اِهْدِنَا الصِّرَاطَ الْمُسْتَقِيمَ

# శాంతిబాట

సంతోషమయ జీవనానికి మార్గదర్శి

సంపుటి 1 సంచిక 5,6 డిశంబర్ 2009 & జనవరి 2010 రూ. 30/-



బిస్మిల్లాహ్ వలన కలుగు 5 ప్రయోజనాలు

ఖుర్ఆన్ తఫ్సీర్ ప్రారంభం

ఇస్లాం ధర్మంపై విషపు వ్రాతలు

రక్తంలో జరిగే అద్భుత ప్రక్రియలు

ఆత్మన్యూనత - అహంకారం

తులనాత్మక అధ్యయనం
*(Comparative Study)*
ప్రవక్త(స)వారి విధానం కాదు

జిల్ హిజ్జా హి.1430 – సఫర్ హి.1431

# శాంతిబాట

మాసపత్రిక రూ. 30/-

సంపుటి 1 సంచికలు 5 & 6

డిశంబర్ 2009 & జనవరి 2010

2-8-31, కోటబజార్, సామర్లకోట 533 440

Phone:9347046090 Email:velugubaata@gmail.com


**1 అరబీ భాషలో సర్వమానవాళికి అల్లాహ్ యొక్క సందేశం:** ఖుర్'ఆన్ గ్రంథ అధ్యయనానికి ప్రోత్సాహం - తఫ్సీర్ ప్రారంభం - 'బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీమ్' ఆయత్‌కు వివరణ ...

**9 ప్రపంచ శాంతిదూత 'ముహమ్మద్(స)' వారి బోధనలు, ఆచరణలు :** సమాజంలోని సమస్యలకు పరిష్కార మార్గం - ఈ నెల ప్రత్యేకం : కష్టం - కరుణ. విశ్వాసికి కష్టం కూడా కరుణించబడటానికే వస్తుందని, ముల్లు గుచ్చుకున్నా మేలే జరగుతుంది ...

**14 తిరిగి గూటికి :** ఏ సృష్టి ధర్మంతో బిడ్డ జన్మించిందో, తిరిగి ఆ ధర్మానికే చేరుకున్న సోదరుడు లేదా సోదరి గురించి (వారి మాటలలో). సోదరి మిమి మా మరియు సోదరి పెనోమీ గురించి ...

**18 ఖుర్'ఆన్ మరియు సైన్స్ :** ఆల్‌జీబ్రా పితామహుడు - అల్-ఖ్వారిజ్మి గురించి ...

**21 డార్విన్ సిద్ధాంతం – శాస్త్రీయ వాస్తవం కాదు :** సృష్టికర్త యొక్క అద్భుత సృష్టిపై శాస్త్రీయ వర్ణన. అవాస్తవాల ప్రచారంపై ఖండన - రక్తం - జీవాన్నిచ్చే ద్రవం.

**25 జ్ఞానం – అజ్ఞానం :** జ్ఞానులమనుకొనే వారి అజ్ఞానాన్ని బయటపెట్టడం. ఖుర్'ఆన్ వాక్యాల వక్రీకరణను ఖండించి, వివరించే ప్రయత్నం - డా॥ క్రాంతికార్ విషపురాతలపై చర్చ ...

**32 ధర్మసందేశ ప్రచారం :** ప్రస్తుతం సమాజంలో అనుసరిస్తున్న కొత్త పోకడల గురించి .... ఖుర్'ఆన్ మరియు సున్నత్ వెలుగులో సందేశాన్ని అందించే విధానాల పరిచయం ...

**40 ఇంటర్‌నెట్‌లో ఇస్లాం కబుర్లు :** ఒకే పదం పలుమార్లు రిపీట్ కావడం, పరస్పర వ్యతిరేక పదాల మధ్య సమతుల్యత గురించి ...

**44 టెర్రరిజం :** టెర్రరిజానికి ఏ మతం పేరును అతికించకుండా, 'ఇస్లాం'నే అతికించి ముస్లిములనే టార్గెట్‌గా ఎందుకు పెట్టుకున్నారు? కనులు మూసుకున్న మీడియా యొక్క కనులు తెరిపించే ప్రయత్నం. అమెరికాపై ఇంతవరకూ జరిగిన దాడులపై విశ్లేషణ - C.I.A.మరియు బిన్‌లాడెన్‌కి మధ్యనున్న సంబంధంపై ఫోకస్ - పరిశోధనాత్మక వ్యాసం

**49 బాలబాలికలకు ప్రత్యేకం :** ఇస్లాం పరిచయం. పాఠ్య పుస్తకాలలో సైన్స్ డిస్కవరీల గురించి నేర్చుకున్న అసత్యాలను ఎత్తిచూపడం మరియు వాస్తవాల వివరణ

**53 ఖుర్'ఆన్‌ను అర్థం చేసుకుంటూ చదువుదాం :** నెలకు 24 అరబీ పదాల చొప్పున 30 నెలలలో ఖుర్'ఆన్‌లోని 80 శాతం పదాలను నేర్పించాలని..

**55 ముస్లిం యువత – ఆలోచించండి! :** అహంకార భావం - ఆత్మన్యూనతా భావం



ఎడిటర్:

**ఎమ్‌డి. అతహరుల్లా**

**ఎడ్వయిజరీ బోర్డ్:**

డా॥ సలీమ్ పాషా

డా॥ నాగిరెడ్డి శ్రీనివాసరావు

ఎమ్‌డి. అఫ్ఫాన్ ఉమ్రీ

**సహాయకులు:**

**వెలుగుబాట**

ఎడ్యుకేషనల్ సొసైటీ

మరియు

**ట్రూవిజన్**

ఎడ్యుకేషనల్ సొసైటీ

సభ్యులు



**Printed by**
Md. Athaharullah

**Published by**
Md. Athaharullah

**Owned by**
Velugubaata Educational Society
(R.No. 569/2008), Samalkot-533440

and

**Printed at**
'*Akash Industries*',G-14, Industrial Estate, Samalkot - 533440

and

**Published at**
2-8-31, Kota Bazar,
Samalkot - 533440,

**Editor:** Md. Athaharullah
Phone : 9347046090,
Email: velugubaata@gmail.com
RNI Regd. No. APTEL/2009/29650


ఈ పత్రికలో ప్రచురించిన వ్యాసాల గురించిగాని, లేదా ఇతర వివరాలకుగాని సంప్రదించండి

**డా॥ నాగిరెడ్డి శ్రీనివాసరావు,** *M.Sc.,Ph.D.*
**Cell : 9491103017**

**సంవత్సర చందా:**

**రూ. 180/-**

*For online payments, Please contact Dr. N. Srinivasa Rao (Cell: 9491103017)*

M.O. చేయవలసిన చిరునామా:

**వెలుగుబాట ఎడ్యుకేషనల్ సొసైటీ**
2-8-31, కోట బజార్,
సామర్లకోట-533440

మీ పూర్తి ఎడ్రస్‌ను, ఫోన్ నెంబర్లతో సహా **M.O.** ఫారమ్‌పై వ్రాయండి.
లేదా
క్రింది నెంబర్‌కు
మీ వివరాలను **SMS** చేయండి.
**Cell : 9491103017**

బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీమ్ (అనంత కరుణామయుడు, అపార కృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో)

# మీడియా పై విశ్వసనీయత

'మీడియా' అంటే వాస్తవాలను నిర్భయంగా ప్రజలకు తెలియజేసే సాధనం. అలా తెలియజేసేందుకు మీడియాకు ప్రత్యేకమైన స్వేచ్ఛ ఉంది. నిర్వచనం ప్రకారం న్యాయవాది న్యాయం కోసం పోరాడేవాడు. వైద్యుడంటే నిస్వార్థంగా ప్రజల ఆరోగ్యం కోసం పాటుపడేవాడు. పోలీసాధికారి రక్షణ కోసం శ్రమించేవాడు. ఈ విధంగా సమాజంలో బాధ్యతగల ప్రతీ వ్యక్తి ఉత్తముడే.

కాని వాస్తవంగా వీరంతా పైన చెప్పిన విధంగా నిర్వచనం ప్రకారం ప్రవర్తిస్తున్నారా అంటే, 'ఔను' అని చెప్పలేము. ప్రతీ రంగంలోనూ మంచివారు, చెడ్డవారు ఉన్నారు. ఒక రంగానికి చెందిన ఓ వ్యక్తి చెడ్డవాడైనంత మాత్రాన ఆ రంగంలో పనిచేసేవారంతా చెడ్డవారు కాదు. అన్ని రంగాలతో పాటు మీడియా రంగం కూడా తన నిర్వచనాన్ని మార్చుకుంటుంది.

మీడియా తన విశ్వసనీయతను కోల్పోతూ వస్తుంది. ఏదైనా ఓ సంఘటన జరిగితే, ఆ సంఘటనపై, ఒక్కొక్క మీడియా గ్రూపు వారు ఒక్కొక్క భిన్నమైన కథనాన్ని ఉద్దేశపూర్వకంగా అందిస్తున్నారు. పాఠకులలో ఎవరికి వారు వాటిలో తమకు ఏది అనుకూలంగా ఉంటే, వాటినే తీసుకుంటున్నారు.

గత రెండు నెలలుగా రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలను బట్టి, వాస్తవంగా నెలకొని ఉన్న విద్వేషాన్నే మీడియా చూపిస్తుందా? లేక దానిని మరింత తీవ్రం కావడానికి మీడియా పరోక్షంగా ప్రోత్సహిస్తుందా? అనే అనుమానం మెజారిటీ ప్రజలకు కలిగింది.

ఓ పాత్రికేయ ప్రముఖుడు ఈ మధ్యనే ఓ టీవీ చర్చా కార్యక్రమంలో, ఈ విషయంపై తన అభిప్రాయాన్ని తెలియజేశారు. కొన్ని సంవత్సరాల క్రితం, ఓ వ్యక్తి హత్య చేయబడ్డారు. ఆ హత్య అనంతరం జరిగిన విధ్వంసాన్ని ప్రసారం చేస్తూ, వేరే జిల్లాలోని తమ విలేఖరిని ఓ ఛానల్ యాంకర్ ఏమని ప్రశ్నించారంటే, ఫలానా జిల్లాలో చాలా బస్‌లను తగులబెట్టారు. మీ జిల్లాలో కూడా అలా తగులబెట్టారా? అని. అంటే పరోక్షంగా ఆ జిల్లాలో కూడా తగులబెట్టాలనే ఆలోచనను సంఘ విద్రోహ శక్తులకు కలిగేలా చేయడమేనని అభిప్రాయపడ్డారు.

టి.ఆర్.పి. రేటింగ్స్‌ను పెంచుకోవడం కోసం, టి.వి. చానళ్లు పోటీపడుతున్నాయి. ఈ రేటింగ్ వారానికొకసారి చేస్తారట. అది కూడా శాస్త్రీయం కాదని విమర్శలున్నాయి. మన రాష్ట్రంలోని 13 పట్టణాలను అందుకొరకు సెలక్ట్ చేశారట. ఒక టి.వి. ఛానల్‌ను పదేపదే చూడటంగాని, లేదా ఓ పత్రికను ఎక్కువమంది చదివారంటే, ఆ టి.వి. ఛానల్‌ను, ఆ పత్రికను ఆదరిస్తున్నారని కూడా చెప్పలేము. అవి అశ్లీలమైన విషయాలను, అబద్ధాలను చెప్పేవే అయితే, అవి ఏమేమి చెబుతున్నాయో తెలుసుకోవాలని ఆతృత కొద్దీ చూసే అవకాశం కూడా ఎక్కువగానే ఉంటుంది. అందువలన కేవలం సర్క్యులేషన్‌లను, టి.ఆర్.పి. రేటింగ్స్‌ను బట్టి వాటి యొక్క విశ్వసనీయతను అంచనా వేయలేము. రాష్ట్రంలో మద్యం అమ్మకాలు పెరిగాయి అంటే, 'త్రాగుడు'కి మంచి ఆదరణ లభిస్తుంది కాబట్టి, త్రాగుడు మంచిదని మనం అనుకోగలమా?

ప్రముఖ నటీమణుల గురించి గాసిప్స్ వస్తుంటాయి. కొంతమంది సంస్కార హీనులు నటీమణుల ఏకాంత సమయాలకు సంబంధించి, రహస్యంగా వీడియోలు తీసి, సెల్‌ఫోన్‌లలో MMS చేస్తుంటారు. ఈ విధంగా కొందరు చేస్తున్నారని వార్తలలో చెబితే సరిపోతుంది కదా! కాని అలాంటి అశ్లీల దృశ్యాలను సేకరించి టి.వి.లో పదే పదే చూపించడం ఎంతవరకూ సమంజసమో విజ్ఞత కలవారు ఆలోచించాలి. నిజంగా అది సెల్‌ఫోన్ల ద్వారా MMS చేయబడిన వీడియోనే కావచ్చు. అయినంత మాత్రాన ఆ వీడియోని ప్రసారం చేయడం వలన ప్రజలకు ప్రయోజనం ఏమైనా ఉందా?

మరి అలాంటి ప్రసారాలపై ప్రభుత్వం చర్యలు ఎందుకు తీసుకోవడం లేదు? సెల్‌ఫోన్‌లో కొద్దిమందే చూసి ఉంటారు. కాని టి.వి. ఛానల్ వారు రాష్ట్రంలోని ప్రజలందరికీ చూపిస్తారు. ఈ విషయం తెలుసుకొని ప్రేక్షకులు ఆసక్తితో ఆ ఛానల్‌ను చూస్తే, ఆ ఛానల్ టి.ఆర్.పి. రేటింగ్ పెరుగుతుంది. కాబట్టి మీడియా వ్యక్తులందరూ నైతిక విలువలను కలిగి ఉన్నారని చెప్పలేని పరిస్థితి ఏర్పడింది.

ఈ మధ్యనే రష్యన్ ఆన్‌లైన్ పత్రికలోని ఓ వ్యాసాన్ని టెలికాస్ట్ చేసిన ఓ టి.వి. ఛానల్ వారిని అరెస్ట్ చేయడం జరిగింది. ఆ విదేశీ పత్రిక ఎటువంటిదో తెలుసుకోకుండా, ప్రసారం చేయడాన్ని విమర్శించారు. **నిజానిజాలను నిర్ధారించుకుని ప్రసారం చేయాలనే విషయాన్ని మేము హర్షిస్తున్నాము.** కాని ఇటువంటివి నిష్పక్షపాతంగా సమాజ క్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని చేస్తే, సంస్కారమున్న ప్రతీ ఒక్కరూ హర్షిస్తారు.

పైన చెప్పిన ఓ టి.వి. ఛానల్ వారు, సదరు నటీమణి ఆ వీడియో తనది కాదని చెప్పిన విషయాన్ని కూడా ప్రసారం చేశారు. అది నకిలీ వీడియో అని తెలిశాక కూడా ఆ వీడియోను ఎందుకు ప్రసారం చేయవలసి వచ్చింది? ఓ స్త్రీని అవమానపరచి, ఆమె మనస్సును గాయపరిచే హక్కును మీడియాకు ఎవరు ఇచ్చారు?

ఏదో ఓ ఫలానా ఛానల్‌ని విమర్శించడానికో లేదా సమర్ధించడానికో మేము ఈ విషయాలు వ్రాయలేదు. మీడియాలో పక్షపాత ధోరణి, నైతిక విలువల స్థితి ఎలా ఉందో తెలపాలనేదే మా ఉద్దేశ్యం.

అలాగే రష్యాలోని మరో ఆన్‌లైన్ పత్రిక వ్రాసే వ్యాసాలను, అమెరికాలోని ఓ ప్రముఖ మీడియా సంస్థ మెచ్చుకుంది. ఎందుకంటే, ఆ వ్యాసాలు రష్యన్ గవర్నమెంట్‌కి వ్యతిరేకంగా వ్రాసినవి. అందుకని అమెరికా మీడియా సంస్థకు ఆ పత్రిక బాగా నచ్చింది. అమెరికా వార్తా

సంస్థకు నచ్చిందని తెలిసిందంటే, మన మీడియా సంస్థలకు కూడా ఆ పత్రికపై ప్రేమ కలుగుతుంది. అమెరికా సినిమాలలో రష్యన్ల విలువలను తక్కువ చేసి చూపించడం సాధారణంగా కనిపిస్తూ ఉంటుంది. తమ శత్రుదేశాలకు సంబంధించిగాని, ప్రత్యర్థుల గురించిగాని వ్యతిరేకంగా ఎవరైనా వ్రాస్తే, అది నిజంకాక పోయినా, సదరు మీడియా సంస్థ అంగీకరించి ఆ వార్తకు విశేషమైన ప్రాచుర్యాన్ని కలిగిస్తుంది.

ఇదే అమెరికా మీడియా సంస్థ సెప్టెంబర్ 2001లో అమెరికాలో ట్విన్ టవర్స్ కూలిపోయాక, ఓ వీడియోను ప్రసారం చేయడం జరిగింది. పాలస్తీనియన్లు స్వీట్లు పంచుతూ వినోదిస్తున్న దృశ్యాలను చూపించడం జరిగింది. ఆ వీడియోను చూసి, అమెరికాలోని టవర్స్ కూలిపోతే, పాలస్తీనా ముస్లిములు పండుగ చేసుకుంటున్నారని ప్రపంచ ప్రజలంతా నమ్మారు. అలా అనుకోవాలనే ఆ వార్తా సంస్థ ఆ వీడియోని ప్రసారం చేసింది. నిజానికి ఆ వీడియో చాలా పాతది. ఏదో పెళ్ళికి సంబంధించిన వీడియో అది, వెంటనే ప్రతిస్పందించి చాలామంది ఆ ప్రసారాన్ని ఖండించారు. ఈ సంఘటనకు సంబంధించి, ఆ వార్తా సంస్థ ప్రసారం చేసిన విషయంపై ఎన్నో విమర్శలున్నాయి. కాబట్టి ఆ ప్రముఖ వార్తా సంస్థ విశ్వసనీయతను కోల్పోయింది. అలాంటి ప్రముఖ అమెరికా వార్తా సంస్థ కూడా తప్పుడు వార్తలు అందిస్తుందని ప్రపంచానికి స్పష్టంగా తెలిసింది.

కాబట్టి ఆ వార్తా సంస్థ ప్రసారం చేసిన విషయాలలోని నిజానిజాలను నిర్ధారించుకున్న తరువాతనే మిగిలిన దేశాలవారు, ఆ సంస్థ చేసిన ప్రసారాన్ని ఉపయోగించుకోవలసి ఉంది. కాని ప్రస్తుతం అలా జరుగుతున్నదా? మనదేశ మీడియా సంస్థలు, ఆ అమెరికన్ వార్తా సంస్థకి చాలా విలువిస్తాయి. గుడ్డిగా నమ్ముతాయి. మా ఉద్దేశ్యం ఆ వార్తా సంస్థ యొక్క ప్రతీ ప్రసారం అసత్యమైనదని చెప్పాలని కాదు. ప్రజలు అభిమానించే ఎన్నో పత్రికలు, టి.వి. ఛానళ్లలో అసత్యాలు కూడా ఉంటాయని చెప్పడమే మా ఉద్దేశ్యం.

http://newsbusters.org వెబ్‌సైట్‌లో టి.వి. ఛానళ్ళ విశ్వసనీయతపై Brent Baker గారు వ్రాసిన వ్యాసాన్ని ఉంచారు. ఈయన మీడియా రీసెర్చ్ సెంటర్‌కి వైస్ ప్రెసిడెంట్. ఆ వ్యాసంలో అమెరికా, బ్రిటన్‌కు చెందిన 12 ప్రముఖ ప్రింట్/టి.వి. చానళ్ళపై జరిగిన సర్వే గురించి వివరాలు అందించారు. అమెరికాలో ప్రథమ స్థానంలో ఉన్న ఓ ప్రముఖ వార్తా సంస్థ యొక్క విశ్వసనీయత కేవలం 30 శాతమేనట. ఇక బ్రిటన్‌లోని ప్రముఖ వార్తా సంస్థ విశ్వసనీయత అయితే ఇంకా తక్కువ - 21 శాతం. అంటే ఈ ఛానల్ వాళ్ళు 100 వార్తలను ప్రసారం చేస్తే, అందులో కేవలం 21 వార్తలు మాత్రమే నిజమని చెప్పవచ్చు లేదా వారు చెప్పే వార్తా కథనాన్ని పూర్తిగా నమ్మలేము, కేవలం 21 శాతం మాత్రమే నమ్మదగినది. అంటే కనీసం సగం నిజం, సగం అబద్ధం కూడా కాదన్నమాట. గత 20 సంవత్సరాలలో వీటి విశ్వసనీయత 6 నుండి 12 శాతం వరకూ పడిపోయిందని, సర్వే ఫలితాలను ఉదహరిస్తూ చెప్పారు. అయితే ఈ సర్వే శాస్త్రీయంగా జరిగిందా? లేదా? అనే విషయాన్ని తెలుసుకోవాలంటే ఆ వ్యాసాన్ని చదివి తెలుసుకోండి. ఒక్కటి మాత్రం నిజం - మీడియా విశ్వసనీయతను చాలా వరకూ కోల్పోయింది.

**'ఇస్లామిక్ తీవ్రవాదం'** అని పాశ్చాత్య దేశాల మీడియా సంస్థలు, వారి ప్రభుత్వ సహకారంతో, ప్రసారం చేస్తున్నప్పుడు, ఆ విషయాలనే ప్రామాణికంగా తీసుకుని, యథాతథంగా ప్రసారం చేసే మన దేశ టి.వి. ఛానళ్ల వారు గాని పత్రికా విలేఖర్లు గాని అది నిజమా, కాదా అని నిర్ధారణ చేసుకోవడం లేదని స్పష్టంగా తెలుస్తూనే ఉంది. అలా నిర్ధారణ చేసుకోకుండా చేసే ప్రసారాలపై ప్రభుత్వం చర్యలు తీసుకోదా? అమెరికా సంస్థలు ఏది చెబితే అదే నిజమా? లేక పాశ్చాత్య మీడియా అంటే అంత ప్రేమా?

**కేవలం కొన్ని షాపులపైన దాడి జరిగితేనే చర్య తీసుకునే ప్రభుత్వాలు, 'ఇస్లామిక్ తీవ్రవాదం' అనే దుష్ప్రచారంతో కోట్ల సంఖ్యలోని ముస్లిముల హృదయాలపై జరుగుతున్న దాడులపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదు?** ఈ విషయంపై కనీసం ఓ వినతి పత్రాన్నయినా ప్రభుత్వానికి సమర్పించాలనే ఆలోచన ముస్లిమ్ రాజకీయ నాయకులకు రాకపోవడం విచారకరం. మైనారిటీ సెల్ వారు పట్టించుకోరు. ముస్లిమ్ అడ్వకేట్లు కూడా పట్టించుకోరు.

ఒక్కొక్క రాజకీయ పార్టీకి అనుకూలంగా ఒకొక్క మీడియా మేనేజ్‌మెంట్ పనిచేస్తుందని చెబుతూ బహిరంగంగానే విమర్శిస్తున్నారు. అందులో నిజం లేకపోలేదు. అది అందరికీ తెలిసిన రహస్యమే. తప్పు విలేఖర్లది కాదు, పత్రికలది కాదు, ఆ పత్రికల మేనేజ్‌మెంట్ వత్తిడితోనే అలాంటి వార్తా కథనాలని అందిస్తున్నారని విమర్శిస్తూ, పత్రికా మేనేజ్‌మెంట్‌పై చర్యలు తీసుకోమని కోరేవారిని చూస్తున్నాము. మరి 'ఉగ్రవాదాన్ని' పోషించే మేనేజ్‌మెంట్స్ కూడా ఉన్నాయి కదా! ఆ మేనేజ్‌మెంట్స్ పైన చర్యలు తీసుకుంటే, ఈ 'ఉగ్రవాద దాడులు' కూడా ఇన్షాఅల్లాహ్ పూర్తిగా ఆగిపోతాయి.

'అల్-ఖైదా'పై పోరాటం చేస్తున్నామని చెప్పే అమెరికా ప్రభుత్వమే ఆ సంస్థను ప్రారంభించిందనే సాక్ష్యాలున్నాయి కదా! అంటే 'అల్-ఖైదా' ఉగ్రవాద సంస్థను మేనేజ్ చేసేది అమెరికా ప్రభుత్వమే. ప్రపంచంలోని ఉగ్రవాదాన్ని ప్రోత్సహించేది కూడా అమెరికాయేనని అందరికీ తెలిసిన రహస్యమే. ఉగ్రవాదాన్ని ప్రోత్సహించడంలో అమెరికా పాత్ర గురించి టెర్రరిజం శీర్షికలో వివరాలను చదవండి.

**'ఇస్లామిక్ తీవ్రవాదం' అనేది పాశ్చాత్యులు చేసే అసత్య ప్రచారం అని తెలుసుకుని, కనీసం మన రాష్ట్ర మీడియా అయినా సరే నైతికంగా ఆలోచించి తీవ్రవాదానికి 'ఇస్లాం' పదాన్ని కలపకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నాము.**

పాశ్చాత్యుల మోసానికి గురయ్యి, 200 సంవత్సరాలకు పైగా బానిస బ్రతుకు బ్రతికి స్వేచ్ఛను పొందిన మనం, వారి మీడియా బానిసత్వం నుండి స్వేచ్ఛను ఇంకా పొందవలసి ఉంది. మన రాష్ట్రంలోని ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా వారు ధర్మంగా బ్రతికే ముస్లిముల ఆవేదనని అర్థం చేసుకోవాలి.

**- శాంతిబాట టీమ్**



# అరబీ భాషలో
# సర్వమానవాళికి అల్లాహ్ యొక్క సందేశం

بِسۡمِ اللّٰهِ الرَّحۡمٰنِ الرَّحِيۡمِ

అనంత కరుణామయుడు, అపార కరుణాప్రదాత అయిన అల్లాహ్ పేరుతో

5 & 6

**ఖుర్'ఆన్ తఫ్సీర్**

### 1. బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీమ్

సూరహ్ ఫాతిహా యొక్క ఈ తొలి ఆయత్ ఖుర్'ఆన్ గ్రంథంలోని ప్రతీ సూరహ్ ముందూ కన్పిస్తుంది. సూరహ్ 'తౌబా' ముందు తప్ప. ఖుర్'ఆన్ గ్రంథంలో పదే పదే ఈ ఆయత్ రావడాన్ని బట్టి అనంత జ్ఞానియైన అల్లాహ్ ఈ ఆయత్‌కి ఎంత ప్రాముఖ్యత ఇచ్చారో అర్థం చేసుకోవాలి. ఈ పదాలను మన నిత్య జీవితంలో జ్ఞాపకం చేసుకుంటూనే ఉంటాము.

ఇంతకు పూర్వం అవతరించబడిన గ్రంథాలన్నీ ఖుర్'ఆన్‌లో సంక్షిప్తం చేయబడ్డాయని, అదే విధంగా మొత్తం ఖుర్'ఆన్ గ్రంథం - సూరహ్ ఫాతిహాలో సంక్షిప్తమైందని (2వ సంచిక చూడండి), సూరహ్ ఫాతిహా సంక్షిప్తంగా 'బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీమ్'లో తెలుపబడిందని విద్వాంసులు అభిప్రాయపడ్డారు.

ఈ ఆయత్‌లోని 5 చిన్న పదాల అర్థాలను 2వ సంచికలో పూర్తిగా వివరించడం జరిగింది.

**బిస్మిల్లాహ్ - 'అల్లాహ్ పేరుతో'**

వాక్యం పూర్తికాలేదు. ఈ విధంగా వాక్యనిర్మాణంలో కొన్ని పదాలను ఉద్దేశపూర్వకంగా వదిలివేయడాన్ని ఇంగ్లీష్‌లో అయితే ellipses అంటారు. ఇక్కడ అల్లాహుతాలా వదిలేసిన ఖాళీలో మనం ఏ పని అయితే చేద్దామని అనుకుంటున్నామో, ఆ పనితో పూరించడానికే అల్లాహుతాలా వాక్యాన్ని అసంపూర్ణంగా ఉంచారేమో అనేది కూడా విద్వాంసుల యొక్క అభిప్రాయం.

ఉదాహరణకు మనం 'వుజూ' చేసుకోవడానికి ముందు 'బిస్మిల్లాహ్' చెబుతాము. అంటే అల్లాహ్ పేరుతో వుజూ చేయడం ప్రారంభించ బడింది. మనం భోజనానికి ముందు మరియు దాహం తీర్చుకోవడానికి నీళ్ళు త్రాగే ముందు, మన కార్లుగాని, స్కూటర్లుగాని నడపడానికి ముందు కూడా 'బిస్మిల్లాహ్' అని చెబుతాము.

ఈ విషయాన్నే మరో విధంగా చెప్పాలంటే, మనం ఉదయం లేచింది మొదలు, రాత్రి పడుకునే వరకూ, మనం చేసే ప్రతీ చిన్న పనికి ఈ పదాలు ఉపయోగిస్తున్నాం. ఈ విధంగా మనం చేసే ప్రతీ పని, మన ప్రభువైన అల్లాహ్ పేరుతో చేసినట్లు అవుతుంది.

మనం చేసే ప్రతీ పని యొక్క ప్రారంభంలో ఈ పదాలను చెప్పడం వలన, మనకు కలిగే ప్రయోజనాలలోని 5 ప్రయోజనాలను ఇక్కడ తెలియజేస్తున్నాము.

❶ మొదటి ప్రయోజనం ఏమిటంటే 'బిస్మిల్లాహ్' - అల్లాహ్‌ను మనం గుర్తుచేసుకునేలా చేస్తుంది. ఖుర్'ఆన్‌లోని ఇతర ఆయత్ (వాక్యాల)లో అల్లాహ్ మనకు చెప్పేదేమిటంటే, అల్లాహ్‌ను గుర్తు చేసుకోవడం వలన మన హృదయాలు ఉపశమనాన్ని (ఓదార్పును) పొందుతాయి.

మన జీవితంలోని ప్రతీ సెకను, 'అల్లాహ్'పై ఆధారపడి నడుస్తున్నప్పటికీ, ఆయనను మనం ప్రత్యక్షంగా ఇంద్రియాల ద్వారా తెలుసుకోలేము. కాబట్టి మనం చేసే ప్రతీ పని ముందు 'బిస్మిల్లాహ్' అని చెప్పడం ద్వారా, 'అల్లాహ్'ను గుర్తు చేసుకుంటున్నాము.

❷ ఈ పదాలను పలకడం ద్వారా మనం పొందే మరో ప్రయోజనం ఏమిటంటే, అది మన జీవిత లక్ష్యాన్ని గుర్తు చేస్తుంది. మానవులను అల్లాహ్ సృష్టించడానికి గల కారణం - ఆయనను ఆరాధించ డానికేనని మనకు తెలుసు. ఎల్లప్పుడూ మనం చేసే పనుల ముందు ఈ పదాలను చెప్పడం ద్వారా ఇన్షాఅల్లాహ్ ఈ పదాలు మన జీవిత లక్ష్యాన్ని గుర్తు చేస్తూ ఉంటాయి.

❸ ఇక మూడవ ప్రయోజనం ఏమిటంటే, ప్రతీ పనిముందు 'బిస్మిల్లాహ్' అని పలకడం వలన, ఆ పని ప్రార్థనగా మారుతుంది. చేసే ఆ పనిలో అల్లాహ్ యొక్క ఆదేశాలను పాటిస్తూ, అల్లాహ్‌కు దగ్గరవ్వాలనే ఆశతో మనం ఆ పనిని గనుక చేస్తే, ఆ విధంగా చేసే ప్రతీపని, అల్లాహ్‌కై మనం చేసే ఆరాధనలలో ఓ భాగమే అవుతుంది. సలాత్ (నమాజ్) చేయడం, సౌమ్ (ఉపవాసం - రోజా) ఉండటం మాత్రమే ప్రార్థన కాదు. ఏ పనిచేసినా, ఆ పని అల్లాహ్ కొరకు చేసే సంకల్పంతో చేస్తే అది ప్రార్థనగానే పరిగణించబడుతుంది. మనకు దాహం వేసినప్పుడు 'బిస్మిల్లాహ్' (అల్లాహ్ పేరుతో) అని నీళ్ళు త్రాగితే, అది కూడా ప్రార్థనే.

❹ మనం చేసే పనిముందు 'బిస్మిల్లాహ్' అని అనడం ద్వారా, అల్లాహ్

యొక్క సహాయ సహకారాలను ఆ పనిలో మనం పొందుతాం. అరబీ భాషలో నైపుణ్యం గలవారి అభిప్రాయం ప్రకారం బిస్మిల్లాహ్ లోని 'బ' అనేది 'ఇస్తి'ఆనా' యొక్క 'బ'గా చెబుతారు. అంటే దానర్థం 'సహాయాన్ని కోరడం'. ఈ విధంగా ప్రతీసారి 'బిస్మిల్లాహ్' అని చెప్పడం ద్వారా అల్లాహ్‌కు దగ్గరగా రావాలని కోరుకోవడమే కాకుండా, ఆ పనిలో అల్లాహ్ యొక్క సహాయాన్ని కూడా కోరుకుంటున్నాము. ఆయన సహకారం గనుక మనకు అందితే, అపజయమనేది ఉంటుందా? ఆయన సహకారం అందితే, దాని ఫలితం ఈ లోకంలోనే కాకుండా, పరలోకంలో కూడా ఉత్తమమైనదే అవుతుంది.

❺ మనం చేసే పనుల ముందు, ఈ పదాలను అనడం వలన, నిషేధించ బడిన పనులనుండి ఆ పదాలు మనల్ని ఆపి ఉంచే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ప్రతీ పని ముందు, బిస్మిల్లాహ్ అనడం అలవాటు చేసుకుంటే, ఎలాంటి ఇహలోక పనులైనప్పటికిని ఏదైనా చెడుకార్యం చేయాలని తలంపు వస్తే ఈ పదాలు అల్లాహ్‌ను మనకు గుర్తుకు తెచ్చి, ఇన్షా అల్లాహ్, నిషేధించబడిన (హరామ్) పనుల నుండి మనం దూరంగా ఉండే పరిస్థితి కలుగజేయవచ్చు. ఈ హరామ్ పనుల వలన దైవాగ్రహం మనపై పడుతుందని, అది మనల్ని అల్లాహ్ నుండి దూరం చేస్తుందని తెలిశాక, అలాంటి పనులను చెయ్యకుండా ఉండడం కంటే కావలిసింది మనకు ఇంకేముంటుంది!

**'బిస్మిల్లాహ్'** పలకడంలో కలిగే ఎన్నో ప్రయోజనాలలో, ఓ ఐదు ప్రయోజనాలను మాత్రమే ఇక్కడ చెప్పడం జరిగింది.

కాబట్టి ప్రతీ పని ముందు బిస్మిల్లాహ్ అని చెప్పడం ఎంత అదృష్టం!

ప్రతీ పని ప్రారంభంలో తప్పనిసరిగా బిస్మిల్లాహ్ చెప్పవలసి నప్పటికిని, అన్నిటికంటే ముఖ్యమైన సందర్భం - ఖుర్'ఆన్ చదవడానికి ముందు చెప్పే 'బిస్మిల్లాహ్'. ఎందుకంటే మనకు తెలుసు - ఖుర్'ఆన్ మనందరికి మార్గదర్శకత్వం కనుక, దానివైపు మనం మరలుతాం. 'బిస్మిల్లాహ్' ద్వారా ఆ గైడెన్స్‌ని అర్థం చేసుకోవడంలో, అవగాహన కొరకు అల్లాహ్ యొక్క సహాయాన్ని అర్థిస్తున్నాము. ఈ విధంగా మనకు ఖుర్'ఆన్‌ను అర్థం చేసుకోవడంలో సహాయం పొందడం మరియు అలా చేయడం వలన మనకు గైడెన్స్ అందడంతో పాటు, అది కూడా ప్రార్థనే అయిపోతుంది. అందువలననే, అల్లాహ్ ప్రతీ సూరహ్ ముందు ఈ ఆయత్ నుంచారని విద్వాంసులు అంటారు.

అంతేకాకుండా ఈ 'బిస్మిల్లాహ్' చెప్పడం వెనుక మరో కారణం కూడా ఉండవచ్చు. అదేమిటంటే, అల్లాహుతాలా తన పేరుతో సూరహ్‌ను ప్రారంభించడాన్ని బట్టి, ఆ సూరహ్‌లో ఉన్నదంతా సత్యమేనని ప్రకటిస్తూ, ఆ విషయాన్ని ధృవీకరించినట్లు కూడా అనిపిస్తుంది. అల్లాహ్ సత్యమే చెబుతారు. కాబట్టి ఖుర్'ఆన్ గ్రంథంలోని ఏ ఆయత్‌పై కూడా మనకు ఎలాంటి సందేహమూ అవసరం లేదు. మన జ్ఞానానికి అందని ఎన్నో విషయాలు ఖుర్'ఆన్‌లో ఉన్నాయి. మనకు అర్థం కాకపోయినా అవి సత్యమైనవి. అల్లాహ్ అనుగ్రహిస్తే వాటిలో కొన్నయినా భవిష్యత్తులో అర్థం కావచ్చు. అర్థంకాని విషయాలపై చర్చలు అనవసరం.

ఎప్పుడైతే మనం అల్లాహ్ యొక్క శుభప్రదమైన పేర్లను (ఆయన గుణాలను తెలిపే పేర్లు) మరియు అల్లాహ్ మనకు జీవితంలో చేసిన మేలును గుర్తు చేసుకుంటే, ఇన్షా అల్లాహ్ ఆ విధంగా గుర్తు చేసుకోవడం వలన అల్లాహ్‌పై మనకు ఎంతో ప్రేమ, ఎంతో భయం కలుగుతుంది. ఆ విధంగా చేసే పనిని మనస్ఫూర్తిగా అల్లాహ్ కొరకే చేయగలుగుతాం. అల్లాహ్‌కు సంపూర్ణంగా స్వయం సమర్పణ చేసుకోవడంలో ఇది కూడా ఓ భాగమే!

మనం చేసే ప్రతీపని అల్లాహ్ యొక్క ఇష్టం కోసం చేయడం వలన, ఆ పనులను చేయడం ద్వారా ఎటువంటి గర్వం, పొగరు మనలో రాకుండా ఉంటాయి. వీటినుండి మనకు ఎల్లప్పుడూ రక్షణ కావాలి. పొగరు అనేది షైతాన్ చేసిన పాపమే! ఈ పొగరు వలనే షైతాన్ ఒక ఉన్నత స్థానం నుండి బహిష్కరించబడ్డాడు. ఆదమ్ సంతానాన్ని సాధ్యమైనంత వరకూ సన్మార్గం నుండి తప్పించడానికి ఈ షైతాన్ ప్రయత్నిస్తానని ప్రతిజ్ఞ చేశాడు. వీడికి ఇష్టమైన సులువైన విధానం ఏమిటంటే, మనలో గర్వాన్ని కలిగించడమే. మనం 'ఎంతో ప్రత్యేకమైన వారమని', 'చాలా ఉన్నతులమని' మనలో ఆలోచనలు కలిగేలా చేస్తాడు.

వాడు ఇలాంటి పనులు చేయడానికి ఎంచుకున్న మార్గం మనం చేసే ఆరాధనలను మరియు మనం చేసే సేవని చూసుకుని మనం గర్వపడేలా చేయడం : '**ఆహా! నేనెంత గొప్ప భక్తుడను, రోజూ 5 సార్లు నమాజ్ చేస్తున్నాను, రమదాన్ నెలలో ఉపవాసాలుంటాను. నేను ఎంత ఉత్తముడినో! నేను జకాత్ ఇస్తున్నాను, హజ్ కూడా చేసేసాను**' మొదలైన ఆలోచనలను మన హృదయాలలో కలుగజేస్తాడు.

ఈ విధంగా అల్లాహ్ గురించి కాకుండా మన గురించే ఆలోచించేలా చేస్తాడు. ఎదుటివారిని తక్కువగా చూస్తూ తన ఆరాధనే గొప్పదిగా భావించేలా చేయడం ద్వారా, మన చేత పాపం చేయించడమే కాకుండా, అల్లాహ్‌కు దూరం అయ్యేలా చేస్తాడు. అల్లాహ్‌ను ఆరాధించడానికే సృష్టించబడిన మనం అల్లాహ్‌కు దాసులమేగాని మనమెలా ప్రత్యేకం అవుతాం? మనం ఎంత మంచి పనిచేసినా, అలా చేసింది అల్లాహ్ కొరకే, అలా చేయగలగడానికి అల్లాహ్ అనుగ్రహమే కారణం కదా! అందుకే 'బిస్మిల్లాహ్' అని పలకడం చాలా ప్రత్యేకమైనది.

ఈ పదాలను పలకడం ద్వారా, మనమెంత భక్తులమనే విషయాన్ని లక్ష్యపెట్టం, చేసేది అల్లాహ్ కొరకేనని, అల్లాహ్ కొరకు మాత్రమేనని ఈ 'బిస్మిల్లాహ్' మనకు జ్ఞాపకం చేస్తూ ఉంటుంది.

మనకు ఎల్లప్పుడూ మనస్సులో ఉండవలసిన వాస్తవమేమిటంటే, మనం చేసే పని అల్లాహ్ కొరకు అంకితం చేస్తున్నామని.

'బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీమ్' అనే తొలి ఆయత్‌లో మొదటి భాగమైన **'బిస్మిల్లాహ్** (అల్లాహ్ పేరుతో)' గురించి చెప్పుకున్నాం. ఇక 2వ భాగంలో 2 పదాలున్నాయి. 'అల్లాహ్' యొక్క గుణాలను వర్ణించడానికి 99 పేర్లు ఉన్నాయి కదా! వాటన్నింటికంటే గొప్పదైన పేరు - **'అల్లాహ్'**.

ఈ పేరు విషయంలో ముస్లిమేతరులే కాకుండా, కొందరు ముస్లిములకి కూడా అపోహలున్నాయని తెలియజేయడానికి విచారిస్తున్నాం. కొందరు అనువాదకులు ఇలా వ్రాస్తున్నారు :

## 'తెలుగులో దేవుడు, ఇంగ్లీష్‌లో 'గాడ్', అరబీలో 'అల్లాహ్'

మన రాష్ట్రంలో తెలుగు మాట్లాడే కొన్ని ధర్మాలవారు రాజకీయ నాయకుడిని 'దేవుడు' అంటారు. 'సినిమా హీరోని' కూడా దేవుడంటారు. ఎటువంటి దుర్గుణాలు ఉన్నవాడినైనా సరే, అతని వలన మేలును పొందిన వారు, ఆ వ్యక్తిని 'దేవుడు'అని వర్ణిస్తున్నారు. 'దేవుడు' అనే పదం సమాజంలో ఓ 'జోక్'గా మారిపోయింది.

సమస్త లోకాలను సృష్టించినవాడు, సర్వజ్ఞాని, సర్వశక్తిమంతుడు అయిన 'అల్లాహ్'ను, ఇలాంటి పదం యొక్క స్థాయికి తగ్గించి వ్రాయాలని ఎలా అనుకుంటున్నారో? సామాన్యుడికి అర్థం కావాలంటే తమ వివేకాన్ని ఉపయోగించి చెప్పాలి.

కొందరు ఆలోచన ఎలా ఉందంటే - అస్సలు చెప్పకపోవడం కంటే ఏదో ఒకటి చెబుతున్నారు కదా! ప్రోత్సహించాలి. అంతే! 'దావా' పని చేసేస్తున్నారు. 'ఇస్లాం' పనిచేస్తున్నారంటూ చాలామంది ముస్లిములు వాళ్ళని నెత్తిన పెట్టుకోవడం జరుగుతుందే గాని, వారు చేసేది, చెప్పేది నిజమా? కాదా? అని ఎవరూ పట్టించుకోవడం లేదు. 'దావా' లేదా ధర్మ ప్రచారం చేసేవాని సంకల్పం ఏమిటో ఎవరికీ అవసరం లేదన్నట్లు ప్రవర్తిస్తున్నారు.

ఇదే అదనుగా కొందరు కపటులు 'అల్లాహ్' అనే పేరుని సర్వేశ్వరుడుగా అనువదించి, 'అల్లాహ్' పేరును లేకుండా చేయడానికి, నీచ సంకల్పంతో ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలోని ముస్లిమ్ సమాజం, కళ్ళుండి చూడలేని, చెవులుండి వినలేని, నోరుండి చెప్పలేని వారి స్థితి ఎలా ఉంటుందో అలాంటి స్థితిలోనే ఉంది.

ఇంత కఠినంగా విమర్శిస్తారా? అని మా మీద చాలామందికి కోపం రావచ్చు. వచ్చింది కూడా. కాని వాస్తవాన్ని ఒప్పుకోవాలి. 'ఫోబియా' (భయం) అనే పదాన్ని చాలా మంది వినే ఉంటారు. ఇది ఒక మానసిక వ్యాధి. కొందరు నీటిని చూస్తే భయపడతారు. అలాంటి వారిది 'వాటర్ ఫోబియా'. నీటి నుండి దూరంగా పోతారు. ఇలా ఎన్నో రకాల ఫోబియాలున్నాయి.

అల్లాహ్‌కు ప్రతీ ముస్లిం భయపడతాడు. ఇది మాత్రం ఫోబియా కాదు. ఇక్కడ చెప్పిన భయం వ్యాధి ఎంతమాత్రం కాదు - చెడు పనులు చేస్తే అల్లాహ్ శిక్షిస్తారనే భయం. ఆయన అనుగ్రహం దొరకకపోతే ఎక్కడ నష్టపోతామోనన్న భయం. ఈ భయం ఆయనకు దగ్గర చేయడమే కాకుండా ఆయనను ప్రేమించేలా చేస్తుంది.

ఈ మధ్యనే మేము మరో ఫోభియాను తెలుగు అనువాదకులలో గమనించాము. అదేమిటంటే 'అల్లాహ్' అనే పదం ఉన్నచోట, 'దేవుడు' అనే పదాన్ని ఉంచడం. అక్కడక్కడ దేవుడు, ఆరాధ్యుడు మొదలైన పదాలను అవసరాన్ని బట్టి వాడవచ్చు. కాని వీరు 'అల్లాహ్' అనే పదాన్నే పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారు.

ఈ అనువాదకులు ఎప్పుడో సత్యకాలంలో పుట్టినవారు కూడా కాదు. 'దేవుడు' అనే పదాన్ని ఓ జోక్‌గా వాడుకునే ఈ కాలంలో పుట్టినవారే.

'లా ఇలాహ ఇల్లల్లాహ్' అంటే 'ఆరాధ్యుడు లేడు అల్లాహ్ తప్ప' అనే వచనంలో 'ఇలాహ్' అంటే ఆరాధ్యుడు లేదా దేవుడు. ఈ అనువాదకులు 'అల్లాహ్'ను తెలుగులో దేవుడని చెబుతున్నారు. 'ఇలాహ్'ని కూడా దేవుడనే చెబుతున్నారు కాబట్టి, వీరి అనువాదం ప్రకారం, 'లా ఇలాహ ఇల్లల్లాహ్' అనే వచనం ఏ విధంగా అనువదించ బడుతుందంటే - '**దేవుడు లేడు దేవుడు తప్ప**'. ఇది వినడానికి ఎంత హాస్యాస్పదంగా ఉంది!

'అల్లాహ్' అంటే ఆరాధ్యుని యొక్క అసలు పేరు అని తెలుసుకోలేని వారు ఎందుకు అనువాదాలు చెయ్యాలి? ఖుర్ఆన్‌లోని తొలి వాక్యంలోనే 'బిస్మిల్లాహ్' ఉంది. 'అల్లాహ్' అనేది పేరు అనే విషయం ఖుర్ఆన్ ప్రారంభంలోనే తెలిసిపోతుంది.

ఖుర్ఆన్‌లో పలుచోట్ల 'అనల్లాహ్' అని అల్లాహుతాలా చెప్పారు. అంటే '**I am Allah**' (**నేనే అల్లాహ్‌ని**).

మా జ్ఞానాన్ని బట్టి 'పేరు'ని ఏ దేశంలో కూడా అనువదించరు. ఎంత తెలియని వాడయినా సరే ఆ పని చేయడు. 'అబ్దుర్రహీమ్' అనే పేరుగల ఓ సోదరుడు, మన ఆంధ్రప్రదేశ్‌కి వచ్చాడనుకుందాం. అతనిని ఇక్కడివారు కూడా 'అబ్దుర్రహీమ్' అనే పిలవాలి. అలా కాకుండా, అతనిని తెలుగులో 'ఆ కరుణగలవాని దాసుడా!' అని ఎవరైనా పిలుస్తారా?

ఏ దేశం వెళితే, ఆ దేశంలోని భాషను బట్టి, మన పేరుని ఆ భాషలోకి అనువదించి చెబితే, అక్కడివారు మనల్ని అరెస్ట్ చేస్తారు. ఎందుకంటే ఆ భాషలో అనువదించి మనం చెప్పిన పేరు, మన పాస్‌పోర్ట్‌లోని పేరు వేర్వేరుగా ఉంటాయి కనుక.

'అల్లాహ్' అనే పేరు పురాతన సెమిటిక్ భాషలన్నింటిలోనూ ఉంది. ఈసా(అ) వారి మాతృభాషయైన 'అరమాయిక్' భాషలో ఆ పదం ఉంది. మూసా(అ)వారి మాతృభాషయైన హిబ్రూలో ఆ పదం ఉంది. చాలామందికి ఓ సందేహం రావచ్చు. ఆ పదం వారి భాషలో ఉంటే, క్రైస్తవులకు, యూదులకు ఆ విషయం ఎందుకు తెలియలేదని.

ఆయా భాషలు మాట్లాడే క్రైస్తవులు మరియు యూదులకు 'అల్లాహ్' అంటే ఆరాధ్యుని పేరు అని తెలుసు. యూదుల నాయకుడైన 'అబ్దుల్లా బిన్ సబా' అనే వ్యక్తి పేరులో 'అల్లాహ్' ఉంది. 'మీ ప్రభువు, మా ప్రభువు అల్లాహ్‌యేనని' ముహమ్మద్(స)వారు చెప్పినప్పుడు, వారెవరూ అడ్డు చెప్పలేదు.

వారి గ్రంథాలను వేరే భాషలలోకి అనువాదాలు చేసేటప్పుడు, 'అల్లాహ్' అనే పదాన్ని కూడా అనువాదం చేసారు కాబట్టి, ఆ అనువాదాలను చదివే నేటి యూదులకు, క్రైస్తవులకు 'అల్లాహ్' పేరు గురించి తెలియక పోవచ్చు.

అలాగే నేటి ఆధునిక ముస్లిమ్ అనువాదకులు చేసే అనువాదాల వలన ముస్లిమ్ సమాజంలో కూడా అటువంటి పరిస్థితే వచ్చి

ఉండేది. కాని అల్లాహ్ రక్షణలో ఒరిజినల్ ఖుర్ఆన్ ఉండటం వలన, అలాంటి అనువాదాలు వెంటనే ఖండించబడుతున్నాయి.

ఇటువంటి పరిస్థితి వచ్చే అవకాశం ఉందని గ్రంథప్రజలు భావించి, అరమాయిక్ భాషలో ఉన్న 'అల్లాహ్' అనే పదం - పేరును సూచించడం లేదని, కేవలం 'దేవుడు' అనే అర్థాన్ని మాత్రమే చెబుతుందని ప్రచారం చేసి నమ్మిస్తూ, ఆ దేవుని పేరు వేరే ఉంది అని నమ్మించే ప్రయత్నం కొనసాగిస్తూనే ఉన్నారు.

అది ఎలా అంటే,

| | | | | | |
|---|---|---|---|---|---|
| **అల్** | + | **ఇలాహ్** | = | **అల్లాహ్** | ✗ |
| (The | + | God | = | The God) | |

ఈ ప్రచారాన్ని ఓ ధర్మానికి చెందినవారు పైన చెప్పిన సంకల్పంతో ప్రారంభించారు. కాని ఈ రోజు ఆ తప్పుడు ప్రచారాన్ని వేరే ధర్మం వారు కాకుండా, ముస్లిములే స్వయంగా తమ భుజాలపై వేసుకుని చేస్తున్నారు. ఇది చాలా సిగ్గుపడాల్సిన విషయం.

అరబీ గ్రామర్ ప్రకారం పై విధంగా చెప్పడం సాధ్యం కాదు. క్రింది వివరణ చూడండి.

'**అల్**' అనే పదం '**కరీమ్**' అనే పదంతో కలిసి '**అల్-కరీమ్**' అనే పదం ఉత్పన్నమవుతుంది.

اَلْ+كرِيم = اَلْكَرِيم

(అల్-కరీమ్) (కరీమ్) (అల్)

'**అల్**' అనే పదం '**రహీమ్**' అనే పదంతో కలిస్తే '**అల్ రహీమ్**' అనే పదం కాకుండా '**అర్రహీమ్**' అనే పదం ఉత్పన్న మౌతుంది. ఇక్కడ 'ల' అనే శబ్దాన్నిచ్చే అక్షరం ఉంది కాని అది సైలెంట్ అవుతుంది. 'రహీమ్'లోని మొదటి అక్షరమైన 'ర' - రెట్టింపవుతుంది (అంటే 'ర' క్రింద ' ్ర ' వత్తు వస్తుంది).

اَلْ+رَحِيم = اَلرَّحِيم

(అర్రహీమ్) (రహీమ్) (అల్)

అల్-కరీమ్ పదంలోని 'క' అనే అక్షరాన్ని అరబీ భాషలో అల్-ఖమరీ (చంద్రాక్షరం)గానూ, అ(ల్)ర్రహీమ్ పదంలోని 'ర' అనే అక్షరాన్ని అష్షమ్సీ(సూర్యాక్షరం)గానూ పిలుస్తారు.

సూర్యాక్షరాలు: ت ث د ذ ر ز س ش ص ض ط ظ ل ن

చంద్రాక్షరాలు: ا ب خ ح ج ع غ ف ق ک م و ه ی

దీనిని బట్టి, తెలిసేదేమిటంటే 'అల్' అనే పదానికి పైన తెలిపిన సూర్యాక్షరాల లోని ఏదైనా అక్షరం కలిస్తేనే ఆ సూర్యాక్షర ఉచ్ఛారణ రెట్టింపు అవుతుంది. ఇలాహ్‌లోని మొదటి అక్షరం అలిఫ్ చంద్రాక్షరం, సూర్యాక్షరం కాదు.

కాబట్టి, '**అల్+ఇలాహ్**', ఎట్టి పరిస్థితులలోనూ '**అల్లాహ్**' కాదు. 'అల్ ఇలాహ్' మాత్రమే అవుతుంది. అంతే కాకుండా '**అల్లాహ్**' అనే పదంలో ఉన్నట్లు '**అలిఫ్**' అనే అక్షరం తరువాత రెట్టింపుగా వచ్చిన '**లామ్**' తో కూడియున్న మరో పదం(ﷲ) ఖుర్ఆన్‌లో ఎక్కడా కనిపించదు.

**'అల్లాహ్ అనేది అత్యంత ఉన్నతమైన పదం'**. దానిని మించిన పదం మరొకటి లేదు.

పై విషయాలు మాచే పబ్లిష్ కాబడిన 'సకల లోకాలను సృష్టించిన ఆ సృష్టికర్త పేరు ఏమిటి?' పుస్తకంలో వివరించడం జరిగింది. ఆ పుస్తకంలో అరమాయిక్, అరబీ, హెబ్రూ లిపిలో ఉన్న వాక్యాలను కూడా అందించాము.

'**అల్ + ఇలాహ్ = అల్లాహ్**' అనే ప్రచారాన్ని తెలియక చేస్తున్న ముస్లిమ్ సోదరులు గనుక మీకెదురైతే, వారికి ఈ వాస్తవాన్ని వివరించండి.

---

అల్లాహ్ పేరును 'అల్లాహ్'గానే చెప్పుకుందాం! ఆ పేరును అత్యధికంగా స్మరిస్తే మన హృదయాలకు స్వాంతన లభిస్తుంది. అలాంటి మంచి అవకాశాన్ని ఏ విశ్వాసి కూడా పోగొట్టుకోకూడదు.

**"ఎవరైతే విశ్వసించారో, వారి హృదయాలు అల్లాహ్ ధ్యానం వలన తృప్తి పొందుతాయి. జాగ్రత్తగా వినండి! కేవలం అల్లాహ్ ధ్యానమే హృదయాలకు తృప్తినిస్తుంది."** (ఖుర్ఆన్ 13:28)

'అల్లాహ్' యొక్క లక్షణాలను వర్ణించే 99 పేర్ల గురించి ముందరి పేజీలో చెప్పుకున్నాం.

'బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీమ్'లోని మొదటి భాగమైన 'బిస్మిల్లాహ్' తరువాత, రెండవ భాగంలో ఆయన గుణాలను తెలిపే రెండు పేర్లున్నాయి - '**రహమాన్**' మరియు '**రహీమ్**'. ఈ రెండు పేర్లు 'రహమ' అనే మూలపదం నుండి ఉత్పన్నమయ్యాయి. వాటి అర్థాలు కరుణ, కృప, దయ మొదలైనవి.

ఈ రెండు పదాలు అల్లాహ్ యొక్క కరుణను తెలుపుతున్నాయి.

'బిస్మిల్లాహ్' తరువాత 99 పేర్లలోనుండి ఈ రెండు పేర్లను మాత్రమే అల్లాహ్ ఎందుకు ఎన్నుకుని ఉంటారు? ఈ పదాలు ఖుర్ఆన్‌లో ఎన్నోసార్లు వచ్చాయి. అసలైన కారణం అల్లాహ్‌కే తెలుసు.

ప్రతీ సూరహ్ ముందు 'బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీమ్' (అనంత కరుణామయుడు, అపార కృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో) అని చదవడం ద్వారా, మనకు పదే పదే ఆయన కరుణ గురించి గుర్తు చేస్తున్నాయి. 'అల్లాహ్' మిగతా ఏ పేరు కంటే కూడా తనను తాను 'కరుణామయుడు, కృపాశీలుడు'గానే పరిచయం చేసుకుంటున్నాడు.

ఖుర్ఆన్ మరియు ముహమ్మద్(స)వారి బోధనలను బట్టి, కారణం కొంత వరకూ అర్థం చేసుకోవచ్చు. వాటి వివరాలు ఇక్కడ అందిస్తున్నాము. అయితే అసలు నిజం అల్లాహ్‌కే తెలుసు.

అల్లాహుతాలా అనంత కరుణామయుడు, అపార కృపాశీలుడు.

ఆయన కరుణకు సంబంధించిన ప్రత్యేకమైన వాటిలో మొదటి

అంశం ఏమిటంటే, ఆయన కరుణ 'సృష్టి' అంతటా వ్యాపించి ఉంది. సృష్టి అంతా తన ఉనికికి సంబంధించిన ప్రతీ సెకన్ 'అల్లాహ్' యొక్క కరుణను అనుభవిస్తూనే ఉంది.

**"..... ఓ మా ప్రభూ! నీవు నీ కారుణ్యం మరియు నీ జ్ఞానంతో ప్రతి దానిని ఆవరించి ఉన్నావు కావున పశ్చాత్తాపంతో నీ వైపునకు మరలి, నీ మార్గాన్ని అనుసరించే వారిని క్షమించు, మరియు వారిని భగభగమండే నరకాగ్ని శిక్ష నుండి కాపాడు!"** (ఖుర్ఆన్ 40:7)

ఆ విధంగా అల్లాహ్ యొక్క కరుణను అనుభవించకపోతే, సృష్టి యొక్క ఉనికే ఉండదు. అల్లాహ్‌కు ఏదీ అవసరం లేదు. సృష్టి అవసరం ఆయనకు లేదు. విశేషంగా విశ్వంలోని ప్రతీ వస్తువూ ఆయన కరుణను ప్రదర్శిస్తూనే ఉంది. ఎందుకంటే అల్లాహ్ ప్రతీదానిని ఆయన కరుణ నుండే సృష్టించాడు.

కాబట్టి విశ్వంలోని రాళ్ళు రప్పలు, మొక్కలు, జంతువులు, నక్షత్రాలు మొదలైనవన్నీ అల్లాహ్ కరుణలో భాగంగానే సృష్టించబడ్డాయి. కాబట్టి ఉనికిలో ఉన్న ప్రతీది ప్రతీ క్షణమూ అల్లాహ్ కరుణనే కోరుకుంటుంది. ఒక్క క్షణం పాటు, అల్లాహ్ ఈ విశ్వాన్ని పట్టించుకోక పోతే, విశ్వమంతా సర్వనాశనమవుతుంది.

కొందరు విద్వాంసులు ఇలా అభిప్రాయపడ్డారు : 'విశ్వాన్నంతటినీ సృష్టించి, దానిని నడిపించడం ఆయన యొక్క కరుణను స్పష్టం చేయడానికే!'

కాబట్టి విశ్వంలో 'అల్లాహ్' యొక్క కరుణను రుచి చూడనిదంటూ ఏదీ లేదు.

ఉదాహరణకు క్రింది ఖుర్ఆన్ వాక్యం చూడండి.

**"ఆకాశంలో భద్రంగా విహరించే పక్షులను వారు ఎన్నడూ చూడలేదా? అల్లాహ్ తప్ప వాటిని క్రిందపడకుండా నిలిపి ఉంచిందెవరు? విశ్వాసులకు ఇందులో చాలా నిదర్శనాలున్నాయి"** (ఖుర్ఆన్ 16:79)

ఆయన నేలపై నడిచే చిన్న చీమకే కాదు, సముద్రాల లోతుల్లో ఉండే చేపలకు కూడా పోషణ నందిస్తున్నాడు.

అయితే మనం తెలుసుకోవలసిన అతి ముఖ్యమైన మరో విషయం ఏమిటంటే, విశ్వంలో అన్నిటికంటే మానవులపై ఆయన ఎక్కువ కరుణ చూపిస్తున్నారనే నిజాన్ని.

ఖుర్ఆన్‌లో అల్లాహుతాలా తెలియజేస్తున్నారు - ఈ భూమిపైని ప్రతీది మనకోసమే సృష్టించారని. ఆ విధంగా జంతువులు, మొక్కలు, చెట్లు మరియు కదలని నిర్జీవ పదార్థాలు అన్నీ మన ఉపయోగానికే సృష్టించ బడ్డాయి.

జంతువులను ఆహారం కొరకు, ప్రయాణ సాధనాలుగానూ, చెట్లను ఇళ్లు కట్టుకోవడానికి, కూరగాయలను ఆహారం కోసం, ... ఇలా ఒక విధంగా కాకుండా, ఎన్నో విధాలుగా మన చుట్టూ ఉన్న 'అల్లాహ్'యొక్క సృష్టిని మనం ఉపయోగించుకుంటున్నాం. అయితే ఇక్కడ ఓ విషయాన్ని గుర్తు పెట్టుకోవాలి. 'అల్లాహ్'కు విధేయత చూపకుండానే వాటిని ఉపయోగించుకో కూడదు కదా! వాటిని ఉపయోగించడంలో 'అల్లాహ్' ఆదేశాలను ఉల్లంఘించకూడదని మర్చిపోతే ఎలా?

మన కోసమే 'అల్లాహ్' వీటిని సృష్టించారంటే, మిగతా సృష్టితాల కంటే మనకెంతో గొప్ప సౌకర్యాన్ని మరియు ప్రత్యేకమైన హక్కును కల్పించారు. కాబట్టి మనం అల్లాహుతాలాకు ఎంత కృతజ్ఞులై ఉండాలి!

మానవులందరికీ, **వారు అల్లాహ్‌ను విశ్వసించని వారైనా సరే**, అన్నీ సమకూర్చారు. అవిశ్వాసులకి అల్లాహ్ సమయం ఇచ్చారు - వారు అర్థం చేసుకుని, అల్లాహ్ మార్గం వైపు మరలి, ఆయనను ఆరాధించడానికి. వారికి ఇవ్వబడిన ఆ సమయం కూడా అల్లాహ్ యొక్క కరుణే!

అయితే అల్లాహ్‌కు విధేయత చూపే విశ్వాసులపై చూపినంత కరుణ, సృష్టిలోని మరి దేనిపై ఆయన చూపలేదని తెలుసుకోవాలి.

ఆ విషయాన్ని స్పష్టం చేసేవే 'బిస్మిల్లాహ్' తరువాత ఉండే రెండు పేర్లు : అర్రహమాన్, అర్రహీమ్.

అర్రహమాన్ అంటే సృష్టి మొత్తానిపై ఉండే అల్లాహ్ యొక్క కరుణ. అర్రహీమ్ అంటే సన్మార్గంలో ఉండే విశ్వాసులపై చూపే ప్రత్యేకమైన కరుణ.

**విశ్వాసులపై చూపే ప్రత్యేకమైన కరుణ:**

అర్రహీమ్ పదం ద్వారా వర్ణించబడిన విశ్వాసులపై చూపే ఆ ప్రత్యేక కరుణ ఏమై ఉంటుంది?

మొట్టమొదటిది ఏమిటంటే, విశ్వాసుల హృదయాలలో సన్మార్గపు వెలుగు నుంచారు. అల్లాహ్‌ను మరియు ఆయన పంపిన సందేశాన్ని విశ్వసించడాన్ని వారికి సులువు చేశారు. అల్లాహ్ చెప్పారు కదా, ఎవరైతే తనను సన్మార్గాన్ని చూపమని కోరారో, వారికి సన్మార్గం చూపుతానని. ఎవరైతే నిజాయితీగా అల్లాహ్ సూచనల కొరకు వెతుకుతారో 'అల్లాహ్' ఉన్నారనే సత్యం వైపు వారికి సన్మార్గాన్ని చూపుతారు. అంతేకాకుండా వారి హృదయాలలో విశ్వాసమాధుర్యాన్ని ఉంచుతారు. ఆ విశ్వాస మాధుర్యం ఇహలోక జీవితం కోరుకునే ఎటువంటి దానికంటే కూడా చాలా ఉత్తమమైనది.

అల్లాహ్ యొక్క మరో కరుణ ఏమిటంటే విశ్వాసుల కుండే వారి విశ్వాసం నుండి వారి హృదయాలకు ప్రశాంతతను కలిగిస్తారు. ఎవరైతే అల్లాహ్‌ను గుర్తించి, ఆయనలో స్థిరమైన విశ్వాసాన్ని కలిగి ఉంటారో, వారు ఈ ప్రపంచపు ఏ విషయంలోనూ విచారంగాని, భయంగాని కలిగి ఉండరు. ఎందుకంటే వారికి తెలుసు, ప్రతీది అల్లాహ్ నుండే వస్తుందని, అన్నీ కూడా ఆయన 'నియంత్రణ'లోనే ఉన్నాయని, ప్రతీది ఆయన వింటాడు, చూస్తాడని తెలుసుకాబట్టి.

మనం ఈ లోకంలో అనుభవించే ప్రతీ కష్టం గురించి ఆయనకు తెలుసు. ఈ కష్టం మనకు ఓ పరీక్ష కావచ్చు. దాని ద్వారా మనకు మంచి ప్రతిఫలాన్ని ఇవ్వవచ్చు లేదా ఆ కష్టం ద్వారా మన పాపాలను

కొన్నింటిని తొలగించవచ్చు. ఇక్కడ పాపాలంటే ఘోరపాపాలు కాదు (లేదా) తెలుసుండీ కావాలని పదే పదే చేసే పాపాలు కూడా కాదు.

శాశ్వత సంతోష నివాసమైన స్వర్గానికి, మనకు మధ్య అడ్డుగా పాపాలే కదా ఉంటాయి. పాపాలు తొలగడమంటే స్వర్గానికి చేరువయ్యే అవకాశాలు పెరుగుతున్నట్లే కదా! కాబట్టి అల్లాహ్‌పై ఉండే విశ్వాసంతో కష్టాలను ఎదుర్కొంటూ, ఆయన కొరకే వాటిని భరించే ముస్లిమ్‌కు, ఆ కష్టాలు కొన్ని పాపాలను దూరం చేస్తాయంటే, అల్లాహ్ తన దాసుడికి స్వర్గాన్ని చేరువ చేయడంలో ఆ కష్టాల ద్వారా తన కరుణను అందిస్తున్నారని, ఆలోచించేవారికి అర్థమౌతుంది.

**(తఫ్సీర్ యొక్క మరికొంత భాగం వచ్చే సంచికలో ...)**

## ఖుర్'ఆన్ వాక్యాలను వక్రీకరిస్తూ చేస్తున్న దుష్ప్రచారం - 1

ఆంధ్ర రాష్ట్రంలో **'పిట్టలదొరల'** గురించి తెలియని వారుండరని మా నమ్మకం. ఈ పిట్టలదొరల మాటలన్నీ కూడా కూతలేనని అందరికీ తెలుసు. అంతేకాకుండా వాడి వేషం అందరికీ నవ్వు వచ్చేలా చేస్తుంది. వీరివలన సమాజానికి ప్రమాదం ఉండదు.

కాని మరో రకం పిట్టల దొరలు ఈ మధ్యనే గత కొన్ని సంవత్సరాలుగా రాష్ట్రంలో తిరుగుతున్నారు. వీరి వేషం మాత్రం సాంప్రదాయ పిట్టలదొరల వలే ఉండదు. అందుకని వీరిని గుర్తు పట్టడానికి చాలా సమయం పడుతుంది. వీరు ఆధునిక దుస్తులే ధరిస్తారు. అలాగే వీరిని గుర్తుపట్టని విధంగా నాగరీక భాషనే మాట్లాడుతారు. వాక్చాతుర్యం ఉంటుంది. గట్టిగా అరవగలరు. వీరు మతధర్మాల గురించి మాట్లాడతారు. వీరికి అందులో జ్ఞానం శూన్యం. కాని జ్ఞానంగలవారికి పాఠాలు చెబుతామంటారు. అధర్మ ప్రచారంతో డబ్బులు దండుకోవడమే వీరి వ్యాపారం. అదే వారి జీవనోపాధి.

అలాంటి పిట్టలదొరలలోని ఒకడు, ఖుర్'ఆన్ వాక్యాన్ని విమర్శిస్తూ అజ్ఞాన మైకంలో పలికిన పలుకులు :

"ఇస్లామిక్ ప్రోపగేటర్స్ నోట్ చేయాలి. ఇస్లాం పండితులు నోట్ చేయాలి. క్రైస్తవ పండితులు నోట్ చేయాలి ఈ విషయం. ఈ విషయాన్ని చాలా కాంప్లికేటెడ్‌గా భావించవచ్చు. **నాకు భయం లేదు. యదార్థాన్నే మాట్లాడతాను.** ఇది కాంప్లికేటెడ్ విషయంగా భావిస్తే అది మీ దురదృష్టం. కాని ఇందులోని రహస్యం ఏమిటనేది మీరు అన్వేషిస్తే దేవుడు జ్ఞానం తెలియజేస్తాడు."

కంగారు పడకండి. ఈ పిట్టలదొరకు తెలుగు చదవడం, వ్రాయడం తప్ప మరేమీ రాదు. మహా భయస్థుడు, అబద్ధాలనే చెబుతుంటాడు. ఇంతకీ అతడు మాట్లాడుతానన్నది యదార్థమేమీ కాదు. కేవలం ఖుర్'ఆన్ వాక్య వక్రీకరణ. ఈ పిట్టల దొర ఎంచుకున్న ఖుర్'ఆన్ వాక్యం - 5వ సూరహ్‌లోని 68వ వాక్యం.

ఒరిజినల్ అరబీని వక్రీకరించడం ఎవరి సాధ్యమూ కాదు. ఎందుకంటే అది అల్లాహ్ రక్షణలో ఉంది.

కాబట్టి ఇలాంటి వారు ఎన్నుకునేది తమకు అనుకూలంగా ఉండే తెలుగు అనువాదాలని. ఈ వాక్యాన్ని హమీదుల్లా షరీఫ్‌గారు క్రింది విధంగా అనువదించారు :

قُلْ يَـٰٓأَهْلَ الْكِتَـٰبِ لَسْتُمْ عَلَىٰ شَىْءٍ حَتَّىٰ تُقِيمُوا التَّوْرَىٰةَ وَالْإِنجِيلَ وَمَآ أُنزِلَ إِلَيْكُم مِّن رَّبِّكُمْ ۗ

**"(ఓ ముహమ్మద్!) స్పష్టంగా ప్రకటించు - గ్రంథ ప్రజలారా! (యూదులూ, క్రైస్తవులు) మీరు తౌరాతును, ఇంజీలును, మీ ప్రభువు తరపునుండి మీ వైపునకు అవతరింపజేయబడిన ఇతర గ్రంథాలను స్థాపించనంతవరకు, అసలు మీరు ఏ పునాది పైనా లేనట్లే."** (దివ్య ఖుర్'ఆన్ 5:68)

ఈ పై వాక్యంలో 'ఇతర గ్రంథాలను' అని ఉన్నచోట, వాటి బ్రాకెట్లో (అంటే మొత్తం బైబిల్ సంపుటి) అని ఉంచి అతడు పలికిన నీచమైన మాటలు :

> "ఏమి స్థాపించమంటున్నాడు ఆ ముహమ్మద్? ఏ గ్రంథం స్థాపించమంటున్నాడండీ .... బైబిల్."

(ఓ అల్లాహ్! ముహమ్మద్(స)వారిని అగౌరపరుస్తూ మాట్లాడే ఇలాంటి వేదన కలిగించే మాటల నుండి మమ్మల్ని కాపాడు)

జీవితంలో ఒక్కసారి కూడా ఖుర్'ఆన్ చదవని వ్యక్తి, నామ మాత్రపు ముస్లిం ఎవరైనా, ఇతని మాట నిజమేనని నమ్మేసే అవకాశం ఎంతైనా ఉంది.

అయితే, 'అల్లాహ్'ను పూర్తిగా విశ్వసించిన ఏ ముస్లిమైనా, ఎప్పుడైనా తన దైనందిన జీవిత విషయాల్లో అబద్ధమాడటానికి తీవ్ర భయాందోళనలకు లోనవుతాడు. 'ధర్మం' విషయంలో నయితే అసలు అబద్ధమాడలేడు. అలాంటి దైవభీతిని 'ముస్లిం'ల మనస్సులలో ఇస్లాం కలుగజేస్తుంది.

కాని ఇంత పబ్లిక్‌గా, అదీ కూడా దైవ ధర్మం విషయంలో అబద్ధ మాడటమంటే, ఆ వ్యక్తి ఎటువంటి వాడో అర్థం చేసుకోండి. ఆంధ్రాలోని ప్రజలకు ఉర్దూ అనువాదం ఉన్న ఖుర్'ఆన్ కాపీలు ఎప్పటినుండో అందుబాటులో ఉన్నాయి. అయితే తెలుగులో 'అబ్దుల్ గఫూర్' గారు అనువదించిన ఖుర్'ఆన్ 1941 నుండి అందుబాటులో ఉంది. పైన తెలిపిన అబద్ధాలను పలికిన ఆ 'అసత్యవాది' 1950 సంవత్సరం తరువాత పుట్టినవాడే. అంటే అప్పటికే ఇంగ్లీషు, తెలుగు, ఉర్దూ అనువాదాలున్న ఖుర్'ఆన్‌లు మన రాష్ట్రంలో అందుబాటులో ఉన్నాయనేది స్పష్టమైన విషయం.

1992లో హమీదుల్లా షరీఫ్‌గారు తెలుగులో అనువదించిన 'దివ్యఖుర్'ఆన్' నుండి 5వ సూరాలోని 68వ వాక్యాన్ని తీసుకుని, 'ఇతర గ్రంథాలను' అని ఉన్నచోట 'విత్ ఇన్ బ్రాకెట్స్ అంటే బ్రాకెట్లలో బైబిల్ మొత్తం సంపుటి' ఉంటుందని చెబుతూ ఖుర్'ఆన్ వాక్యం యొక్క ఘోర వక్రీకరణకు పాల్పడిన ఈ మోసగాడు ఏం చెప్పాడో పైన వివరించడం జరిగింది. "నేను భయపడను. యదార్థాన్నే మాట్లాడతాను" అని అన్నాడు. **అంటే ఖుర్'ఆన్ వక్రీకరణకు పాల్పడటానికి ఆతనికి భయం లేదు. ఆంధ్రప్రదేశ్‌లోని ముస్లిములకు ఇంద్రియాలు పనిచేయవని ఈ అసత్యవాది ధీమా!** అంతేకాదు, ఇలాంటి వ్యక్తికి ధన

సహాయం చేసి ఈ దుష్ప్రచారానికి సహకరించే ముస్లిములు కూడా సమాజంలో ఉన్నారని చెప్పడానికి విచారిస్తున్నాము.

పై వాక్యంలో ఇతర గ్రంథాల బ్రాకెట్లో 'బైబిల్' అని ఈయన చెప్పాడు కదా.

**ఎందుకు చెప్పాడు? ఎలా చెప్పగలిగాడు?**

ఇతర గ్రంథాలనే గనుక బైబిల్ అని ఈయన భ్రమపడితే, వాక్యం ప్రారంభంలోని తౌరాత్, ఇంజీల్ గ్రంథాలను 'బైబిల్'లోని భాగాలుగా ఆయన భావించుట లేదా? ఒకవేళ ఆ రెండింటినీ బైబిల్ భాగాలుగా ఈయన భావిస్తే, ఇతర గ్రంథాలను కూడా బైబిల్ అని ఎలా చెప్పాడు?

ఇతర గ్రంథాలను బైబిల్ అని చెప్పడానికి అతని దగ్గర ఏ ఆధారాలున్నాయి?

ఖుర్'ఆన్ వాక్యాలను అర్థం చేసుకోవడంలో ఇబ్బంది ఎదురైతే, ఆ వాక్యాల వివరణ కోసం హదీసులను రిఫర్ చేస్తారు.

ఖుర్'ఆన్‌ను అర్థం చేసుకోవడానికి అథెంటిక్ సోర్స్ - హదీసులే. ఈ వాక్యం యొక్క అంటే సూరే మాఇదాలోని 68వ వాక్యం (5:68) యొక్క **కొన్ని అనువాదాలను క్రింద ఇస్తున్నాము.** గమనించండి.

> "ఓ గ్రంథము గల వారలార! మీరు తౌరాత్‌ను, ఇన్జీలును **మీ ప్రభువునుండి మీకు పంపబడినదానిని** స్థిరముగ ననుసరింప నంత వరకు మీకు ఏ మత మార్గమందును లేనివారగుదురు అని ఓ ప్రవక్తా! పలుకుము......."

(**అబ్దుల్ గఫూర్,** ఖురానె మజీద్, వ్యాఖ్యానంతోనున్న తెలుగు అనువాదం, క్రీ.శ. 1941)

ఈ వాక్యంపై అబ్దుల్ గఫూర్ గారి యొక్క వ్యాఖ్యానం: "...... కావున యూదులును, క్రైస్తవులను **ఖురాను గ్రంథమును** విశ్వసించి దాని ననుసరించియే తీరవలెను."

> ఇలా అను: "ఓ గ్రంథ ప్రజలారా! మీరు తౌరాతును, ఇంజీలును మరియు మీ ప్రభువు తరపునుండి **మీ పై అవతరింప జేయబడిన (ఈ ఖుర్'ఆన్‌ను) ఆచరించనంత వరకు** మీరు అసలు దేని (ఏ సత్యమార్గం) మీద కూడా ఉండనట్లే! ......."

(**డా॥ అబ్దుర్రహీమ్ బిన్ ముహమ్మద్ మౌలానా**, దివ్య ఖుర్'ఆన్ సందేశం, క్రీ.శ. 2008)

18వ శతాబ్దంలో (క్రీ.శ. 1734) ముస్లిమేతర అనువాదకుడు **G. Sale** వారి యొక్క అనువాదం:

> Say, O ye who have received the scriptures, ye are not grounded on any thing, until ye observe the law and the gospel, and that **which hath been sent down unto you from your Lord**.

19వ శతాబ్దంలో (క్రీ.శ. 1861) మరో ముస్లిమేతర అనువాదకుడు **J. M. Rodwell** వారి యొక్క అనువాదం:

> "SAY: O people of the Book! ye have no ground to stand on, until ye observe the Law and the Evangel, **and that which hath been sent down to you from your Lord***. ....."

(* That is, the **Koran**. The Jew was to retain a faith in the Towrât, or Law; the Christian in the Injil, or Gospel; but both Jews and Christians were to receive the Koran as the complement of both)

20వ శతాబ్దంలో (క్రీ.శ. 1934) ముస్లిం అనువాదకుడు **Abdullah Yusuf Ali** వారి యొక్క అనువాదం:

> Say: "O People of the Book! ye have no ground to stand upon unless ye stand fast by the Law, the Gospel, **and all the revelation that has come to you from your Lord**."

20వ శతాబ్దం చివరిలో (క్రీ.శ. 1997) ఇస్లాం ధర్మాన్ని స్వీకరించిన 4గురు అమెరికన్ సిస్టర్స్ యొక్క ఇంగ్లీష్ అనువాదం:

> Say: "O People of the scripture, you are [standing] on nothing until you uphold [the law of] the Torah, the Gospel, **and what has been revealed to you from your Lord** [i.e., the **Qur'an**] ......" (The Qur'an, Saheeh International)

"**ఇందులోని రహస్యం ఏమిటనేది మీరు అన్వేషిస్తే దేవుడు జ్ఞానం తెలియజేస్తాడు**" అని చెప్పిన ఈ అసత్యవాది మాత్రం ఎందుకు అన్వేషించ లేదో!

అందుబాటులోనున్న మూడు, నాలుగు పుస్తకాలను కూడా చదవడం చేతకాని వాడు పరిశోధకుడా! ఇలాంటి వ్యక్తి చెప్పిన మాటలను ఇస్లామిక్ పండితులు నోట్ చేసుకోవాలా?

ఖుర్'ఆన్ యొక్క 5:68 వాక్యంలోని - '**ఇతర గ్రంథాలను (All Rev elations)**' అంటూ అనువదించబడిన ఆ ఒరిజినల్ అరబీ పదాలను క్రింద ఇస్తున్నాము.

وَمَآ أُنْزِلَ إِلَيْكُمْ مِّنْ رَّبِّكُمْ

**"వమా ఉంజిల ఇలైకుమ్ మి(న్) ర్రబ్బికుమ్"**

వమా= మరియు ఏదైతే

ఉంజిల = అవతరించబడింది (ఈ మధ్యకాలంలో)
[has been revealed]

ఇలైకుమ్ = మీ వైపు

మిన్ = నుండి

రబ్బికుమ్ = మీ ప్రభువు

**"మరియు ఏదైతే మీ ప్రభువునుండి మీ వైపు అవతరింపజేయబడిందో** (ఈ మధ్య కాలంలో)"

ఈ మధ్య కాలంలో ముహమ్మద్(స)పై అవతరింపజేయబడింది అంటే, ఆ కాలంలో, అవి ఖుర్'ఆన్ మరియు ఖుర్'ఆన్‌లో తెలుపబడని కొన్ని సందేశాలు అని అర్థం. ఖుర్'ఆన్‌లో తెలియజేయబడని సందేశాలలోనివి చాలా వరకూ హదీసులలో లిఖించబడ్డాయి.

**కాబట్టి ఖుర్'ఆన్ మరియు హదీసులని అనుసరించనంత వరకూ మీరు ఏ పునాది పైనా లేరు.**

ఖుర్'ఆన్‌లోని ప్రతీ వాక్యానికి ఓ సందర్భముంది:

'తౌరాత్' దైవ గ్రంథమని చెప్పారు కాబట్టి, నేను దానినే అనుసరిస్తాను. మీ ఖుర్'ఆన్‌ను అనుసరించను అని ముహమ్మద్(స) వారితో ఓ యూదుడు చెప్పిన సందర్భంలో అవతరించిన ఆయత్ ఇది.

ఆ వాక్యంలోని ఇతర గ్రంథాల బ్రాకెట్లో వ్రాయవలసింది "**ఖుర్'ఆన్ మరియు హదీసులు**". అంతేగాని బైబిల్ మొత్తం సంపుటి అని కాదు.

**ఈయన గారి వాక్యంలో అసలు ఖుర్'ఆన్ గ్రంథం యొక్క ప్రస్తావనే లేదు. చూశారా!**

**ఖుర్'ఆన్**కు బదులుగా **బైబిల్** అని వ్రాసి అర్థాలను తారుమారు చేసిన ఇలాంటి అసత్యవాదులను 'అల్లాహుతాలా' ఖుర్'ఆన్‌లోని క్రింది వాక్యంలో హెచ్చరిస్తున్నాడు.

"కాని ఎవరైతే మా సూచనలను కించపరచటానికి ప్రయత్నిస్తారో అలాంటి వారు తప్పక భగభగ మండే నరకాగ్ని వాసులవుతారు. **(దివ్య ఖుర్'ఆన్ 22:51)**

"ఒక అబద్ధాన్ని కల్పించి, దానిని అల్లాహ్‌కు ఆపాదించే వాడి కంటే, లేక ఆయన ఆయత్ (సూచన)లను అబద్ధాలని తిరస్కరించే వాడికంటే, మహా దుర్మార్గుడెవడు? నిశ్చయంగా, పాపులు ఎన్నటికీ సాఫల్యం పొందలేరు!" **(దివ్య ఖుర్'ఆన్ 10:17)**

ఈ అసత్యవాది ఎన్నో సంవత్సరాలుగా సందేశ ప్రచారంలో ఉన్నాడట. ఇలాంటి వ్యక్తులు సమాజంలో ఇంకెంతమంది ఉన్నారో!

ఈ పిట్టలదొర మరియు ఇతని అనుచర వర్గాన్ని గట్టిగా అడిగితే, హమీదుల్లా షరీఫ్‌గారి అనువాదాన్నే మేము నమ్ముతాము అంటారు. అలా చెబుతూ, అనువాదకులపైకి వీరి పాపాన్ని నెట్టివేస్తున్నారు. వీరికి కావలసింది అనువాదకులను అగౌరపరచడం, ఖుర్'ఆన్ గ్రంథాన్ని అగౌరపరచడం. ఇదే అతని జీవనాధారం.

ఈ వ్యక్తి యొక్క అనుచరులు, రాష్ట్రంలోని దాదాపు అన్ని సంస్థల లోనూ దూరి, రహస్యంగా పనిచేస్తున్నారని తెలిసింది. వారి గుట్టు బయట పడితే, ఆ సంస్థలన్నింటికీ కూడా చెడ్డ పేరొస్తుంది కాబట్టి, అప్పుడు తనగురించి మరియు తన సంస్థ గురించి ప్రత్యేకంగా ఎవరూ ఏమి మాట్లాడరు అనేది ఈ పిట్టలదొర ప్లాన్ అయివుంటుంది.

హమీదుల్లా షరీఫ్‌గారి తెలుగు అనువాదంలో 'ఇతర గ్రంథాలను' అని మాత్రమే ఉందిగాని, ఆ పదాల బ్రాకెట్లో ఆయన ఏ విషయాన్ని కూడా ఇంటర్‌ప్రెట్ చేసి వ్రాయలేదు.

తౌరాత్ మరియు ఇంజీల్ అని చెప్పిన తరువాత, ఇతర గ్రంథాలు అంటే అర్థమేమిటి? ఆ రెండు కాక ఇతర గ్రంథాలని చెప్పడాన్ని బట్టి, ఆ ఇతర గ్రంథాలలో తౌరాత్ మరియు ఇంజీల్ లేనట్లే. మరి దానిని బైబిల్ మొత్తం సంపుటి అని చెప్పడానికి, కనీస జ్ఞానం, కనీస విద్యార్హతలు లేనివాడు ఎలా చెప్పగలడు? పోనీ అలా చెప్పడానికి ప్రయత్నించాలంటే, అందుబాటులోనున్న అనువాదాలని పరిశోధించాలి.

ఖుర్'ఆన్ గ్రంథంతో పాటు సహీహ్ హదీస్ గ్రంథాలున్నాయని ఈ మోసగానికి తెలియదా? ఒకవేళ తెలిస్తే, ఇతర గ్రంథాల బ్రాకెట్లో ఖుర్'ఆన్ మరియు హదీస్ గ్రంథాలు అని వ్రాయవచ్చు. ఒకవేళ తెలియకపోతే, ఇస్లాంపై కనీస అవగాహన లేనట్లే.

ముస్లిములందరినీ మేము కోరేదేమిటంటే, ఏ జీవనాధారం లేకుండా ఇలా మోసాలతో బ్రతికేవారికి, జీవనోపాధి కొరకు ఏదైనా ఉద్యోగాన్ని చూపించి, వారిని సన్మార్గంలోనికి తీసుకురావడానికి ప్రయత్నించమని.

**(పిట్టలదొర గురించి మరింత సమాచారం వచ్చే సంచికలో)**

## వక్రీకరణలు కాకుండా మరో విధంగా అయోమయాన్ని సృష్టించడం

మరి కొందరు తెలిసో తెలియకో ప్రజలలో అయోమయాన్ని సృష్టిస్తున్నారు. ఈ మధ్యనే ఓ కరపత్రంపై ఖుర్'ఆన్‌లోని 103వ సూరహ్‌ని పూర్తిగా ప్రింట్ చేశారు. అందులో వక్రీకరణ లేదు. ఆ కరపత్రంలో ఉన్నది యథాతథంగా :

**కాలం సాక్షిగా నిస్సందేహంగా మానవుడు పెద్ద నష్టానికి గురి అయి ఉన్నాడు.** (దైవాన్ని) **విశ్వసించి సత్కార్యాలు చేస్తూ ఉండేవారు. ఒకరికొకరు సత్యోపదేశం, సహన బోధ చేసుకునేవారు తప్ప.** (దివ్య ఖుర్'ఆన్ 103వ అధ్యాయం)

(హమీదుల్లా షరీఫ్‌గారి ఒరిజినల్ అనువాదంలో 'దైవాన్ని' అనే పదం లేదు. ఇది కరపత్రాన్ని ప్రచురించినవారు ఉంచారు. 'అల్లాహ్' అని ఉంచడానికి వీరికొచ్చిన సమస్య ఏమిటి? అది ఖుర్'ఆన్ వాక్యమని స్పష్టంగా ఇచ్చారు. మరి అల్లాహ్ అని చెప్పకపోవడం - నియ్యత్‌లో ఏదో తేడాని తెలియజేస్తుంది.)

*వక్రీకరణ లేదు కదా! సమస్యేమిటి? అని మీరు అడగవచ్చు.*

ఈ వాక్యాలను కరపత్రంలో ప్రెజెంట్ చేసిన తీరులోనే సమస్య ఉంది. అదే అయోమయానికి గురిచేస్తుంది.

ఆ వాక్యానికి క్రింద మూడు ఫొటోలను అచ్చువేసారు. ముగ్గురూ మూడు ధర్మాలకు అంటే, క్రైస్తవ, హిందూ మరియు ఇస్లాం మత ధర్మాలకు ప్రతినిధులుగా.

పై ఖుర్'ఆన్ వాక్యాలలో **'విశ్వసించి'** అంటే **అల్లాహ్‌ను విశ్వసించి** అని అర్థం. అయితే బ్రాకెట్లో 'దైవాన్ని' అని ఉంచారు. ఖుర్'ఆన్ గ్రంథంలో ఎక్కడైనా 'విశ్వసించి' అని వస్తే, అది అల్లాహ్‌ను విశ్వసించి అని ఖుర్'ఆన్ అనువాదాన్ని చదివే వారికి మాత్రమే అర్థమవుతుంది. అన్ని మత ధర్మాల వారిని దృష్టిలో పెట్టుకుని, ఏదో ఓ ఖుర్'ఆన్ వాక్యాన్ని కరపత్రంలో ముద్రించాలనుకున్నప్పుడు, ఇతరులకు ఈ విషయాన్ని స్పష్టం చేయాలి. బ్రాకెట్లో 'అల్లాహ్' అని ఉండాలి.

**'ఒకరినొకరు సత్యోపదేశం సహనబోధ'** అంటే ఆ ముగ్గురూ ఒకొరికొకరు సత్యాన్ని ఉపదేశించుకుంటారనా? లేదా 3 ధర్మాలవారు వారి వారి 'సత్యాన్ని' ఉపదేశించుకోమనా?

ఇలాంటివి పరోక్షంగా ప్రజలను అయోమయంలో పడవేస్తాయని తెలుసుకుంటే మంచిది. ఈ వ్యాసాన్ని చదివిన వారు ఒకసారి 'సూరహ్ కాఫిరూన్'ను అర్థంతో సహ చదవండి. ఇక్కడ చెప్పిన సత్యోపదేశం, సహన బోధ చేసుకునేవారు మరెవరో కాదు - అల్లాహ్‌ను విశ్వసించేవారు.

ప్రపంచ శాంతి దూత

సన్మార్గ బోధకుడు
నాయకుడు
ఆదర్శనీయుడు

# ముహమ్మద్ (స) వారి

బోధనలు
ఆచరణలు

మంచిగా మానవత్వంతో బ్రతకమనే హితబోధను ప్రతి మనిషి తన ఊహతెలిసిన దగ్గరనుండి వింటూనే ఉంటాడు. అయితే ఏది మంచి? ఏది చెడు? కొంతమంది తమ దృష్టిలో ఫలానా విషయం మంచిది అని సమర్థిస్తారు. అదే విషయాన్ని మరికొందరు పూర్తి చెడుగానూ తీసుకుంటారు. అంతెందుకు, ఒకే మనిషిలో ఒకే పనిపై, తన జీవితంలోని వివిధ దశలలో వేర్వేరు అభిప్రాయాలు జనిస్తాయి. నిజంగా మంచి చెడులపై మనుషులయొక్క వ్యక్తిగత అభిప్రాయాలనే గనుక పరిగణనలోకి తీసుకుంటే, అన్ని పనులూ మంచి పనులే. అలాగే అన్నీ కూడా చెడ్డపనులే అవుతాయి.

కేజీ బరువున్న వస్తువును, ప్రపంచంలో ఎక్కడకు తీసికెళ్లినా అది కేజీ బరువే ఉంటుంది. అలాగే కొలతలకు కూడా ప్రపంచవ్యాప్తంగా ఒకటే ప్రమాణముంది.

మరి మనిషి జీవనానికి లేదా ఆచరణకు ప్రపంచవ్యాప్తంగా అలాంటి ఓ ప్రమాణం లేదా? ప్రపంచంలోని ఏ మారుమూలనుండి ఏ వ్యక్తిని తీసుకున్నా, అతని శారీరక నిర్మాణం, అతని అవయవాల పనితీరు తదితర అంశాలన్నీ మిగతా ప్రాంతాలలోని మనుషులలాగే ఒకే విధంగా ఉంటాయి కదా!

మనిషి అనే ఈ జీవయంత్రాన్ని తయారుచేసి, దానికి అవసరమైన ప్రోగ్రామింగ్‌ను చేసిన సృష్టికర్తకే తెలుసు - ఈ మనిషికి ఏది మంచి చేస్తుందో, ఏది చెడు చేస్తుందోనన్న విషయం.

మంచి చెడుల ప్రమాణాలు ఖుర్'ఆన్‌లో ఉన్నాయి. అయితే ఆ ప్రమాణాల ప్రకారంగా ఎటువంటి సందేహానికి లోనవకుండా ఉండేందుకు ముహమ్మద్(స) మనందరి శిక్షణకై ఎన్నో విషయాలను ఆచరించి చూపారు. ఖుర్'ఆన్ యొక్క ఆదేశాల ప్రకారంగా దైవప్రవక్త ముహమ్మద్ (స)ఆచరించిన పనులను మరియు ఆయన యొక్క ప్రవచనాలను హదీస్‌లు అంటారనే విషయం చాలామందికి తెలుసు. సమకాలీన పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని, వేల సంఖ్యలో ఉన్న హదీసులలోని కొన్ని హదీసులను ఎన్నుకొని ఈ శీర్షిక ద్వారా ఇన్షాఅల్లాహ్ అందిస్తూ ఉంటాము.

**ప్రారంభ సంచికలో సుందర సమాజ స్థాపనలో 'విద్య' యొక్క ప్రాముఖ్యతను ముహమ్మద్(స) బోధనల ద్వారా వివరించడం జరిగింది. ఆ బోధనలను అర్థం చేసుకుని, ముస్లిములు తొలి యూనివర్శిటీ స్థాపకులుగా, ఆధునిక సైన్స్‌కి వ్యవస్థాపక శాస్త్రవేత్తలుగా ఉన్నతస్థితికి చేరుకున్నారు. ఆ పూర్వ వైభవం మరలా రావాలంటే హదీసు జ్ఞానమెంత అవసరమో తెలియజేయడం జరిగింది. తరువాయి రెండు సంచికలకు ఎన్నుకున్న విషయం 'వడ్డీ'. సమాజాన్ని సుందరంగా తీర్చిదిద్దడంలో 'విద్య'కు ఎంత ప్రాముఖ్యత ఉందో, సమాజాన్ని సర్వనాశనం చేయగల సామర్థ్యం అంతకంటే ఎక్కువగా 'వడ్డీ'కి ఉంది. గత సంచికలో సులభంగా ఆచరణకు సాధ్యమయ్యే చిన్న పనులద్వారా గొప్ప ఫలితాన్ని సాధించగలమనే శుభవార్తను అందించాము. ఈ సంచికలో కష్టం ద్వారా కూడా అల్లాహ్ యొక్క కరుణ లభిస్తుందన్న విషయాన్ని తెలియజేసే బోధనను అందిస్తున్నాము.**

5 & 6

## కష్టం - కరుణ

حدَّثني عَبْدُ اللهِ ابنُ مُحمَّدٍ : حدَّثنا عَبْدُ المَلِكِ بنُ عَمْرٍو : حدَّثنا زُهَيرُ بنُ مُحمَّدٍ، عَنْ مُحمَّدِ بنِ عمرِو بنِ حَلْحَلَةَ، عَنْ عَطاءِ بنِ يَسارٍ، عَنْ أبي سَعِيدٍ الخُدْرِيِّ، وَ عَنْ أبي هُرَيْرَةَ عَنِ النَّبِيِّ ﷺ قالَ: ((ما يُصِيبُ المُسْلِمَ مِنْ نَصَبٍ وَلا وَصَبٍ وَلا هَمٍّ وَلا حزَنٍ، وَ لا أذًى، وَلا غَمٍّ، حتَّى الشَّوْكَةِ يُشاكُها، إلَّا كَفَّرَ اللهُ بِها مِنْ خَطاياهُ)).

**అబూ స'ఈద్ ఖుద్రీ మరియు అబూహురైరా (రజి) ఉల్లేఖనం : "ఓ ముస్లిమ్‌కి అలసటగాని, జబ్బుగాని, దు:ఖం గాని, విచారంగాని, కీడుగాని, ఆందోళన గాని, ఓ ముల్లు సయితం గుచ్చుకోవడం సంభవించదు దాని వలన అల్లాహ్ అతని పాపాల నుండి కొన్నింటిని క్షమించడానికి తప్ప."**

**(సహీహ్ బుఖారీ, నెం. 5641, 5642, సంపుటి 7, అధ్యాయం 1)**

حدَّثنا محمدُ بنُ يوسفَ : حدَّثنا سُفيانُ، عنِ الأعمشِ، عنْ إبراهيمَ التَّيميِّ، عنِ الحارثِ بنِ سُويدٍ، عنْ عبدِ اللهِ رضيَ اللهُ عنهُ قالَ : أتيتُ النَّبيَّ ﷺ في مرضِهِ وهوَ يُوعكُ وَعْكاً شديداً فقلتُ : إنَّكَ لتُوعكُ وَعْكاً شديداً، قُلتُ : إنَّ ذاكَ بأنَّ لكَ أجرينِ، قالَ : ((أجلْ، ما منْ مُسلمٍ يُصيبُهُ أذىً إلَّا حاتَّ اللهُ عنهُ خطاياهُ كما تحاتُّ ورقُ الشَّجرِ)).

**"అబ్దుల్లా(రజి) ఉల్లేఖనం : ముహమ్మద్(స)వారు అనారోగ్యంగా ఉన్నప్పుడు నేను ఆయన దగ్గరికి వెళ్ళాను. ఆయన(స) తీవ్రమైన జ్వరంతో బాధపడుతున్నారు. నేను చెప్పాను : 'మీ జ్వరం చాలా తీవ్రంగా ఉంది. ఇది మీకు రెట్టింపు ప్రతిఫలాన్ని ఇవ్వడం కోసమా?' ఆయన చెప్పారు, 'ఔను, ఏ ముస్లిమ్ కూడా ఏ కష్టంతోనూ బాధించబడడు కాని దాని వలన చెట్టునుండి ఆకులు రాలిపడినట్లుగా అల్లాహ్ అతని పాపాలను కొట్టివేయడం జరుగుతుంది."** (సహీహ్ బుఖారీ, నెం. 5647, సంపుటి 7, అధ్యాయం 1)

ముందరి శీర్షికలో ఖుర్ఆన్ తఫ్సీర్‌లో అల్లాహ్ కరుణ గురించి చెప్పడం జరిగింది. అల్లాహ్‌ను విశ్వసించిన వారికి, ఆయన పెట్టే పరీక్షలో వారు నెగ్గడానికి తన కరుణతో వారికి సాయం చేస్తూ ఉంటారు. పై హదీస్‌లను బట్టి రెండు రకాలుగా ఆ సాయం అందుతుందని అన్పిస్తుంది.

విశ్వాసులకు కలిగే కష్టం పెద్దదైనా, చిన్నదైనా సరే, ఆఖరికి ఆ కష్టం ఓ ముల్లు గుచ్చుకోవడం వలన కలిగే బాధ వలన కలిగినా సరే, ఆ విశ్వాసి చేసిన పాపాలనుండి కొన్నింటిని ఆయన క్షమిస్తారు. చాలా మందికి సందేహం కలుగవచ్చు - కష్టాలు రావడం కరుణ ఎలా అవుతుందని.

ఉదాహరణకు ఓ వ్యక్తికి పదివేల రూపాయల అప్పు ఉంది. ఆ అప్పులో నుండి ఓ వెయ్యి రూపాయలను కొట్టివేస్తే లేదా మాఫీ చేస్తే, అది అతనికి మేలే అవుతుంది కదా!

ఈ కష్టాల వల్ల లాభం పొందేది కేవలం విశ్వాసి మాత్రమే!

అయితే ఆ కష్టం కలిగినప్పుడు విశ్వాసి ఎలా స్పందిస్తాడో (లేదా జవాబిస్తాడో) తెలియాలంటే క్రింది హదీస్‌ను అర్థం చేసుకోవాలి.

ముహమ్మద్(స)వారి బోధనను ఇబ్నె ముబారక్(రజి) ఉల్లేఖించారు: 'తన దాసుల్లోని ఒక దాసుని బిడ్డ మరణించినప్పుడల్లా అల్లాహ్ తన దూతల్ని అడుగుతాడు - 'మీరు నా దాసుని బిడ్డ ప్రాణం తీశారా?' దానికి వారు 'అవును' అని సమాధాన మిస్తారు. తిరిగివారితో 'మీరు నా దాసుని గుండెలో భాగమైన వాని ప్రాణం తీశారా?' అని ప్రశ్నిస్తాడు. వారు 'అవును' అని బదులిస్తారు. అప్పుడు ఆయన అడుగుతాడు. 'అయితే నా దాసుడు ఏమన్నాడు?' వారు ఇలా అంటారు, 'దీనిపై అతడు నీకు అభివందనాలు అర్పించుకున్నాడు, 'మేమంతా అల్లాహ్ కొరకే ఆయన వైపునకు మరలిపోవలసిన వారమే' అని పలికాడు'. 'నా ఈ దాసుని కొరకు స్వర్గంలో ఒక గృహం నిర్మించండి, దానికి కృతజ్ఞతా గృహమని పేరు పెట్టండి'' అని వారిని అల్లాహ్ ఆదేశిస్తాడు (అహ్మద్, నెం. 415, సంపుటి 4)

చూశారు కదా! అల్లాహ్ యొక్క దాసుడు ఎలా స్పందించాడో! అంతేగాని, 'నాపై దయ లేదా? నన్నెందుకు ఇలా బాధపెట్టాడు?' అంటూ అల్లాహ్ గురించి నిష్ఠూరంగా మాట్లాడలేదు.

మొదటి సంచికలో 'అమినా అస్సిల్మి'గారి జీవిత కథను అందించాము. మీకు గుర్తుండే ఉంటుంది. ఇక్కడ సందర్భానికి సరిపోతుందని ఆ వ్యాసంలోని ఓ సంఘటనను మరలా ఇక్కడ అందిస్తున్నాము.

కొన్ని సంవత్సరాల క్రితం ఆమెకి కాన్సర్ అని తెలిసింది. క్యాన్సర్ బాగా ముదిరిందని, ఆమె ఒక సంవత్సరం కంటే బ్రతకరని డాక్టర్లు చెప్పారు. కాని అల్లాహ్‌పై ఉన్న ఆమె విశ్వాసం అలాగే బలంగానే ఉంది.

**"మనమందరం చనిపోవాల్సిందే. నేను అనుభవించే బాధలోనే దీవెనలు ఉన్నాయని నా నమ్మకం".**

అల్లాహ్‌ను ఎంతగా ప్రేమించగలరో చెప్పటానికో విశిష్ఠమైన ఓ ఉదాహరణ : కరీమ్ అల్-మిసావి అనే ఆమె స్నేహితుడు చిన్న వయస్సులోనే (అంటే 20-30 సం॥ల మధ్య) కేన్సర్ వలన చనిపోయాడు. ఆ స్నేహితుని మాటలను గుర్తు చేసుకున్నారు.

''అతడు చనిపోవడానికి కొన్ని రోజుల ముందు, అల్లాహ్ నిజంగా కరుణగలవాడని అతను నాకు చెప్పాడు. అతను నమ్మశక్యంగాని తీవ్ర బాధలో ఉన్నాడు. అల్లాహ్ యొక్క ప్రేమని అన్నివైపులా ప్రసరింప జేస్తున్నాడు. అతను చెప్పాడు: **'నేను మచ్చలేని పుస్తకంతో** (అంటే దోషరహితంగా) **స్వర్గానికి చేరుకోవాలని అల్లాహ్ ఉద్దేశ్యమై ఉంటుంది.'** అతని మరణం యొక్క అనుభవం నన్ను ఆలోచింప జేసింది. **అతనే అల్లాహ్ యొక్క ప్రేమా కరుణల గురించి నాకు నేర్పాడు**''.

స్తోత్రాలన్నీ అల్లాహ్ కొరకే, ఆమె కేన్సర్ రావడాన్ని తనకు గొప్ప బ్లెస్సింగ్‌గానే భావిస్తున్నారు. బోన్ కేన్సర్‌తో ఆమె రెండుసార్లు 'హజ్' చేశారు. కాన్సర్ వలన ఆమె ఎముకలు బలహీనమవడంతో చక్రాల కుర్చీ ఉపయోగిస్తు న్నారు.

''నేనింకా బ్రతికుండాలని దైవం నిర్ణయించినట్లున్నారు'' అని చెబుతారామె. ''నేను ఏ విషయం కోసమైనా భయపడటం మానివేశాను. ప్రతిచోట నిజ ధర్మాన్ని చెప్పాలి. అది చాలా ముఖ్యం. నేను చేసే ప్రతీదానికి అల్లాహ్‌కు సమాధానం చెప్పుకోవలసి ఉంది. ఇస్లాంను పంచుకోవడం నాకిష్టం.

కరుణను ఆ సోదరుడే నేర్పాడని 'ఆమినా' చెప్పారు. ఆమెకు 1991లో బోన్ కాన్సర్ వస్తే, ఒక సంవత్సరానికి మించి బ్రతకడం కష్టమని డాక్టర్లు చెప్పారు. కాని ఆ కాన్సర్‌ని ఆమె అల్లాహ్ యొక్క కరుణగానే భావించారు. ఇప్పటికీ ఆ బోన్ కాన్సర్‌తోనే జీవిస్తూ, ఎందరికో ఇస్లాం గురించి పరిచయం చేస్తున్నారు.

విశ్వాసికి కష్టాలు రావడం కూడా కరుణను పొందడంలో ఓ భాగమేనని ఇప్పుడు మీకు స్పష్టంగా అర్థమై ఉంటుంది.

ముస్లిమ్ సమాజంలో హదీస్‌లను తిరస్కరించే సమూహాలు కూడా ఉన్నాయి. పైన వివరించిన 'ముహమ్మద్(స)వారి జ్వరం' గురించి అలాంటి వారు వక్రీకరించే అవకాశముంది. వక్రీకరణకు అవకాశ ముందనే ఉద్దేశ్యంతోనే ఆ హదీస్‌ను ఎన్నుకోవడం జరిగింది.

ఆ హదీస్‌ను జాగ్రత్తగా గమనిస్తే, ముహమ్మద్(స)వారికి కలిగే కష్టాలు ఆయనకు ఇంకా ఎక్కువ ప్రతిఫలాన్ని ఇస్తాయి. అంతేగాని అవి ఆయన(స) పాప క్షమాపణ కొరకు అని భావించకూడదు (అల్లాహ్ క్షమించుగాక!)

ఇంతకు ముందే చెప్పుకున్నాం - అప్పులతో నున్న ఓ వ్యక్తి యొక్క అప్పునుండి కొద్దిగా అప్పును తగ్గించినా, అది అతనికి మేలు అవుతుంది. అంటే 10 వేలు అప్పుగల వానికి 1000 రూ॥లు ఇస్తే, ఆ వెయ్యి రూపాయలను అతను ఉపయోగించుకోలేడు గాని, అతని అప్పు కొంత తగ్గి 9 వేలకి చేరుకుంటుంది. అలా పదిసార్లు ఇస్తే, అతని అప్పు తీరిపోతుంది. ఆ తరువాత మరో వెయ్యి రూపాయిలిస్తే, అప్పు తీరిపోయింది కాబట్టి ఈసారి ఆ డబ్బును ఉపయోగించుకో గలుగుతాడు. ఈ 11 సార్లూ అతనికి మేలే జరిగింది.

అంటే అప్పు పూర్తిగా తీరిపోయి, డబ్బు ఉపయోగంలోకి వచ్చింది.

పైన చెప్పిన దానికి భిన్నంగా డబ్బున్న వ్యక్తికి, ఇంతకు ముందరి వ్యక్తికి ఇచ్చినట్లే 11 సార్లు, ఒక్కొక్కసారి వెయ్యి రూపాయల చొప్పున ఇస్తే, అతనికి అప్పులేదు కనుక, అతని దగ్గరున్న సొమ్ముకి ఈ 11వేల రూపాయలు కలిసి, సొమ్ము వృద్ధి అవుతుంది.

కాబట్టి కష్టాలు ముస్లిమ్ చేసిన చిన్న, చిన్న పాపాలనుండి అల్లాహ్ క్షమాపణ దొరికేలా చేయవచ్చు లేదా ముస్లిమ్ చేసిన పుణ్యాలకు మరిన్ని కలపవచ్చు. పెంచవచ్చు. ఈ పుణ్యాల స్థాయిని బట్టే, స్వర్గంలో తగిన స్థాయి ఇన్నా అల్లాహ్ లభిస్తుంది.

ముహమ్మద్(స)వారికి వచ్చిన జ్వరం ఆయన(స) యొక్క పుణ్యాల స్థాయిని పెంచేదేనని హదీస్‌నుండి స్పష్టమవుతుంది.

ఈ విషయం మరింతగా స్పష్టం కావాలంటే, ముహమ్మద్(స) వారి క్రింది బోధనను చదవండి.

**సుహైబ్(రజి) ఉల్లేఖనం : అల్లాహ్ యొక్క సందేశహరులు చెప్పారు: "మోమిన్ (విశ్వాసి) వ్యవహారం కూడా వింతైనది. అతను ఏ స్థితిలో ఉన్నా తద్వారా శుభాన్నే సేకరిస్తాడు. ఈ మహాభాగ్యం మోమిన్‌కి తప్ప మరెవ్వరికీ ప్రాప్తం కాదు. అతను కష్టాలకు, వ్యాధి వ్యథలకు గురయినప్పుడు వాటిని 'సహనం'తో ఎదుర్కొంటాడు. అది అతనికి శుభాన్ని చేకూర్చుతుంది. అలాగే సుఖం, ఐశ్వర్యం లభించినప్పుడూ 'కృతజ్ఞత'తో మెలుగుతాడు. అదీ అతనికి శుభప్రదమవుతుంది"** (ముస్లిమ్)

అల్లాహ్ తన దాసులపై వారు భరించలేనంత కష్టాన్ని కలిగించడు.

**అందువలననే, కష్టాలలోనూ సుఖాలలోనూ 'ముస్లిమ్' సంతోషంగా బ్రతకగలుగుతాడు.**

## హదీస్‌లపై అపోహలు 3

ఒక ప్రత్యేక మత ధర్మానికి చెందినవారు ఆయిషా(రజి)వారి వివాహం విషయాన్నే ఎల్లప్పుడూ ప్రత్యేకంగా ప్రస్తావించి 'ఇస్లాం'పై బురద చల్లడానికి ప్రయత్నిస్తూ ఉంటారు. ఆయిషా(రజి)వారు ముస్లిము లందరికీ మాతృమూర్తి (ఉమ్ముల్ మోమినీన్) మాత్రమే కాకుండా, అమోఘమైన జ్ఞానం గల మహిళ. అందువలన ఈ మాతృమూర్తి గురించి పరమత ధర్మం వారు దురభిమానంతో మాట్లాడుతుంటే ఏ ముస్లిమ్‌కైనా హృదయవేదన కలుగుతుంది.

ఈ విషయంపై చాలామంది ముస్లిమ్ సోదరులు, చాలా రకాలుగా వివరణ ఇచ్చారు.

ఓ హాఫిజ్ గారయితే మరో మార్గాన్ని ఎంచుకున్నారు. ఈయన కొన్ని ఆధారాలతో ఓ పుస్తకాన్ని వ్రాసారు. ఈయన చెప్పిన ఆధారాలను పరిశీలించ కుండా, మన రాష్ట్రంలోని ఓ సంస్థవారు తెలుగులో అనువదించి ప్రచురించారు. బహుశా ఈ పుస్తకాన్ని వేలమంది చదివి ఉంటారు. ముందుగా ఈ తప్పును పబ్లిషర్స్ దృష్టికి తీసుకు వెళదామని అనుకున్నాము. ఎంతో మంది చదివి ఉంటారు కాబట్టి, 'శాంతిబాట'ద్వారా ఆ పుస్తకంలో ఇచ్చిన అంశాల గురించి చర్చించి, పాఠకులకు వివరించాలని, తద్వారా పాఠకులను ఆలోచింప చేయాలనేది మా కోరిక.

ఆయిషా(రజి) వారి వయస్సు, ఆమె కాపురానికి వచ్చేటప్పటికి 9 యేళ్ళ కంటే ఎక్కువ అని నిరూపించడం ద్వారా, ప్రవక్త(స) వారిపై మరో ధర్మం వారు వేసిన అపవాదు తొలగిపోతుందనే సంకల్పంతో, ఆలోచన కంటే ఆవేశానికే ఎక్కువ ప్రాధాన్యమిచ్చి రచయిత 24 ఆధారాలను చూపారు. నిజానికి అవి **ఆధారాలు కాదు**. రచయిత యొక్క **అభిప్రాయాలు మాత్రమే**.

ఓ అపవాదును తొలగించే ఉద్దేశ్యంతో, మరో పెద్ద అపవాదును ముస్లిములపై రచయిత వేయడం జరిగింది.

**ముందుగా రచయిత యొక్క ఆవేదన, ఆలోచనలను అతని మాటల ద్వారానే తెలియజేసి**, ప్రతీ ఆధారాన్ని విపులంగా చర్చించడం జరిగింది.

**పేజీ 204:** "అరేబియా ఉష్ణప్రాంతం కనుక అక్కడి బాలికలు ఈ వయస్సులో (అంటే 9 యేళ్ళ వయస్సులో) రజస్వలలు అవుతారు అని మన ఉలేమాలు (విద్వాంసులు) ఊహించి చెబుతూ వచ్చారు"

**పేజీ 206:** "అరేబియాలో ఉన్న శీతోష్ణ పరిస్థితులు (లేక) ఇంచుమించుగా అటువంటి శీతోష్ణ పరిస్థితులు ఉన్న ఆఫ్రికా, ఏషియా, ట్యూనిస్, సూడాన్,

మొరాకో మరియు భూమధ్యరేఖా ప్రాంతంలో వాటి సమీప ప్రాంతాలు అంటే పాకిస్తాన్‌లోని ముల్తాన్, సిఖర్, హల్బీ, జైకబ్, ఆబాద్ ప్రాంతాలు ప్రసిద్ధమైనవి. అటువంటప్పుడు ..... ఆయా ప్రాంతాల్లో పది పదకొండేళ్ళ వయస్సులోనే బాలికలందరూ రజస్వలలయి పోవాల్సింది. పాకిస్తాన్‌లో రెండు మూడు లక్షల బాలికలు కాకపోయినా, రెండు మూడు వేల బాలికలయినా తొమ్మిదేళ్ళ వయస్సులో రజస్వలలు అయిన ఉదాహరణలు కనిపించాల్సింది.

**పేజీ 207:** "ఇస్లాం విరోధులు, దైవప్రవక్త(స)పై బురద జల్లడానికి పన్నే పన్నాగాలను తిప్పికొట్టడం" అనే విషయం పైనే మేము వ్రాయదలచు కున్నాము. "ఏది ఏమైనా దైవప్రవక్త(స) ఉన్నత వ్యక్తిత్వం, బుఖారీ, ముస్లిం ఉల్లేఖకుల కన్నా అధిక గౌరవనీయమన్న విషయం సుస్పష్టం ...... బుఖారీ, ముస్లిం ఉల్లేఖకులను విశ్వసించడం మనకు తప్పనిసరి కాదు".

విశ్వాసులుగా, విద్యార్థులుగా మేము తెలుసుకున్నదల్లా, దైవప్రవక్త(స) వ్యక్తిత్వం మహోన్నతమైనది. అది మా భావాలకు అందనంత ఉన్నత శిఖరస్థాయిలో ఉంది. ఏ ప్రవక్త పైనైనా ఏదో రకంగా అపవాదు పడుతూ ఉంటే అటువంటి అపవాదులను నేలకేసి కొట్టడమే మన విశ్వాసానికి ప్రతీక".

**రచయితల సంకల్పం ఏమిటో అర్థమైంది కదా!**

ఓ అపవాదును నేలకేసి కొట్టడం కోసం, పరోక్షంగా మరో అపవాదును ఇతను ముస్లిమ్ సమాజంపై వేశారని గమనించలేక పోయారు.

సహీహ్ బుఖారీ, సహీహ్ ముస్లిం గ్రంథాలపై అనుమానం కలిగేలా వ్రాయడం, రచయిత తొందరపాటుతనం, అవివేకమేనని స్పష్టంగా తెలుస్తుంది. ఈ రోజు ఇతను సహీహ్ హదీస్ గ్రంథాలలో ఒకటి తప్పు అని చెబితే, మరో రోజు మరొకరు మరో హదీస్ తప్పని చెబుతాడు.

వీరి అజ్ఞానం సామాన్య ముస్లిమ్‌ని అయోమయంలో పడవేస్తుంది.

---

**ఏ అపవాదునైనా వివేకంతో ఖండించాలి. ముహమ్మద్(స) వారిపై ఎన్నో అపవాదులను వేశారు. వాటిని వివేకంతో చాలా చక్కగా ఖండించి, అపవాదు వేసేవారి దుర్మార్గాన్ని సులభంగా బయటపెట్టవచ్చు.**

**ముహమ్మద్(స)వారిపై ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న దుష్ప్రచారాన్ని ఖండిస్తూ, ప్రచురించే పుస్తకాన్ని పాఠకులందరికీ ఉచితంగా అందించాలనే ఉద్దేశ్యంతో, పత్రికలో ప్రకటన కూడా ఇచ్చాము. 180 పేజీలకు పైగానే పుస్తకం పూర్తయింది. ఓ 10 పేజీలు మాత్రమే పెండింగ్ ఉంది. ఈ పత్రికను సమయానికి అందించాలనే ప్రయత్నంలో, ఆ పుస్తక ప్రచురణ ఆలస్యం అవుతుంది.**

**ప్రమాణంలో ఏ మాత్రం తగ్గకుండా అందించాలి కాబట్టి, కాస్త ఆలస్యమైనా మేము చేసిన వాగ్దానం ప్రకారం పాఠకులకు త్వరలోనే ఇన్షా అల్లాహ్ ఈ పుస్తకాన్ని అందిస్తాం. అందించే ముందు పత్రికలో ముందస్తు ప్రకటన ఇవ్వడం జరుగుతుంది.**

---

రచయిత 'ఇస్లాం' గురించి మదరసాలో చదువుకుని కోర్సులు పూర్తిచేసి ఉండవచ్చు. కాని ఇతనికి లోకజ్ఞానం తక్కువని తెలుస్తుంది. రచయిత వాడిన భాష కూడా సంస్కారవంతంగా లేదు. ఆవేశం, ఆలోచనను కోల్పోయేలా చేస్తుంది. ఇది ఇస్లామ్‌కి విరుద్ధం.

**హజ్రత్ ఆయిషా(రజి) వారి వయస్సు కాపురానికి వచ్చే సమయానికి 9 సం॥లా? లేక 19 సం॥లా? అనే విషయంపై చర్చ:**

మొదటి రెండు ఆధారాల గురించి చర్చించవలసిన అవసరం లేదు.

**ఆధారం - 3:**

సైన్స్ గురించి మరియు వైద్య బృందాల ప్రస్తావనను ఈ మూడవ ఆధారంలో చర్చించారు.

**(9 సంవత్సరాల వయస్సుకే రజస్వల అవడం) లాంటివి జరగడం సంభవం అయితే ప్రస్తుత యుగంలో పత్రికల పతాక శీర్షికలయ్యేవి అని రచయిత అంటున్నారు.**

ఇలాంటివి న్యూస్ పేపర్ల పతాక శీర్షికలలో పెట్టరని ముందుగా రచయిత తెలుసుకోవాలి. ఇవి సహజంగా జరిగే విషయాలు కాబట్టి న్యూస్ పేపర్లలో కనిపించవు. అయితే ముఖ్యమైన వ్యక్తుల ఇంటర్వ్యూలలో ఇలాంటి విషయాలు తెలుస్తాయి.

**అలాంటి కొన్ని ఉదాహరణలు మేము అందించబోయే ఉచిత పుస్తకంలో ఉన్నాయి.**

రచయితలు చూపిన 24 ఆధారాలలో, కొన్ని వాక్యాలలో వారు వాడిన భాష హుందాగా లేదు. వాటిని హదీసు జ్ఞానమున్న ఆలిమ్‌లు వ్రాసినట్లుగా లేదు.

అంతే కాకుండా ముస్లిమెవరైనా తొమ్మిది యేళ్ళ వయస్సులో తన అమ్మాయికి పెళ్లిచేసి సున్నత్‌ను పునరుద్ధరించే వారు కదా! అని అన్నారు.

రచయితలలాగే మనం కూడా ఆలోచిస్తే, ముహమ్మద్(స) వారు తన కంటే ఎక్కువ వయస్సున్న విధవరాలు హజ్రత్ ఖదీజా(రజి) వారిని వివాహమాడారు కాబట్టి, ప్రతీ తండ్రి తన కొడుక్కి పెద్ద వయస్సున్న ఓ విధవరాలనే వివాహం చేసి సున్నత్ అని అనుకోవాలా? ముహమ్మద్(స) వారు అన్ని వయస్సులలో నున్న వారిని వివాహం చేసుకున్నారు. కాబట్టి **ఖుర్ఆన్ ఆదేశాలకు లోబడి** ఏ వయస్సు స్త్రీని పెళ్లాడినా సరే, అది సున్నతే అవుతుంది.

అంతేకాదు. ముహమ్మద్(స) వారు 11 వివాహాలు చేసుకున్నారని, మనం కూడా అన్ని వివాహాలు చేసుకుని సున్నత్ అనుకోవడానికి ఆస్కారం లేదు. ఎందుకంటే అల్లాహ్ ఆ విషయంలో నలుగురినే హద్దుగా పెట్టారు కాబట్టి.

మరో విషయం, విశ్వాసుల మాతృమూర్తులకు ప్రవక్త(స) తదనంతరం, సాధారణ ముస్లిముల వలె వివాహం చేసుకొనే వీలు లేదు కదా! ముహమ్మద్(స)వారి విషయం ప్రత్యేకం. ఆయన సర్వ మానవాళిని సంస్కరించడానికి పంపబడిన చివరి ప్రవక్త. ఎవ్వరూ అనుభవించని ఎన్నో బాధలను, కష్టాలను అనుభవించారు. ఆయన రాత్రుళ్ళు సుదీర్ఘంగా ప్రార్థనలు చేసేవారు. కాని అలాంటి ప్రార్థనలు తన అనుచర సమాజానికి ఆదేశించలేదు.

**ఆధారం - 4:**

హజ్రత్ ఆయిషా(రజి) వారికి వివాహం జరిగినప్పటి వయస్సు గురించి తెలిపే ఉల్లేఖనం గురించి మాట్లాడుతూ, ఉర్వ(ర) చెప్పిన ఉల్లేఖనాన్ని ఖండించినా ఫర్వాలేదు అని అన్నారు. ఎందుకంటే హజ్రత్

ఆయిషా(రజి) తన వివాహ వయస్సు గురించి ప్రత్యక్షంగా చెప్పిన హదీసు గాని లేదా ప్రవక్త(స) చెప్పినదైనా అయితే ఎటువంటి సందేహం ఉండకపోయేది అని రచయిత అభిప్రాయపడ్డారు.

కాని తన వివాహ వయస్సుకు సంబంధించి చెప్పిన ఈ ఉల్లేఖనం హజ్రత్ ఆయిషా(రజి) చెప్పలేదని ఖచ్చితంగా నిరూపించే సాక్ష్యం ఏమీ లేనప్పుడు, ఈ 4వ ఆధారానికి విలువ లేదు. ఇది కూడా రచయిత వ్యక్తిగత అభిప్రాయం క్రిందకే వస్తుంది.

**ఆధారం - 5:**

ఆయిషా(రజి) వారి వివాహ వయస్సుకు సంబంధించి చెప్పిన ఉల్లేఖనాన్ని నకలు చేసిన వారు 'హుష్షామ్'. ఈయనకు ముఖ్య శిష్యులైన ఇమామ్ మాలిక్ గారు తన గురువుగారి ఉల్లేఖనాన్ని తన గ్రంథంలో పొందుపర్చలేదు. ఎందుకంటే హుష్షామ్, తన అవసాన దశలో ఇరాఖ్‌లో చెప్పిన హదీసులను ఇమామ్ మాలిక్ గారు తిరస్కరించారు.

అబ్దుర్రహ్మాన్ బిన్ ఖరాష్ ప్రకారం: "**ఇమామ్ మాలిక్ ఆయన్ని తిరస్కరించారు.** ఆయన ఇరాఖ్‌లో చెప్పిన హదీసుల కారణంగా ఆయన పట్ల అభ్యంతరం తెలిపారు". దానికొక ఉదాహరణనిచ్చారు: హుష్షామ్(ర) గారి భార్య పేరు ఫాతిమా బిన్తె అల్ మున్జర్. ఈమె తన భర్త కంటే 13 సంవత్సరాలు పెద్దది. తన భార్యకి కూడా తొమ్మిదేళ్ల వయస్సులో వివాహం జరిగిందని హుష్షామ్ చెప్పినట్లు హాఫిజ్ జహబీ చెప్పారు.

ఒకవేళ నిజంగా 9 సంవత్సరాల వయస్సులో ఆమెకు వివాహం జరిగి ఉంటే, ఆమె యొక్క వివాహ సమయానికి, హుష్షామ్ ఇంకనూ పుట్టలేదు కదా అనేది రచయిత వాదన. ఆమె కాపురానికి వచ్చినప్పుడు ఆమె వయస్సు 28 సంవత్సరాలట. అయితే ఇక్కడ ఓ విషయం స్పష్టం కావాలి. హుష్షామ్ గారి కంటే ముందుగా మరొకరితో ఆమె వివాహం జరిగి ఉండి ఉంటే, హుష్షామ్ గారి యొక్క ఉల్లేఖనం నిజమే కావచ్చు.

హజ్రత్ ఆయిషా(రజి) వారి వయస్సు కాపురానికి వచ్చే సమయానికి 19 సం॥లు అయిఉంటుందని, అందులోని మొదటి అంకెను తీసివేసి (అంటే దశమ స్థానాన్ని తీసివేసి) 9 మాత్రమే చెబుతున్నారని రచయిత అభిప్రాయ పడుతున్నారు.

తన భార్య విషయంలో హుష్షామ్ తప్పుగా చెప్పారని రచయిత అనుకున్నాడు కాబట్టి, హజ్రత్ ఆయిషా(రజి) వారి వయస్సు విషయం లోనూ తప్పు చెప్పి ఉండవచ్చు అనేది రచయిత యొక్క అనుమానం.

**ఇది అనుమానమే గాని ఆధారం కాదు.**

**ఆధారం - 6:**

హుష్షామ్ ఇరాఖ్ చేరేటప్పటికి అతని వయస్సు 71 సంవత్సరాలు. అంతకు పూర్వం ఆయన మదీనాలో ఉన్నారు. కాని ఈయన ఉల్లేఖనాన్ని చెప్పిన 13 మందిలో 9 మంది కూఫా నివాసులు, 4 గురు బస్రా నివాసులు.

ఒక్క మదీనా వాసి కూడా వీరిలో లేడు. ఈ ఉల్లేఖనాన్ని ఈయన మదీనాలో ఎందుకు చెప్పలేదు అనేది రచయితల ప్రశ్న. ఈయన మదీనాలో చెప్పిన హదీసు ఉల్లేఖనాన్ని పుస్తక రచయితలు ఖండించడం లేదు. ఇరాఖ్‌లో ఉల్లేఖనాలను మాత్రమే ఖండిస్తున్నారు.

అంతేకాకుండా రచయితలు హుష్షామ్ చెప్పిన మాటలనే ఉదాహరించారు:

**"మీకు ఎవరైనా ఇరాఖీ ఒక వెయ్యి హదీసులు వినిపిస్తే వాటిలో 990 హదీసులను నేలకేసి కొట్టండి. మిగతా పదింటినీ అనుమానిస్తూ ఉండండి".**

హదీసు ధృవీకరణ విషయంలో, హలాల్, హరామ్ విషయాలలోనే చాలా గట్టిగా వ్యవహరిస్తారని, ఎవరైనా ఉల్లేఖకునికి అవసాన దశలో జ్ఞాపకశక్తి మందగిస్తే, అతడు మందగించిన జ్ఞాపకంతో ఉల్లేఖించడం జరిగితే, ఆ ఉల్లేఖనాన్ని విన్న శిష్యులు దానిని నకలు చేసినా, ఆ ఉల్లేఖనం స్వీకరించబడదు అనే సూత్రాన్ని రచయితలిద్దరూ గుర్తు చేస్తున్నారు.

ఈ ఆధారంలో వారు వ్రాసిన క్రింది వాక్యం యొక్క అవసరమేమైనా ఉందా?

"**ఒక వ్యక్తి లేక ఒక వర్గం బుఖారీని విశ్వసిస్తున్నామన్న కలిమా చదివారంటే అది వేరే విషయం**".

ఈ ఆరవది కూడా రచయిత అభిప్రాయమే గాని, ఆధారం ఎంత మాత్రం కాదు.

**ఆధారం - 7:**

బుఖారీ గారి కితాబుత్ తఫ్సీర్ లోని ఓ హదీసు గురించి వివరించారు. ఉమ్ముల్ మోమినీన్ ఆయిషా(రజి) సెలవిచ్చారు: "**అప్పుడు నేను బాలికను. ఆటలాడుతూ తిరిగేదాన్ని**". ఖమర్ సూరాలోని ఆయత్ అవతరణకు సంబంధించిన విషయమిది. ఈ సూరా చంద్రుడు చీలిన సందర్భంలో అవతరించబడింది. **హిజ్రత్‌కు 5 ఏళ్ళ పూర్వం** ఈ సంఘటన జరిగిందని, అయితే వివరణ వ్రాసిన వారి ప్రకారం ఈ సూరా **ప్రవక్త పదవీ కాలపు 4వ సంవత్సరంలో** అవతరించబడిందని రచయిత చెబుతున్నారు.

**(ఈ ఆధారం కూడా కరెక్ట్ కాదనే విషయం వచ్చే సంచికలో)**

**ఆలస్యమయినా, అందరికీ ఉపయోగపడే అరుదైన విషయాలతో వెలువడుతున్న శాంతిబాట పత్రికను ఆదరించమని కోరుతున్నాము.**

**ఎవరో ఒకరి ఉపాధి కొరకుగాని, లాభం కొరకుగాని కాకుండా, కేవలం ఇస్లాం ధార్మిక విషయాలతో ఎడ్యుకేట్ చేయాలనే మా తపనను అర్థం చేసుకోమని కోరుతున్నాము.**

**ప్రతీనెలా మొదటి వారంలో పత్రికను అందించడానికి అల్లాహ్ పేరుతో ప్రయత్నిస్తున్నాము**

# తిరిగి గూటికి

ప్రారంభంలో చెప్పుకున్నట్లు, దైవధర్మం అనేది ఏ ఒక్కరి సొత్తో కాదు. ప్రకృతిలాగే ఇది అందరికీ చెందుతుంది. ఈ వాస్తవాన్ని ఆలస్యంగానైనా సరే చాలా మంది తెలుసుకుంటున్నారు. ప్రస్తుతం ఇస్లాం (శాంతి) ధర్మం ప్రపంచంలో అత్యంత వేగంతో విస్తరిస్తుంది. ఈ ధర్మంపై బురద చల్లడానికి పాశ్చాత్యులు చేస్తున్న కృషి వలన, ఈ ధర్మవ్యాప్తి తగ్గడానికి బదులు దీని వేగం మరింత పెరుగుతూ వస్తుంది. ప్రస్తుతం అమెరికాలో ప్రతీ సంవత్సరం సగటున 20,000 మంది ఇస్లాం ధర్మంలో ప్రవేశిస్తున్నారు. మన దేశంలో, మన రాష్ట్రంలో కూడా ఈ దైవ ధర్మాన్ని చాలామంది తెలుసుకుని, ఈ ధర్మంలో ప్రవేశిస్తున్నారు. ఈ ధర్మాన్ని ఆచరించడం అనేది 'మత మార్పిడి' ఎంత మాత్రం కాదు. దారి తప్పిన సోదరి లేదా సోదరుడు తిరిగి తన పయనించవలసిన దారిని చేరుకోవడం లాంటిది. ఇలా తిరిగి గూటికి చేరుకున్న ఓ సోదరి గురించి గాని, ఓ సోదరుని గురించి గాని ఈ శీర్షికలో పరిచయం చేయబడుతుంది.

ఇస్లాం ధర్మంలో అడుగిడిన వీరిని కొత్త ముస్లింలు లేదా నవముస్లింలు లేదా నౌ ముస్లింలుగా అభిమానంతో తోటి ముస్లిం సోదరసమాజం పిలుస్తుంది. అయితే ఇస్లాం పట్ల అవగాహన లేని కొంతమంది 'ముస్లిం' సోదరులుగాని, విద్వాంసులుగాని ఈ నవముస్లింల పట్ల ప్రవర్తించే తీరు కొంతమేర అభ్యంతరకరంగానూ, ప్రియ ప్రవక్త ముహమ్మద్ (స) వారి సాంప్రదాయానికి వ్యతిరేకంగానూ ఉంటుంది. ఇస్లాం పట్ల అవగాహన ఉన్నవారు వీరిని ఆప్యాయంగా అక్కున చేర్చుకుంటున్నారు. దారి తప్పిన తమ సోదరుడు లేదా సోదరి తిరిగి తన గూటికి చేరుకున్నారన్న ఆనందోత్సాహం వారిలో స్పష్టంగా కనిపిస్తుంది.

ఇస్లాం ధర్మాన్ని అవగాహన చేసుకుంటే, ఏ ధర్మానికి చెందినవారైనా సరే, ఇది ఖచ్చితంగా దైవధర్మమనే విషయాన్ని అంగీకరిస్తారు. కాని ఈ ధర్మాన్ని ఆచరించడానికి మనో ధైర్యం కావాలి. దైవ భీతికలవారికి ఇది సునాయాసంగా లభిస్తుంది. కుటుంబానికో, సమాజానికో భయపడటం వల్లనో లేదా ఇతరత్రా కారణాల వల్లనో దైవధర్మానికి చాలామంది దూరంగా ఉన్నారు.

అలాగే కొత్తగా దైవధర్మంలోకి వచ్చిన వారికి చాలా సందేహాలుంటాయి. ఒక్కసారిగా అన్ని పుస్తకాలనూ వారు చదవలేరు. ధర్మావగాహనకు కూడా కొంత సమయం పడుతుంది. అనుభవజ్ఞుల వివరణలు వీరికి చాలా అవసరం. ఇంతకు ముందరి జీవితంలోని కొన్ని అభ్యంతరకరమైన అలవాట్లు నుండి దూరం కావడానికి మరికొందరికి సమయం పడుతుంది. వారు ప్రారంభంలో ఓ ప్రత్యేకావస్థకు గురై ఉంటారు. వారికి ప్రవక్తగారి సాంప్రదాయ ప్రకారం సౌమ్యంగా, సహనంతో అన్ని విషయాలను ఆకళింపు చేసుకొనేలా చేయడం, వారికి తోడుగా ఉండడం మనందరి బాధ్యత.

ఈ శీర్షిక ద్వారా వీలుని బట్టి నవ ముస్లిం సోదరులకు ఎదురయ్యే ఇబ్బందులు, వాటిని సునాయాసంగా అధిగమించడానికి ఖుర్ఆన్, హదీసుల వెలుగులో పరిష్కారాలను కూడా అందించే ప్రయత్నం జరుగుతుంది.

---

## మిమి మా (Mimi Ma)

18 సంవత్సరాల వయస్సులో ఈ సోదరి ఇస్లాం స్వీకరించారు. వియత్నాంలో బౌద్ధమతస్థులైన దంపతులకు జన్మించారు. వియత్నాంలో యుద్ధం జరుగుతున్న కాలంలో పుట్టారీమె. తన పెద్దక్కను వివాహం చేసుకున్న వ్యక్తి అమెరికన్. అతను విదేశీ సేవల కోసం పనిచేస్తూండే వారు. తనకు 4 సంవత్సరాల వయస్సున్నప్పుడు, తన అక్కా బావలతో కలిసి తన మాతృదేశాన్ని వదలిపెట్టి వెళ్లారు.

ఆమె బావగారు విధి నిర్వహణలో భాగంగా ఆఫ్రికా వెళ్ళవలసి వచ్చింది. ఎన్నో సంవత్సరాలుగా అక్కడ ఒకచోట నుండి మరో చోటికి వెళ్ళవలసి వచ్చేది. ఆమె ముస్లిమ్ దేశాలలో నివశిస్తూ క్రైస్తవత్వాన్నే అనుసరిస్తుండేవారు. క్రైస్తవులు కానివారిపై ఆమెకు తక్కువ అభిప్రాయముండేది.

అక్కాబావలతో ఆఫ్రికాలో ఉంటూ క్రిస్టియన్‌గానే పెరిగారు. ఆమె ఇస్లాం స్వీకరించాక, ఆమె బంధువులతో సంబంధాలు తెగిపోయాయి.

ఆమె తన గుర్తింపులోని ఓ భాగాన్ని కోల్పోయింది. నీలం రంగు జీన్స్ మరియు టి-షర్ట్‌ల స్థానంలో తలను కప్పుతూ హిజాబ్, పొడవైన స్కర్ట్‌ను ధరించడం ప్రారంభించాక, సెప్టెంబర్ 11 తరువాత, ఆమెను ఇక ఆసియా వాసిలా కాక, ఆమె ఓ అరబ్ అనే అనుకునేవారు.

ఇది అమెరికాలోని యువతులకు ఎదురయ్యే అనుభవం. ఇస్లాంలో చేరుతున్న అమెరికన్ యువతుల సంఖ్య పెరుగుతూ ఉంది.

ఇంతకు పూర్వం ఆఫ్రికన్-అమెరికన్లు ఎక్కువగా ఇస్లాం స్వీకరించే వారు. ఇప్పుడు వైట్, కాకేసియన్ మహిళలు కూడా ఇస్లాం స్వీకరిస్తున్నారు. ఇది చాలా వింతైన దృగ్విషయంగా అమెరికన్-ఇస్లామిక్ సంబంధాల కౌన్సిల్ ఫ్లోరిడా ఛాప్టర్‌కి డైరక్టర్ అయిన అల్తాఫ్ అలీ పేర్కొన్నారు.

ఎక్కువమంది మహిళలు అక్కడ ఇస్లాం స్వీకరించడానికి కారణం: **ఇస్లాంలో మహిళల కుండే హక్కులు.**

ముస్లిమ్ మహిళలను బందీలుగా, మాట్లాడటానికి స్వేచ్ఛలేనివారిగా దురభిమానంతో చిత్రించినప్పటికిని, చాలామంది మహిళలు ఇస్లాం స్వీకరించడానికి కారణం: **ఇస్లాంలో వారు కనుగొన్న స్వేచ్ఛ.** ఎన్నో సంవత్సరాలుగా మహిళలు పెళ్లికొరకుగాని లేదా భర్తల కొరకు గాని ఇస్లాం స్వీకరించే వారని, కాని ప్రస్తుతం పెళ్లికాని యువతులు, పెళ్లి

అయిన మహిళలు కూడా వారి యొక్క స్వీయ ధృఢ నిశ్చయంతోనే, ప్రత్యేకంగా సమసమానత్వ బోధనలకు ఆకర్షితులై ఈ ధర్మాన్ని స్వీకరిస్తున్నారు.

పురుషులు స్త్రీల కిచ్చే గౌరవానికి ఆనందిస్తున్నామని వారు ఎల్లప్పుడూ చెబుతున్నారు.

**ఖుర్'ఆన్‌లో ఓదార్పును పొందడం :**

మహిళలను నీచంగా చూసే విధానాన్ని ఇస్లాం బోధనలు ఆజ్ఞాపించ లేదు. సమానత్వం గురించి ఆమెకున్న చింతలను దేనికంటే కూడా చాలా ఎక్కువుగా, ఖుర్'ఆన్ గ్రంథంలోనే శాంత పరచినట్లు సోదరి తెలుసుకున్నారు. ఆమె తన భర్తతో సహా మగవాళ్ళను మహిళల హక్కు విషయంలో సవాల్ చేయడానికి ఇష్టపడుతుంది.

**'ఖుర్ఆన్ తెరచి చూపించండి. ఋజువు చేయండి'** అని ఆమె చెప్పగలుగుతుంది. విద్య విషయంలో, ఆస్తుల విషయంలోనే కాదు, ఏ విషయంలోనైనా ఏమి చెప్పినా సరే, ఖుర్'ఆన్ ద్వారా ఋజువు చేస్తేనేగాని ఆమె ఒప్పుకోరు.

మహిళల దుస్తుల గురించి కూడా ఖుర్'ఆన్ చెబుతుంది. చేతులను మరియు కాళ్ళను కప్పుకునే విధంగా పొడవాటి దుస్తులను ధరించడం, జుట్టును కప్పుకోవడానికి హిజాబ్ ధరించడం. ఇలా ధరించడానికి ఇస్లాం స్వీకరించిన చాలామంది మహిళలు మొహమాట పడటం లేదు. దీనిని చాలామంది గర్వంగా స్వీకరిస్తున్నారు.

అలీ చెబుతున్నారు : ఇక్కడున్న సొసైటీలో బట్టలు వేసుకోవడం కంటే, వాటిని విప్పడమే సులభం.

దుస్తులతో కప్పుకోవడంలో అన్ని రకాల ఆందోళనల నుండి విముక్తిని పొందుతున్నామని చాలామంది ఒప్పుకుంటున్నారు.

'మా' ఇలా చెబుతున్నారు :

"ముస్లిమ్ మహిళలు సిగ్గుతో మర్యాద కొరకు తమ జుట్టును హిజాబ్‌తో కప్పుకుంటారు. సెక్స్ వస్తువుల లాగ కాకుండా, మేము ఏమిటో? మేము ఏం చేస్తున్నామో అనే ఆలోచన చూసే వారికి కలుగుతుంది. మహిళలు శరీరాలను కప్పుకుంటూ, హక్కులను కలిగియుండే ఇస్లామీయ సమాజంలో ఉండవచ్చు. చాలీచాలని బట్టలు తొడుక్కుని, హక్కులు లేని సమాజంలో కూడా మహిళలు ఉండవచ్చు."

'మా' కూడా ఇతర అమెరికన్ స్త్రీల వలే, స్వయంగా ఇస్లాం స్వీకరించడానికి ప్రాథమిక కారణం - **ఇస్లాంలో నున్న మహిళల హక్కులు.**

శ్రద్ధతో క్రైస్తవ మతాన్ని ఆచరించే 'మా', మిడ్ వెస్ట్రన్ బోర్డింగ్ స్కూల్‌లో ఖుర్'ఆన్ మరియు ఇతర ఇస్లామీయ బోధనల గురించి అధ్యయనం చేశారు. ఆ అధ్యయనం సహజమైన వివేకంతో కూడిన అనుభవమని ఆమె భావించింది. కాని దాదాపు వెంటనే తన ఆధ్యాత్మిక అవసరాల సంపూర్తికై ముహమ్మద్(స)వారు చూపిన ధర్మంలో ఏదో ఉందని కనుగొన్నారామె.

శీలవతియైన యువతి 'మా'ను, తాను పూర్వం అనుసరించే ధర్మంలో, స్త్రీల గురించి మరియు వారి పాత్రల గురించి చెప్పిన విషయాలు కలవరపెట్టాయి.

ఖుర్'ఆన్‌లో మహిళల సమానత్వాన్ని కనుగొన్న 'మా'ను ఆమె కుటుంబం తిరస్కరించింది.

ఓ నెల అధ్యయనం తరువాత ఇస్లాం స్వీకరించారు. అప్పటికి ఆమె వర్జీనియాలోని జార్జ్ మేసన్ యూనివర్శిటీలో అండర్ గ్రాడ్యుయేట్. వెంటనే ఆమె తన కుటుంబంచే తిరస్కరించబడ్డారు.

'ఇస్లాం' స్వీకరించిన తరువాత ఎదురయ్యే కష్టమైన అంశాలలో ఇది ఒకటి' అని 'మా' చెబుతున్నారు.

'ఆ తిరస్కృతి నన్ను ఆపలేదు. నాలో దైవంపైనున్న భావనను వారు ఆజ్ఞాపించలేరు' అని చెబుతున్న 'మా' ధృఢ విశ్వాసంతో, సాఫల్యం పొందాలని ఆకాంక్షిస్తూ, ఈ సోదరిని అనుగ్రహించమని అల్లాహ్‌ను ప్రార్థిస్తున్నాము (ఆమీన్).

## సోదరి పెనోమీ (డాక్టర్ కేరీ యాన్ ఓవెన్)

అమెరికాలోని పరిస్థితులు ఆమెను ఆలోచించేలా చేశాయి. అమెరికాకు, పాశ్చాత్య సమాజానికి ఆవల నైతిక మార్గదర్శకత్వం కోసం 'ఇస్లామీయ సంస్కృతి'ని చూడటం ఈ సోదరిలో ప్రారంభమైంది.

ఈ సోదరి గురించి ఆమె మాటలలో :

**ఇస్లామే ఎందుకు? వేరొకటి ఎందుకు కాకూడదు?**

తన తల్లివైపు పూర్వీకులు స్పానిష్ యూదులు. 1492లో యూదుల సంఘం వెలివేయబడేవరకూ వీరు ముస్లిములతో కలిసి జీవించేవారు. నా పూర్వీకుల బహిష్కరణ సమయంలో ఒట్టోమన్ ఖలీఫా యూదులపై చూపిన మానవీయతను తెలుసుకున్నాను.

నేను గాఢమైన స్థాయిలో ఫీలయ్యే నా చారిత్రక జ్ఞాపకాలలో, ప్రార్థన కొరకు పిలచే ముఅజ్జిన్ పిలుపు ఎంత గంభీరంగా ఉంటుందంటే, మహాసముద్రం లాలించి నిద్రపుచ్చినట్లుగా, ఓడలు అటూ ఇటూ ఊగిస లాడుతూ వెళ్ళినట్లుగా, ఎడారిగుండా పోయే గుఱ్ఱాల గిట్టల స్వారీలా, అణచివేత ముఖంలో ప్రేమను ప్రకటించినట్లుగా.

అల్లాహ్ నా వివేకానికి సరియైన మార్గాన్ని చూపారు. ఇస్లాం గురించి నేర్చుకున్నాను. నా తొలి పరిశోధనాత్మక ఇంటర్వ్యూ శాన్‌ఫ్రాన్సిస్కోలోని మిసన్ జిల్లాలో హలాల్ మాంసం షాపు దగ్గర జరిగింది. అక్కడే సజీవ మైన ఇస్లాం గురించి నేనేదైతే అంతవరకూ తెలుసుకున్నానో, దానిపై అపారమైన ప్రభావాన్ని చూపించారు ఓ ముస్లిం మహిళ.

నేను కలిసిన తొలి ముస్లిమ్ మహిళ ఆమె. హిజాబ్ ధరించిన ఆమె ఆ షాపు కస్టమర్. చాలా స్వీట్ కైండ్‌నెస్‌తో కూడిన ఆమె ప్రవర్తన నాపై ఎంతో ప్రభావాన్ని వేసింది. ఆమె నాలుగు భాషలు చదవగలరు, వ్రాయగలరు మరియు మాట్లాడగలరు.

అహంకారం నుండి స్వేచ్ఛను పొందినట్లుగా నున్న ఆమె ప్రవర్తన,

ఆమె తెలివితేటలు నాపై అపారమైన ప్రభావాన్నే వేసాయి. ఇస్లాం మానవ ప్రవర్తనపై ఎటువంటి ప్రభావం చూపిస్తుందో ప్రాక్టికల్‌గా ఆ ముస్లిమ్ మహిళను చూసాకే తెలుసుకున్నాను.

నా ఈ పరిశోధన ఇస్లాం గురించి ఏవో కొన్ని సత్యాలను తెలుసుకునేలా చేయడం మాత్రమే కాకుండా, నాకు చాలా ఎక్కువుగా పరిచయం కాబడిన దేమిటంటే - ఇస్లామనేది ఓ సజీవ ధర్మం.

సెక్సువల్ పోటీ మరియు హింసతో కూడిన అమెరికా బానిస బ్రతుకుల కంటే, ముస్లిములకుండే హుందాతనం మరియు దయ, వారి స్థాయిని పైకి లేపిందని తెలుసుకున్నాను.

ముస్లిమ్ మహిళలు, పురుషులు ఒకరి సమక్షంలో మరొకరు క్రియాశీలంగానూ, భౌతికంగానూ ఉండగలరని తెలుసుకున్నాను. ధరించే మర్యాదపూర్వకమైన దుస్తులు వారి ఆధ్యాత్మ స్థితిగా గ్రహించాను. ఈ వస్త్రధారణ మనిషి ప్రవర్తనను ఉత్తమ స్థాయికి లేపుతుందని కూడా తెలుసుకున్నాను.

**ఇది ఎందుకు ఆశ్చర్యంగానూ మరియు కొత్తగానూ ఉంది?**

ఎందరో అమెరికా స్త్రీలలాగే, నేను కూడా అమెరికన్ బానిస సమాజంలోనే పెరిగాను. నా విలువ నా చిన్నతనం నుండీ నేనితరులకు ఎంత ఆకర్షణీయంగా కనిపిస్తున్నాననే దానిపైనే ఆధారపడి ఉందని తెలుసుకున్నాను. (అమెరికా సమాజం నైజం గురించి, అక్కడి అనైతిక విలువల గురించి కొన్ని విషయాలను సోదరి తెలిపారు)

ముస్లిమ్‌లలో మానవ పరిపూర్ణత ఉంటుందని నేను అనుకోలేదు. ముస్లిమ్ సమాజం మరియు నేనుండే సమాజాల మధ్యన అపారమైన వ్యత్యాసముంది. ఆ వ్యత్యాసం నాలాంటి వారికి నమ్మశక్యం గాదు.

ఇస్లాంను ప్రేమిస్తున్నాను మరియు గౌరవిస్తున్నాను.

**ఇస్లాం గురించి ఇంకా ఏమి విశ్వసించాను మరియు ఫీలయ్యాను?**

సమాజంలో మహిళలకు మరియు మగవాళ్ళకు ఉండే హక్కులు, మర్యాదపూర్వకమైన వస్త్రధారణ, విద్యకు ఇస్లామ్ ఇచ్చిన గౌరవం, వీటన్నింటి కంటే ఎక్కువ నిగ్రహశక్తిని కలిగియుండటం మరియు వివాహం - వీటన్నింటి వలన నేను ఇస్లామ్‌కి మద్దతునిస్తూ గాఢమైన అభిమాని నయ్యాను. నా జీవితంలోని ముఖ్యమైన రెండు విషయాలలో ఒకటి నేను 21 సంవత్సరాల నిగ్రహశక్తికలదానిని కావడం మరియు రెండవది సంతోషంగా వివాహం చేసుకోవడం.

వివాహం మన కారెక్టర్‌ని అభివృద్ధి చేస్తుందని నేను విశ్వసించడం; డ్రగ్స్‌కు మరియు ఆల్కహాల్‌కు దూరంగా ఉండాలని తీసుకున్న నా నిర్ణయం, 150కోట్ల ముస్లిములు షేర్ చేసుకుంటున్నారన్న ఫీలింగ్ ఎంత అద్భుతంగా ఉందో!

ఆరాధన, ధ్యానం, నిగ్రహం మరియు విద్య ద్వారా, మనం ఇస్లాం మార్గాన్ని అనుసరిస్తే మన పిల్లలని హింస నుండి దూరంగా ఉంచగలుగుతాం.

**ఇస్లాంను ఈ సోదరి ఓ గొప్ప బహుమతిగా వర్ణించారు.**

**తిరిగి గూటికి | నవముస్లిములకు ప్రత్యేకం | 3**

## తహారత్ - వుజూ

**అరబీ పదం తహారత్‌కు భాషాపరమైన అర్థం**

1. • అన్ని రకాల మలినాల నుండి శుభ్రం కావడం
   • ఏ దోషం/కళ్మషం లేకుండా ఉండటం

**2. ఇస్లామీయ షరీయత్ ప్రకారం, తహారత్ అంటే :**

- వుదూ (వుజూ) చేయడం ద్వారా **'హాజత్ అస్ఘర్'** యొక్క మలినాన్ని తొలగించుకోవడం. హజత్ అస్ఘర్ అంటే చిన్న మలినం. ఉదాహరణకు క్రింద నుండి ఆపాన వాయువు వెలువడడం, మూత్ర విసర్జన వలన కలిగే మలినం. నిద్రపోయి లేచిన తరువాత కూడా వుజూ చేసుకోవాలి.
- గుసుల్ ద్వారా **'హాజత్ అక్బర్'** (పెద్దవైన మలినాలు, ఉదా: భార్యాభర్తల శారీరక కలయిక వలన కలిగే మాలిన్యం) నుండి మలినాన్ని తొలగించుకోవడం

ఇస్లాంలో మనం నేర్చుకునే మొట్టమొదటి పాఠం - తహారత్ పాఠమే. ఒక ముస్లిమ్ చేసే సలాత్ (నమాజ్) ఆమోదయోగ్యం కొరకు ముహమ్మద్(స)వారు నిర్ణయించిన ముందస్తు షరతు - తహారత్.

**వాస్తవానికి యోగ్యమైన శుభ్రతా వ్యవస్థ - ఇస్లాంలో పాటించే తహారత్**

ముహమ్మద్(స)వారు ముస్లిమ్‌లకు ప్రతీ చిన్న విషయాన్ని కూడా బోధించారు.

1. ముహమ్మద్(స)వారు 1 ముద్ద్ నీటితో వజూ చేసేవారు. 1 ముద్ద్ అంటే 2/3 లీటర్ (సుమారుగా 650 మి.లీ.) సాధారణంగా మనకు ప్రస్తుతం మార్కెట్లో దొరికే ప్లాస్టిక్ మగ్‌లలో 1000 మి.లీ. నీరు పడుతుంది.
2. శుద్ధిలేని నమాజ్ స్వీకరించబడదు. ఇక్కడ శుద్ధి అంటే వుజూ మరియు గుసుల్.
3. నమాజ్‌కి తాళం చెవి - శుద్ధి. నమాజ్ అల్లాహు అక్బర్‌తో తెరవబడుతుంది. అస్సలాము అలైకుమ్‌తో మూయబడుతుంది.
4. శుద్ధి సగం విశ్వాసం. సరియైన విధంగా వుజూ చేయడమనేది విశ్వాసంలో సగభాగం.

   అబూ మాలిక్ అష్అరి(రజి) ఉల్లేఖనం : సరియైన విధంగా **వుజూ** చేయడం **విశ్వాసంలో సగభాగం**, పలికే **'అల్‌హమ్‌దులిల్లాహ్'** త్రాసుని (మంచివైపు ఒరిగే పళ్లాన్ని) నింపుతుంది, పలికే **సుబహానల్లాహ్** మరియు **అల్లాహు అక్బర్** భూమ్యాకాశాలను నింపుతాయి, **సలాత్** - కాంతి, **జకాత్** - సాక్ష్యం, **సహనం** - మెరుపు (తేజోవంతం) మరియు **ఖుర్'ఆన్** - మీ కొరకు గాని, మీకు వ్యతిరేకంగా గాని సాక్ష్యం. ఉదయం ప్రతీ వ్యక్తి తన ఆత్మను అమ్ముకోవడానికి బయటికి వెళతాడు, కాబట్టి అతడు దానిని స్వేచ్ఛగా ఉంచుతాడు లేదా నాశనం చేసుకుంటాడు.

(**సహీహ్ ముస్లిం**, నెం. 534, సంపుటి 1, 2వ పుస్తకం, **ఇబ్నెమాజా** (సహీహ్) నెం. 280, సంపుటి 1)

**5. చక్కగా ఇంటి దగ్గర వుజూ చేసి కేవలం నమాజ్ కొరకు తప్ప మరి ఏ ఇతర ప్రయోజనం కోసం కాకుండా మస్‌జిద్‌కి బయలుదేరే వ్యక్తి, అతను మస్‌జిద్ చేరేవరకు వేసే ప్రతీ అడుగు అతని (హోదాలో) ఒక స్థాయిని పైకి తీసుకెళు తుంది మరియు దానివలన ఒక పాపాన్ని అతని నుండి తొలగిస్తుంది.**

6. ముస్లిమ్‌లను పునరుత్థాన దినాన ముహమ్మద్(స)వారు గుర్తుపట్టేది వారు చేసిన వుజూ ద్వారానే. మీ ఉమ్మత్‌లో మీరు చూడని వారిని ఎలా గుర్తుపడతారని అడిగిన ప్రశ్నకు ముహమ్మద్(స)వారు చెప్పిన సమాధానం ఏమిటంటే, వారి నొసటి పై నుండి మరియు కాళ్ళపైని మెరుపుల నుండి గుర్తుపట్టడం జరుగుతుందని, అవి వుజూ యొక్క చిహ్నాలని తెలిపారు.

పై కారణంగా ముహమ్మద్(స)వారి ఉమ్మత్‌ని **'గుర్ర ముహజ్జలీన'** అని పిలుస్తారు.

7. ఎవరైతే తన నోటిని మరియు ముక్కును శుభ్రం చేసుకుంటూ వుజూ చేస్తారో అతని పాపాలు అతని ముక్కులోనుండి, నోటిలో నుండి వెళ్ళిపోతాయి. అతని ముఖాన్ని కడిగినప్పుడు అతని ముఖం నుండి పాపాలు పోతాయి, అతని యొక్క కనురెప్పల వెనుకనుండి సయితం, చేతులను కడిగినప్పుడు అతని చేతుల నుండి పాపాలు పోతాయి. తడిచేతులతో తలను తుడుచుకున్నప్పుడు (మసాహ్) తల నుండి పాపాలు పోతాయి. అలాగే చెవులను కాళ్ళను కడిగినప్పుడు చెవులనుండి, కాళ్ళ నుండి, కాలి గోళ్ళ (toenails) దిగువనుండి సయితం వుజూవలన పాపాలు పోతాయి.
(పాపాలు పోతాయంటే, అల్లాహ్ వాటిని క్షమిస్తారని. వుజూ వలన తొలగే పాపాలు - చిన్న, చిన్న పాపాలు)

8. పాదాలపై తడిచేత్తో తుడిస్తే సరిపోదు. కాళ్ళను చీలమండల వరకూ శుభ్రంగా కడగాలి. "మీ మడమలను నరకాగ్ని నుండి కాపాడుకోండి" అని ముహమ్మద్(స)వారు చెప్పారు.
(**సహీహ్ బుఖారీ,** నెం. 163, సంపుటి 1, 4వ పుస్తకం)

**9. ... 'ఎవరయితే నేను చేసినట్లు వుజూ చేస్తారో, అంతకు పూర్వపు పాపాలు క్షమించబడతాయి' అని ముహమ్మద్(స)వారు చెప్పారు. అంతేకాకుండా 'వుజూ'కు ఉండే ఈ గొప్ప సుగుణం వలన గర్వం వహించవద్దని కూడా చెప్పడం జరిగింది.**

**కాబట్టి వుజూ ద్వారా లభించే మేలును గమనించండి.**

**ప్రవక్త(స)వారు చేసినట్లే వుజూ చేయండి.**

---

**ఇబ్నెమాజా, సంపుటి 1**

1. సహీహ్ నెం. 267, 2. సహీహ్ నెం. 271,
3. హసన్ నెం. 275,276, 280(సహీహ్)
5. సహీహ్ నెం. 281, 6. హసన్ నెం. 284,
7. సహీహ్ నెం. 282, 9. సహీహ్ నెం. 285

# ట్రూవిజన్ ఎడ్యుకేషనల్ సొసైటీ

**7-13-11, Opp. AU Outgate, Chinna Waltair, Visakhapatnam -17,**
(Regd. No. 466/2008) Email: truevisionvizag@gmail.com

## ప్రకటన

ట్రూవిజన్ ఎడ్యుకేషనల్ సొసైటీ - కమర్షియల్ (commercial) 'దావా సెంటర్' కాదు. ఓ గ్రంథాలయం (శాంతి గ్రంథాలయం). ప్రామాణిక ఇస్లామీయ సాహిత్యాన్ని ప్రజల ప్రయోజనార్థం సేకరించాము. ఇస్లాం గురించి తెలుసు కోవాలనుకునే ఏ ధర్మానికి చెందిన వారినైనా సరే, హృదయపూర్వకంగా ఆహ్వానిస్తున్నాము.

**మా గ్రంథాలయంలో పరమత ధర్మాలను కించపరచడానికి గాని, వాటిపై ఎటువంటి వాదనలకుగాని అనుమతి లేదు.**

సొసైటీ సభ్యులందరూ ముస్లిములే. కాబట్టి ముస్లిములుగా దావత్ మరియు ఇస్లాహ్ చేయడం మా ప్రాథమిక బాధ్యతగా స్వీకరించాము. కొన్ని అనుభవాల వలన మేము ఎవ్వరి దగ్గరా చందాలు అడగడం లేదు.

ఇస్లాం గురించి తెలుసుకోవాలనుకునేవారు డైరక్టుగా మస్‌జిద్‌కు వెళ్ళలేరు. వారికి కొంత మొహమాట ముంటుంది. అలాగే ఏ సోదరి అయినా ఈ ధర్మం గురించి తెలుసుకోవాలంటే మస్‌జిద్‌కు వెళ్లి అడగటానికి ఇబ్బందిపడే అవకాశముంది. అందుకని ఇలాంటి వారికి సౌకర్యంగా ఉండేలా గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఆ విధంగా అల్లాహ్ దయవలన, జూలై 2008 నుండి మా శక్తిమేరకు అల్లాహ్ మాపై ఉంచిన బాధ్యతలను నిర్వర్తిస్తున్నాము.

**శాంతిబాట** మాసపత్రికకు సంబంధించిన పని, దానికి కావలసిన పరిశోధన పూర్తిగా జరుగుతుంది ఇక్కడే.

ఖుర్ఆన్ మరియు సున్నత్ ప్రకారంగా సౌమ్యంగా బాధ్యతలను నిర్వర్తిస్తున్న మాకు సహకరించడానికి బదులు, ప్రారంభం నుండి ఇప్పటి వరకూ మాకు ఇబ్బందులు కలుగజేయడానికి ఎన్నో ప్రయత్నాలు జరిగాయి. ఇస్లాం మాకు నేర్పిన సహనంతో వాటిని భరిస్తూ వస్తున్నాము.

ఇస్లామీయ జ్ఞానం కలవారు, వివిధ ప్రాంతాల నుండి మా సొసైటీ చేస్తున్న ఇస్లామీయ పరిశోధనను ప్రోత్సహిస్తున్నారు. మేము ఈ పనిచేయగలగడానికి గల ఏకైక కారణం - అల్లాహ్ అనుగ్రహమే. ఏ ఉపాధిని ఆశించకుండా, ఏ ఇహలోక ప్రతిఫలాన్ని ఆశించకుండా దావత్, ఇస్లాహ్ మరియు, పరిశోధనను చేస్తున్న మమ్మల్ని, మా సౌమ్యతను చేతగాని తనంగా భావించిన కొందరు, హద్దులు మీరి ప్రవర్తించారు.

భారతదేశ చట్ట ప్రకారంగా వారిపై లీగల్ చర్యలు తీసుకోవడానికి సిద్ధపడగానే క్షమించమని కోరడం జరిగింది.

ఇస్లాంపైగాని, ఖుర్ఆన్ మరియు హదీస్ గ్రంథాలపై గాని ఎవరైనా వ్యతిరేకంగా వ్రాస్తే ఖండిస్తున్న మమ్మల్ని ప్రోత్సహించే బదులు, మేము ఖుర్ఆన్‌కు వ్యతిరేకంగా పనిచేస్తున్నామని తెలుగు తెలియని ముస్లిముల దగ్గర మాపై చెడు ప్రచారం చేయడం జరిగింది.

**'ట్రూవిజన్ ఎడ్యుకేషనల్ సొసైటీ' తరఫున ఎటువంటి బ్యానర్లనుగాని, పబ్లిసిటీ మెటీరియల్స్‌నుగాని, పోస్టర్లు గాని, స్టిక్కర్లని గాని ముద్రించలేదు. ఒకవేళ అటువంటివి ఎక్కడైనా మీకు కనిపించినా, వాటికి మాకూ ఎటువంటి సంబంధమూ లేదని తెలియజేస్తున్నాము. ఏ ప్రొఫెషనల్ దాయీతోనూ మాకు సంబంధాలు లేవు.**

\- సెక్రటరీ

# ఆల్‌జీబ్రా పితామహుడు - అల్ ఖ్వారిజ్మి

(గత సంచిక తరువాయి)

అల్ ఖ్వారిజ్మి గురించి ముస్లిమ్‌లు వ్రాసిన ఆర్టికల్స్ అందుబాటులో ఉన్నప్పటికీ, ముస్లిమేతరులు విమర్శనాత్మకంగా వ్రాసిన వ్యాసాన్ని మాత్రమే పాఠకుల ప్రయోజనార్థం తీసుకున్నాము.

రేఖాగణిత పద్ధతి ద్వారా అల్-ఖ్వారిజ్మి చేసిన సమీకరణ సాధన విషయంలో భిన్నాభిప్రాయాలు ఉన్నాయంటూ కొందరి స్టేట్‌మెంట్లను ఉదాహరించారు.

యూక్లిడ్ యొక్క elementsతో ఆయనకు పరిచయం ఉందేమోనని సందేహాన్ని కొందరు వ్యక్తం చేసారు. యూక్లిడ్ యొక్క 'elements'ని అల్-ఖ్వారిజ్మి ఉపయోగించి ఉంటారని Toomer అభిప్రాయ పడితే, Gandz ఇలా వాదిస్తున్నారు : "యూక్లిడ్ యొక్క ఎలిమెంట్స్ - అంతర్యములోనూ, అర్థంలోనూ, భావంలోనూ పూర్తిగా అల్-ఖ్వారిజ్మికి తెలియదని, నిర్వచనాలనుగాని, సిద్ధాంతాలనుగాని, అభ్యూహలనుగాని demonstrationగాని యూక్లిడియన్ తరహాలో అల్-ఖ్వారిజ్మి చేయలేదు.

**'హిసాబ్ అల్-జబ్ర్ వల్ ముఖాబల'**లో arithmetic laws (అంకగణిత నియమాలను) ఆల్‌జీబ్రా objectsలోని arithmeticకి ఎలా విస్తరించాలో పరిశీలిస్తూ అల్-ఖ్వారిజ్మి తన అధ్యయనాన్ని కొనసాగించారు.

ఉదాహరణకు (a+bx) (c+dx) ని ఎలా గుణించాలో చూపించారు.

నేటి ఆధునిక కోణంలో చూస్తే, సాపేక్షంగా ఈ గణనలు (calculations) ప్రాథమిక స్థాయివని మనకు అనిపించినా సరే, ఈ calculation లో చెప్పుకో దగ్గ లోతు మరియు కొత్తదనం (novelty) ఉన్నట్లు Rashed తెలిపారు. Rashed ఇలా వ్రాశారు.

*"Al-Khwarizmi's concept of algebra can now be grasped with greater precision: it concerns the theory of linear and quadratic equations with a single unknown, and the elementary arithmetic of relative binomials and trinomials. ... The solution had to be general and calculable at the same time and in a mathematical fashion, that is, geometrically founded. ... The restriction of degree, as well as that of the number of unsophisticated terms, is instantly explained. From its true emergence, algebra can be seen as a theory of equations solved by means of radicals, and of algebraic calculations on related expressions..."*

అల్-ఖ్వారిజ్మి గురించి *Sarton* ఏమంటున్నారంటే,

*"... the greatest mathematician of the time, and if one takes all the circumstances into account, one of the greatest of all time...."*

"అల్-ఖ్వారిజ్మి ఆ కాలంలోని గొప్ప గణితశాస్త్రజ్ఞుడే కాకుండా, అప్పటి పరిస్థితులన్నింటిని లెక్కలోకి తీసుకుంటే, ఎప్పటికీ గుర్తుంచుకొనే గొప్ప గణితశాస్త్రవేత్తలలో ఒకరు."

ఇటువంటి అభిప్రాయాన్ని *Rashed* కూడా వ్యక్తం చేశారు :

*It is impossible to overstress the originality of the conception and style of al-Khwarizmi's algebra...*

అయితే అల్ ఖ్వారిజ్మి సైంటిఫిక్‌గా సాధించినవి సాధారణమైనవేనని మాట్లాడేవారు కూడా ఉన్నారు.

ఇక *Gandz* యొక్క అభిప్రాయం :

*"Al-Khwarizmi's algebra is regarded as the foundation and cornerstone of the sciences. In a sense, al-Khwarizmi is more entitled to be called "the father of algebra" than Diophantus because al-Khwarizmi is the first to teach algebra in an elementary form and for its own sake, Diophantus is primarily concerned with the theory of numbers."*

**"అల్-ఖ్వారిజ్మి యొక్క ఆల్‌జీబ్రా సైన్సెస్‌కి పునాదిరాయి వంటిదని, ఆల్‌జీబ్రా పితామహుడు అని పిలవడానికి డియోఫంటస్ కంటే అల్-ఖ్వారిజ్మీకే అర్హతుందని, ఎందుకంటే ప్రాథమిక రూపంలో ఆల్‌జీబ్రాను మొదట బోధించినది ఆయనే. డియోఫంటస్ ప్రధానంగా నంబర్‌థీరీ పైనే పనిచేసారు."**

అల్-ఖ్వారిజ్మి గ్రంథం లోని రెండవ భాగంలో, ఆల్‌జీబ్రా ప్రయోజనాలు మరియు సాధించిన ఉదాహరణలు *(solved examples)* ఉంటాయి. వృత్తం లాంటి ఫిగర్స్ యొక్క వైశాల్యాలను కనుగొనే నియమాలను గురించి, గోళం, శంఖువు మరియు పిరమిడ్ల ఘనపరిమాణాలను కనుగొనడంలోని నియమాల మీద దృష్టి పెట్టడం జరిగింది.

ఇక గ్రంథంలోని 3వ భాగం - ఇస్లామీయ షరీయత్ ప్రకారం క్లిష్టమైన ఆస్తి పంపకాల విషయాలను డీల్ చేస్తుంది.

హిందూ అరబిక్ న్యూమరల్స్‌పై అల్-ఖ్వారిజ్మి ఓ గ్రంథం వ్రాశారు. ఆ గ్రంథం యొక్క ఒరిజినల్ అరబీ గ్రంథం పోయింది గాని, దాని లాటిన్ అనువాదమైన 'Algoritmi de numero Indorum', ఇంగ్లీష్ అనువాదమైన 'Al-Khwarizmi on the Hindu art of Reckoning'.

గ్రంథాలున్నాయి. దురదృష్టవశాత్తు లాటిన్‌లో అనువాదం జరిగినప్పుడు, ఒరిజినల్ అరబీ మూలం చాలా వరకూ మార్చివేయబడింది. ఇలా జరిగిన ఈ అనువాదం వలన అల్-ఖ్వారిజ్మి యొక్క ఒరిజినల్ గ్రంథం యొక్క పేరు కూడా తెలియలేదు.

ఈ వర్క్‌లో హిందూ సంఖ్యల యొక్క స్థానం-విలువ వ్యవస్థను 1,2,3,4,5,6,7,8,9,0 పై ఆధారపడి వర్ణించడం జరిగింది. positional base notation లో సున్నాను place holder గా మొట్టమొదట ఉపయోగించినది బహుశా అల్-ఖ్వారిజ్మి వర్క్‌లోనే కావచ్చు.

అంకగణితం యొక్క గణన పద్ధతులను ఇవ్వడం జరిగింది. అంతేకాకుండా square roots (వర్గ మూలాలని) కనుగొనే పద్ధతి లాటిన్ అనువాదంలో మిస్సయినప్పటికీ, అరబీ ఒరిజినల్‌లో ఉన్నట్లు తెలుస్తుంది.

Toomer ఇలా వ్రాస్తున్నారు :

**'డెసిమల్ స్థాన విలువ' వ్యవస్థ ఇటీవల కాలంలోనే ఇండియా నుండి విచ్చేసిందని, కాని అల్-ఖ్వారిజ్మి చేసిన వర్క్ ద్వారానే ఇది క్రమపద్ధతిలో వివరించడం జరిగిందని మరియు ఆ విధంగా ఈయన వర్క్ ప్రాథమికమే అయనప్పటికిని నిర్ణయాత్మక ప్రాముఖ్యతను కలిగిఉంది.**

*"... the decimal place-value system was a fairly recent arrival from India and ... al-Khwarizmi's work was the first to expound it systematically. Thus, although elementary, it was of seminal importance*

7 నుండి 12వ శతాబ్దపు మధ్య కాలంలో లాటిన్ గ్రంథాలు అంకగణితంపై అల్-ఖ్వారిజ్మి వ్రాసిన గ్రంథాలపైననే ఆధారపడ్డాయి. ఆ తరువాతి కాలంలో అల్-ఖ్వారిజ్మి ఒరిజినల్ అరబీ గ్రంథాలు కనిపించకుండా పోయాయి. క్రింద ఇచ్చిన వ్యాసంలో చర్చించబడ్డాయి. ఆసక్తి గలవారు చదివి తెలుసుకోగలరు.

*[A Allard, La diffusion en occident des premières oeuvres latines issues de l'arithmétique perdue d'al-Khwarizmi, J. Hist. Arabic Sci.* ***9*** *(1-2) (1991), 101-105.*]

**అల్-ఖ్వారిజ్మిగారి మరొక ముఖ్యమైన వర్క్ - ఖగోళ శాస్త్రంపై వ్రాసిన '*Sindhind Zij*'** (సింద్‌హింద్ జిజ్).

దీనికి సంబంధించిన రెండు వెర్షన్‌లలో చిన్న వెర్షన్‌ని 10వ శతాబ్దంలో అల్-మజ్రితి కొద్దిగా మార్పులు చేశారు. అల్-ఖ్వారిజ్మి యొక్క ఒరిజినల్ కాపీ కనిపించకుండా పోయింది. రెండు వెర్షన్‌ల యొక్క లాటిన్ అనువాదాలు మాత్రం మిగిలి ఉన్నాయి.

సింద్‌హింద్ జిజ్‌లోని చెప్పబడిన ముఖ్యమైన టాపిక్‌లు :

కాలెండర్లు, సూర్యుని, చంద్రుని మరియు గ్రహాల నిజ స్థానాలను గణించడం, సైన్ *(sine)* మరియు టాంజెంట్ *(tangent)* టేబుల్స్, *spherical astronomy*, పారలాక్స్, గ్రహణాలకు సంబంధించిన గణనలు మరియు చంద్రుని యొక్క విజిబిలిటీ మొదలైనవి.

అల్-ఖ్వారిజ్మిదే అని భావించే ***Spherical Trigonometry*** వ్రాత ప్రతి గురించి క్రింది వ్యాసంలో చర్చించబడింది.

[B A Rozenfeld, al-Khwarizmi's spherical trigonometry (Russian), *Istor.-Mat. Issled.* **32-33** (1990), 325-339.]

భౌగోళిక శాస్త్రంపై ఆయన పెద్ద వర్క్ చేశారు. 2402 ప్రదేశాల అక్షాంశాలను (latitudes), రేఖాంశాలను (longitudes) అందులో చెప్పారు. ఈ పుస్తకం Ptolemy యొక్క భౌగోళిక శాస్త్రం (Geography)పై ఆధారపడింది. నగరాలు, పర్వతాలు, సముద్రాలు, ద్వీపాలు, భౌగోళిక ప్రాంతాలు మరియు నదుల గురించి వివరించడం జరిగింది. ఆ వ్రాతప్రతిలో మేప్‌లు కూడా ఉన్నాయి. మొత్తంగా చూస్తే అవి Ptolemy కంటే చాలా ఖచ్చితమైనవి. ప్రత్యేకత ఏమిటంటే, ఇస్లామీయ ప్రాంతాలైన ఆఫ్రికా, సుదూర తూర్పు ప్రాంతాలకు సంబంధించిన లోకల్ విషయాలు అల్-ఖ్వారిజ్మికి అందుబాటులో ఉండటమే. అయితే యూరప్‌కి సంబంధించి Ptolemy వివరాలనే అల్-ఖ్వారిజ్మి వాడుకుని ఉంటారని అనిపిస్తుంది.

ఇంకా చిన్నవైన వర్క్‌లనెన్నింటినో చేశారాయన. వాటిపై ఆయన చాలా పుస్తకాలను వ్రాశారు. ఉదాహరణకు astrolobe, దానిపై రెండు పుస్తకాలు వ్రాశారు. ఒకటి 'సన్ డయల్'పైనా, రెండవది యూదుల క్యాలెండర్‌పై.

(ఈ astrolobe పరికరం చాలా ఆసక్తికరంగా ఉంటుంది. ఇన్షా అల్లాహ్! వీలైతే astrolobe వివరాలను పాఠకులకు సవివరంగా అందిస్తాము.)

అల్-ఖ్వారిజ్మి అభివృద్ధి చేసిన ఆల్-జీబ్రాపై యొక్క ప్రాముఖ్యత గురించి వివిధ అభిప్రాయాలను చెప్పడం జరిగింది. ఇక ఈ వ్యాసాన్ని ముహమ్మద్ ఖాన్ గారి కొటేషన్‌తో ముగిద్దాం.

***In the foremost rank of mathematicians of all time stands Al-Khwarizmi. He composed the oldest works on arithmetic and algebra. They were the principal source of mathematical knowledge for centuries to come in the East and the West. The work on arithmetic first introduced the Hindu numbers to Europe, as the very name algorism signifies; and the work on algebra ... gave the name to this important branch of mathematics in the European world...***

"ఎప్పటికీ ఉన్నత స్థానంలో ఉండే గణితశాస్త్రవేత్తలలో అల్-ఖ్వారిజ్మి ఉంటారు. ప్రాచీన అంకగణితం (Arithmetic), బీజగణితం (Algebra)లను రచించారు. తూర్పు మరియు పశ్చిమ దేశాలలో శతాబ్దాల కాలం వరకూ గణితజ్ఞానానికి అవి ప్రధానమైన మూలాలు అయ్యాయి. అంకగణితంపై ఈయన చేసిన వర్క్ యూరప్‌కి హిందూ అంకెలను పరిచయం చేసింది. యూరప్ ప్రపంచానికి గణిత శాస్త్రానికి సంబంధించి ఓ ముఖ్యమైన భాగాన్ని అందించారు."

ఏ కంప్యూటర్ ప్రోగ్రామ్ వ్రాయాలన్నా, ముందుగా అల్‌గారిథమ్ (Algorithm) వ్రాసుకుంటారు. అల్‌గారిథమ్ అంటే ఈరోజు **తెలియని వారు** తక్కువ. అయితే ఈ అల్‌గారిథమ్ పేరు అల్-ఖ్వారిజ్మి నుండి వచ్చిందని **తెలిసినవారు** కూడా తక్కువే.

(జెజె ఓకనార్ మరియు రోబర్ట్‌సన్ వారికి కృతజ్ఞతలతో)

***A Quotation by AL-KHWARIZMI***

*That fondness for science, ... that affability and condescension which God shows to the learned, that promptitude with which he protects and supports them in the elucidation of obscurities and in the removal of difficulties, has encouraged me to compose a short work on calculating by al-jabr and al-muqabala , confining it to what is easiest and most useful in arithmetic.*

**(source:** http://www-history.mcs.st-andrews.ac.uk/Quotations/Al-Khwarizmi.html)

**'సైన్స్‌పై ఇష్టత ... సర్వజన అంగీకారత, చదువుకున్నవారికి అల్లాహ్ చూపించే అనుగ్రహం ... అస్పష్టమైన తెలియని విషయాలను స్పష్టం చేయడంలో మరియు సమస్యలను తొలగించడంలో (చదువుకున్న) వారికి అల్లాహ్ ఇచ్చే రక్షణ మరియు సహాయ సహకారాలతో కూడిన ప్రేరణ 'అల్ జబ్ర్ మరియు అల్-ముఖాబల' అనే ఓ చిన్న వర్క్‌ను - అంకగణితం (ఖచితమైన విజ్ఞానం)లో ఏది సులభమో మరియు ప్రయోజనమో, ఆ హద్దులోపలే ఉండేటట్లుగా - రచించడానికి నన్ను ప్రోత్సహించింది."**

**- అల్-ఖ్వారిజ్మి**

**వ్యాసం ముగింపు :**

సమాజంలో చదువుకున్నవారు, చదువుకోని వారు ఉన్నారు. చదువుకున్న వారిలో కనీస విద్యను అభ్యసించిన వారే అధికంగా ఉంటారు. విద్యలో పరిశోధనా స్థాయికి చేరుకున్న వారి సంఖ్య చాలా తక్కువగా ఉంటుంది. ఇలా వ్రాయడానికి గల కారణం కొన్ని విషయాలను అన్ని తరగతుల వారూ అవగాహన చేసుకోలేరని చెప్పడానికే.

ఓ సైంటిస్ట్ 'కంప్యూటర్' మొదటిసారిగా తయారుచేశాడంటే, ఆ వ్యక్తి ఎలక్ట్రానిక్స్ గురించి, దానికి చెందిన ఇతర అనుబంధ సైన్స్‌ల గురించి బాగా చదువుకుని, అవగాహన కలిగి ఉంటాడు. ఆ సైన్స్‌లన్నీ ఇంతకు పూర్వం ఎన్నో లక్షలమంది శాస్త్రవేత్తలు పరిశోధించి అభివృద్ధి చేసినవే. అంటే కంప్యూటర్‌ని కనుగొన్న వ్యక్తి, అంతవరకూ జరిగిన పరిశోధనలను తెలుసుకుని, వాటిని అభివృద్ధి చేస్తూ విజయం సాధించాడని తెలుసుకోవాలి.

అంతేగాని, ఎలక్ట్రానిక్స్‌ని మా వాళ్ళు అభివృద్ధి చేసి ఉండకపోతే, ఈ రోజు అతను కంప్యూటర్ తయారు చేయగలిగేవాడా? అని మరో వర్గానికి చెందిన వారెవరైనా ప్రశ్నిస్తే, ఆ ప్రశ్న వినడానికే హాస్యాస్పదంగా ఉంటుంది.

ఈనాడు ప్రపంచంలో పనిచేసే రీసెర్చ్ సైంటిస్ట్‌లందరూ, వారు ఏ విషయంపై పరిశోధన చేస్తున్నారో, అదే విషయంపై ప్రపంచంలో అంతవరకూ జరిగిన పరిశోధనను ముందుగా తెలుసుకుని, వాటిని బాగా అధ్యయనం చేసి వాటిలోని లోపాలను, మరియు వాటిలో ఉపయోగపడే వాటిని తెలుసుకుని, తన ఆలోచన ప్రకారం ఆ లోపాలను గాని, లేదా పూర్వం ఎదురైన సమస్యలను తొలగించడానికి పరిశోధన చేస్తారు.

**ఇలాంటి పరిశోధనలతో ఆయా రంగాలలో ఒక్కసారిగా ట్రెండ్ మార్చే వారున్నారు. ఆ విధంగా సిద్ధాంతాలకే పరిమితమైన సైన్స్‌కి, ప్రయోగాలను జోడించి ఆధునిక సైన్స్‌కి పునాదులు వేసి ముస్లిమ్ శాస్త్రవేత్తలు సరికొత్త ట్రెండ్‌ని ప్రారంభించారు.**

*ఈ ముస్లిమ్ శాస్త్రవేత్తల పేర్లను కూడా లాటిన్ భాషలలోకి మార్చడంతో, ఆధునిక సైన్స్‌లోని ఎన్నో శాస్త్ర విభాగాల వ్యవస్థాపక పితామహులైన ముస్లిమ్ శాస్త్రవేత్తల గురించి ప్రపంచానికి తెలియకుండా పోయింది.*

**ఈ విషయాలను చెప్పడానికిగల కారణం - ముస్లిములు తమ పూర్వీకుల గొప్పతనాన్ని తెలుసుకుని మురిసి పోవడానికో లేదా ఇతరుల ముందు పోజ్ కొట్టడానికో మాత్రం కాదు. 'ఇస్లాం' వల్లనే ముస్లిములు వెనుకబడ్డారని చెప్పేవారి మాటలు నిజం కాదని, 'ఇస్లాం'వలన సైన్స్ పరిశోధనలు ఊపందుకుంటాయని, ఇస్లాంని పాటిస్తే నేటి ముస్లిమ్‌లు కూడా తమ పూర్వీకుల వలె గొప్ప శాస్త్రవేత్తలు కాగలరని, ఆధారాలతో వివరిస్తూ వారిని ఎడ్యుకేట్ చేసే ఉద్దేశ్యమే మాది.**

**- శాంతిబాట టీమ్**



**A page from Al-Khwarizmi's ALGEBRA**

**అల్-జబ్ర్ వల్ ముఖాబల గ్రంథంలోని ఒక పేజీ**




**A stamp issued September 6, 1983 in the Soviet Union, commemoratingal-Khwrizmi's (approximate) 1200th birthday**

**సోవియట్ యూనియన్ సెప్టెంబర్ 6, 1983లో అల్-ఖ్వారిజ్మి 1200వ పుట్టిన రోజు సందర్భంగా విడుదల చేసిన పోస్టల్ స్టాంప్**

### మనిషి కోతినుండి పరిణామం చెందాడనే

# డార్విన్ సిద్ధాంతం - శాస్త్రీయ వాస్తవం కాదు.

## రక్తం - జీవాన్నిచ్చే ద్రవం

**రక్తం యొక్క ప్రధానమైన విధులు :**

మన శరీరానికి జీవాన్నిచ్చే ద్రవమే రక్తం. అది మన శరీరంలో ప్రసరణ జరుగుతున్నంత కాలం, అది శరీరాన్ని వేడిగా, చల్లగా, పోషణనిస్తూ మరియు హానికరమైన వాటిని శుభ్రపరచడం ద్వారా మనకు రక్షణ నిస్తుంది. మన శరీరాలలో సందేశాలను అందించే విషయంలో దాదాపుగా ఈ రక్తమే పూర్తి బాధ్యతను తీసుకుంటుంది. అంతేకాకుండా నరాల గోడలలోని పగుళ్ళను వెంటనే రిపేర్ చేసి, వ్యవస్థకు తిరిగి కొత్త జీవాన్నిస్తుంది.

సగటున 60 కేజీల బరువుండే మానవుని శరీరంలో దాదాపు 5 లీటర్ల రక్తముంటుంది. ఈ మొత్తం రక్తాన్ని మన శరీరంలో సులభంగా ప్రసరణ చేయడానికి మన గుండెకు 8 సెకన్లు చాలు. అయినప్పటికీ, పరుగెత్తేటప్పుడుగాని, ఎక్సర్‌సైజ్‌లు చేసేటప్పుడుగాని, ఈ రక్త ప్రసరణ వేగం ఓ 5 రెట్ల వరకూ పెరగగలుగుతుంది. మన తల వెంట్రుకల కుదుళ్ళనుండి, కాలి వ్రేళ్ళ వరకూ, వేర్వేరు సైజులలో నున్న దమనుల లోపల ప్రతీచోటుకి రక్తం ప్రవహిస్తుంది. రక్తం ప్రవహించడానికి ఏ అడ్డులేకుండా, ప్రవాహంలో ఏ ఘనపదార్థం తయారవ్వకుండా దోషరహితమైన నిర్మాణంతో నరాలను సృష్టించడం జరిగింది.

> **"ఆయన ఒకదానిపై నొకటి ఏడు ఆకాశాలను సృజించాడు. నీవు కరుణామయుని సృష్టిలో ఎలాంటి క్రమరాహిత్యాన్నీ చూడలేవు. కావాలంటే మరొకసారి చూడు, అందులో నీకేమైనా లోపం కనిపిస్తున్నదా? మళ్లీ మళ్లీ చూడు, నీ చూపులు అలసిపోయి విఫలమై వెనుకకు తిరిగి వస్తాయి."** (దివ్య ఖుర్‌ఆన్ 67:3)

ఎన్నో రకాల పోషక పదార్థాలు మరియు వేడి, ఈ సంక్లిష్ట వ్యవస్థ ద్వారా తీసికెళ్ల బడతాయి.

**ఆక్సిజన్ కారియర్ :**

మన మనుగడకు చాలా ప్రధానమైనది మరియు మూలాధారమైనది - **మనం పీల్చే గాలి**. కొయ్య దుంగను మండించినట్లు, 'సుగర్'ని మండించడానికి మన జీవకణాలకి ఆక్సిజన్ కావాలి. ఆ సుగర్‌ను మండించడం ద్వారా శక్తి ఉత్పత్తి అవుతుంది. అందుకే మనఊపిరితిత్తుల నుండి జీవకణాలకు ఆక్సిజన్ తీసుకెళ్ళబడుతుంది. పైప్‌లైన్లను కలిపే అల్లిక వలే ఉండే ఈ రక్త ప్రసరణ వ్యవస్థే ఆక్సిజన్‌ను తీసుకెళుతుంది.

ఎర్రరక్త కణాల్లోని హిమోగ్లోబిన్ పరమాణువులు ఆక్సిజన్‌ను తీసుకు వెడతాయి. డిస్క్ ఆకారంలో ఉండే ఎర్రరక్తకణంలోని ప్రతీ రక్తకణం దాదాపు 300 మిలియన్ల (30 కోట్ల) హిమోగ్లోబిన్ పరమాణువులను తీసుకువెళుతుంది. ఈ రక్త కణాలు దోషరహితమైన విధానాన్ని చూపుతాయి. అవి ఆక్సిజన్‌ను తీసుకు వెళ్ళడమే కాకుండా ఎక్కడ ఆక్సిజన్ అవసరమో అక్కడే ఆక్సిజన్‌ను విడుదల చేస్తుంటాయి. ఉదా: కండరాల కణంలోని ఎర్ర రక్త కణాలు టిష్యూలకు ఆక్సిజన్‌ను అందిస్తాయి. చక్కెరను కాల్చడం వలన ఉత్పన్నమైన కార్బన్ డై యాక్సైడ్‌ను తీసుకుని తిరిగి వెనక్కు అంటే ఊపిరితిత్తులకు చేరుకుని అక్కడ వదిలేస్తాయి. మరలా అక్కడి నుండి ఆక్సిజన్‌ను తీసుకుని, టిష్యూలకు తీసుకెళతాయి.

**పీడన సమతుల్య ద్రవం :**

ఆక్సిజన్‌తోపాటు హిమోగ్లోబిన్ పరమాణువులు నైట్రోజెన్ మోనాక్సైడ్‌ను మోసుకెళతాయి. ఈ గ్యాస్ కనుక బ్లడ్‌లో లేకపోతే, రక్తం యొక్క ప్రెషర్ స్థిరంగా మారిపోతూ ఉంటుంది. టిష్యూలకు ఎంత మోతాదులో ఆక్సిజన్‌ను అందివ్వాలో, నైట్రోజెన్ మోనాక్సైడ్ ద్వారా హిమోగ్లోబిన్ క్రమబద్ధీకరిస్తుంది. ఇక్కడ వింత ఏమిటంటే, ఇలా క్రమబద్ధీకరించేది ఏమిటో కాదు ఓ పరమాణువు. ఈ పరమాణువుకి బ్రెయిన్‌గాని, కళ్లుగాని ఉండవు. మన శరీరాలని క్రమబద్ధీకరించేవి **'కొన్ని పరమాణువుల సముదాయం'**.

ఇది దోషరహితంగా మన శరీరాలని సృష్టించిన అల్లాహ్ యొక్క అనంత జ్ఞానానికి సూచన.

**కణాల (Cells) యొక్క ఆదర్శ డిజైన్ :**

రక్తకణాలలోని మెజారిటీ రక్తకణాలు ఎర్రరక్త కణాలే. పురుషుని రక్తం 30 బిలియన్ ఎర్రరక్త కణాలను కలిగి ఉంటుంది. వాటి ఉపరితలాలను కలిపితే ఫుట్‌బాల్ మైదానంలో దాదాపు సగం ఉంటుంది. ఈ కణాలే రక్తానికి ఆ రంగును ఇస్తాయి.

ఎర్రరక్త కణాలు చూడటానికి డిస్క్‌ల్లాగా ఉంటాయి. ఆశ్చర్యాన్ని కలిగించే వాటి మెత్తదనం (flexibility) వలన, వెంట్రుక వాసి నాళాల నుండి, సూక్ష్మమైన రంధ్రాల నుండి అవి పీల్చబడతాయి. అవి అంత ఫ్లెక్సిబుల్ కాకపోతే, అవి శరీరంలోని చాలా చోట్ల అడ్డుపడిపోయి ఉండేవి.

ఒక అంగుళం వెడల్పున్న దానిని 10 లక్షల భాగాలుగా చేస్తే, ఆ విధంగా భాగాలైన సూక్ష్మ భాగాలలోని 39 భాగాలను కలిపితే ఎంత సూక్ష్మమైన వెడల్పు ఉంటుందో, అంత సైజు ఉంటుంది ఒక్కొక్క

ఎర్రరక్త కణం. ఈ రక్త కణం తన కంటే చిన్నదైన అంటే తన సైజులో మూడింట రెండు వంతులుండే రక్తనాళం (capillary) గుండా పోగలుగుతుంది.

అంత ఫ్లెక్సిబుల్ (మెత్తదనం)తో ఎర్రరక్తకణాలను సృష్టించక పోయి ఉంటే ఏం జరిగుండేది? 'డయాబెటిస్' పరిశోధకులు ఈ ప్రశ్నకు కొన్ని సమాధానాలు చెప్పారు. డయాబెటిక్ రోగులలో, ఎర్రరక్తకణాలు తన మెత్తదనాన్ని కోల్పోతాయి. ఇలా **మెత్తదనం కోల్పోయిన రక్తకణాలు** రోగియొక్క కన్నులలోని సున్నితమైన టిష్యూలలో ఆగిపోవడం వలన, గుడ్డితనానికి దారితీస్తాయి.

**ఆటోమెటిక్‌గా పనిచేసే అత్యవసర వ్యవస్థ :**

ఎర్రరక్తకణం యొక్క జీవితకాలం దాదాపు 120 రోజులు. ఆ తరువాత వాటిని spleen (ప్లీహం) తొలగిస్తుంది. ఈ నష్టాన్ని సరిచేయడానికి, నిరంతరం కొత్తకణాల ఉత్పత్తి జరుగుతూ ఉంటుంది. సాధారణ పరిస్థితులలో ఒక సెకనులో 2.5 మిలియన్ల ఎర్రరక్త కణాలు ఉత్పత్తి అవుతాయి. అవసరమైనప్పుడు, ఈ సంఖ్య పెరుగుతుంది. కిడ్నీలలో తయారయ్యే 'erythropoietin' అనే హార్మోన్ ఈ ఉత్పత్తి వేగాన్ని క్రమబద్ధీకరిస్తుంది. ఉదాహరణకు, ప్రమాదాల వల్ల భారీగా రక్తం కారడం లేదా ముక్కునుండి రక్తం కారడం జరిగినప్పుడు, ఆ నష్టం వెంటనే బేలన్స్ అవుతుంది.

అంతేకాకుండా, గాలిలో ఆక్సిజన్ శాతం తగ్గితే, ఈ ఉత్పత్తి వేగం పెరుగుతుంది. ఉదాహరణకు, బాగా ఎత్తైన ప్రదేశాలపై ఎక్కుతున్నప్పుడు, గాలిలో ఆక్సిజన్ స్థాయి తగ్గుతూ ఉన్నప్పుడు, శరీరం ఆటోమెటిక్‌గా రక్తకణాల ఉత్పత్తిని పెంచి, అందుబాటులో ఉండే ఆక్సిజన్‌ను చాలా సమర్థవంతంగా ఉపయోగించుకుంటుంది.

**పెర్‌ఫెక్ట్ ట్రాన్స్‌పోర్టేషన్ వ్యవస్థ :**

రక్తంలో ఉండే ద్రవ భాగాన్ని ప్లాస్మా అంటారు. ఈ ప్లాస్మా రక్త కణాలనే కాకుండా శరీరంలో ఉండే ఇతర పదార్థాలను కూడా తీసుకెళు తుంది. ప్లాస్మా స్పష్టమైన పసుపురంగు ద్రవం. ఈ ప్లాస్మా సాధారణ శరీర బరువులో 5 శాతం ఉంటుంది. ఈ ద్రవంలో 90శాతం నీరే. దీనిలో లవణాలు, మినరల్స్, కార్బోహైడ్రేట్స్, కొవ్వు మరియు వందల సంఖ్యలో భిన్న రకాల ప్రోటీనులు మునిగి తేలుతూ ఉంటాయి. రక్తంలోని ఈ ప్రోటీనులలోని లిపిడ్స్‌ను కలిపి ఉంచి, టిష్యూలకు తీసుకు వెళ్ళే ట్రాన్స్‌పోర్ట్ ప్రోటీనులు కొన్ని ఉంటాయి. ఈ ప్రోటీన్‌లు కనుక ఈ విధంగా లిపిడ్స్‌ను తీసుకెళ్ళకపోతే, ఈ లిపిడ్స్ ఓ పద్ధతి లేకుండా తేలుతూ, తీవ్ర ఆరోగ్య సమస్యలకు కారణమవుతాయి.

ప్లాస్మాలోని హార్మోనులు ప్రత్యేకమైన కొరియర్ల పాత్ర పోషిస్తాయి. ఇవే శరీరంలోని అవయవాలకు, కణాలకు మధ్య రసాయన సందేశాల ద్వారా సమాచారాన్ని ఇచ్చి పుచ్చుకోవడాన్ని సులువుచేస్తాయి.

అల్బుమిన్ ప్లాస్మాలోని ప్రముఖ ప్రోటీన్, ఇది ఒక ట్రాన్స్‌పోర్టర్. ఇది కొలెస్ట్రాల్, హార్మోనులు, బిలిరుబిన్ లేక పెన్సిలిన్ వంటి మెడిసిన్స్ వంటి లిపిడ్స్‌ని కలిపి ఉంచుతుంది. విషపదార్థాలను లివర్‌లో వదిలేసి, మిగతా పోషక పదార్థాలని మరియు హార్మోనులను వాటి అవసరం ఎక్కడైతే ఉందో ఆ చోటుకి తీసుకెళతాయి.

ఈ విషయాలన్నింటినీ గనుక మనం పరిగణనలోకి తీసుకుంటే, మనకి స్పష్టమయ్యేదేమిటంటే మన శరీరం ఎంతో గొప్పగా (in extremely detailed way) సృష్టించబడింది. ప్రతీ ఒక్క ప్రోటీన్ యొక్క సామర్థ్యం ఎలా ఉంటుందంటే లిపిడ్, హార్మోన్ మరియు మెడిసిన్‌ల మధ్య ఉండే తేడాను అది గుర్తించ గలుగుతుంది. అంతేకాదు వీటి అవసరం ఎక్కడ ఉందో, ఎంత మోతాదులో వీటి అవసరం ఉందో అన్నీ తెలుసుకో గలుగుతుంది.

అల్లాహ్ యొక్క దోషరహిత డిజైన్‌కు స్పష్టమైన సూచనలే ఇవన్నీ.

ఆశ్చర్యాన్ని కలిగించే ఇటువంటి జీవరసాయన చర్యలు వేల సంఖ్యలో మన శరీరంలో జరుగుతూ ఉంటాయి. ట్రిలియన్ సంఖ్యలో ఉండే మన శరీరంలోని పరమాణువులన్నీ అద్భుతమైన సామరస్యంతో పనిచేస్తాయి. వాస్తవేమిటంటే ఈ పరమాణు వ్యవస్థలన్నీ కూడా తల్లి గర్భంలో ఏర్పడిన ఒకే ఒక కణం నుండి విభజన జరిగి ఏర్పడినవే.

ఇది ఓ గొప్ప విషయాన్ని స్పష్టం చేస్తుంది. మానవ శరీరం యొక్క అద్భుత వ్యవస్థ ఒకే బిందువు నుండి మానవున్ని సృష్టించిన అల్లాహ్ యొక్క అద్భుత ఆర్టిస్ట్రీకి ప్రత్యక్ష సాక్ష్యం.

> **"మేము మానవుణ్ణి మట్టియొక్క సారంతో సృష్టించాము. తరువాత అతనిని ఒక సురక్షితమైన స్థానంలో పడే బిందువుగా మార్చాము. ఆ తరువాత ఈ బిందువుకు ముద్ద ఆకారాన్ని ఇచ్చాము. ఆపైన ముద్దను కండగా చేశాము. తరువాత మాంసపు కండను ఎముకలుగా చేశాము. ఆ తరువాత ఎముకలకు మాంసాన్ని తొడిగాము. ఆ పైన దానిని భిన్నమైన సృష్టిగా చేసి నిలబెట్టాము. కనుక అల్లాహ్ ఎంతో శుభప్రదుడు, సృజన కారులందరిలో కెల్లా ఉత్తమ సృజనకారుడు"** (ఖుర్‌ఆన్ 23:12-14)

**ప్రత్యేకమైన కంట్రోల్ మెకానిజమ్ :**

ఆర్టెరీస్ (ధమనుల)నుండి పోషక పదార్థాలు అవసరమైన టిష్యూలలోకి చొచ్చుకుపోవడానికి ఆర్టెరీ గోడలను దాటవలసి ఉంది. ఆర్టెరీ గోడలు చాలా సూక్ష్మ రంధ్రాలు కలిగి ఉన్నప్పటికి, ఏ పదార్థమూ దానంతట అదే చొచ్చుకుపోలేదు. ఈ చొచ్చుకు పోవడాన్ని సులువు చేసేది బ్లడ్‌ప్రెషర్. అయినప్పటికీ అవసరానికంటే ఎక్కువ మొత్తంలో పోషక పదార్థాలు టిష్యూలకు వెళితే, ఆ టిష్యూలలో మంటకు ఇవి కారణమవుతాయి. అందువలన దానికొక ప్రత్యేకమైన మెకానిజమ్ ఏర్పాటు చేయబడింది. దాని ద్వారా బ్లడ్‌ప్రెషర్‌ని బేలన్స్ చేస్తూ, ద్రవాన్ని వెనుకకు తిరిగి బ్లడ్‌లోకి తీసుకోవడం జరుగుతుంది.

ఈ బాధ్యతను అల్బుమిన్ తీసుకుంటుంది. ఆర్టెరీ గోడలలోని రంధ్రాల కంటే ఈ అల్బుమిన్ పెద్దగా ఉంటుంది. ఇది రక్తంలో చాలా సంఖ్యలో సరిపోయినంత ఉంటుంది. స్పాంజ్ పీల్చినట్లు వాటర్‌ని పీలుస్తుంది. శరీరంలో అల్బుమిన్ లేకపోతే, ఎండిన చిక్కుడు గింజను

నీటిలో వదిలి ఉంచితే ఎలా ఉబ్బిపోతుందో అలా శరీరం ఉబ్బిపోతుంది.

దీనికి వ్యతిరేకంగా, రక్తంలోని పదార్ధాలు కంట్రోల్ లేకుండా మెదడు యొక్క టిష్యూలలోకి ప్రవేశించ కూడదు. ఎందుకంటే అనవసర పదార్ధాలు నెర్వ్ కణాల(న్యూరిన్స్)ను తీవ్రంగా పాడుచేస్తాయి. కాబట్టి అన్ని రకాల హాని కలిగించే వాటినుండి మెదడు రక్షింపబడుతుంది. మందమైన కణపొరలు రంధ్రాలను మూసేస్తాయి. ఈ పొరల గుండా అవసరమైన అన్ని రకాల పదార్ధాలు వెళతాయి. ఎలా అంటే సెక్యూరిటీ చెక్ పాయింట్‌లో నుండి తనిఖీ కాబడి వెలుతున్నట్లు. ఈ విధానం వలన మొత్తం శరీరంలోని చాలా సున్నిత అవయవాలకు పోషక పదార్ధాలు సరిగ్గా ప్రసరణ కావడం సులభం అవుతుంది.

**శరీరంలో థెర్మోస్టాట్ :**

విటమిన్స్ మరియు ఇతర పదార్ధాలతో పాటు, కణాలలో శక్తి ఉత్పత్తి కావడం వలన వెలువడిన వేడిని కూడా ఎర్రరక్త కణాలు తీసుకెళతాయి. బయటి వాతావరణంలోని వేడిని బట్టి, రక్తం తీసుకెళ్ళే వేడిని శరీరంలో పంచడం ద్వారా శరీర ఉష్ణోగ్రతను బేలన్స్ చేయడం అతి ముఖ్యమైన విషయం. మన శరీరాలలో గనుక వేడిని పంపిణీ చేసే వ్యవస్థ గనుక లేకపోతే, మన చేతి కండరాలను ఉపయోగించినపుడు, మన చేతులు తీవ్రమైన వేడిగా ఉండి, మిగతా శరీరం చల్లగా ఉంటుంది. ఈ విధంగా గనుక జరిగితే మెటాబోలిజమ్ (ఆహార పదార్ధాలు జీవ పదార్ధాలుగా మారే ప్రక్రియ) పాడవుతుంది. మన శరీరంలో జరుగుతున్న రక్త ప్రసరణ వ్యవస్థే మన శరీరమంతటా సమంగా వేడి పంపిణీ అవడాన్ని సులభతరం చేస్తుంది.

మన శరీర ఉష్ణోగ్రతను చల్లబరచడానికి, చెమట పట్టించే వ్యవస్థ యాక్టివేట్ అవుతుంది. చర్మం క్రింద ఉండే బ్లడ్ వెసల్స్ ఎన్‌లార్జ్ (పెద్దవిగా) అయ్యి, ఎక్కువ వేడిని బయటి గాలిలో పంపేలా చేస్తాయి. అందుకే మనం పరుగెడుతున్నప్పుడుగాని లేదా శక్తినుపయోగించి ఏమైనా పనులు చేసినప్పుడు గాని, మన ముఖాలు ఎర్రగా మారతాయి.

బయట చల్లగా నున్నప్పుడు మన శరీర వేడిని నిల్వచేసే బాధ్యత కూడా రక్త ప్రసరణదే. చుట్టూ ఉన్న ప్రదేశాలు బాగా చల్లగా ఉంటే, మన చర్మం క్రింద ఉంటే బ్లడ్ వెసల్స్ ముడుచుకు పోతాయి. దానివలన ఆ ప్రాంతంలో రక్తం తక్కువగా ఉండి వేడి తప్పించుకు పోదు. అందుకనే బాగా చల్లని వాతావరణంలో మన ముఖాలు తెల్లగా అవుతాయి.

రక్తంలో జరిగే ప్రతీ విషయం చాలా క్లిష్టంగానూ ఉంటుంది. సూక్ష్మమైన వివరాలతో సహా మానవ సృష్టి ఎంత దోషరహితంగా జరిగింది. నిజానికి రక్త ప్రవాహంలో ఎలాంటి అద్భుతమైన ఇంట్రికేట్ బేలన్స్ ఉందంటే, కొంచెం బ్రేక్‌డౌన్ అయితే చాలు, తీవ్రమైన చిక్కులకి కారణమవుతుంది.

రక్తాన్ని దానికవసరమైన అన్ని ధర్మాలతో సహా క్షణంలో సృష్టించిన సృష్టికర్త ఒక్కరైన ఆ అల్లాహ్‌యే!

**చిన్ని దోషానికి కూడా తావులేని వ్యవస్థ : బ్లడ్ క్లాటింగ్ (రక్తం గడ్డ కట్టడం)**

ఏదైనా గాయం తగిలినపుడో, లేదా కోసుకుని గాని లేదా పాత గాయమే రేగి మరలా రక్తస్రావం అవుతుంటే అది చివరికి ఆగిపోతుందని ప్రతీ ఒక్కరికి తెలుసు. రక్తస్రావం అయిన చోట, రక్తపు గడ్డ ఏర్పడి, గట్టిపడి, సరియైన టైమ్‌లో గాయాన్ని తగ్గిస్తుంది. ఇది మనకు సులభమైన, సాధారణ ప్రక్రియగా అనిపించవచ్చు. కాని జీవరసాయన శాస్త్రజ్ఞులు వారి పరిశోధనలద్వారా తెలిపిన విషయాలను బట్టి, చాలా సంక్లిష్టంగా ఉండే ఓ వ్యవస్థ పని చేయడం వలననే ఇది జరుగుతుంది. ఈ వ్యవస్థలో పనిచేసే ఏ ఒక్క అంశం తగ్గినా లేక అది పాడయినా, మొత్తం ప్రక్రియ వృధా అవుతుంది.

సరియైన సమయం మరియు సరియైన చోట రక్తం గడ్డకట్టాలి. సాధారణ పరిస్థితులు నెలకొనగానే, గడ్డ మాయమవుతుంది. ఈ వ్యవస్థ సూక్ష్మస్థాయి (మైన్యుటెస్ట్ డిటైల్) వరకూ దోషరహితంగా పనిచేస్తుంది.

రక్తస్రావం జరగుతున్నప్పుడు, ఆ జీవి చనిపోకుండా వెంటనే రక్తపు గడ్డ ఏర్పడాలి. అంతేకాకుండా గాయం మొత్తానికి, గాయంపైన దాని ఉపరితలంపై గడ్డ ఉండాలి. లేకపోతే మొత్తం రక్తం గడ్డకట్టి మరణానికి దారి తీయవచ్చు. అందువలనే గడ్డ అనేది సరియైన సమయంలో సరియైనచోట ఏర్పడాలి.

రక్తం గడ్డకట్టడానికి రక్తంలో ఉండే చిన్ని మూలకాలు (ప్లేట్‌లెట్స్ లేక త్రాంబోసైట్స్) చాలా ప్రధానమైనవి. ఈ కణాలు రక్తం గడ్డకట్టే ప్రక్రియలో మొదట ఉండే ముఖ్యమైన మూలకాలు. రక్త ప్రసరణను నిరంతరం పహారా కాసే von Willebrand factor అనే ప్రొటీన్ గాయం తగిలిన చోటును ప్లేట్‌లెట్స్ మిస్ అవకుండా, అవి ఆ స్థలాన్ని తెలుసుకునేలా చేస్తాయి. ఆ విధంగా గాయమైన ప్రదేశంలో ప్లేట్‌లెట్స్ సులభంగా విడదీయలేని విధంగా చేరిపోయి, ఓ పదార్ధాన్ని విడుదల చేస్తాయి. అది లెక్కలేనన్ని ఇతర ప్లేట్‌లెట్స్‌ని ఆ ప్రదేశంలో సేకరింపబడేలా చేస్తుంది.

ఈ కణాలు చివరికి తెరచిఉన్న గాయానికి చేరుకుంటాయి. గాయాన్ని గుర్తించడంతో ప్లేట్‌లెట్స్ యొక్క బాధ్యత తీరిపోయి అవి చనిపోతాయి.

రక్తం గడ్డ కట్టించే వ్యవస్థలో ఓ భాగమే ఈ ప్లేట్‌లెట్స్ యొక్క త్యాగం.

త్రాంబిన్ అనే మరో ప్రొటీన్ రక్తం గడ్డకట్టడాన్ని సులువు చేస్తుంది. అయితే ఇది గాయం ఉన్న ప్రదేశంలోనే ఉత్పత్తి అవుతుంది. ఈ త్రాంబిన్ ఎంత మోతాదులో ఉత్పత్తి అవ్వాలి అనేది ముఖ్యం. అవసరమైన దానికంటే ఎక్కువగాని తక్కువగాని ఉత్పత్తి కాకూడదు.

అలాగే సరియైన సమయంలో మొదలవ్వాలి మరియు సరియైన సమయంలోనే ఖచ్చితంగా ఈ ఉత్పత్తి ఆగిపోవాలి. ఎంజైములనబడే 20 కంటే ఎక్కువగా ఉండే శరీర రసాయనాలు, ఈ త్రాంబిన్ ఉత్పత్తిలో ముఖ్యమైన పాత్రను పోషిస్తాయి. ఈ ఎంజైములు వాటి ప్రత్యుత్పత్తిని జరపడం గాని, ఆపటంగాని చేయగలవు. ఈ ప్రక్రియలో చాలా

విపులమైన తనిఖీ జరుగుతుంది. నిజంగా టిష్యూలకు గాయమయి నప్పుడే త్రాంబిన్ ఏర్పడుతుంది.

శరీరంలో రక్తాన్ని గడ్డకట్టించే ఎంజైములు, తగిన స్థాయికి చేరిన వెంటనే, ప్రోటీన్‌లతో కూడిన ఫ్రిబ్రినోజెన్స్ ఏర్పడతాయి. చాలా తక్కువ సమయంలోనే, ఫైబర్స్ మెష్‌తో ఓ గూడు ఏర్పడుతుంది. బయటికి రక్తం పోయే ప్రదేశంలో ఇది ఏర్పడుతుంది. ఈ మధ్య సమయంలో పహారా కాసే ప్లేట్‌లెట్స్ అంతరాయం లేకుండా అదే ప్రదేశంలో విడదీయడానికి కష్టమయ్యే విధంగా కలిసి మరియు ప్రోగవుతాయి. ఇవి ప్రోగవడం వలన గాయం యొక్క రంధ్రం మూయబడుతుంది. దానినే క్లాట్ అని పిలుస్తాము.

గాయం పూర్తిగా మానిపోతే, గడ్డ కరిగిపోతుంది.

గడ్డ ఏర్పడేలా చేయడం, అది ఎంత మేర ఉండాలి, ఎంత గట్టిగా ఉండాలి లేదా కరగాలి అని నిర్ధారణ చేసే ఈ వ్యవస్థ నిస్సందేహంగా తగ్గించనలవకాని సంపూర్ణ సంక్లిష్టమైనదని (absolute irreducible complexity) స్పష్టంగా తెలుస్తుంది కదా!

The system works flexibility down to minutest detail. ఇంత ఖచ్చితంగా పనిచేసే వ్యవస్థలో చిన్ని చిన్ని సమస్యలొస్తే ఏం జరుగుతుంది? ఉదాహరణకు, గాయం లేకుండానే రక్తంలో గడ్డ ఏర్పడితే లేదా గాయం నుండి గడ్డ వేరుపడిపోతే? ఈ ప్రశ్నలకి ఒకటే సమాధానం:

గుండె, మెదడు, ఊపిరితిత్తుల్లాంటి అతి ముఖ్యమైన మరియు సంక్లిష్టమైన అవయవాలలో రక్తపు గడ్డలు అడ్డుపడతాయి. ఎన్నో కాంప్లికేషన్స్ తలెత్తుతాయి. మరణించే అవకాశం కూడా ఉంది. వాస్తవంగా ఇది మనకు మరోసారి స్పష్టం చేసేదేమిటంటే - **మానవ శరీరం పరిణామ సిద్ధాంతంచే అనుకోకుండా జరిగిన దానివలననో (లేదా) క్రమంగా అభివృద్ధి జరిగిందనే ఆధారరహిత ప్రతిపాదనల ద్వారా రక్తం యొక్క ఈ క్లాటింగ్ వ్యవస్థను దోషరహితంగా వివరించడం అసాధ్యం.**

అంత శ్రద్ధతో కూడిన నైపుణ్యంతో నిర్మించబడిన మరియు గణనాలతో కూడిన వ్యవస్థ - అల్లాహ్ యొక్క సృష్టిలోని పరిపూర్ణత (పెర్‌ఫెక్షన్)కి సాక్ష్యం. ఇందులో వాదనకు అవకాశమే లేదు.

మనందరిని సృష్టించి, ఈ భూమిమీద ఉంచిన అల్లాహ్‌యే మన జీవితాలలో, గాయాల పాలయ్యే ఎన్నో సందర్భాలలో మనల్ని రక్షించే ఇటువంటి వ్యవస్థలతో మన శరీరాలను సృష్టించాడు.

బ్లడ్ క్లాటింగ్ మనకి కనిపించే గాయాల విషయంలోనే కాకుండా, నిత్యం మనకు కనిపించకుండా జరిగే రక్తనాళాల రాపిడి వలన కనిపించని గాయాలకు కూడా చాలా అవసరం. మనం గుర్తించ నప్పటికినీ, అంతరాయం లేకుండా చిన్న, చిన్న అంతర్గత రక్తస్రావాలు మన శరీరం లోపల జరుగుతూనే ఉంటాయి. **తలుపు (డోర్)కి మన చేయి తగిలినప్పుడో లేదా చాలా బరువుగా కూర్చోవడంలో, వందల సంఖ్యలోని మన రక్తనాళాలు రాపిడికి గురవుతాయి. ఈ రక్తస్రావాలు వెంటనే క్లాటింగ్ వ్యవస్థ ద్వారా ఆగిపోతాయి. ఆ నాళాలు వాటి సాధారణ స్థితిలో మరలా నిర్మించబడతాయి.**

ఒకవేళ దెబ్బ చాలా తీవ్రమైనది అయితే, లోపల జరిగే రక్తస్రావం బలంగా ఉండి, చర్మం కములుతుంది. దీనినే '**టర్నింగ్ పర్పుల్**' అంటారు.

కోయాగులేషన్ వ్యవస్థ లేని మనిషి చిన్న చిన్న దెబ్బలకు సైతం దూరంగా ఉండాలి. హీమోఫిలిక్ పేషంట్లకు కోయాగులేషన్ వ్యవస్థలో దోషాలు ఉంటాయి. వారు తమ జీవితాన్ని చాలా జాగ్రత్తగా గడపాలి.

తీవ్రమైన హీమోఫిలియా ఉన్న రోగులు ఎక్కువకాలం బ్రతకలేరు. ఇలాంటివారు కొద్దిగా జారిపడితే చాలు, వారి జీవితాలు ముగుస్తాయి.

ఈ చిన్న సత్యాన్ని బట్టి, ప్రతీ ఒక్కరూ ఈ సృష్టిలో ఉన్న అద్భుతాలను గమనించాలి. దోషరహితంగా మన శరీరాలను తయారు చేసిన అల్లాహ్‌కు కృతజ్ఞులుగా ఉండాలి.

> **"భూమిలో ఎన్నో నిదర్శనాలు ఉన్నాయి. స్వయంగా మీలోనూ ఉన్నాయి. మీరు ఆలోచంచరా?** (ఖుర్‌ఆన్ 51:20-21)

ఈ శరీరం మనకు అల్లాహ్ నుండి అందిన వరం. దీనిలోని ఒక్కటంటే ఒక్క కణాన్ని కూడా ఎవరూ తయారు చెయ్యలేరు.

Source : www.harunyahya.net


# 'శాంతిబాట'

**చందాదారులుగా చేరగోరువారు**
**క్రింది ఎడ్రస్‌కు రూ. 180/- M.O. చేయండి :**

**వెలుగుబాట ఎడ్యుకేషనల్ సొసైటీ**
2-8-31, కోట బజార్, సామర్లకోట-533440

మీ పూర్తి ఎడ్రస్ మరియు ఫోన్ నెంబర్లను, మనియార్డర్ ఫామ్ క్రింది భాగాన గల ఖాళీలో వ్రాసి ఏ సంచిక నుండి మీకు శాంతిబాట పత్రికను పంపమంటారో తెలియజేయండి.

మీ ఎడ్రస్‌గాని, ఫోన్ నంబర్‌గాని మారితే, వెంటనే పోస్ట్‌కార్డ్‌పై వ్రాసి పై ఎడ్రస్‌కు పంపించండి. లేదా

క్రింది నంబర్‌కు డయల్ చేసి తెలియజేయండి.
Cell: **9491103017**
Email: **velugubaata@gmail.com**

**చందాను బ్యాంకు ద్వారా**
**ఎకౌంట్‌లో డిపాజిట్ చేయలనుకునేవారు**
**వివరాల కొరకు క్రింది నెంబర్‌కి ఫోన్ చేయండి**

Cell: **9491103017**

| జ్ఞానం | నాస్తికుల అజ్ఞానం పై ప్రత్యేక శీర్షిక | అజ్ఞానం |
|---|---|---|

జ్ఞానులుగా పిలుపించుకోబడే, స్వయంగా తాము జ్ఞానులమని తలపోసే వారిలోని అజ్ఞానాన్ని ప్రజల ముందుంచడానికే ఈ శీర్షికను ప్రారంభించామని తొలి సంచికలో తెలియజేసి, కొందరి జ్ఞానులలో నున్న అజ్ఞానాన్ని బయట పెట్టడం జరిగింది. నిజమైన జ్ఞానులెవరో, అజ్ఞానంతో నున్న జ్ఞానులెవరో ఉదాహరణ పూర్వకంగా వివరించడం జరిగింది. 'ఇస్లాం' పై కనీస జ్ఞానం లేకుండా ఇస్లాంపై విషపురాతలతో కూడిన ఓ పుస్తకాన్ని పబ్లిష్ చేశారు. పుస్తకంలోని అజ్ఞానాన్ని ఈ నెల మీ ముందుంచుతున్నాము.

పుస్తకం పేరు :

**ప్రపంచ ముస్లిం మేధావుల దృష్టిలో ఇస్లాం అంటే ...**

సంకలనం, అనువాదం : **డా॥ క్రాంతికార్**

ఈ మేధావిగారి ఎడ్రస్ : 11-1-88, లెనిన్ నగర్, **ఖమ్మం** - 507001

ఫోన్ నంబర్ : (08742) - 223788

**పబ్లిషర్స్ :** హిమకర్ పబ్లికేషన్స్, 79-2-3, ప్రశాంతి ఎస్టేట్, తిలక్ రోడ్
రాజమండ్రి - 533 103,
ఫోన్స్: 0883-2466075, 2449846

హిమకర్ పబ్లికేషన్స్ వారు ప్రత్యేకమైన గమనికను పుస్తకం ప్రారంభంలో అందించారు. ఆ గమనికలోని జోక్ :

**"ఈ సంకలనంలోని వ్యాసాలలో వ్యక్తం చేయబడిన అభిప్రాయాలు, విమర్శలు, విశ్లేషణలు అన్నీ ఆయా వ్యాసకర్తల స్వంతమే! వాటితో ప్రచురణ కర్త, అనువాదకులు, సంపాదకులు ఆవశ్యంగా ఏకీభవించాల్సిన ఆవశ్యకత లేదు".**

వీరు ఏకీభవించని విషయాలను పాఠకుల సమాచారం కోసం అందించారట. కొద్దిగా ఎడిట్ కూడా చేశారట. వ్యాసాలను ఎడిట్ చేయడమంటే, వీరికి నచ్చని విషయాలను తీసివేశారా? లేక వాక్యాలను మార్చారా? ఒకవేళ అదే నిజమైతే వ్యాసాలు వ్యాసకర్తల స్వంతం కానట్లే. తమ ఆలోచనలతో ఏకీభవించని వ్యాసాలను ఏరికోరి ఎందుకు అందించారో?

పాఠకుల సమాచారం కోసమే అందించారట. ఎవరి హృదయాలను గాయపరచాలనే, మనస్సులను కించపరచాలనే ఉద్దేశ్యం ప్రచురణ కర్తలకు గానీ, సంపాదకులకు గానీ ఏ కోశానా లేదట.

ఈ వాస్తవాలను గమనించి <u>**ప్రజాస్వామిక విమర్శగా**</u> తీసుకుంటారని ఆశిస్తూ ప్రచురించారట. 'విమర్శ, కువిమర్శ, సద్విమర్శ'ల గురించి విన్నాము గాని, ప్రజాస్వామిక విమర్శ అనే పదాన్ని తొలిసారిగా వింటున్నాము.

**బిరుదులు :**

మన దేశంలో 'పద్మశ్రీ', 'పద్మ విభూషణ్' మొ॥న బిరుదులను సెంట్రల్ గవర్నమెంట్ ప్రధానం చేస్తుంది. అలాగే నోబెల్ బహుమతులను 'స్వీడన్' దేశం వారు, ఆస్కార్ అవార్డులను అమెరికా దేశం వారు ఇస్తారు. ఎవరికి అవార్డులివ్వాలో నిర్ణయించడానికి ఓ నిపుణుల కమిటీని కూడా వీరు ఏర్పాటు చేసుకుంటారు.

అయితే ప్రపంచంలో ఎవరైనా సరే, ఎవరికైనా సరే ఇవ్వగలిగే బిరుదు ఒకటుంది. అదే - **మేధావి**. మేధావుల గురించి చెప్పుకునే ముందు ఆవుల గురించి చెప్పుకుందాం. 'ఆవులు పాలిస్తాయి, ప్రజలకు ఉపయోగ పడతాయి'. ఆవు గురించి చిన్న పిల్లల నుండి పండు ముసలి వరకూ, వారు చదువుకున్న వారైనా సరే, చదువుకోలేని వారైనా సరే అందరికీ తెలుసు.

కాని 'మేధావి' అనే పదం గురించి, ఆ మాటను పలికే ప్రతీ ఒక్కరికి ఒక్కొక్క అర్థముంది. పుస్తకం ఆఖరి 2 పేజీలలో రచయిత గారైన డా॥ క్రాంతికార్ గారి గురించి పరిచయం చేసిన వ్యక్తి మేధావి కాదని, పరిచయం చేసిన వారి వ్రాతలను బట్టి తెలుస్తుంది. పరిచయం చేసినవారి గురించి ఇలా ఉంది : 'మరో సామాన్యుడు రామారావు, ఖమ్మం'.

రచయితగారు తన పరిచయాన్ని సామాన్యుని చేత ఎందుకు చేయించుకున్నారో! మరో మేధావి చేత ఎందుకు చేయించు కోలేకపోయారు? భయమేసి ఉంటుంది. భయమని ఎందుకంటున్నా మంటే, పుస్తకాన్ని చూశాక రచయితగారి దృష్టిలో 'మేధావి' అంటే మాకెలా అర్థమైందో దానిని దిగువన తెలియజేస్తున్నాము.

1. ముస్లిం కుటుంబంలో పుట్టి, ఇస్లాంను తిట్టాలి
   - అప్పుడు అతడు ముస్లిం మేధావి అవుతాడు
2. తల్లిపాలు త్రాగి, ఆ తల్లిని తిట్టాలి - అప్పుడు ఆ కొడుకు మేధావి
3. భారతదేశంలో పుట్టి, భారతదేశాన్ని తిట్టాలి
   - అప్పుడు అతడు భారతీయ మేధావి
4. మెడిసిన్ చదువుకున్న డాక్టర్ గారు, 'మెడిసిన్' సబ్జక్టును తిట్టాలి
   - అప్పుడు ఆయన మెడిసిన్‌లో మేధావి
5. అలాగే సైన్స్, ఇంజినీరింగ్ చదివినవారు, ఆయా సబ్జక్టులను తిట్టాలి.
   - వారు కూడా గొప్ప మేధావులవుతారు.

కాబట్టి 'మేధావి' చేత గనుక పరిచయం చేయిస్తే, సదరు మేధావి గారు తనకున్న పైన చెప్పిన 'మేధావి' లక్షణంతో ఈ పుస్తకాన్ని చదివి పుస్తక రచయిత అయిన క్రాంతికార్ గారిని తిడతారేమోనని భయమేసి ఉంటుంది. అంతేకదా! ఏ పుస్తకాన్ని చదివితే, ఆ పుస్తకం వ్రాసిన వారినే తిట్టాలి. లేకపోతే క్రాంతికార్‌గారి దృష్టిలో ఆయన మేధావి కాలేడు.

కొంతమంది వ్యక్తులు జోక్‌లేయకపోయినా సరే నవ్వు వస్తుంది. మాటల అవసరం లేకుండా, సదరు జోకర్స్ యొక్క ఎక్స్‌ప్రెషన్‌ని చూడగానే నవ్వు వస్తుంది.

అలాగే కొన్ని పుస్తకాలను పూర్తిగా చదవకుండానే నవ్వు వస్తుంది. అంత హాస్యాస్పదంగా ఉంటాయి. క్రాంతికార్‌గారి హాస్య పుస్తకంలోని జోక్‌లను మరియు ఆ జోక్‌లను వ్రాసిన మేధావుల మట్టిబుర్రను, సామాన్య మానవుల వలే గాలిని పీల్చకుండా, హేతువాద భావజాలాన్నే ఊపిరిగా బ్రతికే ఈ హెూమియో డాక్టర్ మహా మేధావి, నక్సల్బరీ పత్రిక నడిపిన డా॥ క్రాంతికార్ గారి వ్రాతలలోను ఎంత విషం ఉందో చూశాక, ఎందుకో తెలియదుగాని కోపానికి బదులు ఆయనపై జాలివేసింది.

**ఆయనకు ఇప్పటికైనా 'అల్లాహ్' జ్ఞానాన్ని ప్రసాదించాలని కోరుకుంటున్నాము.**

పుస్తకం అట్టపై ముందు భాగాన 'బిన్‌లాడెన్' ఫొటో, ఓ చంద్రుడు మరియు నక్షత్రం సింబల్ (వాస్తవానికి ఈ సింబల్‌కి ఇస్లాంకి ఎటువంటి సంబంధం లేదు), టోపీలు పెట్టుకుని నినాదాలు చేస్తున్నట్లున్న ముస్లిముల సమూహాన్ని బేక్‌గ్రౌండ్‌లో ఉంచారు. అట్ట వెనుకభాగాన ఎర్రటి చొక్కా ధరించిన డా॥ క్రాంతికార్ గారి ఫొటో, ఆ చొక్కాలో ఓ ఎర్రటి పెన్.

**అంటే పుస్తకం అట్టపై ఒకవైపు తీవ్రవాది, మరోవైపు కమ్యూనిస్ట్ తీవ్రవాది.**

ఒకరు అడవులు, పల్లెటూర్లకే పరిమితమైతే, మరొకరికి నగరాలే లక్ష్యం. (నిజానికి బిన్‌లాడెన్ గురించి, అతని లక్ష్యాల గురించి మా దగ్గర సమాచారం లేదు).

బిన్‌లాడెన్ బ్రతికున్నాడో? లేడో? ఎవరికీ తెలియదు. అతను అమెరికాలో దాడులు చేయించాడో లేదో కూడా ఎవరికీ తెలియదు.

అమెరికాలో దాడులు జరిగినా, ఆస్ట్రేలియాలో ఇండియన్లపై దాడులు జరుగుతున్నా, లేదా ప్రస్తుతం మన రాష్ట్రంలో ఓ ప్రత్యేక విషయంపై దాడులు జరిగినా అవన్నీ కూడా తీవ్రవాద దాడులా? కాదా? అని మేమిక్కడ చర్చించదలచు కోలేదు.

**కాని ఇవి అన్నీ కూడా ఇస్లాం ధర్మానికి వ్యతిరేకమైనవే. కాబట్టి ముస్లిములుగా మేము వీటిని ఖండిస్తున్నాము.**

భగత్‌సింగ్ మరియు అల్లూరి సీతారామరాజు వంటి యోధులను దేశభక్తులుగా మనం గౌరవిస్తాం. కాని బ్రిటిష్ వాళ్ళు ఆ ఇద్దరిని టెర్రరిస్టు లన్నారు. (శాంతిబాట 'మొదటి సంచిక' చూడండి)

వియత్నాంపై అమెరికా దౌర్జన్యం చేసినా, ఆఫ్ఘనిస్తాన్‌పై రష్యా దౌర్జన్యం చేసినా, ఇండియాను బ్రిటిష్‌వాళ్ళు మోసం చేసి మన భారతీయుల్ని బానిసలుగా చేసుకున్నా అందుకు కారకులైన అమెరికా, బ్రిటన్, రష్యాలు ప్రజలకోసమే ఇవన్నీ చేసామని చెబుతాయి.

కాబట్టి ఈ దేశాలకు మానవత్వం ఉందని, ఆక్రమించబడిన దేశాలలో ప్రజలు చేసే తిరుగుబాటు, పోరాటాలు మానవత్వం లేకుండా తీవ్రవాదంతో చేసినవిగా భావించాలా?

వీటి గురించి ఆలోచించి, అర్థం చేసుకోవడానికి మనం మేధావులం కానవసరం లేదు. మానసిక ఆరోగ్యం బాగుండి, ఆలోచించగల వారి కెవరికైనా అర్థమౌతుంది.

**పుస్తకం అట్ట వెనుకభాగాన హేతువాదాన్నే ఊపిరిగా తీసుకుంటూ డాక్టర్ క్రాంతికార్ ఆలోచన చేయకుండా పేల్చినవి యధాతథంగా:**

- **నిబ్బరంగా ఆలోచించండి!! లోతుగా పరిశీలించండి!!! వివేకంతో ఆచరించండి !!!!**

☑ డా॥ క్రాంతికార్‌గారు పై విధంగా వ్రాశారుగాని, ఆయన మాత్రం వివేకంతో ఎందుకు ఆలోచించలేకపోయారు?

క్రింది ఖుర్ఆన్ వాక్యాలను గమనించండి :

**"భూమిలో ఎన్నో నిదర్శనాలు ఉన్నాయి, స్వయంగా మీలోనూ ఉన్నాయి. మీరు ఆలోచించరా?"** (ఖుర్ఆన్ 51:20-21)

**"మీరు నా వాక్యాలను శాస్త్రీయ పరిశీలన చేయకుండానే ఇట్టే తిరస్కరించారు .... "** (ఖుర్ఆన్ 27:84)

నిజమైన వివేకాన్ని, ఆలోచనను ఖుర్ఆన్ గ్రంథం 1400 సంవత్సరాల క్రితమే ముస్లిములలో కలుగజేయబట్టే, ఆధునిక సైన్స్‌కి ముస్లిములు పునాదులు వేసి, ఎన్నో సైన్స్ విభాగాలకి ఆనాటి ముస్లిములు పితామహులయ్యారు. సైంటిస్ట్‌లకి ఆదర్శప్రాయులయ్యారు.

- **ముస్లింల్లో పేదరికానికి, వెనుకబాటుతనానికీ, అణిచివేతలకు, పీడనలకు, దోపిడీకి మూలకారణాలేమిటి?**

☑ 'తెలంగాణా'ను ప్రత్యేక రాష్ట్రంగా కావాలని కోరుకునే వారు, తమ వెనుకబాటుతనానికి కారణం ఆంధ్రా నాయకులు అంటున్నారు. అయితే అది నిజమా? కాదా? అని మేమిక్కడ చర్చించదలచు కోలేదు. కాని వెనుకబాటుతనానికి **నాయకులు** కారణమని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

ధనవంతుల, భూస్వాముల అణిచివేతలకు పీడనలకు వ్యతిరేకంగానే కదా, మీరు నక్సలిజంపై అభిమానాన్ని పెంచుకున్నారు. ఇక్కడ మేము నక్సలిజం గురించి కూడా చర్చించదలచు కోలేదు. కాని అణిచివేతలకు, పీడనలకు **ధనవంతులు, భూస్వాములు** కారణమని మీబోటి మేధావుల అభిప్రాయం. దానిని చెప్పడమే మా ఉద్దేశ్యం.

నిజాయితీగా కష్టపడి పనిచేసేవారు తప్ప, ప్రతీ ఒక్కడూ దోపిడీకి పాల్పడుతూనే ఉన్నాడు. **ఇస్లాం నిజాయితీగా కష్టపడి పనిచేయమని నిజాయితీగా వ్యాపారం చేయమని ఆదేశిస్తుంది.**

ప్రపంచంలో దాదాపు 150 కోట్ల మంది ముస్లిములున్నారు. మన దేశంలో అన్ని మతధర్మాలవారు అంతా కలిసి దాదాపు 100 కోట్లున్నారు. మన భారతదేశం లౌకిక, ప్రజాస్వామ్య దేశం. ఇది ఇస్లామీయ ధర్మం ప్రకారం పాలించే ప్రభుత్వం కాదు. **అయినప్పటికీ మనదేశంలో వెనుకబాటుతనం ఎందుకుంది?**

మన భారతదేశంలో సుప్రీమ్ కోర్టు ఉంది. ఈ కోర్టు తీర్పును ఏ మతధర్మం వారైనా సరే, ఈ దేశంలో ఉల్లంఘించడానికి గాని, మన రాజ్యాంగాన్ని ఉల్లంఘించడానికి గాని, ఎవరికీ హక్కులేదు.

మన దేశంలో ఎన్నో ప్రాంతాలు వెనుకబడి ఉన్నాయి, మన రాష్ట్రంలో ఎన్నో వర్గాల వారు తమను వెనుకబడిన తరగతిలోనూ, ఎస్.సి.,

ఎస్.టి. జాబితాలో చేర్చమంటున్నారంటే, దీనికి కారణం ఇస్లామా?

లేక మన భారతదేశం లౌకిక దేశం కావడం వలనా?

లేక మన భారతదేశం ప్రజాస్వామ్య దేశం అయినందు వలనా?

క్రాంతికార్ గారు ప్రశ్నించిన వాటికి కారకులు - **నాయకులు, భూస్వాములు, ధనవంతులు.** మరి వీటన్నింటిని 'ఇస్లాం'కి అంటగట్టారెందుకు?

- **ప్రపంచంతోపాటు అభివృద్ధి చెందలేకపోవటానికీ, వారితో కలిసిపోలేక పోవటానికీ, వారితో సహజీవనం సాగించలేక పోవడానికి కారణమేమిటి?**

☑ ఈ విషయం డా॥ క్రాంతికార్ గారికి తెలియాలంటే, ఆయన మనుషుల మధ్యన ఉండాలి. మనుష్యులతో సహజీవనం చేయాలి. అప్పుడు తెలుస్తుంది. అంతేగాని ఆయన అడవులలో అజ్ఞాత వాసంలో ఉంటే ఆయనకెలా తెలుస్తుంది.

డా॥ క్రాంతికార్‌గారు నిబ్బరంగా ఎందుకు ఆలోచించలేక పోతున్నారో!

**'జనజీవన స్రవంతి'లో కలవమని ప్రభుత్వాలు ఎవరిని కోరుతున్నాయో?**

ముస్లిములను మాత్రం కాదు. అంటే దానర్థం ఏమిటి? ముస్లిములు అందరితో కలిసిమెలిసి ఉన్నారనే కదా! మీలాంటి మేధావులు ముస్లిములను మిగతా ప్రజలనుండి విడదీయాలని కుట్రలు పన్నకుండా ఉన్నంత కాలం, వారు కలిసే ఉంటారు. మన దేశంలో ముస్లిముల కొరకు ప్రత్యేక జిల్లాలు లేవని మీకు తెలియదా?

ముస్లిములకు ఈ దేశంలో **పూర్తి స్వేచ్ఛ ఉంది. వారిపై మతం తరపున ఎవరూ అజమాయిషీ చేయడం లేదు.** రోజూ 5 సార్లు నమాజ్ చేయమని 'ఇస్లాం' ఆదేశించింది. కాని అందరూ చేయడం లేదే? నమాజ్ చేయడం లేదని, మస్జిద్‌కు రావడం లేదని, వారిపై ఏమైనా చర్యలు తీసుకున్నారా? ఇస్లాంలో బలవంతం లేదు.

**'ఇస్లాం' వడ్డీ వ్యాపారం చేయవద్దంది. అబద్ధాలు మాట్లాడవద్దంది. నిజాయితీగా బ్రతకమంది. ఇవన్నీ ముస్లిములందరూ చేయడం లేదు. కొద్దిమందే ఈ ఆదేశాలను పాటిస్తున్నారు.**

'ఇస్లాం' ఆదేశాలను వేటిని పాటించని వారు చేసే పనులను 'ఇస్లాం'కి ఆపాదించడానికి మీలాంటి మేధావులకు సిగ్గుగా అనిపించలేదా?

ప్రాజెక్టులు కట్టడానికి అడ్డుపడేవారు, ప్రపంచ అభివృద్ధికి అడ్డుపడే వారు ఎవరని అడిగితే, ప్రజలంతా ముక్త కంఠంతో ఒక రాజకీయ పార్టీవారి పేరు చెబుతారు. ప్రపంచంతోపాటు అభివృద్ధి చెందలేక పోయినవారు మీరు మరియు మీరు అభిమానించే పార్టీవారు.

ముస్లిములు మాత్రం కాదు.

- **ముస్లిముల జీవితాల్లో మార్పు ఉండదా? సుఖాలకోసం, సౌకర్యాల కోసం మార్పును కోరుకోవటం తప్పా?**

☑ మిమ్మల్ని పరిచయం చేసిన 'సామాన్యుడు - రామారావు (ఖమ్మం)' గారు ఇలా వర్ణించారు.

"ఒక ఉద్యమకారుడిగానో, విప్లవకారుడిగానో (క్రాంతికార్) గారు కన్పించడు. ఒక పాతబ్రేకులు లేని సైకిల్ మీద 'ఉద్యమ వీధుల్లో' తిరిగే సాధారణ కార్యకర్తలా కనిపిస్తాడు."

పరిచయాన్ని పూర్తి చేస్తూ, ఇలా వ్రాశారు :

"అదే బ్రేకుల్లేని సైకిల్. అదే బక్కటి స్వరూపం, అదే సామాన్యత"

అంటే, క్రాంతికార్‌గారి జీవితంలో మార్పు రాలేదు కదా! సుఖాల కోసం, సౌకర్యాల కోసం మీరు కోరుకోలేదా? ఒకవేళ అలా కోరుకోవడం తప్పని మీ పార్టీవారు చెప్పడం వల్లనే, అదే బ్రేకుల్లేని సైకిల్‌ని వాడుతున్నారా సార్?

సైకిల్‌కు ఖచ్చితంగా బ్రేకులుండాలి. మీ క్షేమం కోసమే కాదు సుమా! బ్రేకుల్లేక సైకిల్‌పై మీ కంట్రోల్ పోయి ఎదుటివారికి హానికలిగించే ప్రమాదముంది. ఎదుటివారికి హాని కలిగించాలనే ఉద్దేశ్యంతోనే బ్రేకులు తీసివేశారా ఏమిటి?

ఎలాంటి వాడైనా సరే, కాస్తంత ఆలోచనను కలిగి ఉన్నవాడు ఎవరైనా సరే బ్రేకులు వేయించుకుంటాడు.

హెూమియో వైద్యులైన మీకు ఆ కాస్త ఆలోచన కూడా రాకపోవడం చూస్తుంటే మీపై జాలి కలుగుతుంది.

- **మనిషి ఆవిష్కరించిన విజ్ఞానశాస్త్ర ఫలాలను ముస్లిములు ఆశించ కూడదా?**

☑ బహుశా క్రాంతికార్‌గారు కళ్ళజోడు పెట్టుకోకుండా ప్రపంచాన్ని చూసినప్పుడు, దృష్టి లోపంతో పై అభిప్రాయాన్ని వ్యక్తం చేసి ఉంటారు. ముస్లిమ్‌ల ఇళ్ళల్లో సీలింగ్ ఫ్యాన్లు ఉన్నాయి. కొందరింటిలో ఎ.సి.లు కూడా ఉన్నాయి. సైకిళ్ళు, స్కూటర్లు, కార్లు రైళ్లు, విమానాలను కూడా ముస్లిములు నడుపుతున్నారు.

సర్జికల్ ఇన్‌స్ట్రుమెంట్స్‌ను ఎవరు కనుగొన్నారో, తొలి సర్జరీలను ఎవరు చేశారో, హెూమియో వైద్యులైన క్రాంతికార్‌గారికి తెలియకపోవచ్చు. ఎందుకంటే జనజీవన స్రవంతిలో లేకుండా, నిబ్బరంగా కూడా ఆలోచించ లేకపోతున్నారు కాబట్టి.

ఆవేశంతో ఆలోచించని వారిలో వివేకం దూరమై పోతుంది.

ముస్లిములు ఆవిష్కరించిన ఎన్నో విజ్ఞానశాస్త్ర ఫలాలను ఎందరో ఉపయోగించు కున్నారు.

- **నిరంకుశాధినేతలు, సుల్తానులు, షేక్‌లు, ఇంధన వ్యాపారులు మానవుడు కనిపెట్టిన ఆధునిక సౌకర్యాలైన ఫోన్, టెలికాన్ఫరెన్స్, కంప్యూటర్ ఇంటర్‌నెట్‌లాంటి వాటిని వాడుకోవడం లేదా?**

☑ ఈ సందేహం తమరికెందుకొచ్చిందో?

ఈ వ్యాసాన్ని వ్రాసేవారి దగ్గర కంప్యూటర్లూ ఉన్నాయి. ఇంటర్‌నెట్ కనెక్షన్లూ ఉన్నాయి. లాండ్‌లైన్స్ మరియు సెల్‌ఫోన్లు కూడా ఉన్నాయి. మేము సుల్తానులం కాదు, షేక్‌లం కాదు, ఇంధన వ్యాపారులం అంతకంటే కాదు. మీ వలే నిరంకుశాధినేతలు అంతకంటే కాదు. మీ ప్రశ్నకు అసలు అర్థమే లేదు.

- **ఇస్లాంలో శాంతి-సహనాలు లేవా? ముస్లింలెప్పుడూ ఇతర ప్రపంచంతో యుద్ధాలనే చేస్తుంటారా?**

☑ శాంతి-సహనాలే గనుక ఇస్లాంలో లేకపోతే, మీరు మేధావులుగా భావించి, ఎవరి వ్యాసాలయితే సేకరించి మీరు పుస్తకంగా ప్రచురించారో, వారు ఆ విధంగా వ్యాసాలు వ్రాయగలిగి ఉండేవారా?

ఇస్లాం అంటేనే శాంతి. సహనంతో బ్రతకడమే జిహాద్. ఇస్లాంలో పవిత్ర యుద్ధమనేది లేనే లేదు. మీ ప్రశ్నలోని ఇతర ప్రపంచమంటే?

మీకు లాగ ముస్లిములు అడవులలో లేరు కదా! ప్రపంచమంతటా ఉన్నారు. మీరు కనీసం 10వ తరగతి వరకైనా చదువుకున్నారని అనుకుంటున్నాము. యుద్ధాల గురించి చరిత్ర పుస్తకాలలో వివరాలు ఉంటాయి. అందులో వెతికితే ఎన్నో అసత్యాలతో పాటు వాటిలో కొన్నయినా నిజాలు దొరుకుతాయి.

వియత్నాంపై యుద్ధం చేసినవారు ముస్లిములు కాదు. కాని మన భారతదేశంలో బ్రిటిష్ వారి దుర్మార్గాన్ని ఎదిరించిన వారిలో ముస్లిములున్నారు. మొదటి, రెండవ ప్రపంచ యుద్ధాలకు కారకులెవరు? ముస్లిములా? మనదేశంలో ఎందరో రాజులు, ఎన్నో సార్లు ఒకరిపైనొకరు యుద్ధాలు చేసుకున్నారు.

గత 20 సంవత్సరాలలో, ఏఏ దేశాలు యుద్ధాలు చేశాయి? ఆ యుద్ధాలకు కారకులెవరు? చిన్న దేశాల ఆస్తులను కబళించడానికి అమెరికా, రష్యాలు గోతికాడ గుంటనక్కల్లా ఎదురుచూస్తుంటాయి. 'సోవియట్'లో కమ్యూనిజం యొక్క పునాదులు కదలడంతో ఆ దేశం కొన్ని ముక్కలై పోయింది.

**టెర్రరిజం వంకతో ఆశియాలోని చమురును దొంగిలించాలనుకున్న దొంగలే యుద్ధాలు చేస్తున్నారు.** యుద్ధాలను ప్రజలు కోరుకోరు. నాయకుల వల్లనే యుద్ధాలు జరుగుతాయి.

**మతోన్మాదానికి, మతోగ్రవాదానికి, టెర్రరిజానికి, పాసిజానికి, ముస్లింలే ఎందుకు ఎక్కువగా బలవుతున్నారు?**

☑ 60 లక్షల మంది యూదులను ఊచకోత కోసినవాడు హిట్లర్. 10 లక్షలమందికి పైగా ఆఫ్ఘన్లను రష్యా ప్రభుత్వం చంపితే, 12 లక్షల మందికి పైగా ఇరాఖీయులను అమెరికా పొట్టన పెట్టుకుంది. బలి చేసే మేధావులకి, బలి చేసేవారికి సహకరించే మీలాంటి మేధావులకు తెలియదా? ఇలా ఎందుకు జరుగుతుందో.

**ముస్లింలో లోపాలు ఏమిటి, వాటిని సవరించుకోలేరా? ఆత్మ విమర్శ చేసుకోలేరా..? సద్విమర్శలు స్వీకరించలేరా..?**

☑ ఏ ముస్లిములోనైనా ఒకవేళ లోపముంటే, ఖుర్ఆన్ చదివితే ఆ లోపం అతనికి స్పష్టంగా తెలుస్తుంది. ఆ లోపాన్ని సవరించుకోవడానికి మార్గాన్ని కూడా ఖుర్ఆన్ గ్రంథమే చూపిస్తుంది. 'సద్విమర్శ' గురించి మాట్లాడటం క్రాంతికార్ వంటి ఎర్ర మేధావులకు తగునా? నీచ భావజాలంతో వ్రాసిన వ్యాసాలతో కూడిన ఆయన పుస్తకంపై మేమందించే సద్విమర్శలను ఆయన స్వీకరించగలరా?

**ప్రపంచ సంస్కృతి మారుతుంటే ... ముస్లిం సంస్కృతిని మార్చుకోవలసిన అవసరం లేదా?**

☑ మంచి సంస్కృతి కాని వాటిలో మార్పు కావాలి. సంస్కృతిలో లోపం లేనప్పుడు మార్పు అవసరం లేదు.

1. మద్యపానాన్ని పూర్తిగా నిషేధించిన ధర్మం - ఇస్లాం. నిజమైన ఏ ముస్లిమ్ కూడా త్రాగడు. ప్రపంచంలో ఎక్కువ శాతం మందులో మునిగి తేలే సంస్కృతికి మారిపోతుందని, ఇస్లాం సంస్కృతిని మార్చుకోవాలా?
2. వడ్డీ మహాపాపమని ఇస్లాం చెబుతుంది. శక్తిమేరకు తోటివానికి సాయం చేయమని ఇస్లాం చెబుతుంది. ఈ వడ్డీవలనే కొన్ని దేశాలు బాగా బలిసాయి. రోడ్డు ప్రక్కనుండే చిరు వ్యాపారులు, ఈ వడ్డీ వలన ఎలా నాశనమౌతున్నారో మీకు తెలియదా? ఇప్పుడు చెప్పండి - మారవలసింది ఎవరి సంస్కృతి? ముస్లిం సంస్కృతి మారనవసరం లేదు. ఇది ఆదర్శప్రాయం.
3. ఇస్లాం ప్రకారం ఒక పురుషుడు మరియు ఒక స్త్రీ మధ్య వివాహ సంబంధముంటుంది. పెళ్లయిన స్త్రీ, పురుషుల మధ్య అక్రమ సంబంధాలు గాని, పెళ్లికి ముందు శారీరక సంబంధాలు గాని ఇస్లాంలో నిషేధం. ఇది ముస్లిం సంస్కృతి. మరి మారుతున్న ప్రపంచ సంస్కృతిలో మగవాడు మగవాన్ని, ఆడది ఆడదాన్ని పెళ్లి చేసుకుంటున్నారు. ఈ నీచ సంస్కృతికి మారాలా? లేక ఉత్తమ సంస్కృతి యైన ముస్లిం సంస్కృతిలో మార్పు అవసరమా?
4. రోజూ 5 సార్లు నమాజ్ చేసేటప్పుడు, కూలివాడు, ధనవంతుడనే బేధం లేకుండా ప్రక్కప్రక్కన ఇద్దరూ భుజాలు తగిలేటట్లు నిలుచుని ప్రార్థన చేసుకునే సమసమానత్వ సంస్కృతి ముస్లిములది.

*సరోజినీ నాయుడు ఏమన్నారో చదవండి :*

**ప్రజాస్వామిక వ్యవస్థను ఆదేశించడమేగాక ఆచరించి చూపిన తొలి ధర్మం ఇస్లామే. మస్జిద్‌లోని అజాన్ పలకగానే ఆరాధకులందరూ వచ్చి చేరునపుడు, రైతూ, రాజూ పక్కపక్కనే అల్లాహ్ సమక్షంలో మోకరిల్లి, 'అల్లాహ్‌యే గొప్పవాడు' అని పక్రటించినపుడు ఇస్లాంలోని ప్రజాస్వామిక విధానం ప్రజల్లో రోజుకు 5 సార్లు మూర్తీభవించి దర్శనమిస్తుంది. ఇస్లాం ప్రబోధించే ఈ అబేధ్యమైన ఏకతను చూసి అనేకమార్లు పభ్రావితురాలి నయ్యాను.**

*తమిళనాడు తొలి కాంగ్రేసేతర ముఖ్యమంత్రి అన్నాదురై గారు ఏమన్నారో చదవండి :*

**ఇతర మతాలలో మనిషిని భగవంతునితో సరిసమానమని పోల్చి చెప్పిన కారణం వల్లనే - నాలాంటివారు ఎందరో విరోధ భావంతో మతం నుంచే తొలగిపోయారు. ఇస్లాం మతంలో నన్ను ఆకట్టుకున్న మరో విషయం ఏమిటంటే - అది మనిషిని మానవునిగా మార్చటం. మనిషిని పరిపూర్ణమయిన మనవునిగా చెయ్యగలిగింది ఇస్లాం మార్గం ఒక్కటే. మనిషి తన శక్తి సామర్థ్యాలతో, భగవంతుడు మనిషికై నిర్ణయించిన అత్యున్నత లక్ష్యాన్ని సాధించి, ఆదర్శ శిఖరాలకు చేరుకోగల శక్తి మనిషిని ఎంతో ఉన్నతుని చేయగల, ఉత్తమమయిన నైతిక బలం ఇస్లాం మార్గంలో మటుకే ఉంది.**

5. "కూలివాని చెమట ఆరకముందే అతని కూలీ అతనికిచ్చి వేయండి" అని చెబుతున్న ఇస్లాం సంస్కృతి కంటే గొప్ప సంస్కృతి మీరు అభిమానించే ఉన్మాదపు దేశాలలో ఉంటుందా? మరి మారవలసిన సంస్కృతి ఎవరిది?

**ప్రపంచ సంస్కృతి ఖచ్చితంగా మారాలి! తప్పదు!**

**ఇస్లాం సంస్కృతి వైపుకే మరలాలి.**

6. డబ్బున్నవాడిని కొల్లగొట్టి, పేదవానికి సాయం అందించే సంస్కృతిని మీరిష్టపడవచ్చు. సినిమాలలో చూడడానికి ఇది చాలా బాగుంటుంది. కాని ఇది సమాజంలో అశాంతిని రేకెత్తిస్తుంది. ధనవంతుల నుండి జకాత్ అనే పన్నును వసూలు చేసి పేదవారి కందించడం - ఇస్లాం సంస్కృతి. దీనిని ధనవంతులు కూడా వ్యతిరేకించరు. ఉత్తమ సంస్కృతి ఇస్లాం సంస్కృతి. కాబట్టి ఈ సంస్కృతిలో మార్పు యొక్క అవసరం లేదు. ఇస్లాం సంస్కృతి గురించి తెలుసుకుని, ముస్లిమ్‌లతో సహా ప్రపంచ ప్రజలు ఈ సంస్కృతిని అలవరచుకుంటే ఉన్మాదాల, ఉగ్రవాదాల అవసరంగాని, అడవులలో అజ్ఞాతవాసాలు చేయవలసిన అవసరంగాని ఉండదు.

7. ఇస్లాం ధర్మం స్త్రీకి ఆస్తిహక్కును కల్పించేనాటికి, అంటే 1400 సంవత్సరాల క్రితం, ప్రపంచ సంస్కృతి ఎలాంటి దురవస్థలో ఉందో తెలుసుకోండి. ఇస్లాంలో ఇల్లాలికి ఎంత విలువుందో, తల్లి దండ్రుల విషయంలో ఎలాంటి బాధ్యత ఉందో, మా 'శాంతిబాట' పత్రికలో చదవండి. విషయాలు తెలుసుకుని, కనువిప్పు కలిగితే ఈ సంస్కృతిలో మార్పు అవసరం లేదని స్వయంగా మీరే తెలుసుకుంటారు.

8. పూర్తి నగ్నంగా తిరగడం కూడా కొన్ని దేశాలలో తప్పు కాదు. ఇక అర్ధ నగ్న ప్రదర్శనలైతే సర్వసామాన్యమై పోయాయి. స్త్రీల అర్ధ నగ్న ప్రదర్శనలతో కూడిన విష సంస్కృతిలోనే మార్పు రావాలి. ఆ సంస్కృతి వైపు మారవలసిన అవసరం సభ్య సమాజానికి లేదు. శరీరాన్ని బట్టలతో కప్పుకొనే ఇస్లాం సంస్కృతి మంచి సంస్కృతి కాదా?

**ఇంకా ఎన్నో విషయాలున్నాయి. ఇస్లాం యొక్క ఈ ఉత్తమ సంస్కృతి గురించి ఒకేసారి తెలుసుకుంటే, మీరు ఈ వయస్సులో తట్టు కోలేరేమో. పశ్చాత్తాపంతో మీ గుండె ఆగిపోవచ్చు. ఇప్పటికైనా నిజాన్ని గ్రహించండి. చదవడానికి, అధ్యయనం చేయడానికి మధ్య చాలా వ్యత్యాసం ఉంది. ఆ తేడా ఏమిటో ముందు తెలుసుకోండి.**

ముస్లిములను చూసి 'ఇస్లాం'ను అంచనా వేయడం గాని,

ప్రాక్టీస్ చేసే డాక్టర్‌ను చూసి 'మెడిసిన్' సబ్జక్టును అంచనా వేయడం గాని మూర్ఖత్వం అనిపించుకుంటుంది.

**'నిప్పుల మీద నడవడానికి'**, 'ఇస్లాం' ధర్మానికి ఎటువంటి సంబంధమూ లేదు. అటువంటి మూఢ విశ్వాసాలకు ఇస్లాం ధర్మంలో స్థానం లేదు. ఉస్మానియా ప్రొఫెసర్ రఘమన్న తోక ముడుచుకుని పోయేటట్లు మీరు చేసారని, మీ గురించి సామాన్యుడు 'రామారావు' గారు వ్రాశారు. ఇస్లాం ధర్మం గురించి వాస్తవాలను తెలుసుకుంటే మీరు మీ తోక కత్తిరించుకుంటారేమో! తోక కత్తిరించుకుని ఈ వయస్సులో ఎక్కడికి పారిపోగలరు.

వాస్తుకు, జ్యోతిష్యాలకు ఇస్లాం చోటులేదు. **జ్యోతిష్యాన్ని పాపకార్యంగా 'ఇస్లాం' ప్రకటించింది.**

మూర్ఖంగా ఆలోచించకుండా, నిజమైన హేతువాదిలా ఆలోచించి ఉంటే, మీలాంటి వారు అడవులకు వెళ్ళవలసిన అవసరం ఉండేది కాదు. సంఘాన్ని సంస్కరించాలంటే సంఘంలోనే ఉండాలి. మనుష్యుల మనస్సులలో పరివర్తన తీసుకురావాలి. అప్పుడే మూఢాచారాలకు ముగింపు వస్తుంది.

వేల సంవత్సరాల నుండి వస్తున్న ఎన్నో దురాచారాలను, కేవలం 23 సంవత్సరాల కాలంలో ముహమ్మద్(స)వారు రూపుమాపారు. ప్రజల మనస్సులలో పరివర్తన వచ్చేలా చేశారాయన.

**బుల్లెట్లతో, అజ్ఞాతవాసాలతో ఏమీ సాధించలేరు, అజ్ఞానాన్ని తప్ప.**

సత్యాన్ని తెలుసుకోకుండా ఎవడో చెప్పిన అసత్యాన్నే నిజమని నమ్మడాన్నే **'మూఢ విశ్వాసం'** అంటారు. అటువంటి మూఢ విశ్వాసమే మీలో ఉంది. మీలాంటి వారిలో మూఢవిశ్వాసాలు తొలగించడానికే ఈ పత్రిక నడుపుతున్నాము.

మేము మానవులం. రంకెలు వేయం. ఇస్లాం ఆదేశం ప్రకారం సౌమ్యంగా మీలాంటివారికి నిజాన్ని తెలియజేస్తాం.

**ఆధునిక ప్రపంచంతో ముస్లిములు పోటీ పడాల్సిన అవసరం లేదా?** అని ప్రశ్నిస్తున్న మీ వ్రాతలను చూశాక మీమీద అమితంగా జాలివేసింది. ఆలోచన చేయకుండా, ఆవేశంతో వ్రాస్తున్న మీరు, ఓ పత్రికకు నిర్వహణ బాధ్యతలను గతంలో చేపట్టారంటే, మీ వ్రాతలను చదివి ప్రజలెంత నవ్వుకుని ఉంటారో!

''**FOUNDATION FOR SCIENCE, RATIONALISM AND SECULARISM**'' అని ఖమ్మంలో స్థాపించినట్లు పుస్తకాన్ని చదివితే తెలిసింది. నిజంగా వీటి అర్థాలు తెలుసా మీకు?

క్రాంతికార్‌గారు వ్రాసిన కొన్ని వ్రాతలను పాఠకులకు తెలియ జేస్తున్నాము.

> **"ఏ మతాన్ని గురించైనా తెలుసుకునే స్వేచ్ఛ ప్రతీ పౌరుడికీ ఉంది! మత విశ్వాసాన్ని కలిగి వుండే హక్కు ఎలా వుందో, ఏ మత విశ్వాసం లేకుండా వుండే హక్కు కూడా ప్రతీ ఒక్కరికీ వుంది. మత ప్రచారం చేసుకునే హక్కు ఎలా వుందో, మత విమర్శన, విశ్లేషించే హక్కు కూడా ప్రతి ఒక్కరికీ వుంది."**

నిజమే! మతం గురించి తెలుసుకునే హక్కు ప్రతీ పౌరుడికీ ఉంది. జలుబు తగ్గడానికి సిరప్ కొందామని, మెడికల్ షాపుకి కాకుండా, బ్రాందీ షాపుకెళితే కావాల్సిన 'సిరప్' దొరుకుతుందా? ఏ మతం గురించైనా తెలుసుకోవాలంటే, ఆ మతధర్మం గురించి జ్ఞానం కల్గినవారి దగ్గరి కెళ్లాలి. క్రాంతికార్ గారి దగ్గరికెళితే ఏం తెలుస్తుంది? వెళ్లినవాడి చేతిని కోసి, ఆ రక్తంతో అతడి నుదుటున రక్త తిలకం పెట్టి, జై విప్లవం! అని అంటాడాయన.

మీరు హెూమియో డాక్టర్ కదా అని, ఎవరికైనా ఆపరేషన్ (సర్జరీ) చేసే హక్కు మీకు ఉందా? మీరు డాక్టర్ కదా అని, అమాయకులు నమ్మి మీ దగ్గరికొస్తే ఆ పనిచేస్తారా?

మత విమర్శ చేసే హక్కు ఉంది. కాని ఆ మతం గురించి తెలుసు కోకుండా విమర్శించే నైతిక హక్కు మీకు ఉందా?

ఎంతమాత్రం లేదు.

భూస్వాముల అణిచివేతకు గురియైనవాడు, ప్రతీకారంతో నక్సలైట్ కావచ్చు. గుజరాత్ అల్లర్లలో సర్వం కోల్పోయినవాడు ప్రతీకారంతో నక్సలైట్‌గానో / తీవ్రవాదిగానో కావచ్చు. వీటికీ ఇస్లాంకి సంబంధం లేదు కదా! "జై హేతువాదం! జై కమ్యూనిజం!!" అని నినాదాలు చేస్తూ ఎవరైనా హత్యలు చేస్తే, హేతువాదులు, కమ్యూనిస్టు లందరూ హంతకులై పోతారా?

**"ప్రపంచ వ్యాప్తంగా ఉగ్రవాద సంఘటనలు"** అనే హెడ్డింగ్‌తో 13 దాడులకు సంబంధించి వివరాలను ఇచ్చారు. ఈ దాడులన్నీ 1948 తరువాత జరిగినవి. ఈ మేధావిగారు అందించిన వివరాల ప్రకారం ఈ దాడుల వలన మరణించిన వారి సంఖ్య 1900 మాత్రమే.

ఈ సందర్భంగా, మిమ్మల్ని కొన్ని ప్రశ్నలు అడుగుతున్నాము.

మీ బుర్ర ఇప్పటికే బ్లాంక్ అయిపోయి ఉంటుంది. అందుకే జవాబులను కూడా మేమే అందిస్తున్నాము.

ప్ర: **హిట్లర్ ఎవరు? ఎంతమందిని చంపించాడు?**

జ: ఓ క్రైస్తవుడు, 60 లక్షలకి పైగా

ప్ర: **బుష్ ఎవరు? ఎంతమందిని చంపించాడు?**

జ: ఓ క్రైస్తవుడు, కేవలం ఇరాఖ్‌లోనే 12 లక్షలకు పైగా. ఈయనగారి హత్యల ఖాతాలో ఇంకా చాలామందే ఉంటారు.

ప్ర: **రష్యా ప్రభుత్వం ఎంతమంది ఆఫ్ఘన్లను పొట్టన పెట్టుకుంది?**

జ: రష్యన్లు కమ్యూనిస్టులు, 10 లక్షలకు పైగా ముస్లిములను చంపారు.

ప్ర: **జలియన్‌వాలాబాగ్‌లో వేలాదిమంది భారతీయుల్ని చంపినదెవరు?**

జ: బ్రిటిష్ క్రైస్తవులు.

**రష్యాలోని మీ కమ్యూనిస్ట్ పాలనలో లేదా ఆ పాలనకు ముందరి కాలంలోనూ, ఎన్ని లక్షలమందిని చంపి ఉంటారు?**

పై విషయాలను దృష్టిలో పెట్టుకుని, అవి వాస్తవాలు అయి నప్పటికినీ, 'క్రైస్తవులను, కమ్యూనిస్టులను' తీవ్రవాదులని మేము ఎప్పుడూ చెప్పలేదు కదా! **వాస్తవానికి ఏ మత ధర్మానికి, తీవ్రవాదానికి సంబంధం లేదనే మేము ప్రకటిస్తున్నాము. అది మా ప్రగాఢ విశ్వాసం.**

మేమెప్పుడూ ముస్లిమేతరుల గురించి నీచమైన మాటలను మాట్లాడలేదు.

మరి ముస్లిములనే 'తీవ్రవాదులు'గా వర్ణించడానికి, మీ మనస్సు ఎలా ఒప్పుకుంది? ఇలా వర్ణించి ముస్లిముల హృదయాలపై దాడిచేసే మీలాంటి వారే **ప్రథమశ్రేణి తీవ్రవాదులు**. కాదంటారా?

సెప్టెంబర్ 11, 2001 "వేలాదిమందిని హతమార్చారు" అని వ్రాశారు.

మీకు అమెరికాపై ఉన్న ప్రేమను పై స్టేట్‌మెంట్ తెలియజేస్తుంది. డా॥ క్రాంతికుమార్ గారూ, విమానంతో భవనాలను ఢీకొడితే వేలమంది చనిపోతారా? 'ఒసామాబిన్ లాడెన్' బాధ్యుడని **భావిస్తున్నారని** వ్రాశారు. అంటే ఆ విషయం నిరూపితం కాలేదని మీకూ తెలుసు. అదంతా భావనే! మరి అతని ఫొటోను మీ పుస్తకం కవర్‌పైన ఎలా ముద్రించారు?

1948 తరువాత జరిగిన దాడుల గురించి మాత్రమే వివరించారు. మరి 1948కి ముందు దాడులు జరగలేదా? 'తీవ్రవాదం' అనే పదం ఎప్పటినుండి వినబడుతుందో తెలుసా? 1948కి ముందు ఎన్ని దాడులు జరిగాయో తెలుసా? 1948కి ముందు ఎన్నో తీవ్రవాద దాడులు జరిగాయి. అందులో ఏ ఒక్కటీ కూడా ఏ ముస్లిమ్ చేయలేదు. (శాంతిబాట 2,3,4 సంచికలు చూడండి).

ఇస్లాం గురించి ప్రపంచానికి తెలిసిన దగ్గర నుండి, ఆ తరువాత 1300 సంవత్సరాల పాటు ఏ ముస్లిమ్ కూడా ఇటువంటి దాడి చేయనప్పుడు, ముస్లిములను తీవ్రవాదులని, ఇస్లాం ధర్మం తీవ్రవాదాన్ని ప్రోత్సహిస్తుందని ఎలా చెప్పగలిగారు?

మీలోని ఆవేశం, మీలోని ఆలోచనను చంపివేసింది. ఈ విషయం చాలా స్పష్టంగా తెలుస్తుంది. ఇక మీలో మిగిలి ఉన్నది కేవలం ఉన్మాదమే!

'టెర్రరిజం' అనే ప్రత్యేక శీర్షికతో 'శాంతిబాట'లో వ్యాసాలు ప్రచురించ బడ్డాయి. అవి చదివి, ఇప్పటికైనా వాస్తవాన్ని తెలుసుకోండి.

ఆగష్టు 2009 'శాంతిబాట' మొదటి సంచికలో వివరించాము - 150 కోట్ల ముస్లిములలో కనీసం **0.1** శాతం కూడా తీవ్రవాదులు కానప్పుడు, ఇస్లాం ధర్మాన్ని మరియు ముస్లిములను తీవ్రవాదులని చెబుతున్నవారే **నిజమైన తీవ్రవాదులు.**

కాలంతోపాటు మీ సంస్కృతిని కూడా మార్చుకుంటున్నారని మీ వ్రాతలు తెలియజేస్తున్నాయి. మార్చుకున్న మీ సంస్కృతి ప్రకారం **'ఆలోచించ లేనివాడినే హేతువాది'** అంటున్నారా?

## మతం అంటే ఏమిటి?

మీరు భోజనం చేసేటప్పుడు, ఒకరోజు కుడిచేత్తోనూ, మరో రోజు ఎడమ చేత్తోనూ తింటారా? ఒకొక్కసారి కాళ్ళతో కూడా తింటారా?

మీరెప్పుడూ ఒక చేత్తోనే తింటారని మేము మాత్రం నమ్ముతున్నాము. మీ శరీరాన్ని కప్పుకోవడానికి, మీరు చొక్కా వేసుకుంటారు ఫ్యాంట్ వేసుకుంటారు. అంటే ఇలా మీరు ఓ విధానాన్ని పాటిస్తున్నారు.

ఇలాంటి ఓ జీవనవిధానాన్నే మతం అంటారు. 'నాకు మతం లేదు' అని ఎవరైనా అన్నారంటే, అతనికి ఓ విధానం అంటూ ఏదీ లేదని అనుకోవాలి. అతని మానసిక ఆరోగ్యం గురించి ఆలోచించాలి.

మనిషి ఏ ప్రాంతంలో పుట్టినా, అతను ఆచరించ గలిగిన ఉత్తమ జీవనవిధానాన్నే ఇస్లాం తెలియజేస్తుంది.

మీరు కువిమర్శలు చేసినా సరే, మీ పుస్తకంపై సద్విమర్శ చేసి, మేధావుల అజ్ఞానపు గుట్టును ఇన్షాఅల్లాహ్ 'శాంతిబాట' బయట పెడుతుంది.

నిజాలను జీర్ణించుకునే శక్తి మీ ఎర్రదనానికి ఏ మాత్రం ఉన్నా, నిర్భయంగా చదవండి.

**ఓ నక్సలైట్ మేధావి ఈ మధ్యనే పేపర్ స్టేట్‌మెంటిచ్చారు. ఆమెను మేధావి అని ఎందుకంటున్నామంటే, క్రాంతికార్‌గారి నిర్వచనం ప్రకారం, మావోయిస్టుగా ఉంటూనే, మావోయిస్టు ఉద్యమాన్ని తిడుతున్నారు కాబట్టి.**

**ఓ మహిళా నక్సలైట్ మేధావి దృష్టిలో మావోయిస్టు అంటే ...**

ఈ మధ్యనే 'సాక్షి' పేపర్లో 'మావోయిస్టు ఉద్యమానికి భవిష్యత్ లేదు' అనే హెడ్డింగ్‌తో వార్త ప్రచురితమైంది. ఆ వార్తా కథనాన్ని బట్టి పోరియమ్ పోజే అనే 27 ఏళ్ళ గిరిజన మహిళ ఛత్తీస్‌గఢ్ ఆంధ్రప్రదేశ్ సరిహద్దు అటవీ ప్రాంతాల్లో IANS వార్తా సంస్థతో మాట్లాడారు.

ఉద్యమ లక్ష్యాలు మారుతున్నాయంటూ, దానిపై తనకు ఆసక్తి పోయిందంటూ, ఉద్యమం నుండి వైదొలగాలని అనుకుంటున్నట్లు తెలిపారు.

మావోయిస్టులు తమ సిద్ధాంతాలకు తిలోదకాలిచ్చారని ఇప్పుడు వారు దోపిడిదారులు, హంతకుల్లా వ్యవహరిస్తున్నారని అమాకులను చంపడం, వ్యాపారులను బెదిరించి డబ్బులు గుంజడం ఇక్కడి నాయకులకు నిత్యకృత్యంగా మారిందని, మావోయిస్టు క్యాంపుల్లో మహిళా సభ్యురాళ్ళపై లైంగిక దౌర్జన్యాలకు అంతులేదని, తనపట్ల కూడా అనుచితంగా ప్రవర్తించారని తెలిపింది.

ప్రతీ గిరిజన ఇంటినుండి ఒకరిని ఉద్యమానికి పంపాలని, వ్యతిరేకించిన కొందరు మైనర్ బాలికలను క్రూరంగా చంపివేశారని, తనను కూడా ఇంటినుండి ఎత్తుకొచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రజల్లో మావోయిస్టులు సానుభూతి కోల్పోతున్నారని కూడా తెలిపారు.

మహిళా మావోయిస్ట్ తెలిపిన పై విషయాలలో నిజం ఉండవచ్చు. లేదా అవి అసత్యాలు కావచ్చు. మావోయిస్టుల గురించి పేపర్లలో చదవడం తప్ప మేము వారిపై ఎటువంటి పరిశోధన చెయ్యలేదు. ఈ వ్యాసంలో చర్చించే విషయం కూడా నక్సలిజంపై కాదు.

ఒకవేళ క్రాంతికార్‌గారు నక్సలైట్ తెలిపిన పై వివరాలు నిజమని ఒప్పుకుంటే, వేరొకరిని విమర్శించే నైతిక హక్కు ఆయనకు లేదు.

అలా కాకుండా, ఆమె తెలిపిన వివరాలు నిజం కాదని ఖండిస్తూ, ఎవరో ఒక వ్యక్తి చెప్పినంత మాత్రాన మీరు ఎలా నమ్మేస్తారు, నక్సలైట్లు ప్రజల కోసం వారి జీవితాలనే త్యాగం చేసే మహనీయులని, వారి గురించి తెలుసుకుని మాట్లాడండి అని గనుక చెబితే, ఆయనను సూటిగా మేము అడిగే ప్రశ్న ఒకటే - ఎవరో కొందరు మూర్ఖులు అజ్ఞానంతో ఇస్లాంపై తప్పుడు వ్రాతలు వ్రాస్తే మీరు మాత్రం ఎలా నమ్మారు? మీరు చేసింది తప్పుగా అనిపించలేదా?

**ఆ వ్రాతలు నిజమా? కాదా? అని అధ్యయనం చేయకుండా పుస్తకాన్ని ఎలా వ్రాశారు?**

**స్థలాభావం వలన**

**నాస్తికుని ప్రశ్న శీర్షికను**

**ఈ సంచికలో అందించలేక పోతున్నాము**

**అనివార్యకారణాల వలన**

**ఈసారి పత్రిక ముద్రణ బాగా**

**ఆలస్యమైంది**

**ప్రపంచవ్యాప్తంగా ముహమ్మద్(స)వారిపై జరుగుతున్న దుష్ప్రచారంపై**

పుస్తకాన్ని ప్రచురించి మా పాఠకులకు

ఉచితంగా అందిస్తామని ప్రకటించాము.

శాంతిబాట పత్రికను ప్రతీ నెలా మొదటి వారంలోనే

అందజేసే ప్రయత్నంలో ఉన్నాము.

మా ఈ ప్రయత్నం పూర్తికాగానే

ప్రవక్త(స)వారిపై వ్రాసిన పుస్తకాన్ని

వెంటనే పూర్తిచేసి

ఇన్షా అల్లాహ్ మీకందిస్తాం.

**- శాంతిబాట టీమ్**

# ధర్మ సందేశ ప్రచారం - 3

'శాంతిబాట' మాసపత్రికలోని విషయాలు ధర్మసందేశ ప్రచారంలో బాగా ఉపయోగపడుతున్నాయని చెబుతూ, 'శాంతిబాట టీమ్'ని ప్రోత్సహిస్తూ 'దావత్'పై ప్రత్యేకమైన శీర్షికను కూడా అందివ్వమని కొందరు సోదరులు కోరారు. 'శాంతిబాట'లోని విషయాలు - ప్రపంచంలోని ఎంతో మంది ముస్లిం సోదరులు చేసిన కృషికి ఫలితం. వారందరికీ అల్లాహ్ శ్రేయోశుభాలను అనుగ్రహించు గాక! (ఆమీన్). నేడు సందేశ ప్రచారంలో ఎన్నో కొత్త పోకడలు వచ్చాయి. ప్రవక్త(స)వారి సాంప్రదాయానికి దూరంగా ఈ కార్యక్రమాలు పోతుండటం చూసి, ఆవేదనతో ఈ శీర్షికను ప్రారంభిస్తున్నాము.

## అనుమతించబడినవి - నిషేధించబడినవి

గత సంచికలో దావా కొరకు తీసుకొనవలసిన జాగ్రత్తల గురించి చెప్పడం జరిగింది. ఈ సంచికలో 'దావత్'కు అవసరమైన ముఖ్య విషయాలను మరియు దూరంగా ఉంచవలసిన విషయాలను ఖుర్ఆన్ మరియు సున్నత్ వెలుగులో అందిస్తున్నాము.

డిగ్రీ చదువుకున్న వ్యక్తి స్కూల్ విద్యార్థులకు బోధించగలిగితే, పోస్ట్ గ్రాడ్యుయేషన్ మరియు పిహెచ్.డి. చేసిన వారు డిగ్రీ విద్యార్థులకు, యూనివర్శిటీ విద్యార్థులకు బోధించగలుగుతారు. కేవలం 2వ తరగతి వరకూ మాత్రమే చదువుకున్న వ్యక్తి కూడా తన బిడ్డలకు అక్షరాలను నేర్పించగలడు.

జ్ఞానాన్ని బట్టే బోధనా స్థాయి కూడా ఆధారపడి ఉంటుంది. వివిధ స్థాయిలలో విద్య నభ్యసించే విద్యార్థులకు వివిధ జ్ఞాన స్థాయిలలో ఉన్న టీచర్లు బోధిస్తారు. అంతేగాని ప్రైమరీ స్కూలులో 'అ,ఆ,ఇ,ఈ' లు, A,B,C,D లు నేర్పడానికి కూడా Ph.D. చేసిన వారే ఉండాలి అని అనుకుంటే, సమాజంలో ఏ కొద్దిమంది మాత్రమే చదువుకోగలుగుతారు.

ఇదే విధంగా '**ఇస్లాం ధర్మం విషయంలో మేము పండితులం కాము**' అని అనుకుని, దావత్ కొరకు ఆలిమ్ పైననే ఆధారపడితే, ప్రస్తుతం ఉన్న ఆలిమ్‌లు సరిపోరు. వేల సంఖ్యలో ఆలిమ్‌లు అవసరమౌతారు. అలా పూర్తిగా ఆధారపడటం ఇస్లాం ధర్మానికి వ్యతిరేకం కూడా.

కాబట్టి మనకు కాస్త ధార్మిక జ్ఞానమున్నా సరే, ధర్మం తెలియని వారికి ఆ కాస్త జ్ఞానాన్ని అందించగలమని ముందుగా తెలుసుకోవాలి. గుర్తుపెట్టుకుని చెప్పలేకపోతే, చదివి కూడా వినపించవచ్చు.

ముహమ్మద్(స)వారి బోధనను బట్టి, అల్లాహుతాలా ముహమ్మద్(స) వారికిచ్చిన ఆదేశాలు, ప్రవక్త(స) వారికి మాత్రమే కాకుండా, ఆ ఆదేశాలు ముస్లిములందరికీ ఆదేశాలేనని తెలుస్తుంది. ఖుర్ఆన్‌ని అర్థంతో సహా చదివిన వారికి ఈ విషయాన్ని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు.

క్రింది ఖుర్ఆన్ వాక్యాలలో అల్లాహ్ యొక్క ఆదేశాలను గమనించండి.

> **"వారిని సన్మార్గాన్ని అవలంబించేటట్లు చేయటం నీ బాధ్యత కాదు. కాని అల్లాహ్ తాను కోరిన వారికి సన్మార్గం చూపుతాడు"** (ఖుర్ఆన్ 2:272)

> **"...వాస్తవానికి నీవు కేవలం హెచ్చరిక చేసేవాడవు మాత్రమే! ..."** (ఖుర్ఆన్ 13:7)

> **"... నీ బాధ్యత కేవలం (మా సందేశాన్ని) అందజేయటమే! మరియు లెక్కతీసుకోవటం కేవలం మా పని"** (ఖుర్ఆన్ 13:40)

పై ఆయత్‌ల(వాక్యాల)లో అల్లాహుతాలా ముహమ్మద్(స)వారికి ఆదేశించిన విషయాలు ముస్లిమ్‌లందరికీ ఆదేశాలే!

కాబట్టి '**అల్లాహ్ మార్గం వైపునకు పిలవడం**' (దావత్), ప్రతీ ముస్లిమ్ యొక్క తప్పనిసరి బాధ్యత. అల్లాహ్, తన దాసునిపై మోయలేని బరువును మోపడు. పిండికొద్దీ రొట్టె అన్నారు. అలాగే మన జ్ఞానపరిధిలోనే పిలుపునిచ్చే సంకల్పం చేసుకోవాలి.

ముహమ్మద్(స)వారు ఇలా బోధించారు : **"నేను మీ మధ్య రెండు వస్తువులను వదలిపోతున్నాను. మీరు వాటిని గట్టిగా పట్టుకుని ఉన్నంతకాలం సన్మార్గం తప్పిపోరు. అవేమిటంటే ఒకటి, అల్లాహ్ గ్రంథమైన దివ్య ఖుర్ఆన్. రెండవది ప్రవక్త(స) యొక్క సాంప్రదాయం** (సున్నత్)"

**దావత్‌కు అవసరమైనవి :**

1. ఖుర్ఆన్ గ్రంథం
2. సహీహ్ హదీస్ గ్రంథాలు

(ఈ రెండింటికీ అనుబంధంగా ముహమ్మద్(స)వారి జీవిత చరిత్ర మరియు అందుబాటులోనున్న వ్యాఖ్యాన గ్రంథాలను కూడా ఉపయోగించుకోవచ్చు. అయితే ఈ అదనపు రెండు విషయాలు కూడా పై రెండింటిలో ఓ భాగమే!)

**1. ఖుర్'ఆన్ :**

> **"ఇది ఒక దివ్య గ్రంథం, ఇందులో ఏ మాత్రం సందేహం లేదు. దైవభీతి గలవారికి ఇది మార్గదర్శకత్వము"** (ఖుర్ఆన్ 2:2)

> **"ఈనాడు నేను మీ ధర్మాన్ని మీ కొరకు పరిపూర్ణం చేసి మీపై నా అనుగ్రహాన్ని పూర్తి చేశాను మరియు మీ కొరకు ఇస్లాం (అల్లాహ్‌కు విధేయులుగా ఉండటం)ను ధర్మంగా సమ్మతించాను"** (ఖుర్ఆన్ 5:3)

ఇస్లాం ధర్మం పరిపూర్ణమైనది (perfect) కాబట్టి, ఈ జీవన విధానంలో అదనంగా ఒకటి కలపడమో లేదా ఒక విషయాన్ని తీసివేయడమో వీలుపడదు. మనపై అల్లాహ్, తన అనుగ్రహాన్ని పూర్తిచేశానని చెబుతున్నారు. ఆ అనుగ్రహమే ఖుర్ఆన్. ఎవరైనా అంతిమంగా కోరుకునేది అల్లాహ్ నుండి లభించే అనుగ్రహాన్నే! ఆ అనుగ్రహం

"నిశ్చయంగా, అల్లాహ్ యొక్క దాసులలో **జ్ఞానం గలవారు మాత్రమే ఆయనకు భయపడతారు.**
నిశ్చయంగా అల్లాహ్ సర్వశక్తిమంతుడు, క్షమాశీలుడు" (ఖుర్ఆన్ 35:28)

పొందగలిగితే శాశ్వత నివాసం 'స్వర్గమే!' అంటే ఖుర్'ఆన్ ఆదేశాల ప్రకారంగా ఉండే జీవన విధానం స్వర్గానికి తీసుకెళుతుంది అనడంలో ఎటువంటి సందేహం లేదు.

అంతేకాకుండా సూరహ్ బఖరాలోని 2వ ఆయత్ (వాక్యాన్ని) బట్టి, అల్లాహ్‌పై భయం గలవారికి ఇది మార్గదర్శకత్వము. ఖుర్'ఆన్ మన జీవనవిధానానికి మార్గదర్శి (గైడ్) అని అల్లాహుతాలా స్పష్టంగా చెప్పారు.

ఇక్కడ మార్గదర్శకత్వం అనేది ఏవైనా కొన్ని విషయాలకే పరిమితమా? లేక మన జీవితంలోని ప్రతీ విషయానికి మార్గదర్శకత్వమేనా? ఖుర్'ఆన్ గ్రంథం కొన్ని విషయాలకే పరిమితమైన గ్రంథం కాదు. ప్రార్థనకు సంబంధించో, పెళ్ళికి సంబంధించో పరిమితం కాదు. ఏ మానవుడికైనా ఏ కాలమాన పరిస్థితులలోనైనా గైడ్ చేయగలుగుతుంది.

'దావత్'కూడా ప్రతీ ముస్లిమ్ యొక్క జీవన విధానంలో ఓ అంతర్భాగమే కాబట్టి ముస్లిమ్‌కి ఉదయం లేచిన దగ్గరనుండి, రాత్రి పడుకునే సమయం వరకూ, ప్రతీ విషయంలో మార్గాన్ని చూపేది - **దివ్య ఖుర్'ఆన్.**

మరో ఆయత్‌ను గమనించండి.

**"నిశ్చయంగా మేము ఈ ఖుర్'ఆన్‌ను అవతరింపజేసిన వారం మరియు నిశ్చయంగా మేమే దీనిని కాపాడే వారం."** (ఖుర్'ఆన్ 15:9)

పై రెండు ఆయత్‌లను బట్టి (5:3 మరియు 15:9), ఈ దివ్య గ్రంథంలో మార్పులు రావని, అది సృష్టికర్త రక్షణలో ఉందని, ఈ ధర్మం ప్రళయం వరకూ అందరూ అనుసరించదగిన పరిపూర్ణ (perfect) ధర్మం అని తెలుస్తుంది.

**'దావత్' కూడా మన జీవన విధానంలో ఓ భాగమే కాబట్టి, 'దావత్' ఎలా ఇవ్వాలో ఖుర్'ఆన్ గ్రంథమే చెబుతుంది.**

**2. హదీస్ గ్రంథాలు :**

ఖుర్'ఆన్ గ్రంథం పూర్తిగా మార్గదర్శకత్వమే అయితే, ఇక హదీస్ (ముహమ్మద్(స) వారి బోధన)లతో పని ఏమిటి? అని అపోహలను కలిగించే వారు మరియు వక్రీకరించే అవివేకులు మన మధ్యలోనే ఉన్నారు గనుక, ఈ విషయంపై కొన్ని వివరాలను చెప్పవలసి ఉంది.

**మిఖ్‌దామ్ బిన్ మ'దీకరిబ్ అల్-కింది ఉల్లేఖనం: అల్లాహ్ యొక్క సందేశహరులు (స) చెప్పారు : త్వరలో ఓ కాలం రాబోతుంది, ఒక మనిషి తన దిండుపై వాలి, నా హదీస్‌లలో ఒకటి చెప్పినప్పుడు, అతను అంటాడు: 'నీకూ నాకూ మధ్య అల్లాహ్ గ్రంథముంది(అది చాలు). దేనినైతే అది అనుమతించిందో అది మనకు అంగీకారం మరియు దేనినైతే అది నిషేధించిందో, దానిని మనం నిషేధంగా తీసుకోవాలి'. నిస్సందేహంగా ఏదైతే అల్లాహ్ యొక్క సందేశహరులచే నిషేధించబడిందో, అది అల్లాహ్‌చే నిషేధించబడినట్లే.** (ఇబ్నెమాజా(హసన్), నెం. 12, సంపుటి 1)

**"ఆయన నడవడిక ఆద్యంతమూ ఖుర్'ఆన్ గ్రంథమే"** నని ఆయిషా(రజి) వారు ఉల్లేఖించారు.

అంటే ఏ మార్గాన్ని అయితే ఖుర్'ఆన్ గ్రంథం మానవులకు చూపిందో, ఆ మార్గాన్ని అనుసరించి మరియు ఆచరించి మనకు చూపిన మహనీయులు ముహమ్మద్(స)వారు. ప్రవక్త(స)వారు చేసి చూపించారు కాబట్టి, ఖుర్'ఆన్ ఆదేశాల యొక్క ఆచరణ గురించి స్పష్టంగా అర్థం చేసుకోగలుగుతున్నాం. ఖుర్'ఆన్ గ్రంథం 'థీరీ' అయితే, హదీస్ గ్రంథాలు 'ప్రాక్టికల్స్' అని అర్థం చేసుకోవాలి.

దైవ ధర్మాన్ని మనం స్పష్టంగా అర్థం చేసుకోవడానికే అల్లాహ్, ప్రవక్తలను పంపారు. క్రింది ఆయత్‌లను గమనించండి :

**"వాస్తవానికి, అల్లాహ్ యొక్క సందేశహరునిలో మీకు ఒక ఉత్తమమైన ఆదర్శం ఉంది, వారి కొరకు ఎవరైతే అల్లాహ్ మరియు అంతిమ దినాన్ని ఆశిస్తారో మరియు అల్లాహ్‌ను అత్యధికంగా స్మరిస్తారో!"** (ఖుర్'ఆన్ 33:21)

**"ఓ విశ్వసించిన ప్రజలారా! మీరు అల్లాహ్‌కు విధేయులై ఉండండి మరియు ప్రవక్తను అనుసరించండి మరియు మీ కర్మలను వ్యర్థం చేసుకోకండి."** (ఖుర్'ఆన్ 47:33)

పై ఆయత్ ప్రకారం ముహమ్మద్(స) వారిలో ఒక ఉత్తమమైన ఆదర్శం ఉంది.

మరి ప్రపంచంలో ఎన్నో జాతులకు, విభిన్న సంస్కృతులతో వేర్వేరు భాషలతో జీవించే వారందరికీ కూడా ఈ మహనీయుడు(స) ఆదర్శం కాగలరా? అని కొందరు సందేహపడవచ్చు.

కేవలం ఆదర్శమే కాదు, వారందరికీ ఉత్తమమైన (excellent) ఆదర్శం - ఈ మహనీయుడే!

ముహమ్మద్(స)వారు పుట్టుకతోనే తండ్రిని, సుమారు 7 సం॥ల వయస్సులో తల్లిని పోగొట్టుకుని, అనాథగా తాతగారు, ఆ తరువాత బాబాయి సంరక్షణలో పెరిగారు. నీతినిజాయితీలతో బ్రతికి అరేబియాలో వాటికి నిర్వచనంగా నిలిచి, ప్రజల నుండి ఆదరాభిమానాల్ని చూరగొన్నారు. కష్టపడి పనిచేసేవారు. వ్యాపారాలు చేశారు. అనాథలకోసం, పేదవారికోసం దానాలు అపరిమితంగా చేశారు. మానవాళిని అల్లాహ్ మార్గం వైపుకు పిలిచారు. వివాహాలు చేసుకున్నారు. భార్యాబిడ్డలను పోషిస్తూ, వారి బాగోగులను చూసుకున్నారు. యుద్ధవీరుడుగా, ప్రజలందరినీ ఒకే త్రాటిపై తీసుకువచ్చిన మహోన్నత నాయకుడుగా జీవించారు. విభిన్న తెగలుగా, వేర్వేరుగా బ్రతికే వారందరినీ సంస్కరించి ఒకే జీవనసరళిలోకి తీసుకువచ్చారు.

ఏ వ్యక్తి జీవితంలోనైనా ఆచరించడానికి పై విషయాలకు మించి ఏముంటాయి? అందువలన ఎలాంటివారికైనా ఆదర్శం ఈ మహనీయుడే!

కాబట్టి పై విషయాలపై సులభంగా అవగాహన రావడానికి ముహమ్మద్(స) వారి జీవితచరిత్ర మరియు అందుబాటులో నున్న వ్యాఖ్యాన గ్రంథాలు చదవండి.

ఇంతవరకూ ఇచ్చిన వివరాలను బట్టి, ఖుర్'ఆన్ గ్రంథంలో

మార్పులు రావని, అన్ని కాలాలకు సరిపోయే విధంగా అవతరించబడిన దివ్యగ్రంథమే ఖుర్'ఆన్ గ్రంథమని, ముహమ్మద్(స)వారి ఆదర్శ విధానాలలో కూడా మార్పు ఉండదని స్పష్టంగా తెలుస్తుంది.

**'దావత్' విషయంలోనే కాకుండా, మరే విషయంలోనైనా సరే, ప్రవక్త(స) విధానాలను అనుసరించకుండా చేసే పనులు వృథా అవుతాయనేది కూడా స్పష్టమైంది.**

**బిద్'అత్ :**

ముహమ్మద్(స)వారి ఉత్తమ విధానాలను కాకుండా, వాటిలో కొత్త పోకడలను తీసుకురాకూడదని క్రింది హదీస్ తెలియజేస్తుంది.

"సహ్లా బిన్ సాద్ ఉల్లేఖనం : నేను ప్రవక్త(స) ఇలా చెబుతుండగా విన్నాను. "నేను అల్-హవ్జ్ (కోనేరు - అల్ కౌసర్) వద్దకు మీ కంటే ముందుంటాను. ఎవరైతే అక్కడికి వస్తారో దానినుండి త్రాగుతారు. మరియు దాని నుండి ఎవరైతే త్రాగుతారో, అప్పటినుండి వారికి ఎన్నడూ దాహం వేయదు. నాకు తెలిసినవారు మరియు నన్నెరిగినవారు కొంతమంది అక్కడకు వస్తారు, అప్పుడు వారికీ నాకూ మధ్య ఓ అడ్డు ఏర్పాటుచేయబడుతుంది." అబూ స'ఈద్ అల్-ఖుద్రి దీనికి అదనంగా చెప్పిన ఉల్లేఖనం : ప్రవక్త(స) ఇంకా చెప్పారు : "వారు నా తరపువారే (అంటే నా అనుచరులు) అని అంటాను. 'మీకు తెలియదు మీ తదనంతరం వారు కొత్తమార్పులను మరియు కొత్త విషయాలను (విరుద్ధమైనవి) కల్పించారు' అని చెప్పబడుతుంది. అప్పుడు నేనంటాను, 'నా తరువాత (నా ధర్మంలో) ఎవరైతే మార్పులు చేశారో, కొత్తవి కల్పించారో వారు దూరంగా తొలగిపొండి, దూరంగా తొలగిపొండి"
(**సహీహ్ బుఖారీ,** నెం. **7050,7051**, సంపుటి.9, అధ్యా.1, 92వ పుస్తకం-అల్ ఫితన్)

పై హదీస్‌ను జాగ్రత్తగా అధ్యయనం చేస్తే ఓ ముఖ్య విషయం తెలుస్తుంది. ధర్మంలో ఎన్నో విషయాలను కలిపారు అంటే, ఆ విషయాలు ఖుర్'ఆన్ గ్రంథంలో కలుపబడలేదు. ఎందుకంటే ఖుర్'ఆన్ గ్రంథం అల్లాహ్ యొక్క రక్షణలో ఉంది. ఈ మిశ్రమం మరియు ధర్మ స్వరూపాన్ని మార్చడం అనేది ప్రవక్త(స)వారు చూపిన విధానంలో జరిగాయి. ఆయన చూపిన జీవన విధానంలో మార్పులు అవసరం లేదని స్పష్టమౌతుంది. ప్రవక్త(స) వారిని ప్రేమించిన వారు ఆయన(స)కు దగ్గర్లో ఉంటారు. మరి ధర్మంలో కొత్త విషయాలను కలిపిన వారిని దూరంగా ఉంచారంటే, వారు ప్రవక్త(స) వారిని ప్రేమించలేదనే కదా అర్థం. ప్రవక్త(స) వారిని ప్రేమించనివాడు విశ్వాసి కాగలడా?

కాబట్టి ప్రవక్త(స)వారిని ప్రేమించేవారు, బిద్'అత్‌ల జోలికి పోకుండా, ఆయన చూపిన విధానంలోనే బ్రతికినవారు, ఇన్షాఅల్లాహ్, స్వర్గంలో ఆయనకు దగ్గరగా ఉంటారు.

కాలానుగుణంగా మారాలని, కొత్తకొత్త టెక్నిక్‌లు అవసరమని అవివేకంతో కొందరు వాదిస్తూ ఉంటారు. ముహమ్మద్(స)వారు మనకు తెలియజేసిన విధానం, అల్లాహ్ నుండి అందినదే అని మనందరికీ తెలుసు. అల్లాహ్ చెప్పిన విధానానికి మించిన టెక్నిక్స్ ఎవరు చెప్పగలరు?

**"ముహమ్మద్(స)వారు, ఆనాడు ఒంటె మీద ప్రయాణించారు కాబట్టి, మనం కూడా ఒంటె మీదే ప్రయాణించాలా? కాలాన్ని బట్టి మారాలి"** అని కొందరు అంటారు. ముహమ్మద్(స)వారు ఒక ప్రాంతం నుండి మరొక ప్రాంతానికి కాలినడకన ప్రయాణించారు. గుర్రాన్ని ఉపయోగించారు. గాడిదను ఉపయోగించారు. ఒంటెను కూడా ఉపయోగించారు. జిబ్రయీల్ (అస) వారితో కాంతికి మించిన వేగంతో ప్రయాణించే బుర్రాఖ్ మీద క్షణకాలంలోనే 'అల్ అక్సా' మస్జిద్ కు చేరుకోవడం, ఆ తరువాత స్వర్గం మరియు నరకాన్ని చూసి రావడం జరిగింది.

ఇప్పటికీ ఒంటెలను, గాడిదలను, గుర్రాలను ఉపయోగించే వారున్నారు. సైకిల్లు, కార్లు, స్కూటర్లు, రైళ్లు, విమానాలు - ఇవి అన్నీ కూడా వాహనాలే. మానవులు కాంతివేగంతో ప్రయాణించ గలగడానికి వీలయ్యే వాహనాలు ఇంకా తయారుకాలేదు. ఇలాంటి ఆవిష్కరణలు బిద్'అత్ క్రిందకు రావు. 'మైక్' అనే పరికరాన్ని ఆవిష్కరించడం వలన, నిశ్శబ్దంగాలేని వాతావరణంలో కూడా అజాన్‌ను చాలా దూరం వరకూ వినిపించవచ్చు. కొత్తగా పరికరాలను కనిపెట్టడం బిద్'అత్ కాదు. అధర్మమైన పనులకొరకు ఆ పరికరాలను ఉపయోగించకూడదు.

'దావత్'లో కాలానుగుణ మార్పులు ఎంతమాత్రం అవసరం లేదు. నేడు అందరూ బిజీ బిజీగా జీవనం సాగిస్తున్నప్పటికీ, రోజుకి 5 సార్లు చేసే నమాజ్‌ని తగ్గించి చేస్తున్నారా?

కొత్త వస్తువులను, కొత్త పరికరాలను కనిపెట్టడం బిద్'అత్ కాదు. ధర్మంలో కొత్త ఆచారాలను, కొత్త పద్ధతులను కనిపెట్టడమే బిద్'అత్.

ముహమ్మద్(స)వారు ఆచరించి చూపిన దివ్యమైన విధానం, ఏ కాలంలో నైనా, ఏ ప్రాంతంలోనైనా ఆచరణయోగ్యమైనది. దావత్ అనేది ముస్లిమ్ యొక్క నిత్యజీవితంలో నుండి విడదీయలేని ఓ అంతర్భాగం.

మన నడవడిక అల్లాహ్ యొక్క ఆదేశాల ప్రకారంగా ఉంటే, అది చూసిన వారు మన జీవనవిధానం పట్ల ఆకర్షితులౌతారు. ఇస్లాం చూపిన మంచి లక్షణాల ద్వారా చేసే 'దావా' చాలా ప్రభావాన్ని చూపిస్తుంది.

## వారించబడిన విషయాలు

### 1. ఇతర గ్రంథాలను అధ్యయనం చేయడం అవసరమా?

క్రింది ఖుర్'ఆన్ వాక్యాన్ని జాగ్రత్తగా పరిశీలించండి :

**"(ఓ ప్రవక్తా!) ఇప్పుడు ఈ జ్ఞాపికను (ఖుర్'ఆన్ గ్రంథాన్ని) నీపై అవతరింప జేసింది, వారి వద్దకు అవతరింపజేయబడిన దానిని వారికి నీవు స్పష్టంగా వివరించడానికి బహూశా వారు ఆలోచిస్తారేమోనని!"** (ఖుర్'ఆన్ 16:44)

ఈ ప్రపంచంలో హెచ్చరిక అందని జాతి అంటూ ఏదీ లేదని 35వ సూరహ్‌లో 24 వాక్యం వివరిస్తుంది. కాబట్టి గ్రంథాలను అందుకున్న ఏ జాతివారికైనా, వారి గ్రంథాల గురించి వారికి స్పష్టంగా వివరించడానికి ఈ ఖుర్'ఆన్‌ను అవతరింపజేశామని అల్లాహుతాలా చెబుతున్నారు. ముహమ్మద్(స) వారికి చదవడం, వ్రాయడం తెలియదు. ఆయన ఇతర గ్రంథాలను చదవలేదు. అంతేకాకుండా, ముస్లిములను కూడా చదవ వద్దన్నారు.

క్రింది సహీహ్ హదీస్‌ను చదవండి :

జాబిర్ బిన్ అబ్దుల్లా (రజి) ఉల్లేఖనం : **ఉమర్ బిన్ అల్-ఖత్తాబ్(రజి) తౌరాత్ ప్రతినొకదానిని రసూలుల్లాహ్(స)వారి దగ్గరికి తీసుకువచ్చి అన్నారు: "ఓ రసూలుల్లాహ్(స)! ఇది తౌరాత్ ప్రతి. ఆయన(స) మౌనం వహించారు. ఆయన(ఉమర్-రజి) దానిని చదవడం ప్రారంభించారు. రసూలుల్లాహ్(స)వారి ముఖం (రంగు) మారుతుంది. అబూబకర్ అన్నారు: 'నీ తల్లి నీకోసం శోకించు గాక! రసూలుల్లాహ్(స)వారి ముఖాన్ని చూడవా?' ఉమర్ (రజి) రసూలుల్లాహ్(స)వారి ముఖాన్ని చూచి అన్నారు 'అల్లాహ్ యొక్క ఆగ్రహం నుండి ఆయన సందేశహరుల(స)వారి ఆగ్రహం నుండి నేను అల్లాహ్ శరణు వేడుకుంటున్నాను. అల్లాహ్‌ను ప్రభువుగాను, ఇస్లామ్‌ను ధర్మంగానూ, ముహమ్మద్(స)ను ప్రవక్తగానూ నేను విశ్వశిస్తున్నాను'. అప్పుడు రసూలుల్లాహ్(స)వారు ఇలా అన్నారు : ఎవరి చేతులలో ముహమ్మద్ ప్రాణమున్నదో ఆయన సాక్షి! ఒకవేళ మూసా(అ) వారు మీముందుకు వస్తే, నన్ను వదిలేసి, ఆయనను అనుసరిస్తే, మీరు నిశ్చయంగా సన్మార్గం నుండి తప్పిపోతారు. మూసా(అ) బ్రతికుంటే, నా ప్రవక్త పదవిని తెలుసుకుంటే, ఆయన నన్నే అనుసరిస్తారు'. (తిర్మిదీ, దారిమీ నెం. 115-116)**

కాబట్టి ఈ గ్రంథాలను వ్యక్తిగతంగా కూడా చదవవద్దని ముహమ్మద్(స) వారు అంత స్పష్టంగా చెప్పిన తరువాత, వాటిని 'దావత్' కొరకు ఉపయోగించ కూడదని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. వివేకంతో ఆ విషయాలను మనం అర్థం చేసుకోవాలి.

**మరొక హదీస్ :**

> అబూహురైరాగారి ఉల్లేఖనం : గ్రంథప్రజలు 'తౌరాత్'ను హెబ్రూలో చదివి, దానిని అరబీ భాషలో ముస్లిములకు వివరిస్తుండేవారు. అల్లాహ్ యొక్క సందేశహరులు చెప్పారు : "**గ్రంథప్రజలు చెప్పేది నిజమనిగాని, అబద్ధమని గాని చెప్పవద్దు.** కాని (బదులుగా) చెప్పండి, 'మేము అల్లాహ్‌ను మరియు ఏదైతే మాపై అవతరింపబడిందో దానిని మరియు ఏదైతే మీపై అవతరింప బడ్డాయో వాటిని విశ్వసిస్తున్నాము".
> **(సహీహ్ బుఖారీ, నెం. 7362, సంపుటి 9, పుస్తకం 96, అధ్యాయం:25)**

పై రెండు హదీస్‌లని బట్టి, ఇతర గ్రంథాలను వినవలసిన పరిస్థితి వస్తే వినడమేగాని, చదవకూడదని స్పష్టమౌతుంది.

**ఇక్కడ హెబ్రూ భాషలోనున్న 'తౌరాత్' గ్రంథాన్ని అరబీ భాషలోనికి అనువదించి, యూదులు వినిపిస్తుంటే, వాటిలోని ఏ విషయాలనూ నిజమని నిర్ధారణ చేయడంగాని, అబద్ధమని తిరస్కరించడంగాని చేయవద్దని చెప్పారు కదా! మరి తులనాత్మక అధ్యయనం** (Comparative Study) **పేరుతో ఇతర గ్రంథాలలోని కొన్ని విషయాలు 'తప్పు' అని, మరికొన్ని విషయాలను 'ఒప్పు'అని చెప్పడం, ముహమ్మద్(స)వారి బోధనను తిరస్కరించినట్లే కదా!**

ఒకవేళ క్రైస్తవులుగాని, యూదులుగాని వారి గ్రంథాల అనువాదాలను మనకి చదివి వినిపిస్తే, మనం ఏ సమాధానం ఇవ్వాలో కూడా ప్రవక్త(స) ముందుగానే మనకి చెప్పేశారు. క్రింది రెండు ఆయత్‌లను వారికి స్పష్టంగా చెబితే సరిపోతుంది.

> **"(ఓ ప్రవక్తా!) ఇలా అను: 'మేము అల్లాహ్‌ను విశ్వసించాము మరియు మాపై అవతరింపజేయబడిన దానిని మరియు ఇబ్రాహీమ్, ఇస్మాయీల్, ఇస్'హాఖ్, యాఖూబ్‌లపై మరియు అతని సంతానంపై అవతరింపజేయబడిన వాటిని కూడా. ఇంకా మూసా, ఈసా మరియు ఇతర ప్రవక్తలపై వారి ప్రభువు తరఫునుండి. మేము వారి మధ్య ఎలాంటి విచక్షణ చేయము. మరియు మేము ఆయనకే విధేయు(ముస్లిం)లమై ఉన్నాము." (ఖుర్'ఆన్ 3:84)**

> **"(ఓ ముస్లిం లారా!) మీరు ఇలా అనండి: 'మేము అల్లాహ్‌ను మరియు ఆయన మా కొరకు అవతరింజేసిన సందేశాలను మరియు ఇబ్రాహీమ్, ఇస్మాయీల్, ఇస్'హాఖ్, యాఖూబ్ మరియు అతని సంతతి వారికి ఇవ్వబడిన వాటినీ, మరియు మూసా, ఈసా మరియు ఇతర ప్రవక్తలందరికీ వారి ప్రభువు తరఫునుండి ఇవ్వబడిన వాటినీ విశ్వసిస్తాము. వారిలో ఏ ఒక్కరి పట్లా మేము బేధభావం చూపము. మేము ఆయనకు విధేయుల (ముస్లిముల) మయ్యాము. (ఖుర్'ఆన్ 2:136)**

గ్రంథ ప్రజలు చెప్పిన వాటిలో ఏది నిజమో, ఏది అబద్ధమో నిర్ణయించేటంత జ్ఞానం అల్లాహ్‌కు, ఆయన ప్రవక్త(స)వారికి తప్ప ఇతరులెవరికీ లేదు.

**"...... నేను ఏ కార్యాన్నయితే చేస్తున్నానో, దానిని చెయ్యడానికి కొందరు ఎందుకు వెనుకాడుతున్నారు? అల్లాహ్ సాక్షి, నేను వారందరి కంటే అధిక దైవజ్ఞానం కలవాణ్ణి, వారందరి కంటే అధిక దైవభీతిగలవాణ్ణి"** అని బోధించారు.(**సహీహ్ బుఖారీ**, నెం. **7301**, సంపుటి 9, పు.96, అధ్యా.5)

ముహమ్మద్(స)వారికి అల్లాహ్ తెలియజేయడం వలన, నిజానిజాలు ఆయనకు మాత్రమే తెలుసు.

ముహమ్మద్(స)వారు ఏదైతే చదవవద్దన్నారో దానినే **'తులనాత్మక అధ్యయనం'** పేరుతో బాగా స్టడీ చేస్తూ, ఇతర గ్రంథాల గురించి ఏ మాటలైతే అనవద్దని చెప్పారో, వాటినే ప్రత్యేకంగా చెబుతున్నవారు, ఓసారి ఆలోచించుకోవాలి. ఆత్మ పరిశీలన చేసుకోవాలి.

**ప్రవక్త(స)వారి విధానాలను అనుసరిస్తున్నారా? (లేక) వ్యతిరేకిస్తున్నారా?**

ఈ విషయం తెలుసుకోవాలంటే క్రింది ఆయత్‌ను చదివి మరోసారి నిదానంగా ఆలోచించండి.

> **"దైవప్రవక్త మీకు ఇచ్చిన దానిని తీసుకోండి. ఆయన మిమ్మల్ని నిషేధించిన దాని జోలికి పోకండి"** (అల్ హష్ర్ : 7)

ఇతర గ్రంథాలతోనే 'దావత్' సాధ్యమనుకునే వారు, ప్రవక్త(స) వారికి విధేయత చూపిస్తున్నారా? లేదా? అని ఒక్కసారైనా మనస్సు పెట్టి ఆలోచించండి.ప్రవక్త(స)వారు వారించిన దానినే చేస్తూ క్రింది ఖుర్'ఆన్ ఆయత్‌ను తిరస్కరిస్తున్నారని వారికి అనిపించడం లేదా?

> **"మీరు అల్లాహ్‌కు, ఆయన ప్రవక్తకు విధేయత చూపండి ..."**

ఇతర గ్రంథాల ద్వారా 'దావత్' ఇవ్వాలనుకునేవారు క్రింది ఖుర్'ఆన్ ఆయత్‌ను కోట్ చేస్తుంటారు.

> **"ఇలా అను: 'ఓ గ్రంథప్రజలారా! మాకు మరియు మీకూ మధ్య ఉమ్మడిగా ఉన్న ధర్మవిషయం వైపునకు రండి ..."** (ఖుర్'ఆన్ 3:64)

పై వాక్యాన్ని చెబుతూ ఇతర గ్రంథాలకి, ఖుర్'ఆన్ గ్రంథానికి మధ్య

పోలికలను వెలికి తీయడానికి పోటీలు పడుతున్నారు. ఈ అధ్యయన అవసరం ఎంత మాత్రం లేదని, దీనిని నిషేధిస్తూ ముహమ్మద్(స)వారు చెప్పిన విషయాల గురించి ఇప్పటికే ముందు పేరాలలో చెప్పుకున్నాం.

ఆ ఉమ్మడి ధర్మ విషయమేమిటో, ప్రముఖ దాయీలుగా కీర్తించ బడేవారు కష్టపడి తెలుసుకోవలసిన అవసరం లేకుండా, ఆ వాక్యంలోనే వెనువెంటనే స్పష్టంగా వివరించబడింది.

> **"... అది ఏమిటంటే : మనం అల్లాహ్ తప్ప మరెవ్వరినీ ఆరాధించ కూడదు. ఆయనకు భాగస్వాములను ఎవ్వరినీ నిలబెట్టకూడదు మరియు అల్లాహ్ తప్ప, మన వారిలో నుండి ఎవ్వరినీ ప్రభువులుగా చేసుకోరాదు" వారు (ఒప్పుకోక) తిరిగిపోతే : "మేము నిశ్చయంగా అల్లాహ్‌కు విధేయు (ముస్లిమ్)లం అని పలుకు"** (ఖుర్ఆన్ 3:64)

'ఖుర్ఆన్ గురించి మరియు అల్లాహ్ గురించి చెబితే ఇతర ధర్మాలవారు వినరు' అని కొందరు చెబుతున్నారు. వినకపోతే ఏమి పలకాలో పై వాక్యంలో అల్లాహ్ స్పష్టం చేశారు కదా! క్రింది ఆయత్‌లను కూడా గమనించండి :

> **"(ఓ ముహమ్మద్!) ఈ విధంగా నీపై ఈ గ్రంథాన్ని అవతరింప జేశాము. కావున మేము గ్రంథాన్ని ఇచ్చిన వారిలో కొందరు దీనిని విశ్వసిస్తారు. మరియు ఇతర ప్రజలలో నుండి కూడా కొందరు దీనిని విశ్వసిస్తారు. మరియు మా సూచనలను సత్య తిరస్కారులు తప్ప, మరెవ్వరూ తిరస్కరించరు."** (ఖుర్ఆన్ 29:47)
>
> "ఏమీ? వాస్తవానికి మేము నీపై అవతరింప జేసిన **ఈ గ్రంథం (ఖుర్ఆన్) వారికి వినిపించ బడుతుంది కదా! ఇది వారికి చాలదా?** నిశ్చయంగా ఇందులో విశ్వసించే ప్రజలకు కారుణ్యం మరియు హితబోధలున్నాయి. (ఖుర్ఆన్ 29:51)

ఖుర్ఆన్ గ్రంథం సరిపోతుందని అల్లాహుతాలా చెబుతుంటే ఏ ముస్లిమ్‌కైనా ఇతర గ్రంథాలెందుకు?

అయినా వినడం, వినకపోవడం అనేది అల్లాహ్‌యే నిర్ణయిస్తారని ఖుర్ఆన్ గ్రంథం స్పష్టంగా చెప్పింది కదా! సత్య తిరస్కారులు మాత్రమే దీనిని తిరస్కరిస్తారని స్పష్టంగా చెబుతున్నప్పుడు, ఆ వాక్యాలను మీరు స్వీకరించరా? ఖుర్ఆన్ వాక్యాలను 'దాయీ'లుగా పిలిపించుకోబడేవారే స్వీకరించకపోతే, వారు ఇక ధర్మాన్ని ఎలా బోధించగలరు? ఆలోచించాలి.

ప్రియప్రవక్త ముహమ్మద్(స)వారికే అల్లాహుతాలా ఇలా తెలియ జేస్తున్నారు :

> **"వారిని సన్మార్గాన్ని అవలంబించేటట్లు చేయటం నీ బాధ్యత కాదు. కాని, అల్లాహ్ తాను కోరిన వారికి సన్మార్గం చూపుతాడు."** (ఖుర్ఆన్ 2:272)
>
> **"ఇక నీవు వారిని సన్మార్గానికి తేవాలని ఎంత కోరుకున్నా నిశ్చయంగా, అల్లాహ్ మార్గభ్రష్టతకు గురిచేసిన వానికి సన్మార్గం చూపడు. వారికి సహాయపడే వారు ఎవ్వరూ ఉండరు."** (ఖుర్ఆన్ 16:37)

మరి సామాన్యులమైన మనమెందుకు టెన్షన్ పడాలి? మనపని చెప్పడం వరకే కదా!

**అనుమానం :**

ఇతర ధర్మాలవారు 'అల్లాహ్' పేరు చెబితే, ఒప్పుకోరని ఎందుకు అనుమానపడాలి? పైన చెప్పిన 29 సూరహ్‌లో 47, 51 ఆయత్‌లలో ఆ విషయాన్ని స్పష్టం చేసేశారు కదా!

'మీ ప్రభువూ, మా ప్రభువూ అల్లాహ్‌యే నని ముహమ్మద్(స)వారు యూదులతో, క్రైస్తవులతో అన్నప్పుడు, వారు సమాధానంగా 'మీ ప్రభువు అల్లాహ్ కావచ్చుగాని, **మా ప్రభువు పేరు** అదికాద'ని యూదులు, క్రైస్తవులు చెప్పలేదే!

మదీనా నగరానికి ముహమ్మద్(స)వారు వచ్చే సమయానికి, అక్కడున్న యూదనాయకుని పేరు '**అబ్దుల్లా** బిన్ సబా'. అరబ్బులను చులకనగా భావించే హెబ్రూ భాషలో మాట్లాడే యూదుల నాయకుడు, తన పేరులో '**అల్లాహ్**' అనే పదాన్ని ఎలా ఉంచుకున్నాడు?

హెబ్రూ భాషలో ఆ పదముంది. ఈసా(అ)వారి మాతృభాషయైన అరమాయిక్ భాషలో కూడా 'అల్లాహ్' అనే పదముంది. ఆ భాషలో కూడా ఆరాధ్యున్ని 'ఇలాహ్' అనే అంటారు. అరమాయిక్ భాషకు సంబంధించి ఆన్‌లైన్ డిక్షనరీలో GOD అని టైప్ చేయండి. 'అల్లాహ' అని వస్తుంది. నిజానికి, GOD అనే పదానికి సరిపోయే అరమాయిక్, హెబ్రూ మరియు అరబీ భాషలకు చెందిన ఉమ్మడి పదం - 'ఇలాహ్'. మూడు భాషలలోనూ 'అల్లాహ్' అనేది 'ఇలాహ్' (ఆరాధ్యుని) యొక్క పేరు.

నిత్యం ఖుర్ఆన్‌ను అర్థంతో చదివేవానికి, ధర్మాన్ని అందజేయడం సులభం అవుతుంది. ఖుర్ఆన్‌ను స్టడీ చేయకుండా, హదీస్‌లను చదవకుండా, ఇతర మతగ్రంథాలపై అధ్యయనం చేయడం ప్రవక్త(స)వారి సాంప్రదాయం కాదు.

---

**సమాజంలో కొత్త ఫ్యాషన్‌లు, కొత్త పోకడలు వస్తే వెంటనే ఆకర్షితు లయ్యేది యువకులే! అలాంటి యువకులు ఈ రోజున ధర్మ సందేశాన్ని అర్థం చేసుకోవడానికి మరియు ఇతరులకు అందజేయడానికి ఆసక్తి చూపిస్తున్నారు. ఇది చాలా సంతోషించ దగిన విషయం. అయితే వీరు ప్రవక్త(స)వారి విధానానికి ఆకర్షితులైతే, వారి భవిష్యత్తు సంతోషమయం అవుతుంది. అలా కాకుండా ఈ కొత్తపోకడల వైపు పోతే, వారి జీవితాల నుండి సంతోషం దూరం అవుతుంది.**


---

**స్నేహపూరిత వాతావరణం :**

ఇస్లాం ధర్మం విశ్వసోదరభావాన్ని ముస్లిములలో కలుగజేస్తుంది.


మానవులంతా ఒకరికొకరు బంధువులే. అందులో మంచివారు, చెడ్డవారు కూడా ఉంటారు. సత్యధర్మాన్ని మనం అందజేసేటప్పుడు, వారిని పరాయివారిగా మనం భావించరాదు. స్నేహపూర్వకంగా, వారి మనస్సు గాయపడకుండా, ప్రవక్త(స)వారు చూపిన సౌమ్యమైన పద్ధతిలోనే ధర్మాన్ని వారికి తెలియజేయవచ్చు.


Visit website : **http://www.peshitta.org/lexicon/**
for **ARMAIC** online Dictionary




**అరమాయిక్ ఆన్‌లైన్ డిక్షనరీ**

**మరికొన్ని పేర్లు - ఆయా భాషలలో వాటి ఉచ్ఛారణలు**




**Mary మర్యమ్**

ఇంగ్లీష్‌లో 'మేరీ'

అరబీలో 'మర్యమ్'


అరమాయిక్‌లో 'మర్యమ్'

**Moses మూషే**

ఇంగ్లీష్‌లో 'మోసెస్'

అరబీలో 'మూసా'

అరమాయిక్‌లో 'మూషే'




**Jacob యాఖూబ్**

ఇంగ్లీష్‌లో 'జాకబ్'

అరబీలో 'యాఖూబ్'

అరమాయిక్‌లో'యాఖూబ్'

| | | |
|---|---|---|
| **హెబ్రూ** | - | మోసెస్ (మూసా - అస) వారి మాతృభాష |
| **అరమాయిక్** | - | ఏసు (ఈసా - అస) వారి మాతృభాష |
| **అరబీ** | - | ముహమ్మద్(స) వారి మాతృభాష |

ఉదాహరణకు, సందర్భానికి సరిపోతుందని రెండు మాటలను ఇక్కడ ఉదహరిస్తున్నాము. మా ట్రూవిజన్ ఎడ్యుకేషనల్ సొసైటీ గ్రంథాలయానికి ఓ మత బోధకుడు వచ్చారు. ఆయన తన ధర్మం గురించి మాకు చెప్పే ఉద్దేశ్యంతో వచ్చారు. మేము ఆయనని స్వాగతించాము. శాంతిబాట టీమ్‌లోని ఓ సభ్యుడు మరియు ఆ మతబోధకుని సంభాషణలోని ముఖ్యమైన విషయాలు క్లుప్తంగా :

**మత బోధకుడు** : "మీ పొరుగువానిని ప్రేమించమని మా గ్రంథంలో చెప్పబడింది. చూశారా! ఇది ఎంత గొప్ప విషయం!"

**ట్రూవిజన్** : "ప్రవక్తలు ఎప్పుడూ మంచినే బోధిస్తారు. ముహమ్మద్(స) వారు ఇలా అన్నారు : పొరుగింటి వాడు పస్తులుంటే, కడుపునిండా తినేవాడు 'ముస్లిమ్' (విశ్వాసి) కాజాలడు. ప్రవక్త(స)! ఎవరు ఆ పొరుగువారు అని అనుచరులు అడిగితే, మీ చుట్టూ ఉండే 40 ఇళ్ళవారు అని ముహమ్మద్(స) వారు సమాధాన మిచ్చారు. (పొరుగువారిపై ముస్లిమ్‌కున్న బాధ్యత ఎలాంటిదో ఆ మత బోధకునికి తెలియజేయడం జరిగింది.)

**మత బోధకుడు** : "చివరి కాలంలో ప్రజలు, వెండి బంగారం కంటే జ్ఞానానికే ఎక్కువ విలువిస్తారు."

**ట్రూవిజన్** : "జ్ఞానమనేది, ముస్లిమ్ పోగొట్టుకున్న సంపద వంటిదని, అది ఎక్కడ దొరికినా అతను తీసుకుంటాడని ముహమ్మద్(స)వారు బోధించారు. ఆయన బోధనలవలన ప్రేరణ కలిగి ముస్లిమ్ శాస్త్రవేత్తలు తయారై ఎన్నో సైన్స్ విభాగాలకు పితామహులయ్యారు. ప్రయోగాలను ప్రారంభించి, నేటి ఆధునిక సైన్స్‌కి పునాదులు వేయగలిగారు."

ఆ తరువాత ఆ సృష్టికర్త పేరు **'అల్లాహ్'**యేనని వివిధ సెమిటిక్ భాషల స్క్రిప్టులను చూపించడం జరిగింది. ఖుర్ఆన్ గ్రంథం సర్వసత్యం అవునో, కాదో తెలుసుకోవాలంటే, ముందుగా ఖుర్ఆన్ గ్రంథాన్ని చదవండి అని చెబుతూ, ఆ సోదరునికి ఖుర్ఆన్ గ్రంథాన్ని అందించడం జరిగింది.

గ్రంథాలయానికి వస్తూ ఉండమని ప్రేమపూర్వకంగా ఆహ్వానించడం జరిగింది. **ట్రూవిజన్ ఎడ్యుకేషనల్ సొసైటీ, వెలుగుబాట ఎడ్యుకేషనల్ సొసైటీ**లలో పరమత గ్రంథాలపై వాదనలకు గాని, ఆ గ్రంథాలపై కామెంట్ చేయడానికి గాని అనుమతి లేదు.

గ్రంథాలయానికి విచ్చేసి, ఆవేశంతో, కోపంతో ఊగిపోతూ మాట్లాడిన ఉన్నత విద్యావంతుడైన ఓ పెద్దాయనకు, ఖుర్ఆన్ గ్రంథ వాక్యాలు మరియు హదీస్‌లను వినిపించిన తరువాత వాటిపై ఏదైనా కామెంట్ ఉంటే చెప్పండి అని అడిగితే, 'ఇన్ని మంచి విషయాలు చెప్పాక, నేను ఏమి కామెంట్ చేయగలను'. ఇక్కడ అప్లయ్ అయింది అంటూ, తన నుదుటిపై చేతి నుంచుకుని చెప్పడం జరిగింది. ఆ తరువాత చిరునవ్వుతో ఆయన బయటికి వెళ్లారు. బయటికి వెళుతుండగా, వస్తూ ఉండమని హృదయపూర్వకంగా ఆహ్వానించడం, ఆ సోదరుడు సంతోషంగా మా మనవిని స్వీకరించడం జరిగింది.

**సౌమ్యంగా చెప్పడం ముహమ్మద్(స)వారి విధానం.**

**వాదనలు :**

వాదనలు ద్వేషానికి దారి తీస్తాయి. 'డిబేట్'ల వలన ఓ మతధర్మం వారికి ఇస్లాం ధర్మంపైనా మరియు ముహమ్మద్(స)వారిపైనా బురద చల్లే అవకాశం దొరికింది. ఈ డిబేట్‌లు చాలావరకూ రహస్యంగా జరుగుతున్నాయి. వాటిలో కొన్ని మాత్రమే అందరికీ తెలిసి జరుగుతున్నాయి. నకిలీ ముస్లిమ్‌లకి ఈ డిబేట్‌లు ధనరాశులను కురిపిస్తున్నాయి. వేరే మతధర్మం వారితో, ఈ నకిలీలు కుమ్మక్కై, ఖుర్'ఆన్ గ్రంథ ఔన్నత్యాన్ని తగ్గిస్తూ, ముహమ్మద్(స) వారిపై అపోహలను సృష్టిస్తున్నారు. ఈ డిబేట్‌లు ప్రవక్త(స)వారి సాంప్రదాయం కాదు. వీటిని ప్రోత్సహించకండి.

క్రింది ఖుర్'ఆన్ ఆయత్‌ను చూపించి వాదన చేయడానికి ఖుర్'ఆన్ అనుమతి నిచ్చిందని ఎవరైనా అనవచ్చు.

**"మరియు నీవు గ్రంథప్రజలతో, దుర్మార్గాన్ని అవలంభించిన వారితో తప్ప - కేవలం ఉత్తమమైన రీతిలోనే వాదించు. మరియు వారితో ఇలా అను : "మేము మా కొరకు అవతరింప జేయబడిన దానిని మరియు మీ కొరకు అవతరింపజేయబడిన దానిని విశ్వసించాము మరియు మా ఆరాధ్యదేవుడు మరియు మీ ఆరాధ్యదేవుడు ఒక్కడే (అల్లాహ్) మరియు మేము ఆయనకే విధేయుల (ముస్లిముల)మై ఉన్నాము"** (ఖుర్'ఆన్ 29:46)

పై వాక్యం వాదనలకు అనుమతినిచ్చింది అని అపోహ పడితే, క్రింది వాక్యం ఆ అపోహను తొలగిస్తుంది.

**"వివేకంతోనూ, మంచి ఉపదేశంతోనూ నీ ప్రభువు మార్గం వైపునకు ఆహ్వానించు. మరియు వారితో ఉత్తమ రీతిలో వాదించు ...."**

(ఖుర్'ఆన్ 16:125)

అంటే ముందుగా వారిని అల్లాహ్ మార్గం వైపునకు పిలవాలి. అప్పుడు ఎవరైనా వాదిస్తే ఏమి చేయాలో పై రెండు ఆయత్‌లు వివరిస్తున్నాయి. ఉత్తమ రీతిలో ఎలా వాదించాలో కూడా ఖుర్'ఆన్ గ్రంథమే తెలియజేస్తుంది. కాబట్టి ఖుర్'ఆన్ గ్రంథాన్ని బాగుగా అధ్యయనం చేయవలసి ఉంది.

**ఇస్లాం ధర్మం వాదించమని చెప్పడం లేదు, ఆ పరిస్థితి గనుక వస్తే ఉత్తమరీతిలో వాదించమని చెబుతుంది.**

**కాని నేడు 'వాదన' కోసమే ప్రత్యేకంగా పిలుస్తున్నారు. ఫలానా 'డిబేట్' అంటూ ముందుగానే వాదనకు సిద్ధం అవుతున్నారు.**

అల్లాహ్ మార్గం వైపునకు పిలవడానికి బదులు, వాదనకోసం పిలవడం ఎంతవరకూ సమంజసమో ఓసారి ఆలోచించండి.

**చట్టపరమైన జాగ్రత్తలు :**

ముహమ్మద్(స)వారు ముస్లిమ్‌లకు క్రమశిక్షణను నేర్పారు. సౌమ్యతను నేర్పారు. ఇండియాలో మనధర్మం గురించి తెలియజేసుకోవడానికి, మనపై నున్న అపోహలను తొలగించుకోవడానికి మన దేశంలో అనుమతి ఉంది. ఇది మన దేశం. దేశ పౌరులుగా చట్టాన్ని గౌరవించడం మన కనీస బాధ్యత. ధర్మాన్ని ప్రచారం చేసుకోవడంలో చట్టం ఏర్పరచిన నియమాలను తెలుసుకోవాలి. ఒకవేళ ఏదైనా విషయం మనకు ఆవేదన కలిగిస్తే, మన ఆవేదనను ప్రభుత్వానికి శాంతియుతంగా తెలియజేసుకునే అవకాశాన్ని కూడా మనదేశ చట్టం మనకు కల్పించింది.

సౌమ్యతే మన సంస్కృతి అని మన భారతీయులందరూ అర్థం చేసుకునేలా ప్రవక్త(స)వారి సాంప్రదాయం ప్రకారం బ్రతుకుదాం! (ఇన్షా అల్లాహ్)

ఫలానా వ్యక్తి డిబేట్‌లు చేస్తుంటే, ఎవరూ ఏమీ అనడం లేదుగాని మమ్మల్నే ఎందుకు తప్పుపడుతున్నారంటూ, ఈ వాదనలు చేసే ప్రతీ వ్యక్తి మరొకరి గురించి చెబుతూ, అందరూ తప్పు చేస్తున్నారు కాబట్టి, తను కూడా అదే చేస్తున్నానని తప్పించుకునే ధోరణిలో సమాధాన మిస్తున్నాడు.

కాని అల్లాహ్ నుండి తప్పించుకోలేమని అర్థం చేసుకుని భయపడిన రోజునే ఇలాంటి డిబేట్‌లు ఆగుతాయి.

**అల్లాహ్‌ను, ఆయన ప్రవక్త(స) వారిని ప్రేమించే ముస్లిములు ఇలాంటి డిబేట్‌లకు సహకరించకుండా వాటిని బహిష్కరించండి.**

ఎప్పుడైతే మంచిని చెబుతూ, చెడును నిరోధించడం చేయరో, త్వరలోనే అల్లాహ్ దగ్గరనుండి శిక్ష **అందరిపై** పడుతుంది. ఆ తరువాత అల్లాహ్‌ను అర్థించినా సరే, ఆయన ఆ పిలుపుకు స్పందించరు.

(పై విషయంపై ప్రామాణిక హదీస్‌ల వివరాలను ఇన్షాఅల్లాహ్ వచ్చే సంచికలో అందిస్తాము)

ఖుర్'ఆన్ వాక్యాల వక్రీకరణ, హదీస్ వాక్యాల వక్రీకరణ, దావత్ విషయంలో ప్రవక్త(స)వారు వారించిన విషయాలను పట్టించుకోక పోవడం మొదలైనవి ఎన్నో నేడు మనచుట్టూ జరుగుతున్నాయి.

అల్లాహ్ శిక్షపడిన తరువాత మాకెలాగూ అవకాశ ముండదు కాబట్టి ఆ శిక్షపడక ముందే ఇటువంటి వాటిని నిరోధించడానికి అల్లాహుతాలా మాకిచ్చిన శక్తిమేరకు అల్లాహ్ పేరుతో ప్రయత్నిస్తున్నాము.

ముహమ్మద్(స)వారు బోధించిన శాంతియుత మార్గంలో మీరు కూడా నిరోధించడానికి ప్రయత్నించండి.

**అల్లాహ్ మార్గం వైపునకు ఆహ్వానిద్దాము.**

ఇతర గ్రంథాలతో మాత్రం కాదు.

ఖుర్ఆన్ మరియు సున్నత్ ప్రకారంగానే ఆహ్వానిద్దాం.

నీతి నిజాయితీ, సౌమ్యత, నిస్వార్థంతోనే పిలుద్దాం!

**వాదనలు వద్దు.**

నమాజ్‌పై మనకెటువంటి బాధ్యత ఉందో,
'దావత్'పై కూడా అటువంటి బాధ్యతే మనపై ఉంది.

**రోజూ 5 సార్లు నమాజ్ చేసి, అలా నమాజ్ చేసినందుకుగాను ఎవరి దగ్గరినుండి అయినా డబ్బులు తీసుకుంటున్నామా?**

**మరి 'దావత్' చేస్తున్నామని చెబుతూ ఎందుకు డబ్బులు రాబట్టడానికి ప్రయత్నించాలి?**

"కావున నీవు వారితో అను: "నేను (ఈ ప్రచారానికై) మీతో ఎలాంటి ప్రతిఫలము నడగటం లేదు. కేవలం తాను కోరిన వ్యక్తియే తన ప్రభువు మార్గాన్ని అవలంభించవచ్చు!''

(ఖుర్ఆన్ 25:57)

**తన చేతి సంపాదనతో చేసిన భోజనం కంటే మంచి భోజనం మనిషి ఎప్పుడూ చేయలేదు. దైవప్రవక్త దావూద్(అస) స్వహస్తాలతో పనిచేసి, సంపాదించి భుజించేవారు" అని బోధించారు మహనీయ ముహమ్మద్(స)** (సహీహ్ బుఖారీ)

మానవులకు ధర్మసందేశాన్ని అందించడానికి మరియు సంస్కరించడానికి అల్లాహ్ ప్రవక్తలను పంపారు. దావూద్(అస)వారు స్వహస్తాలతో పనిచేసి సంపాదించుకుంటూ, దావత్ మరియు ఇస్లాహ్ చేశారు. రాజ్యపాలన గావించారు. మహనీయ ముహమ్మద్(స)వారు దావూద్(అస)వారి విషయాన్ని

**ఎందుకు బోధించారో ఆలోచించండి.**

**అందువలననే, 3వ సంచికలో 'దావత్'ను జీవనోపాధిగా చేసుకున్న వారితోగాని, లేదా దావత్‌ను స్వార్థంతో వ్యాపారంగా స్వీకరించి, బిజినెస్ చేసుకునే వారితోనూ, 'శాంతిబాట'కు ప్రత్యక్షంగా గాని, పరోక్షంగా గాని ఎటువంటి సంబంధమూ లేదని ప్రకటించాము. మేము ఆ విధంగా ప్రకటన ఎందుకు చేయవలసి వచ్చిందో, పాఠకులకు ఇన్షాఅల్లాహ్ ఇప్పుడు స్పష్టమై ఉంటుంది.**

**సన్మార్గంవైపు పిలవడం (దావా), నమాజ్ చేసే ప్రతీ ముస్లిముపైనున్న బాధ్యత! మర్చిపోకండి!!**

# ఇంటర్‌నెట్‌లో ఇస్లాం కబుర్లు ❸

**ఇంట్లో ఇంటర్‌నెట్ సౌకర్యమున్న తల్లిదండ్రులు, తమ పిల్లలకు తమ సమక్షంలోనే ఇంటర్‌నెట్‌ను ఉపయోగించుకునేలా అలవాటు చేస్తే, కొంతైనా మన పిల్లలకు జరిగే కీడునుండి తప్పించిన వాళ్ళ మవుతాము.**

ఇంటర్‌నెట్‌లో ఇస్లాం ధర్మాన్ని బోధించే మంచి వెబ్‌సైట్లు ఉన్నాయి. ఉదాహరణకు www.harunyahya.com, www.usislam.org మొ॥వి. ముస్లిములను తప్పుదారి పట్టించేందుకు వేరే మతధర్మానికి చెందినవారు, ఇస్లాం పేరుతో చాలా వెబ్‌సైట్లను నెట్‌లో ఉంచారు.

కొన్ని సున్నితమైన విషయాలను ఈ వెబ్‌సైట్లలో వక్రీకరించి, అమాయక ముస్లిముల మనస్సులలో సందేహాలను కలుగజేస్తారు. అలాంటి వెబ్‌సైట్లు చాలానే ఉన్నాయి. వాటి వివరాలు ఇక్కడ అందించ దలచుకోలేదు. ఎందుకంటే, ఏవి చూడకూడదని చెబుతామో, ఆతృత కొద్దీ ఆ వెబ్‌సైట్లనే ఓపెన్ చేయడం మానవుని బలహీనత - అందులో తప్పుగా ఏం చెప్పారో తెలుసుకుందామని ఓపెన్ చేస్తారు. అలా చేయడం వలన ఆ వైబ్‌సైట్ యొక్క హిట్‌రేట్ పెరుగుతుంది.

హిట్ రేట్ ఎక్కువ అవడం మూలానా ఎవరైనా ఇంటర్‌నెట్‌లో ఇస్లాం గురించి వెతికేటప్పుడు, ఇలాంటి వెబ్‌సైట్లే ప్రారంభంలో వెతికేవారికి కనిపిస్తాయి. అందుకోసమే మంచి వెబ్‌సైట్లను ఎక్కువ సార్లు ఓపెన్ చేసి, క్లోజ్ చేస్తూ ఉండండి.

ఇస్లాంపై కనీస అవగాహన ఉన్న ఇంజినీరింగ్, మెడిసిన్, సైన్స్ చదువుకుంటున్న ప్రపంచంలోని ఎంతో మంది ముస్లిమ్ విద్యార్థులు, తాము తెలుసుకున్న ప్రతీ విషయాన్ని నెట్‌లో ఉంచుతున్నారు.

దివ్య ఖుర్‌ఆన్‌లో 'జ్ఞానం కలవారికి ఎన్నో సూచనలున్నాయని' అల్లాహుతాలా చెబుతున్నారు. చదువుకున్నవారు ఏదో ఒక రంగంలో, వారి స్థాయిని బట్టి జ్ఞానాన్ని కలిగి ఉంటారు. వీరు ఖుర్‌ఆన్ చదువుతున్నప్పుడు వారి జ్ఞానానికి అందే సూచనలు ఆ గ్రంథంలో కన్పించే అవకాశముంది. అంటే జ్ఞానం కలిగి ఆలోచించగలిగే వారికి కనిపించే ఈ సూచనలు, వారిని ఏకైక ఆరాధ్యుని గురించి స్పష్టంగా అర్థం చేసుకునేలా చేస్తాయి.

**అందరినీ ఉద్దేశించిన సూచనలు :** ఖుర్‌ఆన్ గ్రంథంలోని 6,236 వాక్యాలు. మనిషి యొక్క జ్ఞానం ఒక తరం నుండి మరో తరానికి అభివృద్ధి చెందుతూ వస్తుంది. కనిపించే ఆ సూచనలు జ్ఞానంపై ఆధారపడటం వలన, అవి ఆ కాలానికి సరిపోయేలా ఉండవచ్చు.

మనం మన సోదరుని కష్టసుఖాలను తెలుసుకుంటూ ఉంటాము. ఆ సోదరుని కష్టం వినడం వలన మనకి కష్టం రాదు. అతని కష్టాన్ని గట్టెక్కించడానికి మనం చేయగల ప్రయత్నం చేస్తాం. అతనిని ఓదార్చుతాం. అలాగే అతని సుఖాన్ని గురించి తెలుసుకుని సంతోషిస్తాం.

ఆ సోదరుని కష్టం తొలగడానికి అతనికి ఏ పరిష్కార మార్గం దొరికిందో తెలిస్తే, ఒకవేళ మరో సోదరుడు ఎవరికైనా అదే కష్టం వచ్చినప్పుడు, ఈ పరిష్కారం అతనికి కూడా అవసరం కావచ్చు లేదా ఆ పరిష్కారం ఏ విధంగానూ ఉపయోగపడక పోవచ్చు.

ఇదే విధంగా కొందరు విద్యావేత్తలు, వారికి ఖుర్‌ఆన్‌లో కనిపించిన సూచనలను తెలియజేశారు. వారు ఎంతో ఆహ్లాదాన్ని అనుభవించారు. మన సోదరులకు ఆహ్లాదాన్ని కలిగించిన విషయాలను తెలుసుకుందాం. అభూత కల్పనలు, జోక్‌లు, వెటకార విషయాలను చదివే బదులు, ఇలాంటివి చదివి ఆహ్లాదం పొందడం మేలు అని మా వ్యక్తిగత అభిప్రాయం.

ఇలాంటివి ధర్మ ప్రచారానికి వాడవద్దు అని క్రిందటి సంచికలో చెప్పడం జరిగింది. దానిపై ఒక ఆప్తమిత్రుడు ఇలా స్పందించారు. "సినిమాలలో హింసను బాగా చూపించి, చివరిలో హింస మంచిది కాదు అని చెప్పినట్లుంది". కాని మన చుట్టూ ఉన్న పరిస్థితులు ఎప్పుడూ ఒకేలా అనుకూలంగా ఉండవు. ఒక వ్యక్తి వచ్చి 'మీ ముస్లిమ్ సోదరుడు ఒక అద్భుతం గురించి చెప్పాడు. అది కరెక్ట్ కాదు' అని చెప్పగానే, అది విన్నాక మనస్సు బాధపడుతుంది. వెంటనే సమాధానం చెప్పలేని పరిస్థితి. ఆ తరువాత ఎప్పుడో ఆ విషయాన్ని అధ్యయనం చేసి, దానికి జవాబు ఇవ్వగలగవచ్చు. కాని ఆ జవాబును ఆ వ్యక్తికి వెంటనే చెప్పగలిగి ఉంటే చాలా బావుంటుంది కదా!

ఈ రోజున 'ఇస్లాం'పై వ్యతిరేక ప్రచారం - టెర్రరిజం పేరుతో ప్రత్యక్షంగానూ, ఇతర మార్గాల ద్వారా పరోక్షంగానూ జరుగుతుంది. ముస్లిమ్ ముసుగులో కొందరు స్వార్థపరులు, చాపకింద నీరులా ఇస్లాంపై అపోహలను కలుగజేస్తున్నారు.

పోలియో అందరికీ రాదు కదా! ముందుగానే భయపెట్టి వ్యాక్సిన్ ఎందుకు వేసుకోవడం? వచ్చాక చూద్దాంలే! అని అనుకుంటే రిస్క్ తీసుకున్నట్లే కదా!

అలాగే, వ్యాధినుండి కోలుకున్న మన సోదరున్ని పరామర్శించడానికి వెళ్ళినప్పుడు, సాధారణంగా అతని ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకుంటాం. మన సోదరుడు 'ఇప్పుడు చాలా ఆరోగ్యంగా ఉన్నాను' అని చెబుతాడు. మనం సంతోషంతో అతని దగ్గర శలవు తీసుకుని వచ్చేస్తాము.

కొందరయితే 'ఫలానా టేబ్‌లెట్స్ వాడటం వలన నాకిప్పుడు హాయిగా ఉంది' అని చెబుతారు. మనం ఆ టేబ్‌లెట్స్ పేర్లు వ్రాసుకుని, మనకు ఏ వ్యాధి వచ్చినా సరే ఆ టేబ్‌లెట్స్ వాడవచ్చా?

కనీస జ్ఞానమున్నవాడు అలా చేయడు. డాక్టర్ గారిని సంప్రదించి, ఆయన చెప్పిన మందులనే వాడతాడు.

ఇదే విధంగా మన సోదరునికి ఆహ్లాదాన్ని కలిగించిన విషయాలు తెలుసుకోవడం వరకే. మన జ్ఞానాన్ని బట్టి మనకూ సూచనలు కనిపిస్తాయి.

## ఈ నెల ప్రత్యేకం : ఒకే పదం ఒక నియమిత సంఖ్యాలో రావడం

క్రిందటి సంచికలో గేరీ మిల్లర్ (అబ్దుల్ అహద్ ఉమర్)గారు ఖుర్‌ఆన్ గ్రంథంలో పదే పదే వచ్చే పదాల లాజిక్ గురించి చెప్పడం జరిగింది. ఆ వ్యాసానికి కొనసాగింపుగా మరికొందరు సోదరులు అందించిన వివరాలు:

**ఇంటర్‌నెట్ వలన జరిగిన, జరుగుతున్న మేలు అంతా ఇంతా కాదు. ప్రపంచమే ఓ కుగ్రామంగా మారిపోయింది. అయితే ఈ ఇంటర్‌నెట్ వలన కీడు కూడా అదే స్థాయిలో భయపెడుతుంది.**

**ఏడు ఆకాశాలు :**

ఖుర్ఆన్ గ్రంథంలో **ఏడు ఆకాశాల** గురించి **ఏడు** సార్లు చెప్పబడింది.

1. "ఆయనే భూమిలోనున్న సమస్తాన్ని మీ కొరకు సృష్టించాడు : తరువాత తన దృష్టిని ఆకాశాల వైపునకు మరల్చి వాటిని **సప్తాకాశాలుగా** ఏర్పరిచాడు. మరియు ఆయనే ప్రతి విషయానికి సంబంధించిన జ్ఞానం కలవాడు." (ఖుర్ఆన్ 2:29)
2. **సప్తాకాశాలు**, భూమి మరియు వాటిలో ఉన్న సమస్తమూ ఆయన పవిత్రతను కొనియాడుతూ ఉంటాయి. మరియు ఆయన పవిత్రతను కొనియాడనిది, ఆయన స్తోత్రం చేయనటువంటిది ఏదీ లేదు. కాని మీరు వాటి స్తుతిని అర్థం చేసుకోలేరు. నిశ్చయంగా, ఆయన ఎంతో సహనశీలుడు, క్షమాశీలుడు." (ఖుర్ఆన్ 17:44)
3. వారిని అడుగు : "**సప్తాకాశాల** ప్రభువు మరియు సర్వోత్తమ సింహాసనానికి ప్రభువు ఎవరు?" (ఖుర్ఆన్ 23:86)
4. కావున ఆయన వాటిని రెండు రోజులలో **ఏడు ఆకాశాలు**గా నిర్మించాడు, మరియు ప్రతి ఆకాశానికి దాని వ్యవహారాన్ని దివ్యజ్ఞానం ద్వారా నిర్దేశించాడు (ఖుర్ఆన్ 41:12)
5. అల్లాహ్‌యే **సప్తాకాశాలను** మరియు వాటిని పోలిన భూమండలాన్ని సృష్టించి, వాటి మధ్య ఆయన తన ఆదేశాలను అవతరింపజేస్తూ వుంటాడు. నిశ్చయంగా, అల్లాహ్ ప్రతీదీ చేయగల సమర్థుడు మరియు వాస్తవానికి అల్లాహ్ తన జ్ఞానంతో ప్రతిదానిని పరివేష్టించి వున్నాడని మీరు తెలుసుకోవటానికి (ఖుర్ఆన్ 65:12)
6. ఆయనే, ఒక దానిపై ఒకటి **ఏడు ఆకాశాలను** సృష్టించాడు. ఆ అనంత కరుణామయుని సృష్టిలో నీవు ఎలాంటి లోపాన్నీ చూడలేవు. కావాలంటే మరొకసారి చూడు : "ఏమీ? నీకేమైనా లోపం కనిపిస్తుందా?" (ఖుర్ఆన్ 67:3)
7. ఏమీ? మీరు చూడటం లేదా? అల్లాహ్ **ఏడు ఆకాశాలను** ఏ విధంగా అంతస్తులలో సృష్టించాడో! (ఖుర్ఆన్ 71:15)

**షైతాన్** (కీడు నుండి) – (అల్లాహ్‌ను) **రక్షణకై అర్థించడం :**

ఖుర్ఆన్ గ్రంథంలో మానవజాతికి **షైతాన్** శత్రువని చెప్పబడింది. షైతాన్ యొక్క కీడునుండి రక్షణకై అల్లాహ్‌ను ముస్లిములు అర్థిస్తారు.

**ఉదాహరణకు రెండు ఆయత్‌లు :**

1. "మరియు (జ్ఞాపకం చేసుకోండి) మేము దేవదూతలతో : "ఆదమ్‌కు సాష్టాంగ పడండి" అని చెప్పినప్పుడు, ఒక్క **ఇబ్లీస్** తప్ప మిగతా వారందరూ సాష్టాంగపడ్డారు. అతడు జిన్నాతులలోని వాడు. అప్పుడు అతడు తన ప్రభువు ఆజ్ఞను ఉల్లంఘించాడు. ఏమీ? మీరు నన్ను కాదని అతనిని మరియు అతని సంతానాన్ని స్నేహితు (సంరక్షకు)లుగా చేసుకుంటారా? మరియు వారు మీ శత్రువులు కదా! దుర్మార్గులకు ఎంత చెడ్డ ఫలితముంది" (ఖుర్ఆన్ 18:50)
2. ఇలా అను : "నేను మానవుల ప్రభువు, పోషకుడు(అల్లాహ్)యొక్క **శరణుకై వేడుకుంటున్నాను!**" (ఖుర్ఆన్ 114:1)

| | | |
|---|---|---|
| ఇబ్లీస్ | గురించి | 11 సార్లు |
| రక్షణకై అర్థించడం | గురించి | 11 సార్లు |

మానవుని జీవితంలోని ప్రతీక్షణం అల్లాహ్ కరుణపై ఆధారపడి ఉంది. అల్లాహ్ అనుగ్రహం నుండి ప్రతీ మానవున్ని దూరం చేయడానికి ప్రతీ క్షణం షైతాన్ ప్రయత్నిస్తూనే ఉన్నాడు. అందుకని ప్రతీ క్షణం షైతాన్ నుండి అల్లాహ్ యొక్క రక్షణ మనకు కావాలి.

**ఇహలోకం – పరలోకం :**

ఖుర్ఆన్ గ్రంథం రెండు రకాల జీవితాల గురించి తెలియ జేస్తుంది. ఒకటి దున్యా - ఇహలోకం. ఇది కొంతకాలమే. అంటే ఓ నిర్ణీత కాలం వరకే మనం ఇక్కడ ఉంటాం. రెండవది పరలోకం (ఆఖిరత్). దీని కాలం అనంతం. అంటే కలకాలం. ఈ పదాలు ఖుర్ఆన్‌లో సమానంగా ఉన్నాయి.

**ఉదాహరణకు రెండు ఆయత్‌లు :**

1. ప్రతీ ప్రాణి చావును చవి చూస్తుంది. మరియు నిశ్చయంగా, తీర్పు దినమున మీ కర్మల ఫలితంగా మీకు పూర్తిగా ఇవ్వబడుతుంది. కావున ఎవడు నరకాగ్ని నుండి తప్పించబడి స్వర్గంలో ప్రవేశపెట్టబడతాడో! వాస్తవానికి, వాడే సఫలీకృతుడు. మరియు ఇహలోక జీవితం కేవలం మోసపుచ్చే సుఖానుభవం మాత్రమే! (ఖుర్ఆన్ 3:185)
2. నిశ్చయంగా, ఇందులో పరలోక శిక్షకు భయపడే వారికి ఒక సూచన ఉంది. అది సర్వమానవులను సమావేశపరిచే రోజు! ఆ దినమున అందరూ హాజరవుతారు." (ఖుర్ఆన్ 11:103)

| | | |
|---|---|---|
| ఇహలోకం | గురించి | 115 సార్లు |
| పరలోకం | గురించి | 115 సార్లు |

ప్రతీ ముస్లిమ్ ఇహలోకంలో ఏ పని చేస్తున్నా, పరలోకాన్ని దృష్టిలో పెట్టుకునే చేస్తాడు. అందుకేనేమో ఈ రెండు పదాలు ఖుర్ఆన్ గ్రంథంలో సమానంగా వచ్చాయి.

**చెప్పు (ఖుల్) – వారు చెప్పారు (ఖాలూ) :**

ఇక్కడ 'చెప్పు' అంటే ముహమ్మద్(స)వారిని చెప్పమని 'అల్లాహ్' చెబుతున్నారు.

| | | |
|---|---|---|
| (వారికి) చెప్పు | గురించి | 332 సార్లు |
| వారు చెప్పారు | గురించి | 332 సార్లు |

**కరుణ – మార్గాన్ని చూపడం :**

ఎవరికైనా సన్మార్గం దొరికిందంటే ఆ వ్యక్తికి అల్లాహ్ యొక్క కరుణ లభించినట్లే.

"మరియు నిశ్చయంగా, ఇది విశ్వాసులకు మార్గదర్శిని మరియు కారుణ్యం" (ఖుర్ఆన్ 27:77)

రహ్మత్ మరియు హద అనే రెండు పదాలు కలిసి ఉన్న వాక్యాలు ఖుర్ఆన్ గ్రంథంలో 13 ఉన్నాయి.

**నమ్మకం** (రగబ) **- భయం** (రహబ) **:**

**"..... వారు మంచి పనులకోసం ఎక్కువ శ్రమించేవారు. నమ్మకంతోనూ, భయంతోనూ మమ్మల్ని ప్రార్థించేవారు, మా సమక్షంలో వినమ్రులై ఉండేవారు."** (ఖుర్ఆన్ 21:90)

ప్రార్థనలో ఈ రెండూ కలిసి ఉండాలి. ఈ రెండు విరుద్ధమైన ఫీలింగ్స్ బేలన్స్‌లో ఉంటే, అవి మనల్ని నిరాశ నుండి మరియు అహంకారంతో నాశనం కాకుండానూ కాపాడుతాయి.

ఈ రెండు పదాలు ఎనిమిదేసి సార్లు ఖుర్ఆన్ గ్రంథంలో కనిపిస్తాయి.

| | | |
|---|---|---|
| నమ్మకం | గురించి | 8 సార్లు |
| భయం | గురించి | 8 సార్లు |

**గమ్యం** (మసీర్) **- కలకాలం** (అబద) **:**

మన గమ్యం పరలోకం. అక్కడే కలకాలం ఉంటాము.

**ఉదాహరణకు రెండు ఆయత్‌లు :**

1. ''నిశ్చయంగా, మేమే జీవనమిచ్చేవారం మరియు మేమే మరణింపజేసే వారం మరియు మా వైపునకే మీ **గమ్యం** (మీ మరలింపు)'' (ఖుర్ఆన్ 50:43)
2. సమావేశపు రోజున ఆయన మిమ్మల్ని అందరిని సమావేశపరుస్తాడు. అదే లాభనష్టాల దినం. మరియు ఎవడైతే అల్లాహ్‌ని విశ్వసించి సత్కార్యాలు చేస్తాడో, అలాంటి వాని పాపాలను ఆయన తొలగిస్తాడు. మరియు అతనిని క్రింద సెలయేళ్లు ప్రవహించే స్వర్గవనాలలో ప్రవేశింపజేస్తాడు. వారందులో శాశ్వతంగా **కలకాలం** ఉంటారు. అదే గొప్ప విజయం.(ఖుర్ఆన్ 64:9)

| | | |
|---|---|---|
| గమ్యం | గురించి | 28 సార్లు |
| కలకాలం | గురించి | 28 సార్లు |

**సూర్యుడు** (షమ్స్) **- కాంతి** (నూర్)**:**

మనకు కాంతి సూర్యుని నుండి లభిస్తుంది. చంద్రుని నుండి అందే కాంతి కూడా సూర్యునిదే. సూర్యుని నుండి చంద్రునిపై కాంతిపడి, అది పరావర్తనం చెంది మనకు చేరడం ద్వారా చంద్రుడు కనిపిస్తున్నాడు. కాంతికి మరియు వేడికి సూర్యుడే మనకు మూలం. విశ్వంలో 'సూర్యుని'లాగ కాంతినిచ్చే నక్షత్రాలు చాలా ఉన్నాయి. కాని మనకు కాంతినిచ్చేది 'సూర్యుడు'.

కాంతికి సంబంధించిన ఏకవచన పదం 'నూర్' 33 సార్లు, సూర్యుని గురించి 33 సార్లు ఖుర్ఆన్ గ్రంథంలో చెప్పబడింది.

1. ''మరియు ఆయన సూచన (ఆయత్)లలో రేయింబవళ్ళు మరియు సూర్యచంద్రులున్నాయి. మీరు సూర్యునికిగానీ చంద్రునికి గానీ సజ్దా (సాష్టాంగం) చేయకండి, కాని కేవలం వాటిని సృష్టించిన అల్లాహ్‌కు మాత్రమే సజ్దా చేయండి - నిజంగానే మీరు ఆయనను ఆరాధించే వారే అయితే!'' (ఖుర్ఆన్ 41:37)
2. ఓ గ్రంథప్రజలారా! వాస్తవంగా మా ప్రవక్త మీ వద్దకు వచ్చివున్నాడు, మీరు కప్పిపుచ్చుతూ ఉండిన గ్రంథంలోని ఎన్నో విషయాలను అతను మీకు బహిర్గతం చేస్తున్నాడు. మరియు ఎన్నో విషయాలను ఉపేక్షిస్తున్నాడు. వాస్తవంగా మీ కొరకు అల్లాహ్ నుండి జ్యోతి (**నూర్**) మరియు ఒక స్పష్టమైన గ్రంథం (ఈ ఖుర్ఆన్) వచ్చి ఉన్నది. (ఖుర్ఆన్ 5:15)

| | | |
|---|---|---|
| సూర్యుడు | గురించి | 33 సార్లు |
| నూర్ | గురించి | 33 సార్లు |

**న్యాయం** (ఖిస్త్) **- అన్యాయం** (జుల్మ్)**:**

న్యాయంగా తూచేటటువంటి త్రాసులను మేము ప్రళయం నాడు ఏర్పాటు చేస్తాము. ఏ వ్యక్తికైనా రవ్వంత అన్యాయం కూడా జరగదు. ఎవరైనా ఆవగింజంత పనిని చేసి ఉన్నా, దానిని మేము ముందుకు తీసుకువస్తాము. లెక్కచూపటానికి మేము చాలు. (ఖుర్ఆన్ 21:47)

న్యాయం అనే పదం ఖుర్ఆన్‌లో 15 సార్లు 'infinitive form'లో వచ్చింది. దీనికి వ్యతిరేకమైన 'అన్యాయం' కూడా అదే 'form'లో 15 సార్లు వచ్చింది.

| | | |
|---|---|---|
| అన్యాయం | గురించి | 15 సార్లు |
| న్యాయం | గురించి | 15 సార్లు |

**నష్టం/కీడు** (దర్ర) **- లాభం/మేలు** (నఫ్అ)**:**

ఈ రెండు పదాలు ఖుర్ఆన్‌లో 9 సార్లు వచ్చాయి. అయితే విశేషమేమిటంటే, 9 సార్లలో, 8 సార్లు ఈ రెండు పదాలు కలిసి వచ్చాయి. తరువాత ఒక్కొక్క పదం విడివిడిగా ఒక్కొక్కసారి వచ్చింది.

ఉదాహరణ :

1. ఇలా అను : ''ఏమీ? మీరు అల్లాహ్‌ను వదిలి, మీకు **నష్టం**గానీ, **లాభం**గానీ చేసే అధికారం లేని దానిని ఆరాధిస్తారా? మరియు కేవలం అల్లాహ్ మాత్రమే సర్వం వినేవాడు, సర్వజ్ఞుడు. (ఖుర్ఆన్ 5:76)
2. (ఓ ప్రవక్తా!) వారితో ఇలా అను : ''అల్లాహ్ కోరితే తప్ప నా స్వయానికి నేను, **లాభం**గానీ, **నష్టం**గానీ చేసుకునే అధికారం నాకు లేదు. .....'' (ఖుర్ఆన్ 7:188)
3. (ఓ ప్రవక్తా!) వారితో ఇలా అను : ''అల్లాహ్ కోరితే తప్ప! నా కొరకు నేను **కీడు** గానీ, **మేలు** గానీ చేసుకోగలిగే శక్తి నాకు లేదు. ప్రతి సమాజానికి ఒక గడువు నియమింపబడి ఉంది. వారి గడువు వచ్చినప్పుడు వారు ఒక ఘడియ వెనకగానీ లేక ముందుగానీ కాలేరు'' (ఖుర్ఆన్ 10:49)

4. ఇలా అడుగు : "భూమ్యాకాశాలకు ప్రభువు ఎవరు?" నీవే ఇలా జవాబివ్వు : "అల్లాహ్!" తరువాత ఇలా అను : "అయితే మీరు ఆయనను వదలి తమకు తాము **మేలు** గానీ, **కీడు**గానీ చేసుకోలేని వారిని, మీకు సహాయకులుగా (సంరక్షకులుగా) ఎన్నుకుంటారా?" ఇంకా ఇలా అడుగు : "ఏమీ? గ్రుడ్డివాడు మరియు చూడగలిగే వాడూ సమానులు కాగలరా? లేక అంధకారం మరియు వెలుగు సమానమేనా? లేక వారు (అల్లాహ్‌కు) సాటి కల్పించిన వారు కూడా అల్లాహ్ సృష్టించినట్లు ఏమైనా సృష్టించారా, అందువలన సృష్టి విషయంలో వారికి సందేహం కలిగిందా?"

   వారితో అను : "అల్లాహ్‌యే ప్రతిదానికి సృష్టికర్త మరియు ఆయన ఒక్కడు, ప్రబలుడు (తన సృష్టిపై సంపూర్ణ అధికారం గలవాడు) (ఖుర్ఆన్ 13:16)

5. ఏమీ? అది వారికెలాంటి సమాధాన మివ్వజాలదనీ మరియు వారికెలాంటి **కీడు** గానీ, **మేలు** గానీ చేయజాలదని వారు చూడటం లేదా? (ఖుర్ఆన్ 20:89)

6. అయినా వారు ఆయనకు బదులుగా ఏమీ సృష్టించలేని మరియు తామే సృష్టింపబడిన వారిని ఆరాధ్యదైవాలుగా చేసుకున్నారు మరియు వారు తమకు తాము ఎట్టి **నష్టం**గానీ, **లాభం**గానీ చేసుకోజాలరు. మరియు వారికి మరణం మీద గానీ, జీవితం మీద గానీ మరియు పునరుత్థాన దినం మీద గానీ ఎలాంటి అధికారం లేదు. (ఖుర్ఆన్ 25:3)

7. (అప్పుడు వారితో ఇట్లనబడుతుంది) : "అయితే ఈ రోజు మీరు ఒకరికొకరు **లాభం**గానీ, **నష్టం**గానీ చేకూర్చుకోలేరు" మరియు మేము దుర్మార్గులతో : "మీరు తిరస్కరిస్తూ ఉండిన నరకబాధను రుచి చూడండి!" అని పలుకుతాము. (ఖుర్ఆన్ 34:42)

8. "..... వారు తమ హృదయాలలో లేనిది తమ నాలుకలతో పలుకు తున్నారు. వారితో ఇలా అను : "ఒకవేళ అల్లాహ్ మీకు **నష్టం** చేయదలిస్తే, లేదా **లాభం** చేయదలిస్తే, ఆయన నుండి మిమ్మల్ని తప్పించగల శక్తి ఎవరికుంది? వాస్తవానికి మీరు చేసేవంతా అల్లాహ్ బాగా ఎరుగును!

విడివిడిగా

   వారితో ఇలా అను : "నిశ్చయంగా మీకు **కీడు** చేయడంగానీ, లేదా సరైన మార్గం చూపడం గానీ నా వశంలో లేదు" (ఖుర్ఆన్ 72:21)

   "... మీ తల్లిదండ్రులు మరియు మీ సంతానంలో **ప్రయోజనం** రీత్యా మీకు ఎవరు ఎక్కువ సన్నిహితులో, మీకు తెలియదు. ఇది అల్లాహ్ నియమించిన విధానం నిశ్చయంగా అల్లాహ్ సర్వజ్ఞుడు, మహా వివేకవంతుడు" (ఖుర్ఆన్ 4:11)

**సబ్త్:**

ఈ సబ్బత్ అనేది యూదుల కొరకు మాత్రమే విధించబడింది. సబ్స్ 7వ రోజు వస్తుంది. వారంలో మొదటి రోజు ఆదివారం. కాబట్టి 7వ రోజు శనివారం అవుతుంది. వారంలోని 7 రోజులలో 6 రోజులు సాధారణంగానే జీవించవచ్చు. 7వ రోజు వేట నిషిద్ధం. వారంలో 7వ రోజున వచ్చే ఈ 'సబ్త్' పదం ఖుర్ఆన్ గ్రంథంలో 7 సార్లు వచ్చింది.

1. మరియు శనివారం **(సబ్త్)** శాసనం ఉల్లంఘించిన మీ వారి గాథ మీకు బాగా తెలుసు. మేము వారిని "నీచులైన కోతులు కండి!" అని అన్నాము. (ఖుర్ఆన్ 2:65)

2. ఓ గ్రంథ ప్రజలారా! మీ వద్ద నున్న గ్రంథాన్ని ధృవపరుస్తూ, మేము అవతరింపజేసిన (ఈ ఖుర్ఆన్‌ను) విశ్వసించండి, మేము మీ ముఖాలను వికృతం చేసి వాటిని వెనక్కి త్రిప్పక ముందే (నాశనం చేయకముందే) లేక మేము **సబ్త్** వారిని శపించి (బహిష్కరించి) నట్లుగా మిమ్మల్ని కూడా శపించక (బహిష్కరించక) ముందే (దీనిని విశ్వసించండి). ఎందుకంటే అల్లాహ్ ఆజ్ఞ తప్పకుండా నిర్వహించబడుతుంది. (ఖుర్ఆన్ 4:47)

3. మరియు మేము వారిపై 'తూర్ పర్వతాన్ని ఎత్తి ప్రమాణం తీసుకున్నాము. మేము వారితో : "సాష్టాంగపడుతూ (వంగుతూ) ద్వారంలో ప్రవేశించండి." అని అన్నాము. మరియు : "శనివారపు **(సబ్త్)** శాసనాన్ని ఉల్లంఘించకండి." అని కూడా వారితో అన్నాము. మరియు మేము వారితో ధృడమైన ప్రమాణం కూడా తీసుకున్నాము. (ఖుర్ఆన్ 4:154)

4. మరియు సముద్రతీరము నందున్న ఆ నగర (వాసులను) గురించి వారిని అడుగు : వారు శనివారపు **(సబ్త్)** ధర్మాన్ని ఉల్లంఘించేవారు. ఆ శనివారం **(సబ్త్)** రోజుననే చేపలు వారి ముందుకు ఎగిరెగిరి నీటిపైకి వచ్చేవి. మరియు శనివారపు **(సబ్త్)** ధర్మం పాటించని రోజు (చేపలు) వచ్చేవి కావు. వారి అవిధేయతకు కారణంగా మేము వారిని ఈ విధంగా పరీక్షకు గురిచేశాము. (ఖుర్ఆన్ 7:163)

5. వాస్తవానికి, శనివారం **(సబ్త్)** విషయంలో అభిప్రాయ బేధాలు కలిగి ఉన్నవారికే అది విధించబడింది. మరియు నిశ్చయంగా, మీ ప్రభువు పునరుత్థాన దినమున వారి మధ్య ఉన్న భిన్నాభిప్రాయాలను గురించి తీర్పు చేస్తాడు (ఖుర్ఆన్ 16:124)

సోదరులు తెలిపిన అద్భుత సూచనలను మేము ఖండించడం లేదు. కాని 'అల్లాహ్ ధర్మం వైపు ప్రజలను పిలవడానికి', ఈ వ్యాసంలో ఇచ్చిన విధంగా పదాలు లేకపోయినా సరే, ఖుర్ఆన్ గ్రంథం అద్భుత గ్రంథమే! ముహమ్మద్(స)వారు అద్భుతాల గురించి చెప్పి పిలవలేదు.

ఆయన(స) చేసిన అద్భుతాలు చాలానే ఉన్నాయి. కాని వాటిని ఉపయోగించలేదు. ఆ అద్భుతాలను చూసిన అనుచరులలో విశ్వాసం మరింత ధృడంగా మారింది. అందుకోసమే, దావాలో అద్భుతాలను ఉపయోగించ వద్దని మేము చెప్పడానికి కారణం. ఇవి విశ్వాసుల విశ్వాసానికి పోషకాలు కావచ్చని మా అభిప్రాయం.

*ఏ ధర్మాన్ని కించపరిచే ఉద్దేశ్యం మాకు లేదు. అన్ని ధర్మాలను గౌరవిస్తున్నాం*

# టెర్రరిజం

- క్రైస్తవ టెర్రరిజం ?
- సిఖ్ఖు టెర్రరిజం ?
- యూదు టెర్రరిజం ?
- కమ్యూనిస్ట్ టెర్రరిజం ?
- హిందూ టెర్రరిజం ?
- ఇస్లామిక్ టెర్రరిజం ?

*తీవ్రవాదానికి, మత ధర్మానికి ఏ విధమైన సంబంధం లేదు.* ✓

## టెర్రరిజం అనేది ముస్లిములకే స్వంతమన్నట్లు, మీడియా ఎందుకు ముస్లిములనే టార్గెట్‌గా పెట్టుకుంది?

తీవ్రవాదాన్ని 'ముస్లిము'లుగా మేము ఖండిస్తున్నాం. మానవులకు అపకారాన్ని తలపెట్టే ఏ పనినైనా మేం వ్యతిరేకిస్తాం. మానవులందరూ ఒకే జంట యొక్క వారసులని, ఖుర్'ఆన్ ద్వారా తెలుసుకుని ప్రపంచ ప్రజలందరినీ వారు హిందువులైనా, క్రైస్తవులైన లేక మరే ధర్మానికి చెందిన వారైనా సరే, వారిని మా సోదరులుగానే భావిస్తున్నాం. మా సోదరులపై జరిగే ఎటువంటి హింసనైనా నిర్ద్వందంగా ఖండిస్తున్నాం. కాని మీడియా వారి రెండు నాలుకల ధోరణిని వివరించాలనేది ఈ శీర్షిక యొక్క ప్రధానోద్దేశం కాబట్టి ఈ శీర్షికలో మీడియా భాషనే వాడుతున్నాం. మా భాష మాత్రం కాదు. వేరే ధర్మం వారి ఎవరికైనా బాధ కలిగితే, మీడియా వారి వలన ముస్లిములకు కూడా అంతే బాధ కలిగిందని అర్థం చేసుకుని, కొంత మంది ప్రోద్భలంతో మీ తోటి ముస్లిం సోదరులపై అనాగరికంగా వ్రాస్తున్న మీడియా వ్రాతలను ఖండించమని కోరుతున్నాం.

**5 & 6**

## అమెరికాలో జరిగిన తీవ్రవాద దాడులు

**1970-1980 మధ్యకాలంలో అమెరికా, బ్రిటన్ లలో జరిగిన దాడులు**


**ప్రపంచంలో జరిగిన మొత్తం దాడులు = 141**

(అందుబాటులోనున్న సమాచారం ప్రకారం)




**అమెరికాలో = 31**

**బ్రిటన్‌లో = 24**




**అమెరికాలో వివిధ కాలాలలో జరిగిన తీవ్రవాద దాడులు (శాతంలో)**

| | | |
|---|---|---|
| **1800 - 1900** | ⇨ | **17%** |
| **1901 - 1970** | ⇨ | **35%** |
| **1971 - 1980** | ⇨ | **22%** |

***Source :*** *Internet [http://en.wikipedia.org/wiki/List_of_terrorist_incidents]*
***Data Analysis & Graphics :*** *Dr. N. Srinivasa Rao*

**ఖుర్'ఆన్ గ్రంథ అవతరణ మొదలైన తరువాత 1380 సం॥ల వరకూ 'ఇస్లామిక్' తీవ్రవాదం అనే పదం ఎక్కడా ఉపయోగించ బడలేదు. గత 20 సంవత్సరాలుగా ఈ పదాన్ని ఉపయోగిస్తున్నారు. 'ఇస్లాం'కి తీవ్రవాదానికి అసలు సంబంధమే లేదని వివేకం గలవారికి సులభంగా అర్థమౌతుంది.**

| దాడులు జరిగిన కాలం | అమెరికాలో జరిగిన దాడులు | ప్రపంచంలో జరిగిన దాడులు |
|---|---|---|
| 19వ శతాబ్దం | | |
| 1800 - 1900 | 5 | 29 |
| 20వ శతాబ్దం | | |
| 1901 - 1950 | 8 | 26 |
| 1951 - 1960 | 5 | 9 |
| 1961 - 1970 | 5 | 16 |
| 1971 - 1980 | 31 | 141 |
| **Total** | **54** | **221** |

- ప్రపంచంలో జరిగే దాడులలో 4వ వంతు దాడులు కేవలం అమెరికాలోనే జరుగుతున్నాయి.
- 20 శతాబ్దంలో మొదటి 70 సంవత్సరాలలో 18 దాడులు అమెరికాలో జరగగా, అదే అమెరికాలో ఆ తరువాయి 10 సంవత్సరాలలో 31 దాడులు జరిగాయి.
- ప్రపంచంలో 3వ వంతు దాడులు అమెరికా మరియు బ్రిటన్ దేశాలలోనే జరుగుతున్నాయి.
- 1865 - 1877 సంవత్సరాల మధ్యకాలంలో, అంటే 12 సంవత్సరాల కాల వ్యవధిలో దాదాపు **3,000 మందిని అమెరికాలో** చంపివేశారు. ఆ దాడులకు కారకులెవరో 2వ సంచికలో వివరించడం జరిగింది.

**ఈ మధ్యనే బేబీ 'వైష్ణవి'ని కిడ్నాప్ చేసి, ఇద్దరు రాక్షసులు ఎంత కిరాతకంగా హత్య చేశారో తెలుసుకున్న ప్రజలు తీవ్ర ఆగ్రహంతో వారిని కూడా అలాగే చంపాలని ప్రతిస్పందించడం పాఠకులకు తెలుసు. ఈ ప్రజలే కనుక అమెరికాలో నల్లజాతీయులపై జరిగిన దారుణ మారణకాండ గురించి తెలుసుకుంటే, అమెరికా అంటే ఎలాంటి రాక్షసరాజ్యమో వారికి స్పష్టమౌతుంది.**

**అమెరికన్ ఇంటెలిజెన్స్ :**

మన దేశంలో తీవ్రవాదులు దాడిచేసినపుడు, మీడియాలో ఎన్నో కథనాలు వస్తుంటాయి. మేధావులు తమ కలాలను మన కేంద్ర ప్రభుత్వం మీద ఎక్కుపెడతారు.

అమెరికాను చూసి నేర్చుకోమని సలహా ఇస్తారు. ఒక్క టెర్రరిస్ట్ ఎటాక్ జరగగానే, అమెరికా అప్రమత్తమై ఎన్ని జాగ్రత్తలు తీసుకుందోనని మన ప్రభుత్వాన్ని కలంతో చీల్చి చెండాడుతారు.

ఈ మేధావుల మాట నిజమేనా?

వ్యాసం ప్రారంభంలో ఇచ్చిన వివరాలను బట్టి, అమెరికాలో తీవ్రవాద దాడులు 19 శతాబ్దం నుండి జరుగుతూనే ఉన్నాయి. ఇప్పటికి 50 కంటే ఎక్కువే దాడులు అక్కడ జరిగాయి. దాడులు జరగడం అమెరికాలో కొత్తేమీ కాదు.

ఈ మధ్యనే ఒక నైజీరియన్‌ను పట్టుకున్నారు. అమెరికాయే తమ ఇంటెలిజెన్స్ ఫెయిలైందని స్వయంగా ప్రకటించింది. అమెరికా, బ్రిటన్ ప్రభుత్వాధినేతల అభిప్రాయం ప్రకారం, అమెరికా ఇంటెలిజెన్స్ 'ఇరాఖ్' విషయంలో కూడా ఫెయిలైంది. అమెరికాలోని ట్విన్ టవర్స్ విషయంలో కూడా ఇంటెలిజెన్స్ ఫెయిలైంది.

ప్రపంచంలో మేటి టెక్నాలజీని కలిగియున్న అమెరికా ఇంటెలిజెన్స్ అంత అసమర్థంగా పనిచేస్తుందా?

ఒకవేళ అమెరికా ఇంటెలిజెన్స్ చాలా సమర్థవంతమైంది అయితే, ఈ నైజీరియన్ తీవ్రవాది - నిజమైన తీవ్రవాది కాకపోవచ్చు. డమ్మీ తీవ్రవాది అయి ఉంటాడు. అలాగే అమెరికాలోని ట్విన్ టవర్స్ కూల్చివేత కూడా తీవ్రవాదుల పని కాకపోవచ్చు.

ట్విన్ టవర్స్ కూల్చివేసినది తీవ్రవాదులు కాదంటూ ఎందరో అమెరికన్ శాస్త్రవేత్తలు, ఇంజినీర్లు రిపోర్ట్‌లను తయారుచేసి, ప్రజలకు తెలియజేసే ఉద్దేశ్యంతో ఇంటర్‌నెట్‌లో వీడియో క్లిప్పింగ్స్‌తో సహా ఉంచారు.

**డేవిడ్ హెడ్లీ :**

హెడ్లీ గురించి ఈ మధ్యకాలంలో మీడియాలో చాలా వార్తలొచ్చాయి. నిజానికి ఇతను పాకిస్తానీ అని, అమెరికాలో స్థిరపడి మతం మార్చుకున్నట్లు అమెరికా మీడియా వార్తలను బట్టి తెలుస్తుంది. అతనికి గెడ్డం లేదు. అమెరికాలో మాదక ద్రవ్యాల స్మగ్లింగ్ చేస్తుండేవాడట. ఇతడు మిగిలిన స్మగ్లర్లను పట్టించడానికి అంగీకరించడంతో అమెరికా ప్రభుత్వం ఇతనికి శిక్షనుండి తప్పించిందట.

ముంబై తీవ్రవాద దాడిలో పట్టుబడిన 'కసబ్', హెడ్లీని గుర్తుపట్టాడట. హెడ్లీ కూడా తీవ్రవాదేనని, ముంబైలో జరిగిన దాడి జరగడానికి ముందుగానే, హొటల్‌కి అతను వచ్చినట్లు చెబుతున్నారు.

ఈ విషయాలన్నింటిని అమెరికా ప్రభుత్వం ఎంతో అమాయకంగా చెబుతున్నా, ఇందులో ఏదో తిరకాసు ఉందని ఎలాంటివారికైనా అనుమానం కలగడంలో ఆశ్చర్యమేమీ లేదు.

1. **డేవిడ్ హెడ్లీ అమెరికా తరపున పని చేశాడు. అమెరికా ప్రభుత్వానికి స్మగ్లర్స్‌ను పట్టుకోవడంలో సహాయం చేశాడు.**
2. **కసబ్‌కి, హెడ్లీకి సంబంధముంది. హెడ్లీకి ముంబై దాడితో సంబంధముంది.**
3. **హెడ్లీ మతం మార్చుకున్నాడు. ఇతను మతం మార్చుకున్నా, మార్చుకోకపోయినా సరే ఇతను ముస్లిమ్ కాడు. ఎందుకంటే ఇస్లాంలో త్రాగుడు, మాదకద్రవ్యాలు నిషేధం. కాబట్టి హెడ్లీ ముస్లిమ్ కాడు.**
4. **'ఇస్లాం'పై బురద చల్లడానికి హెడ్లీని ముస్లిమ్‌గా అమెరికా చూపెడుతుందనడంలో ఎటువంటి సందేహం లేదు.**

హెడ్లీకి ముంబైదాడితో సంబంధముంటే, దాడికి పూర్వం నుండి అమెరికా తరపున పనిచేస్తున్నాడు కనుక, ముంబైలో జరిగిన దాడి అమెరికాయే చేయించి ఉండవచ్చు. అమెరికా హస్తముందో లేదో తెలుసుకోవడానికి ప్రయత్నించే ధైర్యం మీడియాకు లేదు, ఏ దేశానికీ కూడా లేదు. ఒకవేళ దాడిలో అమెరికా హస్తమున్నా, అమెరికాను ఒక్కమాట అనడానికి కూడా ఏ దేశానికి ధైర్యం లేదు.

ఇరాఖ్‌లో విధ్వంసకర మారణాయుధాలు ఉన్నాయని చెబుతూ, అవి లేవని చెప్పినవారి మాటలను వినకుండా, సాక్ష్యాలున్నాయని బుకాయించి, 12 లక్షలమందికి పైగా ఇరాఖీయులను చంపించిన అమెరికాను అడిగే సాహసం ఎవరికి ఉంది?

పోనీ ఒకవేళ ముంబై దాడిలో అమెరికా ప్రమేయం లేదనుకుందాం. అమెరికా చెప్పిన ప్రకారం 'హెడ్లీ'ని ముస్లిమ్‌గానే భావిద్దాం. హెడ్లీకి గెడ్డం లేదు. పేరు చూస్తే ముస్లిం పేరు కాదు. అయినా సరే అతను ముస్లిం తీవ్రవాది అని అమెరికా చెబుతుంది. ఇదే కనుక నిజమైతే,

అమెరికన్ ఎయిర్‌పోర్ట్‌లో తనిఖీ చేసేటప్పుడు,

1. **పేరును బట్టి తనిఖీ చేయకూడదు. ముస్లిమ్‌పేరు లేనివాడు కూడా తీవ్రవాది కావచ్చు. ఎందుకంటే హెడ్లీలు, ఇడ్లీలు కూడా తీవ్రవాదులే కదా!**

2. **గెడ్డాన్ని బట్టి, వేసుకున్న డ్రెస్‌ని బట్టి కూడా తనిఖీ చేయకూడదు. ఎందుకంటే హెడ్లీకి గెడ్డం లేదు. అతని డ్రెస్ స్టైల్ కూడా ముస్లిమ్ డ్రెస్ స్టయిల్ కాదు.**

మరి అమెరికన్ ఎయిర్‌పోర్ట్‌లలో **ముస్లిములను** ఎందుకు ప్రత్యేకంగా **అవమానించే ధోరణిలో** తనిఖీ చేస్తున్నారు?

పై విషయాలను బట్టి ఆలోచిస్తే క్రింది చెప్పిన రెండింటిలో ఏదో ఒకటి నిజం కావాలి.

1. **అమెరికాయే తీవ్రవాద దాడులను ప్రోత్సహిస్తుంది.** లేదా

2. **మత దురభిమానంతో ముస్లిములను అవమానపరుస్తుంది.**

పై రెండింటిలో ఏది నిజమైనా సరే, సభ్య సమాజం అమెరికాను చీదరించుకోవాలి.

అమెరికా, బ్రిటన్ దేశాలు రోగ్ దేశాలని, వారు చేసే పనులను బట్టి సులభంగానే తెలుస్తుంది. అమెరికా ప్రభుత్వ ప్రకటనలో నిజాయితీ ఉండదు.

కాని అమెరికాలో ఎందరో నిజాయితీపరులుండవచ్చు. ఎందరో మానవతా వాదులుండవచ్చు. అమెరికా ప్రభుత్వానికి వ్యతిరేకంగా, అమెరికా యొక్క రాక్షసనీతిని ఎండగడుతూ ఎందరో అమెరికన్లు సాక్ష్యాలతో సహా నివేదికలను తయారుచేశారు. ఇవన్నీ కూడా ఇంటర్‌నెట్‌లో అందరికీ అందుబాటులో ఉన్నాయి. వీటిపై మన మీడియా విశ్లేషించదు.

అమెరికా ప్రభుత్వానికి వ్యతిరేకంగా వ్రాసిన అన్ని వ్రాతలు నిజం కావచ్చు లేదా నిజం కాకపోవచ్చు. నిజనిజాలు తేల్చగలిగే ఏజెన్సీలు గాని, దేశాలు గాని ముందుకు ధైర్యంగా రాగలవా? సరే, వాటిని మీ ముందుంచుతాం. వివేకంతో మీరే ఆలోచించండి.

"తీవ్రవాదం" అంటే ఈ రోజుల్లో "అల్-ఖైదా" లేదా "అల్-ఖైదా" అంటే "తీవ్రవాదం" అనుకునే విధంగా అమెరికా ప్రభుత్వం ప్రపంచ ప్రజలను నమ్మించడంలో విజయం సాధించిందని చెప్పవచ్చు. అమెరికా చరిత్రలో దీనిని అతి గొప్ప విజయంగా చెప్పవచ్చు. ఎందుకంటే వీరు ప్రపంచాన్ని అంత గొప్పగా నమ్మించగలిగారు కాబట్టి.

**నిజానిజాలేమిటి? అమెరికా ఆంతర్యమేమిటి?**

అల్-ఖైధా అంటే ఏమిటి? ఈ సంస్థను ప్రారంభించింది ఎవరు?
వెనుక ఉండి ఆ సంస్థకు ఆర్థికంగా సహకరించిన వారెవరు?
ఈ సంస్థ ఎప్పుడు ప్రారంభమైంది?
ఆ సంస్థ యొక్క లక్ష్యాలు ఏమిటి?

**అల్-ఖైధా అంటే Database**

బ్రిటిష్ ఫారిన్ సెక్రటరీ రాబిన్ కుక్ 'House of Commons'కి ఏమని నివేదించారంటే, "Alqaeda" is not really a terrorist group but a database of international mujaheddin and arms smugglers used by the CIA and Saudis to funnel guerrillas, arms, and money into Soviet occupied Afganisthan."

అల్-ఖైదా అనేది నిజానికి తీవ్రవాద సంస్థ కాదు. సోవియట్ రష్యా ఆక్రమించిన ఆఫ్ఘనిస్తాన్‌లో పోరాడేవారికిఆయుధాలను, డబ్బును సరఫరా చేయడానికి, అంతర్జాతీయ ముజాహిదీన్ మరియు ఆయుధ స్మగ్లర్‌ల యొక్క డేటాబేస్. ఈ డేటాబేస్‌ని ఏర్పాటుచేసింది అమెరికా గూఢచారి సంస్థ - **CIA.**

**తన శత్రుదేశమైన 'రష్యా'కు వ్యతిరేకంగా పోరాడేవారికి సహాయం చేయడానికి 'అల్-ఖైదా'ను తయారుచేసింది అమెరికా ప్రభుత్వమే!**

ఫ్రెంచ్ మిలటరీ ఇంటెలిజెన్స్ యొక్క మాజీ ఏజెంట్ 'Pierre Henry Bunel' వ్రాసిన వ్యాసంలో చాలా వివరాలున్నాయి. ఆ వాస్తవాలలోని కొన్నింటిని ఈ సంచికలో మీ ముందుంచుతున్నాం.

ఇంగ్లీష్ పదమైన 'DATABASE'కి సరిపోయే అరబీ పదం 'ఖైదతిల్ ముతియాత్'. కాని అరబ్బ్ సాధారణంగా దీనికోసం చిన్న షార్ట్‌పదాన్ని ఉపయోగిస్తారు. అదే 'అల్-ఖైదా'. అంటే 'బేస్' (BASE).

ఒసామాబిన్ లాడెన్ ఆఫ్ఘనిస్తాన్‌లో అమెరికన్ ఏజెంట్‌గా నున్నప్పుడు, అల్-ఖైదా ఇంట్రానెట్ కోడ్ చేయబడిన లేదా రహస్య మెస్సేజ్‌ల ద్వారా గొప్ప సమాచార వ్యవస్థగా ఉండేది.

అల్-ఖైదా అనేది ఓ తీవ్రవాద సంస్థగాని లేదా ఒసామాబిన్ లాడెన్ యొక్క వ్యక్తిగత ఆస్తిగాని కాదు. 2003లో టర్కీలో జరిగిన దాడులు, ప్రాంతీయ దాడులే. ఈ దాడులు టర్కీ గవర్నమెంట్‌ను, ముఖాముఖి బ్రిటన్, ఇస్రాయెల్ వారిని కూడా ఇరకాటంలో పెట్టాయి. ఈ దాడులు

నిజానికి అక్కడి ప్రధానమంత్రిని శిక్షించడానికి చేసినవి. ఇవి అంతర్జాతీయ దాడులు కావు.

డబ్బులిచ్చి గూండాలతో దాడులు చేయించడం మన దేశంలో అయితే సామాన్యమైన విషయమే. అది మనకు కొత్తేమీ కాదు. అదేవిధంగా లోకల్ గూండాలతో భారీ స్థాయిలో తమకు వ్యతిరేకమైన సంస్థలపై దాడులు చేయించి, అల్-ఖైదా చేసినట్లు చెప్పడం కూడా జరిగిందని కొందరు అభిప్రాయ పడుతున్నారు. నిజం అల్లాహ్‌కే తెలుసు.

**తీవ్రవాదంపై పోరు ధనార్జన కోసమా?!**

'www.thetruthseeker.co.uk' వెబ్‌సైట్ ఎడిటర్ నొక్కి వక్కాణించి చెప్పిన మాటలు :

**అల్-ఖైదా పేరుతో ఏదైనా ఇస్లామీయ సైన్యంగాని టెర్రరిస్ట్ సంస్థగాని లేదు. ఇది నిజం. ఈ విషయం ఏ ఇంటెలిజెన్స్ ఆఫీసర్‌కయినా తెలుసు. టి.వి. చూసేవారిని నమ్మించడానికి చేస్తున్న తప్పుడు ప్రచారమిది.**

తీవ్రవాదంపై పోరుకి ఏకైక అంతర్జాతీయ నాయకత్వం అవసరమని టి.వి. చూసేవాడిని నమ్మించడానికి చేస్తున్న ఈ ప్రోపగాండ వెనుకనున్న దేశమే అమెరికా. 'తీవ్రవాదంపై అమెరికా పోరు'కి లోపాయికారి చర్చలు జరిపేవారు దీని ద్వారా సొమ్ము చేసుకుంటున్నారు.

ఇంతేకాకుండా, బుష్ పలుకుబడి ఉన్న బ్యాంక్ పేర్లు, వాటినుండి డబ్బు ఎలా గెరిల్లా పోరాటం చేసేవారికి అందుతుందో మొదలైన వివరాలను ఆ వెబ్‌సైట్‌లో ఉంచారు.

మరో వెబ్‌సైట్ (http://english.pravada.ru)లో *Joseph John Hrevnack* ఇలా అంటున్నారు :

**'అల్-ఖైదా' అనేదే లేదని, అది కేవలం బుష్ ప్రభుత్వం తయారుచేసిన శతృవేనని.**

సెప్టెంబర్ 11, 2001 కి ముందు సగటు అమెరికన్‌కి అల్-ఖైదా గురించి తెలుసా? జార్జ్ డబ్ల్యు. బుష్ కుటుంబం మరియు ఒసామా బిన్ లాడెన్ మధ్య వ్యాపార సంబంధాలున్నాయని. తీవ్రవాదంపై పోరు ద్వారా వారు ధనాన్ని సంపాదిస్తున్నారని తెలుసా? అని ఆయన ప్రశ్నిస్తున్నారు.

అంతేకాకుండా ఇలా ఆలోచించమంటున్నారు : టెక్నాలజీ పరంగా అంతగా అభివృద్ధి చెందని అల్‌ఖైదా అనే ఓ గ్రూపుకి నిజంగా అంత గొప్ప ఆర్గనైజేషనల్ స్ట్రక్చర్ ఉందా? ఒకవేళ అంత గొప్ప ఆర్గనైజ్డ్ స్ట్రక్చర్ గనుక అల్-ఖైదాకు గనుక ఉంటే, సెప్టెంబర్ 11 తరువాత అమెరికాపై మరలా దాడి చేసి ఉండేది. **అమెరికాలో టెర్రరిస్ట్ సెల్స్ ఎక్కడెక్కడున్నాయి?** బుష్ అధికారంలో ఉండగా అలాంటి ఒక్క టెర్రరిస్ట్ సెల్‌ను కూడా పట్టుకోలేదు.

పాఠకులలో చాలామంది ట్విన్‌టవర్స్ కూలిపోయే సంఘటనను టి.వి.లో చూసివుంటారు. ఆ పని చేసింది తామేనని అల్-ఖైదా ప్రకటించ లేదు. ఆ పని వాళ్లే చేసి ఉంటే గర్వంగా ప్రకటించి ఉండేవారు కదా!

1979 మధ్యకాలంలో ఆఫ్ఘనిస్తాన్‌లో సోవియట్ రష్యా ఆక్రమణకు వ్యతిరేకంగా పోరాడే ఆఫ్ఘన్ ముజాహిదీన్‌లకు **అమెరికా కొన్ని వందల మిలియన్ డాలర్లు సాయం చేసింది**. దీనినే **'ఆపరేషన్ సైక్లోన్'** అంటారు. స్థానిక ఆఫ్ఘనిస్తాన్ ముజాహిదీన్‌లతో పాటు, ఇతర దేశాల నుండి వచ్చిన ముస్లిమ్ వాలంటీర్లు కూడా ఉన్నారు. వీరినే 'ఆఫ్ఘన్ అరబ్బులు' అంటారు. వారిలోని ప్రముఖుడే ఒసామా బిన్ లాడెన్.

'Who is Osama bin Laden?' (ఒసామా బిన్ లాడెన్ ఎవరు?) అనే వ్యాసాన్ని 9/11 దాడుల అనంతరం BBC ప్రచురించింది. మిడిల్ ఈస్ట్ విశ్లేషకుడు Hazhir Teimourian చెప్పిన దానిని బట్టి, **CIA** (Central Intelligence Agency, అమెరికా) నుండే ఒసామా బిన్ లాడెన్ ట్రయినింగ్ తీసుకున్నాడని.

2003 సంవత్సరంలో రష్యా పత్రిక Demokratizatsiya కు చెందిన మైఖేల్ పోవెల్‌సన్ చెప్పిన దాని ప్రకారం, **బిన్ లాడెన్ చేసే పనులలో అమెరికా పాత్ర ఏమీ లేదని నమ్మడం కష్టం.** వాస్తవానికి బిన్ లాడెన్ చేసే కార్య కలాపాల గురించి అమెరికాకు బాగా తెలుసు. అంతేకాకుండా అమెరికా తనకు సాధ్యమైనంత సహకారం అందించింది.

2004 సం॥లో 'అల్-ఖైదా మూలాలు మరియు సంబంధాలు' అనే వ్యాసంలో BBC తెలియజేసింది ఏమిటంటే, సోవియట్‌కి వ్యతిరేకంగా జరిగిన పోరులో బిన్‌లాడెన్ ఆర్థిక సహాయం చేసింది అమెరికా. కొంతమంది విశ్లేషకుల అభిప్రాయాన్ని బట్టి, బిన్ లాడెన్ అమెరికా గూఢచారి సంస్థ దగ్గర శిక్షణ తీసుకున్నాడని తెలుస్తుంది.

2007 సం॥లో ప్రచురిమైన Der Spiegel వ్యాసం 'Arming the Middle East' లో, అమెరికా గూఢచారి సంస్థ (**CIA**) యొక్క ఆయుధాల కొనుగోలు చేసే ప్రముఖ కస్టమర్‌లలో బిన్‌లాడెన్ ఒకడని చెప్పడం జరిగింది.

The Independent (ద ఇండిపెండెంట్) వార్తాపత్రిక విలేఖరి ఆండ్రూమార్షల్, బ్రూక్లిన్ (అమెరికా)లోని అల్ కిఫా రెఫ్యూజీ సెంటర్‌ని ఆఫ్ఘనిస్తాన్ కొరకు విదేశీ వాలంటీర్లకు శిక్షణ ఇవ్వడానికి మరియు డబ్బును సేకరించే సెంటర్‌గా వర్ణించారు. ఆఫ్ఘన్ ముజాహిదీన్‌లకు సహకరించడానికి అమెరికా సృష్టి 'ఆఫరేషన్ సైక్లోన్'కు ఇది కీలకమైన ప్రాముఖ్యతను సంతరించుకున్న సెంటర్‌గా చెప్పడం జరిగింది. అంతేకాకుండా ఇక్కడ రిక్రూట్ చేసుకున్న వారిలోని చాలామందికి 1993లో వరల్డ్ ట్రేడ్ సెంటర్ బాంబింగ్‌తో సంబంధాలున్నాయని చెబుతున్నారు.

**రచయిత స్టీవ్ కోల్ కూడా అరబ్బులను సైనిక శిక్షణ కోసం చేర్చుకోవడం గురించి CIA యొక్క ముఖ్యపాత్ర గురించి చర్చించారు.** రోబర్ట్ గేట్స్ అనే వ్యక్తి అప్పటి అమెరికా గూఢచారి సంస్థకు హెడ్. ఆయన చెప్పిన దానిని బట్టి, ఇస్లామాబాద్‌లోని **CIA** ఇస్లామాబాద్ స్టేషన్ చీఫ్ అయిన మిల్ట్ బియర్‌డెన్, బిన్‌లాడెన్‌ని ప్రశంసించారట. ఎందుకంటే బిన్‌లాడెన్ తన సంపాదన ఆఫ్ఘనిస్తాన్ యుద్ధం కోసం ఉపయోగిస్తున్నందుకు.

ఆనాడు ఆఫ్ఘనిస్తాన్ ఆక్రమించిన సోవియట్‌పై యుద్ధం చేసిన వారికి సహాయపడి, వారికి శిక్షణనిచ్చి వారినిఎంతో ప్రశంసించిన అమెరికా

ప్రభుత్వానికిఈనాడు వారు తీవ్రవాదులుగా ఎలా కనిపిస్తున్నారు?

ఇరాఖ్‌ని అమెరికా ఆక్రమించింది. ఆఫ్ఘనిస్తాన్‌ని సోవియట్ ఆక్రమించింది. అమెరికా, సోవియట్‌లు ఒకరికొకరు బద్ధ శత్రువులు. వీరిద్దరూ ముస్లిమ్‌ల దేశాలని ఆక్రమించారు. సోవియట్‌కి వ్యతిరేకంగా పనిచేసే వారికి అమెరికా ప్రోత్సహించి ప్రశంసించింది. **ఆ ప్రశంస ఎందుకోసం? తోటి ముస్లిముల కొరకు పోరాడినందుకా? లేక 'రష్యా'తో పోట్లాడినందుకా?**

సోవియట్ చేసిన పనినే అమెరికా చేసినప్పుడు, తోటి ముస్లిముల కోసం మరలా పోరాటం మొదలవుతుందని అమెరికాకు తెలియదా? ఆఫ్ఘనిస్తాన్ యొక్క శతృవులు, ఇరాఖ్ యొక్క శత్రువులు ఒకే పని చేశారు. ఆఫ్ఘనిస్తాన్ శతృవులతో పోరాడిన వారు హీరోలైతే, అదే హీరోలు 'ఇరాఖ్' శతృవులతో పోరాడితే తీవ్రవాదులవుతారా?

అగ్రరాజ్యాల రాక్షస ఆటలకు బలయ్యేది అమాయక ప్రజలు. పగతో రగిలిపోయే కొందరు పౌరులు. హింసకు, యుద్ధాలకు, తీవ్రవాదానికి మూలం అగ్రరాజ్యాల రాక్షసత్వమే కారణం. తీవ్రవాదం తగ్గాలంటే అగ్రరాజ్యాలను సంస్కరించాలి.

రోబిన్ కుక్ స్టేట్‌మెంట్ చదవండి :

*Robin Cook, former leader of the British House of Commons and Foreign Secretary from 1997-2001, believed the CIA had provided arms to the Arab Mujahideen, including Osama bin Laden, writ ing, "Bin Laden was, though, a product of a monumental miscal culation by western security agencies. Throughout the 80s he was armed by the CIA and funded by the Saudis to wage jihad against the Russian occupation of Afghanistan.*

Cook, Robin. "The struggle against terrorism cannot be won by military means". Guardian Unlimited. http://www.guardian.co.uk/terrorism/story/0,12780,1523838,00.html. Retrieved 2005-07-08.

మాజీ బ్రిటిష్ డిఫెన్స్ సెక్రటరీ, మైఖేల్ పోర్టిల్లోతో, అప్పటి పాకిస్తాన్ ప్రధానమంత్రి బేనజీర్ భుట్టో సంభాషిస్తూ **'ఒసామా బిన్ లాడెన్' ప్రారంభంలో అమెరికా అభిమాని'** అని చెప్పారు.

ఆఫ్ఘనిస్తాన్‌లో అమెరికా స్పాన్సర్ చేసిన జీహాదే అంతర్జాతీయ తీవ్రవాద నెట్‌వర్క్ తయారుకావడానికి తొలి అడుగు అని 'అల్-అహ్రామ్ సెంటర్ ఫర్ స్ట్రాటజిక్ స్టడీస్' సీనియర్ ఫెలో - మోంటె పామర్ నమ్ముతున్నారు. ఇప్పుడు ఆ నెట్‌వర్క్ అమెరికాను సవాల్ చేయగలిగేలా మారిందని ఆయన అభిప్రాయం.

*Federal Bureau of Investigation (FBI,* అమెరికా*)* లో సైబెల్ ఎడ్మండ్స్ అనువాదకుడుగా పనిచేసారు. సున్నితమైన రహస్య విషయాలను బయటపెట్టినందుకు అతన్ని *FBI* నుండి డిస్మిస్ చేశారు. అతను చెప్పినదాని ప్రకారం **తాలిబన్ మరియు అల్-ఖైదా లతో అమెరికాకు సంబంధాలు ఉన్నాయని, మధ్య ఆశియాలోని మరికొన్ని లక్ష్యాల కొరకు వాటిని అమెరికా ఉపయోగించుకో బోతుందని తెలియజేశారు.**

**ఆఫ్ఘనిస్తాన్ స్వాతంత్ర యోధులు : నేటి వార్తలలోని విలన్లు - 80'లలో హీరోలు**

[Forgotten Coverage of Afghan 'Freedom Fighters'. The Villains of Today's News were heroes in the '80s extra January/February 2002, F.A.I.R. (Fairness in Accuracy and Reporting)].

పై వ్యాసంలో డేవిడ్ ఎన్. గిబ్స్ ఇతర ఆధారాల ద్వారా **బిన్‌లాడెన్** కార్యకలాపాలతో **CIA**కు ప్రత్యక్ష సంబంధాలున్నాయని చెబుతున్నారు. బిన్ లాడెన్‌కి మరియు **CIA**కు Bank for Credit and Commerce International (BCCI)లో ఎకౌంట్స్ ఉన్నాయని తెలియజేస్తున్నారు. బిన్ లాడెన్ ప్రత్యేకంగా, గుల్బుద్దీన్ హెక్మత్యార్‌తో చాలా సన్నిహితంగా పనిచేశాడని చెబుతూ గుల్బుద్దీన్‌ను **CIA** యొక్క **అభిమాన ముజాహిదీన్ కమాండర్‌గా** గిబ్స్ వర్ణిస్తున్నాడు. అంతేకాకుండా, 1979లో బిన్‌లాడెన్‌ను **CIA** రిక్రూట్ చేసుకుందని కూడా తెలియజేశారు.

Associated Press ప్రకారం, బిన్‌లాడెన్ యొక్క మాజీ సన్నిహితుడు చెప్పినదానిని బట్టి 1989లో ముజాహిదీన్ వర్గానికి అమెరికా హై పవర్డ్ స్నైపెర్ రైఫిల్స్‌ను సరఫరా చేసింది. ముజాహిదీన్ల కొరకు డబ్బును సమకూర్చడంలో బిన్‌లాడెన్ అమెరికా ఏజెంట్లతో చాలా సన్నిహితంగా పనిచేశారని **Jane's Intelligence Review** తెలియజేస్తుంది.

ఐక్యరాజ్య సమితికి 2002-2008 మధ్యకాలంలో పాకిస్తాన్ శాశ్వత ప్రతినిధి మునీర్ అక్రమ్‌గారి లెటర్‌ని న్యూయార్క్ టైమ్స్‌లో జనవరి 19, 2008లో పబ్లిష్ చేయడం జరిగింది. ఆయన కొన్ని విషయాలను తెలియజేశారు. ఆఫ్ఘన్‌లో సోవియట్ సైనిక జోక్యానికి వ్యతిరేకంగా ఆఫ్ఘన్లకు అమెరికా గూఢచారి సంస్థ, పాకిస్తాన్ గూఢచారి సంస్థలతో సహా ఎన్నో సెక్యూరిటీ ఏజెన్సీలు సహకరించాయి. **సోవియట్ ఆఫ్ఘనిస్తాన్‌ని వదిలి వెళ్ళాక, వేరే దేశాల నుండి సోవియట్‌కు వ్యతిరేకంగా పోరాడటానికి దిగుమతి చేసుకున్న 40,000 మంది మిలిటెంట్లను అక్కడే వదిలేసి, పాశ్చాత్యులు వెళ్ళిపోయారు. వారి తీవ్రవాదం, డ్రగ్స్, తుపాకులను ఇప్పుడు పాకిస్తాన్ ఎదుర్కోవలసి వస్తుందని చెప్పారు.**

ప్రపంచంలో జరిగే ఎన్నో దాడులకు బాధ్యత వహించవలసింది అమెరికా ప్రభుత్వమే. బిన్ లాడెన్‌కి సహకరించింది అమెరికాయే. బిన్‌లాడెన్ తన స్వంత సొమ్మును యుద్ధంలో ఉపయోగించాడు.

**కాని డేవిడ్ హెడ్లీ, కసబ్ డబ్బుకోసం పనిచేసేవారు. వీరికి డబ్బు ఇస్తే ఏ పని అయినా చేయవచ్చు. అమెరికన్ పౌరుడు అయిన డేవిడ్ హెడ్లీ ఇండియాలో చేయించే దాడులకు అమెరికా ప్రభుత్వ సహకారం ఉందా?**

ప్రముఖ విశ్లేషకుల అభిప్రాయాలు వచ్చే సంచికలో ...

**శాంతి ధర్మం - 'ఇస్లాం'. 99.9 శాతం కంటే ఎక్కువమంది ముస్లిములు తీవ్రవాదులు కారు. 'ఇస్లాం'కు తీవ్రవాదానికి సంబంధంలేదని మీడియాకు చాటి చెప్పండి.**

డా. నాగిరెడ్డి శ్రీనివాసరావు

ప్రతీ స్త్రీ లేదా పురుషునికి తొలి బడి అమ్మ ఒడి. గొప్ప గొప్ప జ్ఞానులు, మేధావుల వెనుక తల్లిదండ్రుల ప్రోత్సాహం ఎంతో ఉంటుంది. తొలి గురువులు తల్లిదండ్రులే. ఆ తరువాతనే, పాఠశాలలో చేరిన దగ్గరనుండి, మిగిలిన గురువులు పరిచయమౌతారు. వీరందరినీ మీరు గౌరవించాలి. అయితే వీరందరికీ జ్ఞానాన్ని ఇచ్చిన సృష్టికర్త విశ్వమంతటికీ గురువు - ఆయనే 'అల్లాహ్'. ఏ గురువు చెప్పినా అర్థం కాకపోయినా లేక మరేదైనా చెప్పుకోలేని సమస్య మీకొస్తే డైరెక్టుగా అల్లాహ్‌నే అడగండి. ఆయన వింటాడు. మీకు జవాబు కూడా వస్తుంది.

అయితే ఇక్కడ ఓ ముఖ్యవిషయాన్ని మీకు ఓ ఉదాహరణ ద్వారా చెబుతాను. సెల్‌ఫోన్‌లో మాట్లాడేటప్పుడు, మీ వైపు సిగ్నల్ సరిగ్గా లేకుంటే, అవతలి వ్యక్తి మాటలు మీ సెల్‌కు చేరవు కదా! అలాగే 'అల్లాహ్' ఇచ్చిన సమాధానం మీకు అర్థమవ్వాలంటే, మీ సిగ్నల్ బలంగా ఉండాలి. సెల్‌ఫోన్ సిగ్నల్ కాదు. అల్లాహ్‌పై మీ మనస్సులో ఉన్న విశ్వాసం చాలా బలంగా ఉండాలి. ఖుర్‌ఆన్‌ను, ముహమ్మద్(స) వారి బోధనలను (హదీసులను) అర్థం చేసుకుని, వాటి ప్రకారం మీరు ఆచరిస్తే, క్లాసులో మీరే టాప్ రేంకర్స్. విజయులు మీరే. అలా కాకపోతే అడగండి!

**5 & 6**

## గెలాక్సీలు

గెలాక్సీలో బిలియన్ల కొద్దీ నక్షత్రాలుంటాయి. భూమి నక్షత్రం కాదు. చంద్రుడు నక్షత్రం కాదు. సూర్యుడు మాత్రమే నక్షత్రం. పెద్ద గెలాక్సీలో దాదాపు 3 ట్రిలియన్ల నక్షత్రాలుంటాయి. అంటే 3 లక్షల కోట్ల నక్షత్రాలు ఒకే గెలాక్సీలో ఉంటాయి (3,000,000,000,000).

ఒక మోస్తరు గెలాక్సీలో అయితే 200 నుండి 300 బిలియన్ నక్షత్రాలు (అంటే 30 వేల కోట్ల నక్షత్రాలు) ఉంటాయి. చిన్న గెలాక్సీలో దాదాపు 100 బిలియన్ నక్షత్రాలుంటాయి.

ఒక్క క్షణం ఆగి ఆలోచిద్దాం. 1,2,3,4 అంటూ అంకెలను లెక్క పెడుతూ పోతే 3 లక్షల కోట్ల అంకెలను లెక్కపెట్టడానికి ప్రయత్నిస్తే మనం ముసలివాళ్ళమైపోతాం!

చూశారా! ఇప్పుడు ఆలోచించండి. ఒక్కొక్క గెలాక్సీలోనే ఇన్నేసి నక్షత్రాలుంటే, ఇలాంటి గెలాక్సీలు ఈ విశ్వంలో ఎన్ని ఉంటాయి? ఈ విశ్వం ఎంత పెద్దదో కదా!

ఊహించడం కష్టం.

కాని అల్లాహ్‌కు ఈ అతి పెద్ద విశ్వంలోని ప్రతీదాని గురించి, జరుగుతున్న ప్రతీ విషయం గురించి తెలుసు మరియు వాటిని చూడగలడు. ఈయన యొక్క అనంత శక్తి గురించి ఖుర్‌ఆన్‌లో ఇలా చెప్పబడింది :

**"... భూమ్యాకాశాలలో ఉన్నదంతా ఆయనకు తెలుసు. మరియు అల్లాహ్ ప్రతీదీ చేయగల సమర్థుడు"** (ఖుర్‌ఆన్ 3:29))

"... He knows what is in the heavens and what is on earth. Allah has power over all things." (Qur'an 3:29)

గెలాక్సీలు చిన్నవైనా, పెద్దవైనా సరే, వాటిలో గెలాక్టిక్ సెంటర్ ఉంటుంది. ఈ సెంటర్‌లో అనూహ్యమైన వేగంతో arms తిరుగుతూ ఉంటాయి. ఈ arms అనేవి నక్షత్రాలు, గ్యాస్ మరియు ధూళి మేఘాలతో తయారౌతాయి.

ఈ విధంగా ఈ arms తో మరియు కేంద్రాలతో కూడిన గెలాక్సీలు అంతరిక్షంలోని అతి పెద్దవైన ఖగోళ బాడీలతో క్లస్టర్లుగా తయారౌతాయి. ఇలాంటి క్లస్టర్లు మరికొన్ని క్లస్టర్లను ఏర్పరుస్తాయి. ఈ విధంగా క్లస్టర్స్ కావడం కొనసాగుతూనే చాలా పెద్దగా తయారౌతూ ఉంటుంది.

ఇప్పుడు క్రింది విషయాలను గమనించండి.

- **అనుకోకుండా, ఏదో కాకతాళీయంగానే బిలియన్ నక్షత్రాలు క్రమ పద్ధతిలో ఇలా కలవగలవా?**
- **ఎవరి ప్రమేయం లేకుండా, తమంతట తామే నక్షత్రాలు ఒకదానితో ఒకటి ఢీకొనకుండా ఓ క్రమ పద్ధతిని ఏర్పరచుకోగలవా?**

ఇది సాధ్యం కాదు. నక్షత్రాలు గుండ్రంగా తిరుగుతూ గొప్పవేగంతో ఒకదానితో ఒకటి ఢీకొనకుండా అవి సృష్టించబడిన రోజునుండి కదులుతున్నాయంటే, వాటిని కంట్రోల్ చేసే సృష్టికర్త, ప్రణాళిక చేసేవాడు, వ్యవస్థీకరించేవాడు సృష్టి పాలకుడైన 'అల్లాహ్' యొక్క ఉనికిని అవి సూచిస్తున్నాయి.

ఈ నక్షత్రాలు, గ్రహాలు, తోక చుక్కలు అంతరిక్షంలో కదలడానికి, ప్రతీదానికి ఒక్కొక్క మార్గం చొప్పున మనకు లెక్కలేనన్ని మార్గాలను అల్లాహ్ సృష్టించారు.

ఈ ఖగోళ బాడీలన్నీ కూడా ఒకదానితోనొకటి ఢీకొనకుండా ఈ మార్గాలలో పయనిస్తూనే ఉన్నాయి.

విశ్వంలో కొన్ని కోట్ల గెలాక్సీలున్నాయని చెప్పుకున్నాం. అందులో మన భూమి ఉన్న గెలాక్సీ పేరు పాలపుంత (Milky way).

**పాలపుంత (Milky way):**

ఈ గెలాక్సీ చాలా పెద్దది. గెలాక్టిక్ సెంటర్ గురించి ఇంతకు ముందే చెప్పుకున్నాం. ఈ పాలపుంత గెలాక్సీకి కూడా గెలాక్టిక్ సెంటర్ ఉంటుంది కదా! ఈ సెంటర్ లోపల ఉండే నక్షత్రాలు చాలా పాతవి. అవి ఎరుపు రంగులోనూ, పసుపు రంగులోనూ ఉంటాయి. గెలాక్సీలో arms ఉంటాయని చెప్పుకున్నాం. అందులోని నక్షత్రాలు ఇటీవల

కాలానివి అంటే సెంటర్‌లో ఉండేటంత పాతవి కావు మరియు ఇవి వేడిగా ఉండే నక్షత్రాలు. ఇవి నీలం రంగులో ఉంటాయి.

పాలపుంత స్పైరల్ (గడియారపు స్ప్రింగ్) ఆకారంలో ఉంటుంది. వాస్తవానికి 'పిన్‌వీల్'లా ఉంటుంది. Arms (ఆర్మ్స్) గురించి చెప్పుకున్నాం కదా! నాలుగు ఆర్మ్స్ ఉంటాయి. అందులో ఓ ఆర్మ్ పేరు Huner Arm (హంటర్ ఆర్మ్). ఈ ఆర్మ్‌లోనే మన సౌరవ్యవస్థ ఉంది. సూర్యుడు, మన భూమి మరియు మిగిలిన గ్రహాలతో కూడిన మన సౌరవ్యవస్థనే సౌరకుటుంబం అని కూడా అంటారు.

స్పైరల్ ఆకారంలోని ఈ గెలాక్సీ కేంద్రం నుండి మన సౌరవ్యవస్థ సగం దూరంలో ఉంది. మన సౌరవ్యవస్థ ఈ కేంద్రం చుట్టూ తిరుగుతూ ఉంటుంది. ఒకసారి పూర్తిగా తిరగడానికి 220 మిలియన్ సంవత్సరాలు పడుతుంది.

మన సౌరవ్యవస్థ గురించి మరికొన్ని విశేషాలు ఇన్షా అల్లాహ్ వచ్చే సంచికలో - అంతవరకూ శలవ్!

**(హారున్-యహ్యా వారికి కృతజ్ఞతలతో)**

(ఇంకా ఉంది)

---

## మీకు స్కూలులో ఇలా నేర్పి ఉంటారు

1. *The concept of quarantine was first developed in 1403. In Venice, a law was passed preventing strangers from entering the city until a certain waiting period had passed. If, by then, no sign of illness could be found, they were allowed in.*

'అంటురోగాలతో ఉన్నవారిని దూరంగా ఉంచడం' అనే భావనను 1403లో అభివృద్ధి చేసారు. వెనిస్‌లో కొత్తవారిని నగరంలోకి ప్రవేశించ కుండా, కొంతకాలం వారు వెయిట్ చేసేలా చట్టం చేసారు. వ్యాధికి సంబంధించిన సూచనలు ఏమీ కనిపించని తరువాతే వారిని అనుమతించేవారు.

2. *The first sound approach to the treatment of disease was made by a German, Johann Weger, in the 1500's.*

వ్యాధిని నయం చేయడంలో ఆరోగ్యకరమైన అప్రోచ్‌ని మొట్టమొదట అభివృద్ధి చేసినవారు 16వ శతాబ్దంలో జోహన్ వెగర్ అనే జర్మన్ దేశీయుడు.

## కాని మీరు తెలుసుకోవల్సిన అసలు నిజం ఏమిటంటే..

1. *The concept of quarantine was first introduced in the 7th century A.D. by the prophet Muhammad, who wisely warned against entering or leaving a region suffering from plague. As early as the 10th century, Muslim physicians innovated the use of isolation wards for individuals suffering with communicable diseases.*

నిజానికి ఈ భావనను 7వ శతాబ్దంలోనే పరిచయం చేసినవారు మహాప్రవక్త ముహమ్మద్(స)వారు. ప్లేగు వ్యాధితో బాధపడే రోగులు, ఒక ప్రాంతం నుండి వెళ్ళడంగాని, ఓ ప్రాంతంలోకి రావడాన్ని గాని, ఎంతో వివేకంతో ఆయన(స) వారించారు. 10వ శతాబ్దం ప్రారంభం లోనే ముస్లిమ్ ఫిజిషియన్లు - అంటురోగాలతో బాధపడేవారిని వేరే వార్డులలో ఉంచడాన్ని ప్రారంభించారు.

2. *Harvard's George Sarton says that modern medicine is entirely an Islamic development and that Setting the Record Straight the Muslim physicians of the 9th through 12th centuries were precise, scientific, rational and sound in their approach. Johann Weger was among thousands of European physicians during the 15th through 17th centuries who were taught the medicine of ar-Razi and Ibn Sina. He contributed nothing original.*

హార్వర్డ్‌కు చెందిన జార్జ్ సార్టన్ ఏమంటున్నారంటే : **ఆధునిక వైద్యం సంపూర్ణంగా ఇస్లామీయ అభివృద్ధికి చెందినదే.** 9 నుండి 12వ శతాబ్దపు మధ్యకాలంలో ముస్లిమ్ ఫిజీషియన్లు, ఖచ్చితమైన, సైంటిఫిక్, వివేకం గలవారు మాత్రమే కాకుండా, వారి అప్రోచ్ చాలా ఆరోగ్యకరమైనది.

ముస్లిమ్ ఫిజీషియన్లయిన **అర్-రజీ** మరియు **ఇబ్నెసినా** అభివృద్ధి చేసిన వైద్య శాస్త్రాన్నే వేలాదిమంది యూరప్ ఫిజీషియన్లకు 15 నుండి 17వ శతాబ్దపు మధ్య కాలంలో బోధించబడింది. అలాంటి వేలమంది వైద్య విద్యార్థులలో జోహన్ వెగర్ ఒకరు. ఆయన వైద్యానికి కొత్తగా చేసిందేమీ లేదు.

3. *Medical treatment for the insane was modernized by Philippe Pinel when in 1793 he operated France's first insane asylum.*

పిచ్చివారికిచ్చే మెడికల్ ట్రీట్‌మెంట్‌ని ఆధునీకరించినవారు ఫిలిప్ పినెల్. ఈయన 1793లో ఫ్రాన్స్‌లో తొలి శరణాలయాన్ని పిచ్చివారి కొరకు నిర్వహించారు.

3. *As early as the 11th century, Islamic hospitals maintained special wards for the insane. They treated them kindly and presumed their disease was real at a time when the insane were routinely burned alive in Europe as witches and sorcerers. A curative approach was taken for mental illness and, for the first time in history, the mentally ill were treated with supportive care, drugs and psychotherapy. Every major Islamic city maintained an insane asylum where patients were treated at no charge. In fact, the Islamic system for the treatment of the insane excels in comparison to the current model, as it was more humane and was highly effective as well.*

11వ శతాబ్దపు ప్రారంభంలోనే పిచ్చివారి కోసం ప్రత్యేకమైన వార్డులను ఇస్లామిక్ వైద్యశాలలు (హాస్పిటల్స్) నిర్వహించేవి. పిచ్చివారిని మంత్రగాళ్ళుగా భావించి **యూరప్‌లో సజీవంగా కాల్చేవారు.** అలాంటి కాలంలో ఇస్లామీయ సామ్రాజ్యంలోని వైద్యులు వారిని దయతో ట్రీట్ చేసేవారు. వారి వ్యాధిని నిజమని అంగీకరించేవారు.

మానసిక వ్యాధిని నయంచేసే విధానాన్ని మరియు చరిత్రలో మొదటిసారిగా మానసికరోగులపై శ్రద్ధ తీసుకుని వారికి మందులతో, సైకోథెరపీతో ట్రీట్‌మెంట్ ఇచ్చేవారు. ప్రతీ పెద్ద ఇస్లామీయ నగరంలో పిచ్చివారి కొరకు శరణాలయాలను నిర్వహించేవారు. అక్కడ మానసిక రోగులకు ఉచితంగా వైద్యం అందించేవారు. నిజానికి, మానసిక రోగులను స్వస్థత పరిచే ఇస్లామీయ విధానమే, నేటి విధానం కంటే ఉత్తమమైనది. ఇస్లామీయ వైద్య విధానంలో మానవీయత ఉండటమే కాకుండా, ఆ విధానం చాలా ప్రభావితం చేస్తుంది.

4. *Kerosine was first produced by an Englishman, Abraham Gesner, in 1853. He distilled it from asphalt.*

1853లో అబ్రహమ్ గెస్‌నెర్ అనే ఆంగ్లేయుడు కిరోసిన్‌ను తొలిసారిగా ఉత్పత్తి చేసారు. ఆస్ఫాల్ట్‌ను ఆంశికస్వేదనం చేసి తయారు చేసాడు.

4. *Muslim chemists produced kerosine as a distillate from petroleum products over 1,000 years prior to Gesner (see Encyclopaedia Britannica under the heading, Petroleum)*

కాని ఈ గెస్‌నర్ కంటే 1000 సంవత్సరాలకు ముందే పెట్రోలియం ఉత్పత్తుల నుండి డిస్టిల్లేట్‌గా కిరోసిన్‌ను ముస్లిమ్ రసాయన శాస్త్రవేత్తలు తయారు చేసారు. (ఎన్‌సైక్లోపీడియా బ్రిటానికాలో 'పెట్రోలియం' హెడ్డింగ్ క్రింద చూడండి)

---

**"అల్లాహ్, ఏ ప్రాణిపైననూ దాని శక్తికి మించిన భారం వేయడు, తాను సంపాదించిన (పుణ్య ఫలితం) దానికి లభిస్తుంది మరియు తాను చేసిన దుష్కర్మల శిక్ష అది అనుభవిస్తుంది. ఓ మా ప్రభూ! మేము మరచినా లేక తప్పు చేసినా మమ్మల్ని పట్టకు! ఓ మా ప్రభూ! పూర్వం వారిపై మోపినట్టి భారం మాపై మోపకు. ఓ మా ప్రభూ! మేము సహించలేని భారం మాపై వేయకు. మమ్మల్ని మన్నించు, మమ్మల్ని క్షమించు మరియు మమ్మల్ని కరుణించు. నీవే మా సంరక్షకుడవు, కావున సత్య తిరస్కారులకు విరుద్ధంగా మాకు విజయం (సహాయం) నొసంగు."** (ఖుర్ఆన్ 2:286)

## మీ చిన్నారులకి క్రింది దు'ఆలను నేర్పించండి.

### భోజనం తినడానికి ముందు

بِسۡمِ اللّٰهِ

బిస్మిల్లాహ్

**In the Name of ALLAH** అల్లాహ్ పేరుతో

### భోజనం తినే ముందు 'బిస్మిల్లాహ్' అనడం మర్చిపోయి, తరువాత గుర్తు వస్తే ఇలా చెప్పండి :

بِسۡمِ اللّٰهِ فِيۡ أَوَّلِهِ وَ آخِرِهِ

బిస్మిల్లాహి ఫీ అవ్వలిహి వ ఆఖిరిహ్

**In the Name of ALLAH, in its beginning and end**

ప్రారంభంలోనూ మరియు ముగింపులోనూ 'అల్లాహ్ పేరుతో'

### భోజనం ముగించిన తరువాత

الۡحَمۡدُ لِلَّهِ الَّذِي أَطۡعَمَنِي هَذَا وَ رَزَقَنِيهِ مِنۡ
غَيۡرِ حَوۡلٍ مِنِّي وَ لاَ قُوَّةٍ

అల్‌హమ్‌దు లిల్లాహిల్లదీ అత్‌అ'మనీ హదా వ రజఖనీహి మిన్ గైరి హౌలి మ్మిన్నీ వ లా ఖువ్వత్

**All praise is for ALLAH who fed me this and provided it for me without any might nor power from myself**

పొగడ్తలన్నీ అల్లాహ్ కొరకే

ఇది నాకు తినిపించినందుకుగానూ మరియు నా కొరకు సమకూర్చినందుకు గానూ నా నుండి ఎటువంటి శక్తి లేకున్నా ఎటువంటి సామర్థ్యం లేకున్నా

# ఖుర్‌ఆన్‌ని అర్థం చేసుకుంటూ చదువ్రుదాం - 5 & 6

**"(ప్రవక్తా!) మేము ఎంతో శుభవంతమైన ఈ గ్రంథాన్ని నీ పై అవతరింపజేశాము, ప్రజలు దాని వాక్యాలను గురించి ఆలోచించాలనీ, బుద్ధిమంతులూ, ఆలోచనాపరులూ దానినుండి గుణపాఠం నేర్చుకోవాలనీని'' (దివ్య ఖుర్'ఆన్ 38:29)**

**ముహమ్మద్ (స) ఇలా చెప్పారు: "మీలో శ్రేష్ఠులు ఎవరంటే ఖుర్'ఆన్‌ని నేర్చుకునేవారు మరియు నేర్పించేవారు" (బుఖారి)**

ఖుర్'ఆన్‌లో దాదాపుగా 77,800 పదాలున్నాయి. అందులో దాదాపు 83 శాతం అంటే 64,282 పదాలను తీసుకుంటే, అందులోని కొన్ని పదాలే మాటి మాటికి వస్తూ ఉంటాయి. కాబట్టి ఈ 83 శాతం పదాలను నేర్చుకోగలిగితే, మీరు చదువుతున్నప్పుడే దాని అర్థం కూడా మీ పఠనంతో పాటుగా అర్థమైపోతూ ఉంటుంది.

ఒక సంవత్సరంలో 83శాతం పదాలను నేర్చుకునే విధంగా ప్రతీ నెల కొన్ని పదాలను అందించాలని ఈ శీర్షిక ప్రారంభించాము. కాని పాఠకుల సౌలభ్యం కోసం ఈ శీర్షికను 30 నెలలకు మార్చడమైనది.

ఈ శీర్షికకు సంబంధించిన ఇతర ముఖ్య వివరాలను మొదటి సంచికలో వివరించాము.

ఇక్కడ ముఖ్యంగా మీరు గమనించవలసింది ఏమిటంటే, అరబీ పదాలకు సర్వసామాన్యంగా ఉండే అర్థాన్ని మాత్రమే ఇవ్వడం జరిగింది. వాస్తవానికి ఆ పదానికి ఇంకా ఎక్కువ అర్థాలు ఉండవచ్చు. సందర్భాన్ని బట్టి ఇతర అర్థాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలి. కాని అటువంటి పదాల సంఖ్య తక్కువే. పదాలను అక్షరాల క్రమంలో (alphabetical order) ఇవ్వడం వలన అర్థాలు వెతకడం సులభమౌతుంది.

**అరబీ పదాలకు సరిపోయే ఖచ్చితమైన ఉచ్చారణను తెలుగులో ఇవ్వడం చాలా కష్టం. అందుకని ఈ పదాలను ఉచ్ఛరించడం కోసం మేమిచ్చిన ఉచ్చారణను కాకుండా, మీ దగ్గరలోని హాఫిజ్, మౌలానాలను లేదా అరబీ చదువగలిగిన వారిని సంప్రదించమని మనవి చేసుకుంటున్నాం.**

### 'మా' అనే అరబీ అక్షరంతో విభిన్న అర్థాలు

| | | | |
|---|---|---|---|
| **ఏదైతే** | = | (బిమా) | بِمَا |
| **దీని గురించి** | = | (అ'మ్మా) | عَمَّا |
| **దీనిలో, దేనిలోనయితే** | = | (ఫీమా) | فِيمَا |
| **వలె** | = | (కమా) | كَمَا |
| **దీనికొరకు, అదే** | = | (లిమా) | لِمَا |
| **దీని నుండి** | = | (మిమ్మా) | مِمَّا |
| **ఏదైతే** | = | (అమ్మా) | أَمَّا |
| **అయితే, అదిగాని/ఇదిగాని** | = | (ఇమ్మా) | إِمَّا |
| **అది** | = | (అన్నమా) | أَنَّمَا |
| **నిస్సందేహంగా** | = | (ఇన్నమా) | إِنَّمَا |
| **ఆ విధంగా** | = | (కఅన్నమా) | كَأَنَّمَا |
| **ఎప్పుడైనా, ఎప్పుడైతే** | = | (కుల్లమా) | كُلَّمَا |

### విభక్త్యర్థ పదాలు (Prepositions)

| | | | |
|---|---|---|---|
| **తో, లో, నుండి** | = | (బి) | بِ |
| **గురించి** | = | (అ'న్) | عَنْ |
| **లోపల, ఉంది, ఉండడం** | = | (ఫీ) | فِي |
| **వలె, ఉదాహరణ** | = | (క) | كَ |
| **కొరకు** | = | (లి, ల) | لِ، لَ |
| **నుండి** | = | (మిన్) | مِنْ |
| **వైపు, వరకు** | = | (ఇలా) | إِلَى |
| **సాక్షిగా** | = | (త) | تَ |
| **వరకు** | = | (హత్తా) | حَتَّى |
| **మీద** | = | (అల) | عَلَى |
| **తో** | = | (మఅ') | مَعَ |
| **మరియు** | = | (వ) | وَ |

**కొంతమంది సోదరులు, తమకు అరబీ చదవడం రాదని, కాబట్టి అరబీ అక్షరాల దగ్గర నుండి మొదలు పెడితే వారికి ఉపయోగకరంగా ఉంటుందని చెప్పారు. ఆసక్తి ఉన్నవారికి అరబీ చదవడం నేర్చుకోవడానికి 7 రోజులు చాలు. అరబీ మొదటి నుండి నేర్పడం ఈ శీర్షిక యొక్క ఉద్దేశ్యం కానప్పటికిని, సోదరుల కోరికను కొంతమేరైనా తీర్చాలనే సంకల్పంతో 2వ సంచికలో అరబీ అక్షరాలను, వాటి గుణింతాలను ఇచ్చాము.**

| క్రియకు ముందు చేర్చే పదం, ..... | | | | ఇన్న..... | | | |
|---|---|---|---|---|---|---|---|
| నిజంగా | = | (ఖద్) | قَدْ (+ فعل) | నిస్సందేహంగా | = | (ఇన్న) | إِنَّ |
| చాలా దగ్గరలో (for near future) | = | (స) | سَ (+ فعل) | అది | = | (అన్న) | أَنَّ |
| దగ్గరలో (for future) | = | (సౌఫ) | سَوْفَ (+ فعل) | ఆ విధంగా | = | (కఅన్న) | كَأَنَّ |
| తప్పకుండా | = | (ల+పఅ'ల+న్న) | لَ + فعل + نَّ | కాని, ఏమైనప్పటికీ | = | (లాకిన్న) | لٰكِنَّ |
| నిజానికి | = | (లఖద్) | لَقَدْ (+ فعل) | బహుశా, కావచ్చు | = | (లఅ'ల్ల) | لَعَلَّ |
| నిజానికి, నిజంగా | = | (ల) | لَ | అది | = | (అన్) | أَنْ |
| ఇలా చేసి ఉండవలసింది | = | (లి, ల్) | لِ، لْ (أمر) | అయితే | = | (ఇన్) | إِنْ |
| ఆ | = | (అల్) | الْ | కేవలం | = | (ఇయ్యా) | إِيَّا |
| లేక? | = | (అమ్) | اَمْ | సాధ్యం కావచ్చు | = | (అసా) | عَسَى |
| లేక | = | (అవ్) | اَوْ | అప్పుడప్పుడు | = | (లమ్మా) | لَمَّا |
| కొన్ని | = | (బ'ద్) | بَعْض | అయితే ... | = | (లవ్) | لَوْ |
| ప్రతీది, అంతా | = | (కుల్ల) | كُلّ | ఓ | = | (యా, యా అయ్యుహా) | يَا، يَاأَيُّهَا |

## మనవి

శాంతిబాట మాసపత్రిక ప్రచురించిన విషయాలను సోదరులు పాంప్లెట్స్ రూపంలోగాని, మరే విధంగానైనా ఉపయోగించేటప్పుడు *'శాంతిబాట మాసపత్రిక నుండి'* అని వాటిలో రిఫరెన్స్ ఇస్తే 'శాంతిబాట' మాసపత్రిక గురించి ఎక్కువ మందికి తెలిసే అవకాశం ఉంటుంది. చందాదారులు పెరిగితే ఎటువంటి ఆర్థిక ఇబ్బందులు లేకుండా ప్రామాణిక ఇస్లామీయ సాహిత్యాన్ని తోటివారికి అందించే అవకాశం ఇన్షా అల్లాహ్ మాకు సులువవుతుంది. అల్లాహ్‌ను మరియు ఆయన ప్రవక్త(స)వారిని ప్రేమించేవారిని, 'శాంతిబాట' గురించి తోటివారికి తెలియజేయమని కోరుతున్నాం. 'శాంతిబాట' మాసపత్రికలో చర్చించే సున్నితమైన విషయాల వలన, ఎటువంటి అపార్థాలకు అవకాశం లేకుండా, సపోర్టింగ్ ఇన్ఫర్మేషన్‌ని జత చేస్తున్నాం. పాంప్లెట్స్‌ను అటువంటి సమాచారం లేకుండా ప్రచురిస్తే సమస్యలు రావచ్చు. ఎదుటివారిని కించపరచడంగాని, బాధపడేలా చేయడంగాని 'ఇస్లాం'కి విరుద్ధమని ఈ సందర్భంగా తెలియజేసుకుంటున్నాము.

- శాంతిబాట టీమ్

## అహంకార / ఆత్మన్యూనతా భావం — Superiority / Inferiority Complex

అహంకారం మనిషి జీవితాన్ని సర్వనాశనం చేస్తుంది. ఎందరో అహంకారులు తమ జీవితపు చివరి రోజులలో ఘోరంగా అవమానించ బడ్డారు. ఇది చారిత్రక సత్యం. క్రింది హదీస్‌ను బట్టి అహంకారం అణువంత ఉన్నా సరే, స్వర్గంలో ప్రవేశం లేదని స్పష్టమౌతుంది.

"ముస్లిమ్ హదీస్ గ్రంథంలోని 265వ హదీస్‌లో **అబ్దుల్లా బిన్ మసూద్ (రజి)వారి ఉల్లేఖనం ప్రకారం ముహమ్మద్(స)వారు చెప్పిన మాట 'అణువంత అహంకారం హృదయంలో కలిగి ఉన్నా అతను స్వర్గంలో ప్రవేశించడు."**

సత్యాన్ని తిరస్కరించడం, ప్రజలను చులకన చేయడం కూడా అహంకారమేనని ఈ హదీస్ ద్వారా తెలుస్తుంది.

ఆత్మన్యూనత కలిగినవారు ఎదుటి వ్యక్తులతో పోల్చుకుని, తన అసమర్థతను చూచుకుని బాధపడతారు. వీరు జీవితంలో విజయాన్ని సాధించలేరు. సంతోషంగా బ్రతకలేరు. ఉదాహరణకు తను అందంగా లేనని, తనకు సరిగ్గా మాట్లాడటం చేతకాదని, అయినాసరే ఒకవేళ మాట్లాడితే అందరూ తనను అవహేళన చేస్తారేమోనని, వెక్కిరిస్తారేమోనని ఆలోచిస్తూ, ఆ భావాన్ని పోగొట్టుకోవడానికి ఎటువంటి ప్రయత్నమూ చేయరు. వీరిలో ఆత్మ విశ్వాసం ఉండదు. తాము చేతకానివారమని ఆవేదన చెందుతూ ఉంటారు.

తన కంటే తక్కువ స్థాయిలో ఉన్నవానితో పోల్చుకోమని ముహమ్మద్(స) వారు బోధించారు :

**"మీరు, మీ కంటే, ధనధాన్యాల్లో ప్రాపంచిక హోదాల్లో తక్కువగా నున్న వారిని చూడండి. మీ కంటే ధనధాన్యాల్లో భోగభాగ్యాల్లో అధికలయిన వారి వంక చూడకండి. అప్పుడు మీకు అల్లాహ్ ప్రసాదించిన కానుకలు, వరాలు, బహుమానాలు మీ దృష్టిలో అల్పం కావు."** (సహీహ్ ముస్లిమ్)

స్థోమత లేక నడిచివెళ్ళే వ్యక్తికి, తన తోటివారు స్కూటర్లపై, కార్లపై వెళుతుంటే, తన స్థాయి తక్కువని భావించవచ్చు. తనకు నడవడానికి కాళ్ళు అయినా ఉన్నాయి. కనీసం కాళ్ళు కూడా లేకుండా రోడ్డుపై దేక్కుంటూ వెళుతున్నవారిని చూస్తే, తన స్థితి ఎంత బావుందో అర్థమౌతుంది. కిడ్నీలు పాడై డయాలిసిస్ కోసం ఎంతో ఖర్చుపెడుతూ బాధపడేవారిని చూసినపుడు, మనమెంత అదృష్టవంతులం అని భావిస్తాము.

ఇస్లాం అర్థం చేసుకున్నవారికి ఈ రెండు తీవ్రభావాలు ఉండవు. మధ్యస్థంగా ఉంటారు. ఇస్లాంని అర్థం చేసుకుని ముస్లిమైన వ్యక్తి అల్లాహ్‌కు దాసుడు అవుతాడు. అతడు కోటీశ్వరుడయినా సరే, రోజు కూలీ అయినా సరే, అల్లాహ్‌కి దాసుడే! అంటే ప్రతీ మనిషి ఎలాంటి హోదాగల కుటుంబంలో పుట్టినా అల్లాహ్ యొక్క సేవకుడే!

మన సమాజంలో ప్యూన్, కలెక్టర్, గవర్నర్, రాష్ట్రపతి అనే హోదా లున్నాయి. అల్లాహ్‌పై ప్రేమ, భయం ఎవరికి ఎక్కువగా ఉంటాయో, ఎవరైతే అల్లాహ్ ఆదేశాలను ఖచ్చితంగా ఆచరిస్తారో, వారి హోదా చాలా ఎక్కువ. ఆ పనిని ఓ కూలివాడు చేసినా సరే, అల్లాహ్ దృష్టిలో ఆ కూలివాని హోదాయే గొప్పది.

అల్లాహు అక్బర్! (అల్లాహ్ అన్నిటికంటే గొప్పవాడు) సర్వజ్ఞాని, సర్వశక్తిమంతుడు, సృష్టికర్త, అందరికీ పోషకుడు ఆయనే కదా! ఆయనకు మనమందరం సేవకులం. మన జీవితంలోని ప్రతీ క్షణం ఆయన కరుణపై ఆధారపడి గడుస్తుంది. అలాంటప్పుడు, ఏ ముస్లిమ్‌కైనా అహంకారాన్ని కలిగి ఉండే అవకాశం ఎక్కడుంది?

తన కంటే గొప్పవాడు లేకపోయినా లేదా తాను ఎవరిపైనా ఆధారపడక పోతే అలాంటి వ్యక్తికి అహంకారం ఉందంటే అర్థముంది. కాని ఏ మానవుడైనా అల్లాహ్ కరుణపై ఆధారపడాలి. సృష్టిలో అల్లాహ్ కరుణపై ఆధారపడకుండా ఉండేది ఏదీ లేదు.

ఎవరి సహాయమూ అక్కరలేనివాడు అల్లాహ్ మాత్రమే!

ఓ ముస్లిమ్‌కి ఎంత ధనమున్నా సరే, ఎన్ని ఆస్తులున్నా సరే, అతను అల్లాహ్‌కు సేవకుడే! ఆ ఆస్తులను ఇచ్చింది కూడా అల్లాహ్‌యే! క్షణకాలంలో ఆ ఆస్తులను అతని నుండి అల్లాహ్ దూరం చేయగలడు. ఒక వ్యక్తిని ధనవంతుణ్ణి చేసి అల్లాహ్ పరీక్షిస్తాడు. మరో వ్యక్తిని నిరుపేదగా చేసి పరీక్షిస్తాడు.

ఈ ఇద్దరికీ ఆ పరిస్థితిని కలుగజేసింది అల్లాహ్‌యే కనుక, **అహంకారానికి, ఆత్మన్యూనతకి వారు ఎందుకు అవకాశమివ్వాలి?** వారిద్దరూ కూడా అల్లాహ్ పెట్టిన పరీక్షలో నెగ్గుకు రావడానికి అల్లాహ్ అనుగ్రహానికై వేడుకోవాలి. దువా చేయాలి.

అల్లాహ్ సహాయముంటే ఏదైనా సాధ్యమే! అల్లాహ్ అనుగ్రహం లేకపోతే అన్నీ ఉన్నా సరే, ఏమీ చేయలేము. ఈ వ్యాసాన్ని మీకందించే టీమ్‌లోని ఒక సోదరుడు కూలి పనిచేసుకునే కుటుంబంలో పుట్టి, **పూర్తిగా అల్లాహ్ అనుగ్రహం పైనే ఆధారపడి**, అంతర్జాతీయ గుర్తింపు పొందిన సైంటిస్ట్ కావడం జరిగింది.

మనం ఎక్కడ పుట్టినా, ఏ కుటుంబ పరిస్థితులలో పుట్టినా సరే, ఆ పుట్టుకకు కారకుడు 'అల్లాహ్!' ఆయన ఇష్టప్రకారమే ప్రతీది జరుగుతుంది. ఆయన ఇష్టమే మన ఇష్టం. మనం అందంగా పుట్టకపోయినా, పేదవారిగా పుట్టినా మనకు ఆవేదన ఎందుకు? ఆయన ఇష్టప్రకారమే మన పుట్టుక జరిగింది కదా!

అల్లాహ్ పేరుతో మంచి సంకల్పం చేసుకుని ప్రయత్నిద్దాం. అనంత కరుణామయుడు, అపార కృపాశీలుడు అయిన అల్లాహ్ మనకు మేలే చేస్తారు. ఒకవేళ మనం అనుకున్నది జరుగకపోయినా, జరిగినది మంచేనని మనకు వెంటనే తెలియవచ్చు లేదా ఆలస్యంగానైనా సరే ఇన్షాఅల్లాహ్ తెలుసుకుంటాం.

షైతాన్ గర్వం గురించి, వాడు అల్లాహ్ శాపానికి ఎలా గురయ్యింది మొదలైన విషయాలు ఖుర్ఆన్ గ్రంథంలో స్పష్టంగా చెప్పబడ్డాయి.

సమస్త మానవాళిని ఉద్దేశిస్తూ అల్లాహ్ ఖుర్ఆన్ గ్రంథంలో ఇలా తెలియజేస్తున్నారు :

**"... వాస్తవానికి మేము మిమ్మల్ని భూమిలో స్థిరపరచాము మరియు అందులో మీకు జీవన వసతులు కల్పించాము. (అయినా) మీరు కృతజ్ఞత చూపేది చాలా తక్కువ."**

**మరియు వాస్తవానికి మిమ్మల్ని మేము సృష్టించాము. పిదప మీ రూపాన్ని తీర్చిదిద్దాము. పిదప దైవ దూతలను : "మీరు ఆదమ్ (తొలిమానవుని)కి సజ్దా చేయండి!" అని ఆదేశించగా, ఒక్క ఇబ్లీస్ తప్ప అందరూ సజ్దా చేశారు. అతడు సజ్దా చేసేవారిలో చేరలేదు.**

**(అప్పుడు అల్లాహ్) అన్నాడు : "(ఓ ఇబ్లీస్!) నేను ఆజ్ఞాపించి నప్పటికీ, సజ్దా చేయకుండా నిన్ను ఆపింది ఏమిటీ?" దానికి (ఇబ్లీస్) : "నేను అతనికంటే శ్రేష్ఠుడను. నీవు నన్ను అగ్నితో సృష్టించావు మరియు అతనిని నీవు మట్టితో సృష్టించావు" అని జవాబిచ్చాడు.**

**(అప్పుడు అల్లాహ్) ఆజ్ఞాపించాడు : "నీవిక్కడి నుండి దిగిపో! ఇక్కడ గర్వపడటం నీకు తగదు, కావున వెళ్ళిపో! నిశ్చయంగా, నీవు నీచులలో చేరావు!"**

**(ఇబ్లీస్) ఇలా వేడుకున్నాడు : "వారు తిరిగి లేపబడే (పునరుత్థాన) దినం వరకు నాకు వ్యవధినివ్వు!"**

**(అల్లాహ్) సెలవిచ్చాడు : "నిశ్చయంగా నీకు వ్యవధి ఇవ్వబడుతోంది!"**

**(ఇబ్లీస్) అన్నాడు : "నీవు నన్ను మార్గభ్రష్టత్వంలో వేసినట్లు, నేను కూడా వారి కొరకు నీ ఋజుమార్గంపై మాటువేసి కూర్చుంటాను!**

**తరువాత నేను వారి ముందునుండి, వారి వెనుక నుండి వారి కుడి వైపు నుండి మరియు వారి ఎడమవైపు నుండి, వారి వైపుకు వస్తూ ఉంటాను. మరియు వారిలో అనేకులను నీవు కృతజ్ఞులుగా పొందవు!" (అల్లాహ్) జవాబిచ్చాడు : "నీవిక్కడి నుండి అవమానింపబడి, బహిష్కృతుడవై వెళ్ళిపో! వారిలో ఎవరైతే నిన్ను అనుసరిస్తారో! అలాంటి మీవారి అందరితో నిశ్చయంగా, నేను నరకాన్ని నింపుతాను".**

**(ఖుర్ఆన్ 7:10-18)**

తను శ్రేష్ఠుడనని విర్రవీగిన ఇబ్లీస్ (షైతాన్) స్వర్గాన్ని పోగొట్టుకున్నాడు. వాడు ఎలాగయితే స్వర్గాన్ని కోల్పోయాడో, ఏ మనిషి వలన కోల్పోయాడో, ఆ మానవజాతిలోని ప్రతీ మనిషిని స్వర్గాన్నుండి దూరం చేయాలని మనలో అహంకార భావం కలిగేలా చేస్తాడు. కాబట్టి వాడి మాయలో పడకుండా, అహంకారాన్ని వదిలేసి, అల్లాహ్ ఆదేశాల ప్రకారమే జీవిద్దాం!

అలాగే అల్లాహ్ ఆదేశించిన కొన్ని విషయాలలో - మనం ఆ ఆదేశాలను పాటించగలమా? అని భయపడే సందర్భాలు రావడం కూడా సహజమే! కాని అల్లాహ్‌పై భరోసా ఉంటే, మనం చేయగలమనే ధైర్యం వస్తుంది. ఇన్షాఅల్లాహ్ ఆయన సహకారం మనకు అందుతుంది.

ఈ సందర్భంగా మూసా(అస)వారి వృత్తాంతాన్ని ఓసారి గుర్తు చేసుకుందాం.

మూసా(అ) వారికి అల్లాహుతాలా ఇలా ఆదేశించారు :

**..... "దుర్మార్గులైన జాతి ప్రజల వద్దకు వెళ్ళు**

**ఫిరౌన్ జాతివారి వద్దకు. ఏమీ? వారికి దైవభీతి లేదా?**

**(మూసా) అన్నాడు : ఓ నా ప్రభూ! వారు నన్ను అసత్యుడవని తిరస్కరిస్తారేమోనని నేను భయపడుతున్నాను.**

**నా హృదయం కుంచించుకు పోతోంది మరియు నా నాలుక తడబడుతోంది, కావున నీవు హారున్ వద్దకు కూడా (వహీ) పంపు.**

**మరియు వారి దగ్గర నా మీద ఒక నేరం మోపబడి ఉంది. కావున వారు నన్ను చంపుతారేమోనని భయపడుతున్నాను.**

**(అల్లాహ్) సెలవిచ్చాడు : "అట్లు కానేరదు! మీరిద్దరూ మా సూచనలతో వెళ్ళండి. నిశ్చయంగా, మేము కూడా మీతో పాటు ఉండి సర్వమూ వింటూ ఉంటాము.**

**కావున మీరిద్దరూ ఫిరౌన్ వద్దకు వెళ్ళి అనండి : 'నిశ్చయంగా, మేము సర్వలోకాల పోషకుని సందేశహరులము.**

**కావున ఇస్రాయీల్ సంతతి వారిని మా వెంట పోనివ్వు."**

**(ఖుర్ఆన్ 26:10-17)**

అల్లాహుతాలా యొక్క దయతో దుర్మార్గుడైన ఫిరౌన్ నుండి ఇజ్రాయీల్ సంతతిని మూసా(అస)వారు విడిపించడం జరిగింది.

ఈ సందర్భంగా అల్లాహ్ చూపిన ఓ అద్భుతం గురించి చెప్పుకోవాలి.

**"మేము ఇబ్రాహీమ్‌కు ఈ గృహం (కాబా) యొక్క స్థలాన్ని నిర్దేశించి, అతనితో : "ఎవ్వరినీ నాకు సాటిగా (భాగస్వాములుగా) కల్పించకు. మరియు నా గృహాన్ని తవాఫ్ చేసేవారి కొరకు, సలాత్ చేసేవారి కొరకు, రుకూ మరియు సజ్దా చేసేవారి కొరకు, పరిశుద్ధంగా ఉంచు" అని అన్నాము.**
**మరియు ప్రజలకు హజ్జ్ యాత్రను గురించి ప్రకటించు : వారు కాలి నడకన మరియు ప్రతి బలహీనమైన ఒంటె (సవారీ)మీద, విశాల (దూర) ప్రాంతాల నుండి మరియు కనుమల నుండి నీ వైపుకు వస్తారు."**

(ఖుర్ఆన్ 22:26,27)

అల్లాహుతాలా ఇబ్రాహీమ్(అస)వారికి 'కాబా'ను నిర్మించడానికి ప్రదేశాన్ని చూపించారు. కాని అక్కడ జనావాసాలు లేవు. అక్కడ ప్రజలు నివశించడం లేదు. హజ్ యాత్ర గురించి అల్లాహ్ ప్రకటించ మంటున్నారు. ఇబ్రాహీమ్(అస) : తాను నిలుచున్నది ప్రజలు

నివశించని, నిర్జన ప్రదేశమని విన్నవించుకున్నారు. మరి ప్రజలు నివశించే ప్రదేశాలకు ఇక్కడి నుండి ప్రకటించి సమాచారాన్ని ఎలా అందించగలను అనే సందేహం ఆయనది.

కాని ఇబ్రాహీం(అస)వారు చేయవలసినది కేవలం ప్రకటన చేయడం వరకేనని, ప్రపంచపు అన్ని మూలలకు దానిని అందజేసే బాధ్యత తనదేనని అల్లాహుతాలా తెలియజేశారు. ఆయన చేసిన ప్రకటనను అల్లాహుతాలా భూమి అంతా వినపడేలా చేసారు. ఇబ్రాహీమ్(అస) తన చెవులలో వ్రేళ్ళ నుంచుకుని ముఖాన్ని నాలుగువైపులా తిప్పి పిలుపు నిచ్చారు : "ఓ ప్రజలారా! అల్లాహుతాలా తన గృహాన్ని స్థాపించారు మరియు (హజ్) యాత్ర మీపై తప్పనిసరి చేసారు. కాబట్టి మీ ప్రభువు ఆదేశాన్ని పాటించండి."

ఈ ఉల్లేఖనంలోనే చెప్పబడింది. అల్లాహ్ ఆ విధంగా ఆజ్ఞాపించిన ప్రకటన అద్భుతంగా ప్రపంచమంతటికి వినపడింది. అప్పటికి సజీవంగా ఉన్నవారికే కాకుండా, పునరుథ్థాన దినం వరకూ పుట్టబోయే వారందరికీ వినపడింది. ఎవరికైతే ఆ యాత్ర నిర్ణయించబడిందో వారు 'లబ్బైక్ అల్లాహుమ్మ లబ్బైక్' (ఓ అల్లాహ్! నేను వస్తున్నాను) అని ప్రతిస్పందించారు. ఇబ్నె అబ్బాస్(రజి) ఉల్లేఖనం ప్రకారం ఇబ్రాహీం(అస)వారి పిలుపుకు వచ్చిన ఈ స్పందనే, హజ్ యాత్రలో పలికే 'తల్బియా'.

(ఈపై సంఘటన గురించిన వివరాలు 'మారిఫుల్ ఖుర్ఆన్' ఇంగ్లీష్ అనువాదం నుండి తీసుకున్నాము. ఈ విషయాలు ఖుర్తుబీ, మజహరీ తఫ్సీర్‌లలో ఉన్నట్లు మారిఫుల్ ఖుర్ఆన్‌లో రిఫరెన్స్‌లున్నాయి)

ఈ యాత్ర అప్పటి నుండి కొనసాగుతూనే ఉంది. ముహమ్మద్(స) వారు ఇస్లామ్‌ను అరబ్బులకు పరిచయం చేసే సమయంలో కూడా, దూరప్రాంతాల నుండి యాత్రికులు మక్కాకు వస్తూండే వారని పాఠకులకు తెలిసిన విషయమే. వారు విగ్రహారాధకులు అయినప్పటికీ 'కాబా' యాత్ర ఆగలేదు. కాని ఆ విగ్రహాలను తొలగించి, అల్లాహ్ ఆదేశించిన హజ్‌యాత్రను సరియైన విధంగా ముహమ్మద్(స)వారు తిరిగి ప్రారంభించారు.

ఈ రోజున కూడా కొన్ని కోట్లమంది, ప్రపంచం నలుమూలల నుండి 'లబ్బైక్ అల్లాహుమ్మ లబ్బైక్' అంటూ కాబాయాత్ర చేస్తూనే ఉన్నారు.

ఇబ్రాహీమ్(అస)వారు పిలుపునిచ్చే సమయానికి, అక్కడ ఎవరూ లేరు. అల్లాహ్‌పై ఆయనకున్న అచంచలమైన విశ్వాసం ఆయన చేత ప్రకటన చేయించింది.

**ప్రకటనకు ముందు కనుచూపు మేరలో ఎవరూ లేరు. కాని ఈ ప్రకటన తరువాత ఈ రోజున మన కళ్ళకి కనిపించేటంత మేర అంతా జనమే. అల్లాహ్ యొక్క వాగ్దానం అలా ఉంటుంది. అంతా అద్భుతమే!**

**'నాకు అవకాశాలు కనుచూపు మేరలో ఎక్కడా కనిపించడం లేదు. నా జీవితం ఇంతేనా?'** అని బాధపడేవారిని చూసినపుడుగాని, ఆత్మహత్యలకు సిద్ధపడేవారికిగాని, పైన వివరించిన ఇబ్రహీం(అస) వారి ఉదంతాన్ని తెలియజేయండి. వారికి ఇన్షాఅల్లాహ్ కనువిప్పు కలగవచ్చు.

అయితే విన్న వ్యక్తి ఓ సందేహాన్ని వ్యక్తం చేయవచ్చు. ఇబ్రాహీం(అ) వారికి అల్లాహ్ చెప్పారు గనుక, ఆయన విశ్వాసంతో చేయగలిగారు. కాని నాకు కూడా 'అల్లాహ్' చెప్పి ఉంటే, నేను కూడా విశ్వాసంతో ముందడుగు వేసేవాడిని కదా! అని.

**'మరి ఖుర్ఆన్ గ్రంథం అంటే ఏమిటో ఎప్పుడూ ఆలోచించలేదా?'** అని మనం అతనిని ప్రశ్నించాలి.

"మానవుల కొరకు అల్లాహ్ చేసిన ప్రసంగమే - ఖుర్ఆన్!". ఖుర్ఆన్‌లో చెప్పినవన్నీ మానవులందరి కొరకు. కాబట్టి ఆ మానవులలో నీవు కూడా ఉన్నావు కదా! నీక్కూడా ఆయన చెబుతున్నారు. కాబట్టి అల్లాహ్ నీకు ఏదైతే ఖుర్ఆన్‌లో చెప్పారో అది విశ్వాసంతో చెయ్యి. నీ సమస్య తీరిపోతుంది!

ఇస్లాం ధైర్యాన్నిస్తుంది. అల్లాహ్ అనుగ్రహంతో చేయగలమనే ఆత్మ విశ్వాసాన్ని మరియు ఆత్మాభిమానాన్ని కలుగజేస్తుంది.

ఎవరికీ చెప్పుకోలేక, తల్లిదండ్రులకి, స్నేహితులకి కూడా చెప్పు కోలేకుండా, మానసికంగా బలహీనమై కుమిలిపోయేవారు క్రింది ఆయత్‌ను అర్థం చేసుకోవాలి.

> **"నా దాసులు, నన్ను గురించి నిన్ను అడిగితే : 'నేను వారికి అతి సమీపంలోనే ఉన్నాను. పిలిచేవాడు నన్ను పిలిచినప్పుడు నేను అతని పిలుపును విని, జవాబిస్తాను. కాబట్టి వారు సరైన మార్గం పొందటానికి, నా ఆజ్ఞలను అనుసరించాలి. మరియు నా యందు విశ్వాసం కలిగి ఉండాలి" అని చెప్పు."** (ఖుర్ఆన్ 2:186)

కాబట్టి మీ బాధలను, కష్టాలను ఆయనకే డైరక్టుగా చెప్పుకోండి.

బీదరికంలో ఉన్న వాడి దగ్గరికి, ఓ కోటీశ్వరుడు వచ్చి, 'నీ బీదరికం సమస్యను తీరుస్తాను. నేను చెప్పినట్లు చెయ్యి' అంటే, ఆ బీదవాడు ఆ ధనికునికి ఎంతో విధేయత చూపిస్తాడు. కాని ఈ కోటీశ్వరుని దగ్గర, ఆ సంపద మరుక్షణంలో ఉంటుందో, ఉండదో వానికే తెలియదు. ఆ కోటీశ్వరుడు మరుక్షణంలో బ్రతికి ఉంటాడో? లేదో కూడా అతనికి తెలియదు. కాని మనకు తెలిసింది ఒకటుంది. అదేమిటంటే :

> **అల్లాహ్! ఆయన తప్ప మరొక ఆరాధ్యుడు లేడు. ఆయన సజీవుడు, విశ్వ వ్యవస్థకు ఆధారభూతుడు ఆయనకు కునుకూ రాదు మరియు నిదుర రాదు. భూమ్యాకాశాలలో ఉన్న సమస్తమూ ఆయనకు చెందినదే. ఆయన సమ్ముఖంలో - ఆయన అనుజ్ఞ లేకుండా - సిఫారసు చేయగల వాడెవడు? వారి ముందున్నదీ మరియు వారి వెనుక నున్నదీ అన్నీ ఆయనకు బాగా తెలుసు. మరియు ఆయన కోరితే తప్ప, ఆయన జ్ఞానవిశేషాలలో ఏ విషయమూనూ వారు గ్రహించజాలరు. ఆయన కుర్సీ ఆకాశాలనూ మరియు భూమినీ పరివేష్ఠించి ఉన్నది. వాటి సంరక్షణ ఆయనకు ఏ మాత్రం అలసట కలిగించదు. మరియు ఆయన అత్యున్నతుడు, సర్వోత్తముడు.**
>
> (ఖుర్ఆన్ 2:255)

*(తరువాయి భాగం 64వ పేజీలో)*

# పాఠకుల అభిప్రాయాలు

**ప్రచురించిన సైన్స్ విషయాలపై**

ఖుర్'ఆన్ మరియు సైన్స్ గురించి చెప్పడం కూడా ఇతర గ్రంథాలతో పోల్చినట్లేనని, అది కూడా నిషేధమేనని ఓ సోదరుడు అభిప్రాయపడ్డారు. ఇదే విషయాన్ని 'శాంతిబాట'లో చాలా స్పష్టంగా వివరించాము. సైన్స్‌తో దావా చేయవద్దని, అలాగే ఇతర అద్భుతాలతో కూడా 'దావా' చేయవద్దని, అద్భుతాలకే అద్భుతమైన ఖుర్'ఆన్ ద్వారానూ, సున్నత్ ద్వారా ధర్మ సందేశాన్ని అందజేయడమే, ప్రవక్త(స)వారి సందేశ విధానమని ఇదివరకే స్పష్టం చేయడం జరిగింది.

'అల్లాహ్ మార్గం వైపు పిలవడానికి' సైన్స్ యొక్క అవసరం లేకపోయినా, సైన్స్ అంటే విజ్ఞానం. జ్ఞానం అనేది ముస్లిమ్ పోగొట్టుకున్న సొత్తు అని, ఈ జ్ఞానం ఎక్కడ దొరికినా ముస్లిమ్ తీసుకుంటాడని ముహమ్మద్(స)వారు బోధించారు. ఈ శాస్త్రీయ విజ్ఞానం కూడా మన విశ్వాసాన్ని ధృడంగా చేస్తుంది. ఉదాహరణకు 'భూమ్యాకాశాలన్నీ ఒకప్పుడూ కలిసి ఉండేవనీ, ఆ తరువాత వాటిని మేము వేరు చేశామని తెలియదా?' అని అల్లాహ్ అవిశ్వాసులని ఖుర్ఆన్‌లో ప్రశ్నిస్తున్నారు. అల్లాహ్‌కు విధేయత చూపని శాస్త్రవేత్తే మొట్టమొదట ఈ విషయాన్ని గత శతాబ్దంలో కనుగొన్నారు.

1400 సం॥ల క్రితం ఈ వాక్యాన్ని అర్థం చేసుకునేటంత శాస్త్రీయ జ్ఞానం అరబ్బులకు లేదు. కాని నేడు దీనిగురించి కాస్త శాస్త్రీయ జ్ఞానం ఉన్న వారెవరికైనా ఇది సత్యమని తెలుస్తుంది. అందుకే తెలియని వాటి గురించి వాదనలు వద్దు అని చెప్పారు. ఈ రోజు మనకు తెలియనివి భవిష్యత్తులో ఎప్పుడో తెలియవచ్చు.

మరి శాస్త్రీయజ్ఞానం లేనివారి సంగతేమిటి? అడిగిన వారికి అర్థమయ్యే విధంగా చెప్పవలసిన బాధ్యత ఆ రంగంలో జ్ఞానాన్ని కలిగియున్న వారిపై ఉంది. ఈ విషయాన్ని 4వ సంచికలో 'ధర్మ సందేశ ప్రచారం' శీర్షికలో స్పష్టంగా చెప్పడం జరిగింది. ఇలా చెప్పడం బిద్'అత్ కాదు. ఎందుకంటే ఆ వాక్యం ఖుర్'ఆన్‌లోనే ఉంది. ఆ వాక్యానికి వివరణ ఇవ్వడం జరిగింది.

సైన్స్ ద్వారా ఖుర్'ఆన్ గ్రంథం సత్యమని నిరూపించవలసిన అవసరం ఎంతమాత్రం లేదు.

'శాంతిబాట'లో అందించే 13 శీర్షికలలో సైన్స్ గురించి తెలియజేసే శీర్షికలు కేవలం రెండు మాత్రమే. అందులోని ఒక శీర్షిక 'సైన్స్'లో ముస్లిమ్ శాస్త్రవేత్తలు చేసిన కృషి గురించి మరియు ఇస్లాం ప్రారంభించిన ఆధునిక విద్యా వ్యవస్థ గురించి తెలియజేసేదయితే, రెండవ శీర్షికలో స్వయంగా మనలో, మన చుట్టూ ఉన్న పరిసరాలలో కనిపించే అద్భుత సృష్టి గురించి తెలియజేస్తుంది.

ఇస్లాం 'సైన్స్'కి వ్యతిరేకం కాదు. 'సైన్స్ మరియు మతం వేరు వేరు' అనేది కొన్ని గ్రంథాల దృష్ట్యా భావించి, ఆ విధంగా ప్రకటిస్తున్నారు. సైన్స్ అనేది ఈ రోజున పుట్టినది కాదు. సృష్టి ప్రారంభం నుండి ఉంది. తన చుట్టూ ఉన్నది పరిశీలించి తెలుసుకోవడమే సైన్స్. ఆ విషయాన్నే ఖుర్'ఆన్ తెలియజేస్తుంది.

ఇస్లాం శాస్త్రీయ విజ్ఞానాన్ని నేర్చుకునేలా ప్రోత్సహిస్తుంది. ఇస్లాం ధర్మం వలననే, 'ఆధునిక సైన్స్'కి పునాదులు వేసి, ఎన్నో శాస్త్ర విభాగాలకు ఆనాటి ముస్లిములు పితామహులయ్యారు. ఇస్లాం ధర్మాన్ని నేటి ముస్లిములు సరిగ్గా అర్థం చేసుకోకపోవడం వలన మరియు ఆచరించక పోవడం వలననే వారు వెనుకబడ్డారు.

'*జ్ఞానం కలవారికి స్వయంగా మీలోనే సూచనలు ఉన్నాయి*' అని ఖుర్'ఆన్‌లో చెప్పబడింది కదా! దాని యొక్క అర్థం ఏమిటి?

మనలో ఎన్నో జీవకణాలున్నాయి. అలాగే మనలో ఎన్నో అవయవాలు ఉన్నాయి. వీటిలో ఉన్న అద్భుత సూచనలు తెలియజేయడానికి - 1. జీవకణం గురించి మరియు 2. కన్ను నిర్మాణం గురించి మొదటి 4 సంచికలలో అందించడం జరిగింది.

ముస్లిములను ఎడ్యుకేట్ చేయడానికి, ఇస్లాం ధర్మంపై ఇతర ధర్మాల సోదరులకు ఏర్పడిన అపోహలను తొలగించడానికి ప్రతీ ముస్లిం తనే స్వయంగా సమాధానం చెప్పుకోగలిగేలా చేయాలని, మన చుట్టూ ఉన్న సమాజంలోని అన్ని సమస్యలకు పరిష్కారం 'ఇస్లాం' ధర్మమేనని చాటి చెప్పడానికి 'శాంతిబాట' మాసపత్రికను ప్రారంభించడం జరిగింది.

జ్ఞానం కొరకు ఖుర్'ఆన్, హదీస్ గ్రంథాలు చాలు. అయితే వాటిని సులభంగా అవగాహన చేసుకోవడంలో సహకరించడానికి వీలుగా 'శాంతిబాట'లో కొన్ని శీర్షికలను అందిస్తున్నాము.

'ఇస్లాం' ధర్మం టెర్రరిజాన్ని ప్రోత్సహిస్తుందని ఎవరైనా అంటే, ఆ విధంగా చెప్పిన వ్యక్తికి సగటు ముస్లిమ్ సమాధానం చెప్పగలగాలి. దాని సమాధానం ఖుర్'ఆన్‌లోనే ఉంది. హదీస్‌లలో కూడా ఉంది. వాటి ద్వారా ఇస్లాం ధర్మం, తీవ్రవాదాన్ని ఖండిస్తుందని చెప్పవచ్చు. అయితే నిజమైన టెర్రరిస్ట్‌లు ఎవరో చెప్పగలగాలంటే కొన్ని సంఘటనల వివరాలు కూడా కావాలి. అవి యదార్థ సంఘటనలేగాని కల్పితాలు కాకూడదు. మరి వాటిని సగటు సామాన్య ముస్లిముకి అర్థం అయ్యేలా చెప్పాలి. వివేకంతో చెప్పమని ఖుర్'ఆన్ గ్రంథమే బోధిస్తుంది కదా!

**అభిప్రాయాలను పర్సనల్‌గా తెలియజేయాలనుకునేవారు**
**డా॥ నాగిరెడ్డి శ్రీనివాసరావు (అబ్దుల్ కరీమ్)ని ఫోన్‌లో సంప్రదించడంగాని (నెం. 9491103017) లేదా**
velugubaata@gmail.com, srinagireddi@gmail.com **కు మెస్సేజ్ పంపండి.**

'ఇంటర్‌నెట్'లో ఎన్నో విషయాలను ఉంచుతున్నారు. 'ఇస్లాం' గురించిన విషపురాతల నెన్నింటినో వ్రాస్తున్నారు. అలాంటి విషయాలను చెప్పి, ముస్లిములకు ఎవరైనా ఆవేదన కలిగేలా చేస్తే, ముస్లిములు వెంటనే అలాంటి వాటిని యదార్థాలతో ఖండించ గలగాలి. ఈ విషయాలను సగటు ముస్లిముకి అర్థమయ్యేలా అందజేసే వారెవరు? అందరికీ ఇంటర్‌నెట్ సదుపాయం ఉండదు. ఉన్నా కూడా వాటిలో ఏవి నిజమైనవో, ఏవి విషపూరితమైనవో అందరూ తెలుసుకోలేరు.

చిన్నతనంలో చదువుకున్న విషయాలు, మైండ్‌లో ఉండిపోతాయి. సైన్స్ డిస్కవరీల విషయంలో ఎన్నో అసత్యాలను పిల్లలు నేర్చు కుంటున్నారు. అందుకని ఆ వయస్సులోనే వారు సత్యం తెలుసుకునేలా చేయడానికి, 'బాలబాలికలకు ప్రత్యేకం' శీర్షికలో వ్యాసాలను అందిస్తున్నాము.

ఖుర్‌ఆన్ వాక్యాలను వక్రీకరిస్తూ, విమర్శలు చేసేవారికి మరియు నాస్తికుల ప్రశ్నలకి అవలీలగా సమాధానం చెప్పేవిధంగా, ప్రతీ ముస్లిం తయారుకావాలి. అది **'శాంతిబాట టీమ్' యొక్క ప్రధాన కోరిక.**

ఖుర్‌ఆన్ గ్రంథం సైన్స్ గురించి చెబుతుంది. సైకాలజీ గురించీ చెబుతుంది. ఇంకా న్యాయశాస్త్రం, అర్థికశాస్త్రం మొదలైన ఎన్నో శాస్త్రాల గురించి అనుమానానికి తావులేకుండా స్పష్టంగా చెబుతుంది. కాబట్టి సైన్స్ గురించి మాట్లాడటం ఇస్లాంకి వ్యతిరేకం కాదు. అది నిషేధించబడలేదు. సైన్స్‌ని అభివృద్ధి చేయడానికి ఇస్లాం ఎంతగానో ప్రోత్సహిస్తుంది.

"మీరు పరిశీలన చేయకుండానే తిరస్కరిస్తున్నారా?" అని ఖుర్‌ఆన్ గ్రంథం ప్రశ్నిస్తుంది.

మరి పరిశీలించిన విషయాలను చెప్పడం, మరియు ఇతర గ్రంథాలతో ఖుర్‌ఆన్‌ను పోల్చడం ఒకటి కాదు. ఖుర్‌ఆన్‌ను ఇతర గ్రంథాలతో పోల్చడంలో, వారి సంకల్పం ఏమిటో వివేకంతో ఆలోచించాలి. ప్రవక్త(స) వారు వారించిన అటువంటి పనులను 'శాంతిబాట' ప్రోత్సహించదు. ఖండిస్తుంది.

**ఉదాహరణలు :**

'స్వంత ఉదాహరణలు ఇవ్వకండి. హదీస్‌లలో ఉదాహరణలున్నాయి కదా! వాటినే ఇవ్వండి' అని తన అభిప్రాయాన్ని ఒక సోదరుడు వ్యక్తం చేశారు. మాకు గుర్తున్నవి లేదా పత్రిక కోసం హదీస్‌లను వెతికేటప్పుడు తారసపడే ఉదాహరణలను ఇస్తున్నాము. అయితే ఏ విషయాన్నైనా వివేకంతోనే చెప్పమని ఇస్లాం బోధిస్తుందని ఇది వరకే చెప్పుకున్నాం.

మనం చెప్పే ఉదాహరణలు ఖుర్‌ఆన్ మరియు సున్నత్‌కు వ్యతిరేకం కాకూడదు. అంతేకాకుండా ఆ ఉదాహరణలు పరోక్షంగా మరో అర్థాన్నిచ్చేవిగా కూడా ఉండకూడదు. 'శాంతిబాట టీమ్' సాధ్యమైనంత వరకు వాస్తవ సంఘటనలనే ఉదాహరణగా ఇవ్వడానికి ఇష్టపడుతుంది. అంటే అభూత కల్పనలద్వారా ఏ విషయాన్ని చెప్పదలచుకోలేదు. అయితే పాఠకులు ఓ విషయాన్ని గుర్తు చేయవచ్చు. క్రిందటి సంచికలో 'తిరిగి గూటికి' శీర్షికలో ఓ సంఘటన గురించి చెప్పారని. ఆ సంఘటన యొక్క వర్ణన మాదికాదు. ఒక నవముస్లిమ్ సిస్టర్ ఇస్లాంని ఎంత బాగా అర్థం చేసుకున్నారో, ఆమె చేసిన వర్ణనను బట్టి తెలుసుకోవచ్చు అని మాత్రమే చెప్పడం జరిగింది.

**హారున్ యహ్యా :**

మేము హారున్ యహ్యా పై ఆధారపడి పత్రిక నడుపుతున్నామని ఓ సోదరుడు అపార్థం చేసుకున్నారు. 'శాంతిబాట' పత్రికలోని 13 శీర్షికలలో, కేవలం ఒక శీర్షికలో మాత్రమే హారున్-యహ్యా గారి యొక్క పూర్తి వ్యాసాన్ని, మరో శీర్షికలో ఒక పేరాని మాత్రమే ఇవ్వడం జరుగుతుంది.

'హారున్ యహ్యా' ఎటువంటి వారో తెలుసుకుని, ఆ తరువాతే ఆయన చేసిన వర్క్స్ గురించి వ్రాయండి అని సలహా ఇచ్చారు. మనం స్కూలులో 'న్యూటన్ నియమాలు' (Newton's Laws) గురించి చదువుతాము. అవి సత్యమా? కాదా? అనేదే మనకు ముఖ్యం. అంతేగాని న్యూటన్ ఎటువంటి వాడో తెలుసుకోవలసిన అవసరం లేదు. ఎందుకంటే న్యూటన్ బ్రతికున్న కాలంలో, ఆయన ప్రతిపాదించిన నియమాలను అప్పట్లో పరీక్షించారు. ఈ రోజున కూడా మనం వాటిని పరీక్షించవచ్చు.

ఈ సందర్భంగా ఆ సోదరుడు మరో విషయాన్ని చెప్పారు. హదీస్‌లను సేకరించేటప్పుడు, అబద్ధాలు చెప్పేవారి నుండి, మోసగాళ్ళు అని తెలిసిన వారి నుండి హదీస్‌లను స్వీకరించలేదని చెప్పారు. నిజమే! అవి ప్రామాణిక గ్రంథాలు. ఆ బోధనలు మారవు. వాటికి ఆ జాగ్రత్త చాలా అవసరం. వాటి ప్రామాణికతకు, వ్యక్తులు వ్రాసే వ్యాసాలకు అసలు పోలికే లేదు. అసత్యాలను మాట్లాడే ఓ వ్యక్తి సహీహ్ బుఖారీ గ్రంథంనుండి ఓ హదీస్‌ను చదివి వినిపిస్తే, అతని కారెక్టర్ మంచిది కాదు కాబట్టి, ఆ హదీస్‌ని తిరస్కరించగలరా?

**తిరస్కరించలేరు.** కాని, అతను అసత్యపరుడు అని మనకు తెలుసు గనుక ఆ హదీస్‌ను సరిగ్గా చదివాడో, లేదోనని మనకు సందేహం కలగడం సహజం. సహీహ్ బుఖారీ గ్రంథాన్ని వెతికి ఆ విషయాన్ని నిర్ధారించుకోగలం. ఎందుకంటే మన దగ్గర ఒరిజినల్ సహీహ్ బుఖారీ గ్రంథం ఉంది కాబట్టి.

అలాగే హారూన్-యహ్యా ఎటువంటి వ్యక్తి అయినా సరే, అతను చేసిన వర్క్స్‌లో, ఏదైనా విషయం ఖుర్‌ఆన్‌కి, సున్నత్‌కి వ్యతిరేకంగా ఉన్నట్లు గమనిస్తే, ఆ విషయం శాంతిబాట పత్రికలో ఎట్టి పరిస్థితులలోనూ ప్రచురించబడదు. అంతేకాకుండా, వారికి ఆ విషయాన్ని తెలియజేయడం కూడా జరుగుతుంది, ఇన్షా అల్లాహ్!

ఎన్నో సంవత్సరాల నుండి  చాలా వెబ్‌సైట్‌లను పరిశీలిస్తూనే ఉన్నాము. అన్ని సైట్లలో కంటే, ఈ వెబ్‌సైట్లో చాలా మంచి వివరాలను కనుగొనడం జరిగింది. సగటు మానవునికి అర్థమయ్యే భాషాశైలిలో ఉన్న వ్యాసాలు, పుస్తకాలను ఈ సైట్‌లో ఉండటం మేము గమనించాము.

You Tube లో కెనడాకి చెందిన బిలాల్ ఫిలిఫ్స్‌గారి ఓ వీడియోపై ఆధారపడి చాలామంది హారున్-యహ్యా pantheismని సపోర్ట్ చేస్తారని, అల్లాహ్ అన్నిచోట్ల ఉంటారని ఆయన నమ్ముతారని చెబుతున్నారు. తాను సున్నత్‌ను పాటించేవాడినని చెబుతూ తనపై చేస్తున్న విమర్శలను ఖండిస్తూ స్టేట్‌మెంట్ ఇవ్వడం జరిగింది. ఆ ఆర్టికల్ కూడా 'హారున్ యహ్యా' వెబ్‌సైట్‌లో ఉంది.

'శాంతిబాట' టీమ్‌లోని ఒకరికి, హిందీలో అనువదించబడిన హారున్ యహ్యాగారి యొక్క వర్క్‌ను పంపడం జరిగింది. అనువాదం ఎలా ఉందో చెప్పమని కోరడం జరిగింది. అనువాదాన్ని చెక్ చేయడానికి, ఇంగ్లీష్

స్క్రిప్ట్‌ను, హిందీ స్క్రిప్ట్‌ను వారు పంపారు. ఇంగ్లీష్‌లో అల్లాహ్‌ను '**Omni scient**' (సర్వ జ్ఞాని) అని ఉంటే, హిందీ అనువాదం చేసినవారు ఆ పదాన్ని 'సర్వ్ వ్యాప్' (సర్వాంతర్యామి)గా అనువదించారు. తప్పు అనువాదంలోనే ఉంది. ఒరిజినల్‌లో అలా లేదు. హారున్ యహ్యాగారికి హిందీ భాష తెలియదు. ఆయన తన మాతృభాషలోనే వ్రాస్తారు. అందులోనే మాట్లాడతారు. మరి హిందీ అనువాదాన్ని అలాగే అతని వెబ్‌సైట్‌లో ఉంచితే, చదివినవారు ఆయననే తప్పుగా భావించే అవకాశముంది.

'ఏమీలేని శూన్యం నుండే భూమ్యాకాశాలను అల్లాహ్ సృష్టించాడనే ఖచ్చితమైన అనువాదాన్ని హారున్-యహ్యాగారి అనువాదాన్ని చదివిన తర్వాతే మాకు తెలిసింది. తెలుగులోని ఏ అనువాదంలోనూ ఆ విషయం లేదు. అల్లాహ్‌లోనే విశ్వం ఉండదు కదా! ఏమీ లేని శూన్యం అంటే అర్థమేమిటి? అల్లాహ్ విశ్వమంతటా లేనట్లు కదా! కాని విశ్వమంతా 'అల్లాహ్' కంట్రోల్ లోనే ఉంటుంది.

శూన్యం నుండే భూమ్యాకాశాలు సృష్టించబడ్డాయి అనే విషయాన్ని 'శాంతిబాట'లో వివరించిన తరువాత చాలామంది పాఠకులు ఫోన్‌చేసి, ఈ విషయం వారికి అంతవరకూ తెలియదని చెప్పడం జరిగింది.

నేడు మనతోపాటు ఉండే 'ధర్మ ప్రచారకుల' కారెక్టర్‌ను తెలుసు కోవడమే మనకు సాధ్యం కావడం లేదు. ఎక్కడో టర్కీలో ఉన్న హారున్-యహ్యాగారి కారెక్టర్ గురించి తెలుసుకునే సమయంగాని, అవసరం గాని మాకు లేదు.

'కంటి నిర్మాణంలోని అద్భుతం' వ్యాసాన్ని ప్రశంసిస్తూ రాష్ట్రం నలుమూలల నుండి ఫోన్‌కాల్స్ వస్తున్నాయి. ముస్లిమేతరులు కూడా ప్రశంసించారు. ఆ వ్యాసాన్ని చదివి వినిపించాక, విన్నవారు చాలాసేపు తక్బీర్ చెప్పారంటే, అది వారి హృదయాలపై ఎటువంటి ప్రభావం కలిగించిందో అర్థం చేసుకోవాలి. ఈ ప్రశంసలను అందుకునే అర్హత, ఆయన యొక్క ఒరిజినల్ వర్క్‌కే ఉంది. అల్లాహ్ అనుగ్రహం వలన ఆయన అంత చక్కగా వివరించ గలిగారు.

ముఖ్యంగా అందరికీ శాంతిబాట సవినయంగా మనవి చేసుకునేది ఏమిటంటే, **ఏ వ్యక్తిని గుడ్డిగా నమ్మకండి**. ఏ వ్యక్తినీ గుడ్డిగా అనుసరించ వలసిన అవసరం మనకు లేదు. కేవలం '**ముహమ్మద్(స)** వారిని' ఒక్కరినే విశ్వసించండి, ఆయన **విధానాన్నే అనుసరించండి**. మీ దగ్గర ఎల్లప్పుడూ ఖుర్'ఆన్ మరియు హదీస్ గ్రంథాలను ఉంచుకోండి. అది వీలుపడకపోతే మీకు దగ్గరగా ఉండే మస్జిద్‌లో నున్న గ్రంథాలలో వెతికి, మీరు విన్నది సత్యమో కాదో తెలుసుకోండి.

మీకు ఎవరైనా ఓ ఖుర్'ఆన్ ఆయత్‌ను చదివి వినిపించితే, ఆ ఆయత్ యొక్క నంబర్‌ను వెంటనే ప్రసంగం మధ్యలోనే అడగండి లేదా ప్రసంగం చేసేవారికి నంబర్లను కూడా చెప్పమని ముందుగా చెప్పండి. అలాగే చెప్పబడిన హదీస్ ఏ హదీస్ గ్రంథాలనుండి మరియు ఆ హదీస్ ఏ వాల్యూమ్‌లో ఉంది, ఆ హదీస్ నంబరెంత అని అడిగి తెలుసుకుని, విన్నది నిజమో లేక అబద్ధమో నిర్ధారించుకోండి. మీకు చదవడం రాకపోతే, చదివి వినిపించమని మీ మస్జిద్ ఇమామ్‌గారిని కోరండి.

**ధర్మ విషయంలో ముహమ్మద్(స)వారికి తప్ప, మిగతా వ్యక్తులకు ఇన్నా అల్లాహ్ 'శాంతిబాట టీమ్' ఎలాంటి ప్రాముఖ్యతను ఇవ్వడం జరగదు.** అయితే, ఒకరు చేసిన వర్క్‌ని మేము ఉపయోగించు కునేటప్పుడు, వారి యొక్క వివరాలను ఇవ్వడం మా నైతిక బాధ్యత. మేము హారున్ యహ్యా వారిని ప్రతీ విషయంలోనూ సపోర్ట్ చేసే వారము కాదు. అలాగని, ఆయననూ వ్యతిరేకించే వారమూ కాదు. ఆయన మా తోటి ముస్లిమ్ సోదరుడు. ఈయన వర్క్ మాత్రమే కాదు, ప్రపంచంలో ఎందరో ముస్లిమ్ సోదరులు చేసిన మంచి వర్క్‌ని, వారి అనుమతితో ఇన్షాఅల్లాహ్ మీకు అందించడానికే ప్రయత్నిస్తాము. అల్లాహ్ అనుగ్రహం వలన మేము అనుమతి అడిగిన అంతర్జాతీయ సంస్థలు వెంటనే అనుమతినిస్తున్నాయి.

**బాధ్యతా రాహిత్యం :**

'శాంతిబాట' చందాదారుడైన ఓ సోదరుడు, విషయమేమీ తెలుసుకో కుండానే, పబ్లిషర్స్‌ని irresponsible persons (బాధ్యతను విస్మరించిన వ్యక్తులు)గా చెబుతూ కఠినంగా మాట్లాడారు. ఆయనకు ఒక సంచిక కూడా అందలేదని, కనీసం ఎవరూ ఫోన్ కూడా చేయలేదని సీరియస్ అయ్యారు. శాంతిబాట పంపిన తరువాత, ప్రతీ ఒక్కరికి ఫోన్ చేసి అడగడమంటే అది మాకు సాధ్యం కాదు. అందలేదని చెబితే గాని మాకు తెలియదు. కొరియర్ ద్వారా పంపిన పుస్తకాలు అందలేదని ఎవరి దగ్గరినుండి అయినా మాకు ఫోన్ రాగానే, వెంటనే ఆయా కొరియర్ సర్వీస్ వారికి ఫోన్లు చేసి, తరువాత సంబంధిత పాఠకునికి కూడా ఫోన్ చేసి చెబుతూనే ఉన్నాము. ఈ విధంగా నెలకు 1000కి పైగా కాల్స్ చేయవలసి వస్తుంది.

ప్రతీ ఒక్కరికి సంచిక అందాలని, ఎంత ఖర్చయినా వెనుకాడటం లేదు. మేము పూర్తి బాధ్యతను తీసుకున్నాము. ఎందుకంటే ఇది వ్యాపార పత్రిక కాదు. ధర్మాన్ని అందజేయాలని, నిస్వార్థంతో పనిచేస్తున్నాం. బాధ్యతను విస్మరించిన వ్యక్తులుగా మమ్మల్ని అనడం మాకు తీవ్రమైన ఆవేదనను కల్గించింది.

**ఇది వ్యాపార వార్తాపత్రిక కాదు. ధార్మిక పత్రిక. అందువలన కాస్త ఆలస్యమైతే, సహృదయంతో అర్థం చేసుకోమని కోరుతున్నాం.**

**గుహవాసుల విషయంపై :**

ఇంటర్‌నెట్‌లో ఇస్లాం కబుర్లు శీర్షికలో కొన్ని విషయాలను అందించాము. వాటిలోని ఓ విషయంపై ఒకరిద్దరు పరోక్షంగా అభ్యంతరం వ్యక్తం చేశారు. క్రిందటి సంచికలో మేము ఇచ్చిన ఆ వాక్యాలను ఒకసారి చదవండి.

*ఇక్కడ 300 సూర్యమాన సంవత్సరాలు, 309 చంద్రమాన సంవత్సరాలకి సమానమని చాలా మంది ముస్లిం సోదరులు వివరణనిచ్చారు. ఈ వివరణను ముహమ్మద్(స)వారు ఇచ్చి ఉంటే, మనకు స్పష్టంగా తెలిసి ఉండేది.*

*గుహలోని వ్యక్తులు 300 సంవత్సరాలు ఉన్నా, 309 సంవత్సరాలు ఉన్నా ఆ యదార్థ గాథలో చెప్పే విషయంలో వీటి ప్రాముఖ్యత ఏమీ మనకు కనిపించదు.*

పై వాక్యాలలో దోషమేమిటో మాకైతే అర్థం కాలేదు. ఒక్కొక్కరు ఒకో విధంగా చెబుతారు. కాని అది నిజమని చెప్పాలంటే, ఆ విషయాన్ని ముహమ్మద్(స)వారు గనుక చెబితేనే, ఎటువంటి సందేహం లేకుండా

నిజమని చెప్పగలుగుతాం. కాని ఆ విషయంపై ముహమ్మద్(స)వారు ఎందుకు వివరణ ఇవ్వలేదో అల్లాహుతాలాకు మాత్రమే తెలుసు.

ఈ శీర్షిక యొక్క ఉద్దేశ్యాన్ని స్పష్టంగా ఇదివరకే చెప్పాము. ఎవరైనా ఇలాంటి విషయాలనే పట్టుకుని, ఇబ్బంది కలిగించే ప్రయత్నాలు చేసే అవకాశం ఉంది. కాబట్టి, వీటికి ప్రాముఖ్యత లేదని ప్రతీ ముస్లిమ్ చెప్పగలగాలి అనేదే మా ఉద్దేశ్యం. ఒకవేళ తెలుగు భాషను సరిగ్గా అర్థం చేసుకోక పోవడం వలన, భాషాపరమైన ఇబ్బందులేమైనా ఉంటే, మీ సందేహాన్ని మాకు తెలియజేయండి.

మీ అభిప్రాయాలను ఫోన్ ద్వారా తెలియజేయాలనుకుంటే, సెల్ నెం. 9491103017కి డయల్ చేయండి. అభిప్రాయాలను వ్రాతపూర్వకంగా తెలియజేయాలనుకుంటే శాంతిబాట ఆఫీస్ ఎడ్రస్‌కి పోస్ట్ చేయండి.

వ్రాసిన వ్యక్తుల గురించి కాకుండా, మేము వ్రాసిన వ్రాతలను మాత్రమే పరిగణనలోకి తీసుకోండి. వ్యక్తులను కాదు. అపార్థాలకు తావులేకుండా, ఏ విషయమైనా వెంటనే మాకు తెలియజేయండి.

ప్రఖ్యాత ప్రసంగీకులనో లేదా స్వయంగా ప్రముఖులుగా ప్రచారం చేయించుకునే వారినో గుడ్డిగా అనుకరిస్తూ, ఆ ప్రసంగీకుని అనుచర వర్గంగా మారడం చాలా ప్రమాదకరమైన విషయంగా గుర్తించాలి. మనకు ఆదర్శం మరియు అనుసరణీయం కేవలం ప్రవక్త(స)వారి విధానమే!

అడిగిన వారి పేరును పత్రికలో చెప్పడం లేదు కనుక, మీ అనుమానాలను, అభిప్రాయాలను నిస్సందేహంగా తెలియజేయమని కోరుతున్నాము.

**- శాంతిబాట టీమ్**

**(53వ పేజీ తరువాయి భాగం ...)**

పై వాక్యాలను అర్థం చేసుకుంటూ, తద్వారా అల్లాహ్‌పై సంపూర్ణ విశ్వాసాన్ని కలిగి ఉంటే, అహంకారానికి, ఆత్మన్యూనతకి మనస్సులో చోటు ఉంటుందా?

ఉండదు! అంతా సంతోషమే!

ఓ ముస్లిమ్ బలంగానూ లేదా బలహీనంగానూ, పేదవాడిగానూ లేదా ధనవంతుడుగానూ ఉండవచ్చు. కాని ముస్లిమ్ అహంకారిగానూ ఉండడు, అసమర్థుడుగానూ ఉండడు.

ఒకవేళ ఏ ముస్లిమైనా అలా ఉంటే, అతను 'నేను ముస్లిమ్‌నా? కాదా?' అని ఆత్మపరిశీలన చేసుకోవాలి.

**అల్లాహు అక్బర్** (అల్లాహ్‌యే గొప్పవాడు)

**రబ్బిల్ ఆలమీన్** (సకల లోకాలకు ప్రభువు, పోషకుడు)

ఎవరైనా సోదరుడిలో గాని సోదరిలోగాని ఈ అహంకార, ఆత్మన్యూనత లక్షణాలుంటే, 'అల్లాహు అక్బర్' అని చెబుతూ వాటిని మనస్సు నుండి ఈ క్షణంలోనే తరిమేయమని కోరుతున్నాము.

**- శాంతిబాట టీమ్**

# శుభవార్త

**నవంబర్ నెల చివరి వారంలో 'శాంతిబాట' మాసపత్రికను**

**Registrar of News Papers for India వారు న్యూస్‌పేపర్‌గా రిజిష్టర్ చేశారు.**

**రిజిస్ట్రేషన్ నెం. APTEL/2009/29650**

**పోస్టల్ రిజిస్ట్రేషన్ కొరకు కూడా అప్లై చేశాము.**

**పాఠకులలో ఎవరికైనా తూర్పుగోదావరి జిల్లా పోస్టల్ డిపార్ట్‌మెంట్ నుండి లెటర్ ఏదైనా వస్తే, దయచేసి వెంటనే అది పూర్తి చేసి వారికి పంపించండి.**

**మీ దగ్గర నుండి ఆ లెటర్స్ వారికి అందగానే మాకు పోస్టల్ రిజిస్ట్రేషన్ వస్తుంది.**

**ఒకవేళ ఆ లెటర్ ఎలా నింపాలో సందేహాలుంటే, మీ దగ్గరలోని పోస్ట్ ఆఫీస్‌లో సంప్రదించండి లేదా దయచేసి 9491103017కి ఫోన్ చేయమని కోరుతున్నాము.**

**- శాంతిబాట టీమ్**

**Printed by** Md. Athaharullah, **Published by** Md. Athaharullah **Owned by** Velugubaata Educational Society (Regd.No. 569/2008), Samalkot and **Printed at** '*Akash Industries*', G-14, Industrial Estate, Samalkot - 533440 and **Published at** 2-8-31, Kota Bazar, Samalkot - 533440, **Editor:** Md. Athaharullah , Phone : 9347046090, Email: velugubaata@gmail.com, RNI Regd. No. APTEL/2009/29650

SAANTHIBAATA MONTHLY December 2009 & January 2010 Samalkot-533440 (East Godavari Dist.)
Registered with Registrar of News Papers for India RNI Reg. No. APTEL/2009/29650

حدَّثَنِي عَبْدُ اللهِ ابنُ مُحَمَّدٍ : حدَّثَنا عَبْدُ المَلِكِ بنُ عَمْرٍو :
حدَّثَنا زُهَيرُ بنُ مُحَمَّدٍ، عَنْ مُحَمَّدِ بنِ عمرِو بنِ حَلْحَلَةَ، عَنْ
عَطاءِ بنِ يَسارٍ، عَنْ أبي سَعِيدٍ الخُدْرِيِّ، وَ عَنْ أبي هُرَيْرَةَ عَنِ
النَّبِيّ ﷺ قالَ: ((ما يُصِيبُ المُسْلِمَ مِنْ نَصَبٍ وَلا وَصَبٍ وَلا
هَمٍّ وَلا حَزَنٍ، وَ لا أذًى، وَلا غَمٍّ، حتّى الشَّوْكَةِ يُشاكُها، ألّا
كَفَّرَ اللهُ بِها مِنْ خَطاياهُ)).

అబూ స'ఇద్ ఖుద్రీ మరియు అబూహురైరా(రజి) ఉల్లేఖనం: "ఓ ముస్లిమ్‌కి అలసటగాని, జబ్బుగాని, దు:ఖంగాని, విచారంగాని, కీడుగాని, ఆందోళనగాని, ఓ ముల్లు గుచ్చుకోవడం సయితం సంభవించదు, దాని కొరకు అతని పాపాల నుండి కొన్నింటిని క్షమించడానికి తప్ప"

(సహీహ్ బుఖారీ, నెం. 5641, సంపుటి 7, అధ్యాయం 1)

